www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



జయహో.. భారత్

ఆసియా చాంపియన్స్ హాకీ ట్రోఫీ కైవసం

చైనాపై విజయభేరి.. జుగ్‌రాజ్ అదిరే గోల్

10



బుధవారం | 18-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 154 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి ఉ. 8.04, పాడ్యమి తె. 4.19 వరకు; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ. 11.00 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా. 7.25-8.49; దుర్ముహూర్తం: ఉ. 11.44-12.33; అమృతఘడియలు: తె. 3.51-5.15; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.10 | విజయవాడ సిటీ**


Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మునిగిన ఇంటికి రూ. 25 వేలు!

బెజవాడ వరద బాధితులకు భారీ ప్యాకేజీ

నేటి నుంచే పరిహారం.. ఖాతాలకు సొమ్ము

- ఫస్ట్ ఫ్లోర్, ఆపై ఉన్న ఫ్లోర్లకు రూ.10 వేలు
- బైకులకు 3 వేలు.. ఆటోలకు రూ.పది వేలు
- షాపులకు 50 వేల నుంచి 1.50 లక్షల వరకు
- బాధితులకు బ్యాంకు నుంచి కొత్త రుణాలు
- పంట నష్టానికి ఎకరానికి రూ.10-14 వేలు
- అద్దెకు ఉండేవారికీ, కౌలుదార్లకే పరిహారం
- గేదెలు, ఆవులు చనిపోతే రూ.50 వేలు
- రాష్ట్రంలోని మిగిలిన చోట్ల వరదకు గురైన కుటుంబానికి రూ.పది వేల పరిహారం
- చరిత్రలో ఇంత భారీ పరిహారం ఇప్పుడే: సీఎం



అప్పటికప్పుడే పరిహారం పెంచి..

ఉద్యాన పంటలకు పరిహారంపై అధికారులు కొంత తగ్గించి ప్రతిపాదనలు తయారుచేశారు. ఆ మొత్తం చాలదని భావించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, విలేకరుల సమావేశంలోనే వాటిని మార్చేశారు. దెబ్బతిన్న పంటలకు ఇచ్చినట్టే ఉద్యాన పంటల సాగుకు కూడా ఎకరానికి రూ.పది వేలు ఇస్తున్నట్లు ప్రకటించారు. పంటల సాగును కౌలుదార్లు చేస్తుంటే పరిహారం వారికే ఇస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కనీవినీ ఎరుగని వరదల తాకిడికి తీవ్రంగా నష్టపోయిన విజయవాడ నగర వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ పరిహార ప్యాకేజీని ప్రకటించింది. మంగళవారం రాత్రి సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్యాకేజీ వివరాలను వెల్లడించారు. బుధవారం నుంచే నష్ట పరిహారం పంపిణీ ప్రారంభమవుతుందని, వీలైనంతవరకూ రెండు మూడు రోజుల్లోనే బాధితుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని

మిగతా 12వ పేజీలో...

2 వేల కోట్ల విపత్తు నిధులు గాయబ్!

- పైసాకూ లెక్కరాయని గత సర్కారు.. డబ్బులు ఉన్నాయంటున్న కేంద్రం
- ఇక్కడ చూస్తే విపత్తు నిధిలో పైసా లేదు.. ఏం చేశారో జగన్‌కే తెలియాలి
- ముందు రూ.500 కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం: సీఎం
- రాజధానిపై విషంకక్కితే నోటికి తాళమే.. విశాఖ ఉక్కును ఆదుకుంటాం

11



సముద్ర మార్గాన జంప్

ఓడ ఎక్కి ఉడాయించిన గనుల వెంకటరెడ్డి!

- విచారణ జరిగితే దొరికిపోతానని భయపడి చంద్రబాబు ప్రమాణానికి ముందురోజే పరార్
- కోస్ట్‌గార్డు అధికారిగా పాత పరిచయాల వాడకం
- చెన్నై నుంచి భార్యతో విదేశాలకు
- సముద్ర ప్రయాణానికి పది లక్షల ఖర్చు
- బంధువుల ద్వారా ఏసీబీకి సమాచారం
- ఏ దేశానికి వెళ్లిందీ గుర్తించే యత్నం
- అవసరమైతే రెడ్ కార్నర్ నోటీసు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల అక్రమాల్లో ఘనుడు వెంకటరెడ్డి నీటిపై తేలుతూ దేశం దాటి వెళ్లి పోయారు. నదిలో ఇసుకను అక్రమంగా రాష్ట్రం దాటించినట్లు, ప్రభుత్వం మారగానే ఓడలో దేశం దాటేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన మూడు రోజుల్లోనే (జూన్ 7) భార్యతో కలిసి విజయవాడ

మిగతా 3వ పేజీలో...

ఢిల్లీ కొత్త సీఎం ఆతిశీ

శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్న ఆప్ ఎమ్మెల్యేలు

- ఆమె పేరును ప్రతిపాదించిన కేజ్రీవాల్
- అనంతరం ఎల్జీకి తన రాజీనామా లేఖ
- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని లెఫ్టినెంట్ గవర్నర్‌ను కోరిన ఆతిశీ
- మరి కొద్దిరోజుల్లో సీఎంగా ప్రమాణం!
- షీలాదీక్షిత్, సుష్మాస్వరాజ్ తర్వాత ఢిల్లీకి 3వ మహిళా ముఖ్యమంత్రి



కేజ్రీతో ఆప్‌ఎల్పీ నేతగా ఎన్నికైన ఆతిశీ

ఆమ్ ఆద్మీ... ఆతిశీ

ప్రత్యేక కథనం నవ్యలో

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తాను స్వయంగా ప్రకటించినట్టుగా ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. ఆయన స్థానంలో కొత్త సీఎంగా విద్యాశాఖ మంత్రి ఆతిశీ (43) బాధ్యతలు చేపట్టనున్నారు. కేజ్రీవాల్‌ను తిరిగి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టడమే లక్ష్యంగా పని చేస్తానని ఆమె తెలిపారు. మంగళవారం ఉదయం కేజ్రీవాల్ అధికారిక నివాసంలో ఆప్ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. కొత్త సీఎంగా ఆతిశీ పేరును కేజ్రీవాల్ స్వయంగా ప్రతిపాదించారు. ఎమ్మెల్యేలందరూ ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. దీంతో ఆప్ శాసనసభాపక్ష నేతగా ఆతిశీ ఎన్నికయ్యారు. అనంతరం, సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆతిశీ, ఆప్ నేతలతో కలిసి కేజ్రీవాల్.. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) వీకే సక్సేనాను కలుసుకుని తన రాజీనామాను

మిగతా 2వ పేజీలో...



ముఖం ఛిద్రమైన వ్యక్తి ఆస్పత్రికి తరలింపు

పేజర్లతో పేల్చేశారు

లెబనాన్‌లో 9 మంది హిజ్బుల్లాల మృతి

- 3 వేలమందికి గాయాలు.. పలువురు విషమం
- క్షతగాత్రుల్లో ఇరాన్ రాయబారి కూడా
- రాజధాని బీరుట్ ఆస్పత్రుల్లో హాహాకారాలు
- ఒకేసారి వెయ్యికి పైగా పేజర్ల విస్ఫోటం
- సిరియాలోనూ ఇదే తరహా ఘటనలు
- ఇజ్రాయెల్ పనేనని హిజ్బుల్లా ఆరోపణ

2



హరికథా సార్వభౌమ

కోట సచ్చిదానంద శాస్త్రి కన్నుమూత

3

- దేశవ్యాప్తంగా 20 వేలకు పైగా ప్రదర్శనలు
- ఆదిభట్ల నారాయణదాసు శిష్యుల్లో అగ్రగణ్యులు
- 2023లో 'పద్మశ్రీ' ప్రదానం చేసిన కేంద్రం
- 2018లో సంగీత నాటక అకాడమీ పురస్కారం

జియో సేవలకు తీవ్ర విఘాతం

- లక్షలాది వినియోగదారులకు ఇక్కట్లు
- డేటా సెంటర్‌లో అగ్నిప్రమాదమే కారణం!

2

బుల్డోజర్ న్యాయం.. రాజ్యాంగ వ్యతిరేకం

నిందితుల స్థిరాస్తులనూ తొలగించొద్దు.. మా అనుమతి లేకుండా దేన్నీ కూల్చొద్దు

- ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కరణ కిందికే వస్తుంది
- రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వే మార్గాలు, జల వనరుల్ని ఆక్రమించినవాటిని తొలగించొచ్చు
- మతపరమైన కట్టడాలనూ వదలొద్దు
- ప్రభుత్వం జడ్జి పాత్రను పోషించకూడదు
- 'విశాఖ' తరహాలో మార్గదర్శకాలు వెల్లడిస్తాం
- అవసరమైతే ఈసీ సాయం: సుప్రీంకోర్టు
- విచారణ అక్టోబరు 1వ తేదీకి వాయిదా
- అప్పటిదాకా కూల్చివేతలపై స్టే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: పలు రాష్ట్రాల్లో అమలవుతున్న బుల్డోజర్ న్యాయం చట్టవ్యతిరేకమని, ఇక మీదట కుదరదని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అక్రమ కూల్చివేత ఒక్కటి జరిగినా.. అది రాజ్యాంగం ప్రవచించిన విలువలకు వ్యతిరేకమని తేల్చి చెప్పింది. తదుపరి విచారణ తేదీ అయిన అక్టోబరు 1వ తేదీ వరకూ తమ అనుమతి లేకుండా దేశవ్యాప్తంగా ఎక్కడా బుల్డోజర్ న్యాయం అమలు కావటానికి వీల్లేదని తెలిపింది. అయితే రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వే మార్గాలు, జల వనరుల వంటి

మిగతా 2వ పేజీలో...



మహిళా వైద్యులకు 'నో నైట్ షిఫ్ట్ పాలసీ' సరికాదు

- మినహాయింపులు కాదు..
- మహిళలు సమానావకాశాలు కోరుకుంటారు: సుప్రీం
- బెంగాల్ డీఎంఈ, డీహెచ్‌పై వేటు
- కోల్‌కతాకు కొత్త పోలీస్ కమిషనర్



గూగుల్ టేకౌట్‌తో గుట్టు రట్టు

జెత్వానీ కేసులో తాడేపల్లి కుట్ర బద్దలు

ముంబై నటి కాదంబరీ జెత్వానీ కేసులో గుట్టును గూగుల్ టేకౌట్ రట్టు చేసింది. ఐపీఎస్ అధికారులు, వైసీపీ నేతలు తాడేపల్లి ప్యాలెస్ వేదికగా పన్నిన కుట్ర కోణాన్ని డిజిటల్ టెక్నాలజీ సాయంతో దర్యాప్తు అధికారులు పసిగట్టారు.

- ముంబై నటిపై వేధింపులకు అక్కడే స్కెచ్
- వేర్వేరుగా ముంబైకి పోలీసులు, విద్యాసాగర్
- ఆమెను పోలీసులకు చూపించింది అతడే
- ఆ టైమ్‌లో ఐపీఎస్‌లకు, ఆయనకు మధ్య మెసేజ్‌లు
- టెక్నాలజీ సాయంతో పసిగట్టిన దర్యాప్తు బృందం
- ఆ ముగ్గురు ఐపీఎస్‌లకు బిగుస్తున్న ఉచ్చు
- ఒక్కొక్కటిగా అక్రమాలు వెలుగులోకి
- విద్యాసాగర్‌పై లుక్ అవుట్ నోటీస్ యోచన

జెత్వానీ కేసులో ఎవరినీ వదలం: హోంమంత్రి అనిత



కుక్కల విద్యాసాగర్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నాటి ముఖ్యమంత్రి జగన్ స్నేహితుడిని రక్షించేందుకు అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్‌ఆర్ ఆంజనేయులు, విజయవాడ పోలీసు కమిషనర్ కాంతిరాణా తాతా, డీసీపీ విశాల్ గున్నీ, వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ చేసిన పథక రచనకు సంబంధించిన కీలకమైన డిజిటల్ ఆధారాలు దర్యాప్తు అధికారుల చేతికి చిక్కాయి. జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైన ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఇందులో ఎంతటి వ్యక్తులున్నా వదలవద్దని పోలీసు ఉన్నతాధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ముంబై నటి జెత్వానీ తన తల్లితో కలిసి విజయవాడకు వచ్చి తనకు నాడు జరిగిన అన్యాయం, వేధించిన వ్యక్తులు, ఇబ్బంది పెట్టిన అధికారులపై పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేశారు. ఆయన సూచన మేరకు ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్లో ఆమె రాతపూర్వక ఫిర్యాదు చేయడంతో

మిగతా 11వ పేజీలో...



సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 లక్షల చెక్కును చంద్రబాబుకు అందజేస్తున్న సునీత దంపతులు

సీఎంతో సునీతారెడ్డి దంపతుల భేటీ

- వివేకా పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదులో నిజానిజాలు తేల్చాలని వినతి
- సానుకూలంగా స్పందించిన చంద్రబాబు

3

బీసీ కార్పొరేషన్ పునర్వ్యవస్థీకరణ

- కమ్యూనిటీలవారీగా అభివృద్ధి ప్రణాళికలు
- బీసీ సంక్షేమ శాఖపై సమీక్షలో నిర్ణయం
- 'డైట్' బకాయిలకు మోక్షం
- రూ.110 కోట్ల విడుదలకు ఆమోదం
- కాస్మొటిక్ చార్జీల బకాయిలు కూడా..
- ప్రీ, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్పులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాల విడుదల
- ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం పునరుద్ధరణ
- బీసీ స్టడీ సర్కిళ్ల బలోపేతానికి 10 కోట్లు
- బీసీ రక్షణ చట్టం రూపకల్పనకు సీఎం ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్‌ను పునర్వ్యవస్థీకరించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కమ్యూనిటీలవారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించనుంది. బీసీ ఉప కులాలవారు ఎక్కడెక్కడ నివసిస్తున్నారు.. వారి వృత్తులు, తలసరి ఆదాయం వంటి వివరాలపై ఆరా తీసేందుకు సమగ్ర సర్వే నిర్వహించాలని నిశ్చయించింది. బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ శాఖపై మంగళవార మిక్కడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు బీసీ సంక్షేమ మంత్రి

మిగతా 11వ పేజీలో...



రెండు దఫాలుగా మద్యం పాలసీ


- తొలుత 3,396 దుకాణాలకు లాటరీ
- తర్వాత గీత కార్మికులకు 400 షాపులు
- పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రైవేటుకే
- ఆర్డినెన్స్ తీసుకురానున్న సర్కారు
- నేడు కేబినెట్ భేటీలో నిర్ణయం

11

టీటీడీ ఖజానాకు రూ.520 కోట్ల గండి

జగన్ ప్రభుత్వ నిర్వాకంతోనే.. విజిలెన్స్ అధికారుల నిర్ధారణ

- బాగున్న గుళ్లకూ 'శ్రీవాణి' నిధులు
- ముఖ్యులకు 25 శాతం వాటా
- బ్రేక్ దర్శనాల్లో నిబంధనలకు తూట్లు
- అక్కర్లేకున్నా ఇంజనీరింగ్ పనులకు భారీగా నిధుల కేటాయింపు
- సరుకుల కొనుగోలులో భారీ నష్టం
- ల్యాబ్ ఉన్నా పట్టించుకోలేదు
- అందువల్లే అన్నప్రసాదాల రుచి, నాణ్యత దెబ్బతిన్నాయ్!
- విజిలెన్స్ సమగ్ర నివేదిక



తిరుపతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలను ఉల్లంఘించి తీసుకున్న పలు నిర్ణయాల కారణంగా టీటీడీ ఖజానాకు రూ.520 కోట్ల వరకూ గండి పడింది. బాగున్న ఆలయాలకు కూడా శ్రీవాణి ట్రస్టు నిధులు కేటాయించారు. ఆ వ్యవహారంలో ముఖ్యులకు 25 శాతం వాటా దక్కినట్లు వెల్లడైంది. వీఐపీ బ్రేక్ దర్శనాల విషయంలోనూ నిబంధనలకు తూట్లు పొడిచారు. ఇంజనీరింగ్

మిగతా 11వ పేజీలో...



వినాయక చవితి అంటేనే కాంగ్రె్సకు గిట్టదు!

» నేను పూజలో పాల్గొన్నానని ఆ పార్టీకి కోపం

» బ్రిటిషర్లు కూడా ఈ ఉత్సవాలను ద్వేషించారు: మోదీ

భువనేశ్వర్, సెప్టెంబరు 17: వినాయక చవితి పర్వదినాన సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఇంట్లో తాను పూజలు చేయడాన్ని విమర్శించిన కాంగ్రె్సపై ప్రధాని మోదీ మండిపడ్డారు. ఈ పండుగ అంటే ఆ పార్టీకి గిట్టదన్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఘ్నేశ్వరుడిని ఏకంగా కటకటాల వెనుక పెట్టిందని ఆరోపించారు. వినాయక విగ్రహాన్ని పోలీసు వ్యాన్లో పడేసిన ఫొటో ఇటీవల వైరల్ అయిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మంగళవారం ఆయన ఒడిశాలో పర్యటించారు. భువనేశ్వర్లో రూ.3,800 కోట్ల విలువైన రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించారు. 'మన దేశంలో గణేశ్ ఉత్సవ్ హిందువుల పండుగ మాత్రమే కాదు. స్వాతంత్ర్య ఉద్యమంలో చాలా కీలక పాత్ర పోషించింది. విభజించు-పాలించు అన్న విధానాన్ని అవలంబించిన బ్రిటిషర్లు గణేశ్ ఉత్సవ్‌ను తీవ్రంగా ద్వేషించారు. నేటికి కూడా అధికార లాలసతో ఉన్న కొందరు సమాజాన్ని విభజించాలని చూస్తున్నారు. ఈ విద్వేష శక్తులు ముందుకెళ్లకుండా అందరం అడ్డుకోవాలి' అన్నారు. కాగా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ (పీఎంఏవై-జీ) పథకంలో భాగంగా 14 రాష్ట్రాలకు చెందిన 10 లక్షల మంది మహిళా లబ్ధిదారుల ఖాతాల్లో మోదీ మొదటి విడత వాయిదా మొత్తాన్ని జమ చేశారు.

మహారాష్ట్ర ఎన్నికలు వస్తున్నాయనే: కాంగ్రెస్

న్యూఢిల్లీ: రాజకీయాల కోసం ప్రధాని మోదీ మతాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. గణేశ్ పూజకు సంబంధించి తమ పార్టీపై ప్రధాని చేసిన విమర్శలపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందించారు. జస్టిస్ చంద్రచూడ్ ఇంట్లో గణేశ్ పూజకు విస్తృతంగా కవరేజీ ఇచ్చేందుకు కెమేరాలతో వెళ్లడం.. ప్రభుత్వ, న్యాయవ్యవస్థ మధ్య ఉన్న అధికార విభజన సూత్రాలకే విరుద్ధమన్నారు. త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున.. మహారాష్ట్ర సంప్రదాయ వస్త్రధారణతో మోదీ సీజేఐ ఇంట్లో గణేశుడి పూజలో పాల్గొన్నారని చెప్పారు.

మోదీ 3.0లో మధ్య తరగతి మందహాసం!



న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: మోదీ 3.0 సర్కారు పాలనలో మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూర్చే పథకాలు అమలు చేస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ 100 రోజుల పాలనలో అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. మోదీ సర్కారు మూడోసారి కొలువుదీరి 100 రోజులు పూర్తయిన సందర్భంగా అమిత్ షా, కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తమ ప్రభుత్వం సాధించిన విజయాలను వెల్లడించారు. తొలి 100 రోజుల్లోనే 14 రంగాల్లో రూ.15 లక్షల కోట్ల విలువైన పాలసీలను అమలు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా రూ.30,700 కోట్ల విలువైన మెట్రో ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామన్నారు. రూ.28,600 కోట్ల పెట్టుబడితో 12 పారిశ్రామిక కారిడార్లకు ఆమోదం తెలిపామని.. తద్వారా అంతర్జాతీయ తయారీ రంగానికి భారత్ కేంద్ర బిందువుగా మారనుందని చెప్పారు. ఉద్యోగ నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు పబ్లిక్ పరీక్ష చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. ఆదాయ పన్ను పరిమితిని రూ.7 లక్షలకు పెంచామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పట్టణ గృహ నిర్మాణ రంగానికి రూ.2.30 లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు.

జమ్మూకశ్మీర్‌లో నేడే తొలిదశ ఎన్నికలు

జమ్మూ, సెప్టెంబరు 17: దశాబ్ద కాలం విరామం తర్వాత.. జమ్మూకశ్మీర్ తొలి దశ ఎన్నికలకు సిద్ధమైంది. హిమాలయ పర్వతశ్రేణి పీర్‌పంజాల్ పరిధిలోని ఏడు జిల్లాల్లోని 24 నియోజకవర్గాలకు బుధవారం పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికలు 8 జమ్మూ రీజియన్‌లోని మూడు జిల్లాల్లో.. మరో 18 కశ్మీర్ లోయలోని నాలుగు జిల్లాల్లో ఉన్నాయి. 90 మంది స్వతంత్రులు సహా.. మొత్తం 219 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. వీరి భవిష్యత్‌ను 23.27 లక్షల మంది ఓటర్లు నిర్ణయించనున్నారు. తొలి దశ ఎన్నికల్లో మాజీ సీఎం మహబూబా ముఫ్తీ కుమార్తె.. ముఫ్తీ కుటుంబంలో మూడోతరం నాయకురాలు ఇల్తిజా ముఫ్తీ బిజ్‌బెహ్రా నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు.

జియో సేవలకు తీవ్ర విఘాతం

ముంబై, సెప్టెంబరు 17: దేశంలో అతిపెద్ద టెలికాం కంపెనీ రిలయన్స్ జియో సేవలకు మంగళవారం ఉదయం తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా ముంబై సర్కిల్‌తో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో లక్షలాది మంది వినియోగదారులు కాలింగ్, ఇంటర్నెట్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాంతో ఎక్స్ సహా ఇతర మాధ్యమాల్లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. టెక్నాలజీ సేవల విఘాతాలను పర్యవేక్షించే డౌన్‌డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం.. జియో మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీతో పాటు ఫైబర్ ఇంటర్నెట్ సేవలకూ అంతరాయం ఏర్పడింది. జియో ఐడీసీ డేటా సెంటర్‌లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదమే ఇందుకు కారణమని రాయిటర్స్ కథనం పేర్కొంది. కానీ, కంపెనీ ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. వినియోగదారులకు క్షమాపణలు తెలిపిన జియో.. సేవల అంతరాయానికి చిన్న సాంకేతిక సమస్యే కారణమని పేర్కొంది. సమస్యను పరిష్కరించామని, సేవలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని తెలిపింది. అయితే ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఈ సేవలు పూర్తిగా పునరుద్ధరణ జరగలేదని తెలుస్తోంది.



మయన్మార్‌లో యాగీ తుఫాను బీభత్సం

226 మంది మృతి

బ్యాంకాక్, సెప్టెంబరు 17: యాగీ టైఫూన్ మయన్మార్‌లో విధ్వంసం సృష్టించింది. పెను తుఫాను ప్రభావంతో వరదలు పోటెత్తడంతోపాటు పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో ఇప్పటివరకు దాదాపు 226 మంది ప్రాణాలు కోల్పోగా 77 మంది గల్లంతైనట్లు అధికారిక మీడియా వెల్లడించింది. తుఫాను బీభత్సానికి దాదాపు 6.31 లక్షల మంది ప్రభావితులయ్యారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. సుమారు 1.60 లక్షల ఇళ్లు ధ్వంసం కాగా లక్షల మంది సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. దేశవ్యాప్తంగా లక్షల మంది బాధితులు ఆహారం, నీరు, సరైన ఆశ్రయం లేక అల్లాడుతున్నారని ఐరాసకు చెందిన మానవతా సహాయ సంస్థ వెల్లడించింది. మరోవైపు యాగీ టైఫూన్ ఆగ్నేయాసియా దేశాలను బెంబేలెత్తించింది. వారం రోజుల్లో ఆయా దేశాల్లో 500 మంది మృతిచెందారు. ముఖ్యంగా వియత్నాం, థాయ్‌లాండ్, లావోస్ దేశాలపై టైఫూన్ తీవ్ర ప్రభావం చూపింది. యాగీ ధాటికి వియత్నాంలో 300 మంది ప్రాణాలు కోల్పోగా, థాయ్‌లాండ్‌లో 42 మంది మృతిచెందారు. కాగా, టైఫూన్ ప్రభావానికి గురైన వియత్నాం, మయన్మార్, లావోస్ దేశాలకు భారత్ సాయాన్ని ప్రకటించింది. ఆపరేషన్ 'సద్భవ్' పేరిట నిత్యావసర వస్తువుల్ని, ఇతర సామగ్రిని ఇచ్చి ఆదుకొంది.

ఢిల్లీ కొత్త సీఎం ఆతిశీ

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యేల మద్దతు ఉన్న లేఖను గవర్నర్‌కు ఆతిశీ అందజేశారు. కేజ్రీవాల్ రాజీనామాను, ఆతిశీ లేఖను ఎల్జీ రాష్ట్రపతికి పంపిస్తారని, అవి ఆమోదం పొందగానే ప్రభుత్వ ఏర్పాటుకు, సీఎంగా ప్రమాణ స్వీకారానికి ఆతిశీని ఆహ్వానిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ నెల 26-27 తేదీల్లో ఢిల్లీ అసెంబ్లీ సమావేశం కానుంది. ఈ సమావేశాల్లోనే ఆతిశీ తన ప్రభుత్వ మెజారిటీని నిరూపించుకునే అవకాశముంది.



తన రాజీనామా పత్రాన్ని ఢిల్లీ ఎల్జీ వినయ్ సక్సేనాకు అందజేస్తున్న అరవింద్ కేజ్రీవాల్



ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేల మద్దతు లేఖను సమర్పిస్తున్న ఆతిశీ

కేజ్రీవాల్ మౌనం

మంగళవారం నాటి పరిణామాల మధ్య కేజ్రీవాల్ మీడియాతో ఏమీ మాట్లాడకుండా మౌనం దాల్చారు. ఆతిశీ విలేకర్లతో మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని ఎల్జీని కోరామన్నారు. సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చిన తర్వాత వేరే ఏ నాయకుడైనా.. సీఎం పదవిని తనతోనే అట్టి పెట్టుకుంటారని, కానీ, కేజ్రీవాల్ మాత్రం ప్రజాకోర్టుకు వెళ్లటానికి నిర్ణయించి రాజీనామా చేశారని పేర్కొన్నారు. 'కేజ్రీవాల్ నన్ను విశ్వసించి ఎమ్మెల్యేను, మంత్రిని, ఇప్పుడు సీఎంని చేశారు. ఆప్‌లోనే ఇది సాధ్యం' అని పేర్కొంటూ కేజ్రీవాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కేజ్రీవాల్‌ను తిరిగి సీఎంను చేయటమే లక్ష్యంగా రానున్న రోజుల్లో పని చేస్తానన్నారు. "మీ బిడ్డ, సోదరుడు అయిన కేజ్రీవాల్‌ను మళ్లీ సీఎంను చేయండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఢిల్లీలో ఒకరే ముఖ్యమంత్రి. ఆయనే కేజ్రీవాల్" అని పేర్కొన్నారు. మరోవైపు, ఆతిశీ సీఎం పదవిని చేపట్టిన అనంతరం.. త్వరలోనే అసెంబ్లీని రద్దు చేస్తారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. నవంబరులో మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లతోపాటు ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగాలని కేజ్రీవాల్ కోరుకుంటున్న దృష్ట్యా.. అసెంబ్లీ రద్దు నిర్ణయం తీసుకోవచ్చని ఆ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రస్తుత ఢిల్లీ అసెంబ్లీ గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరి 23వ తేదీ వరకు ఉంది. షెడ్యూల్ ప్రకారమైతే ఫిబ్రవరిలోనే అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి.

ఢిల్లీకి మూడవ మహిళా సీఎం

ఆతిశీ సీఎంగా బాధ్యతలు చేపడితే.. ఢిల్లీలో ఆ పదవిని అధిష్ఠించిన మూడవ మహిళ అవుతారు. అత్యంత పిన్న వయసులో ఢిల్లీ సీఎం అయిన వ్యక్తిగానూ ఆమె రికార్డు సృష్టిస్తారు. ఇంతకుముందు కాంగ్రెస్ నాయకురాలు షీలా దీక్షిత్ (1998 నుంచి 2013 వరకు), బీజేపీ నాయకురాలు సుష్మా స్వరాజ్ (1998లో 52 రోజులపాటు) ఢిల్లీ సీఎంగా పని చేశారు. 15 ఏళ్లు ఏకధాటిగా ఢిల్లీని పాలించిన ఏకైక సీఎంగా షీలాదీక్షిత్ రికార్డు నెలకొల్పారు. ఆతిశీ.. కేజ్రీవాల్ క్యాబినెట్‌లో విద్య, ఆర్థికం, ప్రజాపనులు తదితర 14 శాఖలను నిర్వహించారు. కేజ్రీవాల్ జైలులో ఉన్నప్పుడు పార్టీని నడిపించారు. కాగా, కేజ్రీవాల్ ఆడుతున్న రాజకీయ క్రీడ విఫలం కానుందని ప్రతిపక్ష బీజేపీ ఎద్దేవా చేసింది. వ్యక్తిని మార్చినంత మాత్రాన పార్టీ స్వభావం మారదని బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు వీరేందర్ సచ్‌దేవా తెలిపారు. ఆప్ నేతలు అవినీతికి పాల్పడ్డారని, ప్రజలే వారికి గుణపాఠం నేర్పిస్తారని విమర్శించారు. మనీశ్ సిసోడియా ఒత్తిడితోనే కేజ్రీవాల్.. అతిషిని ముఖ్యమంత్రిగా నియమించారన్నారు. ఆతిశీని డమ్మీ సీఎంగా ఆప్ తిరుగుబాటు ఎంపీ స్వాతి మలివాల్ అభివర్ణించారు. ఆతిశీ కుటుంబం టెర్రరిస్టు అఫ్జల్ గురును ఉరితీయకుండా కాపాడేందుకు ప్రయత్నించిందని, ఈ మేరకు నాటి రాష్ట్రపతికి విజ్ఞప్తి చేసిందని ఆరోపించారు.

దేశంలో ఇప్పటిదాకా 16 మంది మహిళా సీఎంలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: ఢిల్లీ సీఎంగా ఆతిశీ బాధ్యతలు చేపట్టబోతున్న తరుణంలో.. దేశంలో మహిళా సీఎంలుగా పని చేసిన పలువురు నేతల ప్రస్తావన మరోసారి తెరపైకి వచ్చింది. భారత రాజకీయాల్లో పురుషాధిక్యం బలంగా ఉన్నా.. అనేక మంది మహిళామణులు రాజకీయవేత్తలుగా తమదైన ముద్ర వేశారు. స్వాతంత్ర్య సమరయోధురాలు సుచేతా కృపాలాని దేశంలో తొలి మహిళా సీఎంగా నిలిచారు. ఈమె.. 1963 నుంచి 1967 వరకు యునైటెడ్ ప్రావిన్స్ ప్రభుత్వాన్ని నడిపించారు. తమిళనాడు సీఎంగా పనిచేసిన జయలలిత.. అమ్మగా.. అక్కడి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ.. దీదీగా ఆ రాష్ట్ర ప్రజల ఆప్యాయతను చూరగొన్నారు. సీఎంలుగా పనిచేసినవారిలో సుష్మా స్వరాజ్, మాయావతి, షీలా దీక్షిత్, వసుంధరా రాజె, మెహబూబా ముఫ్తీ ప్రముఖ మహిళా నేతలు. ప్రస్తుతం దేశంలో మమత ఒక్కరే మహిళా సీఎం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా దేశంలో 16 మంది మహిళలు సీఎంలు అయ్యారు. ప్రస్తుతం వార్తల్లో ఉన్న ఆతిశీ దేశంలో 17వ మహిళా సీఎం, ఢిల్లీకి మూడో మహిళా సీఎం కాబోతున్నారు.

మహిళా సీఎంలు

పేరు	రాష్ట్రం	పార్టీ	ఏడాది
సుచేతా కృపాలాని	యునైటెడ్ ప్రావిన్సెస్ (నేటి యూపీ)	కాంగ్రెస్	1963
నందినీ సత్పతి	ఒడిశా	కాంగ్రెస్	1972
శశికళా కకోద్కర్	గోవా	ఎంజీపీ	1973
సైదా అన్వరా తైమూర్	అసోం	కాంగ్రెస్	1980
జానకీ రామచంద్రన్	తమిళనాడు	ఏఐడీఎంకే	1988
జయలలిత	తమిళనాడు	ఏఐడీఎంకే	1991
మాయావతి	ఉత్తర్ ప్రదేశ్	బీఎస్పీ	1995
రాజిందర్ కౌర్	పంజాబ్	కాంగ్రెస్	1996
రబ్రీ దేవి	బిహార్	ఆర్‌జేడీ	1997
సుష్మా స్వరాజ్	ఢిల్లీ	బీజేపీ	1998
షీలా దీక్షిత్	ఢిల్లీ	కాంగ్రెస్	1998
ఉమా భారతి	మధ్యప్రదేశ్	బీజేపీ	2003
వసుంధరా రాజె	రాజస్థాన్	బీజేపీ	2003
మమతా బెనర్జీ	బెంగాల్	టీఎంసీ	2011
ఆనందీ బెన్ పటేల్	గుజరాత్	బీజేపీ	2014
మెహబూబా ముఫ్తీ	జమ్మూ కశ్మీర్	పీడీపీ	2016

లోకం తీరు





మార్క్ మనసుతో శాసిస్తాడు..

అలెక్సా పాటేస్తుంది

64 ఏళ్ల ఏఎల్ఎస్ బాధితుడి మెదడులో 'సింక్రాన్' చిప్

న్యూయార్క్, సెప్టెంబరు 17: అమెజాన్ అలెక్సాతో పనిచేయించాలంటే.. దాన్ని పేరు పెట్టి పిలవాలి. మనకు నచ్చిన పాటో, సినిమానో ప్లే చెయ్యమని ఆజ్ఞాపించాలి. అప్పుడే పనవుతుంది. కానీ.. అమెరికాకు చెందిన 64 ఏళ్ల మార్క్ అనే వృద్ధుడు కేవలం తన మనసుతో ఆలోచించడం ద్వారానే అమెజాన్ అలెక్సాను పనిచేయించగలుగుతున్నారు! ఇది తావీజ్ మహిమ కాదు. సింక్రాన్ అనే కంపెనీ తయారుచేసిన బ్రెయిన్ ఇంప్లాంట్ మహిమ. మెదడులో అమర్చే చిప్‌లపై చాలాకాలంగా పరిశోధనలు చేస్తున్న సింక్రాన్ సంస్థ.. ఆయన మెదడులో అమర్చిన చిప్ ద్వారానే ఇది సాధ్యమవుతోంది. మెదడు, వెన్నుపూసలోని నాడులను క్రమంగా క్షీణింపజేసే ఏఎల్ఎస్ (అమ్యోట్రోపిక్ లాటెరల్ స్క్లెరోసిస్) వంటి వ్యాధులతో బాధ పడేవారి కోసం సింక్రాన్, ఈలన్ మస్క్‌కు చెందిన 'న్యూరాలింక్' వంటి సంస్థలు చాలాకాలంగా ప్రయోగాలు చేస్తున్నాయి. వాటిలో తొలుత న్యూరాలింక్ సంస్థ.. తొలిసారిగా ఒక మనిషి మెదడులో బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్‌ను (బీసీఐ) అమర్చినట్లు ఈ ఏడాది మొదట్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దాని సరసన సింక్రాన్ కూడా చేరింది. ఏఎల్ఎస్‌తో బాధపడుతున్న మార్క్ మెదడులో ఈ ఇంప్లాంట్‌ను అమర్చింది. తద్వారా అతను తన ఆలోచనలతోనే 'అమెజాన్ ఫైర్ టాబ్లెట్' పరికరాన్ని పనిచేయించగలిగారు. ఇష్టమైన వీడియోలను ప్లే చేయగలిగారు.

మహిళలకు మినహాయింపులు కాదు.. సమాన అవకాశాలివ్వాలి!

» వారి రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

» పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ 'నైట్ షిఫ్ట్ పాలసీ'ని తప్పుబట్టిన సుప్రీంకోర్టు

కోల్‌కతా, సెప్టెంబరు 17: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రాత్రి షిఫ్టు డ్యూటీలకు మహిళా వైద్యులను నియమించవద్దని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు తప్పుబట్టింది. 'మహిళలు రాత్రి వేళల్లో పని చేయలేరని ఎలా చెబుతారు? ఇటువంటి పరిమితులు మహిళలకే ఎందుకు? మహిళలు మినహాయింపులను కోరటం లేదు. సమాన అవకాశాలు కావాలంటున్నారు. అన్ని షిఫ్టుల్లో పని చేయటానికి వారు సిద్ధంగా ఉన్నారు. రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది' అని స్పష్టం చేసింది. కోల్‌కతా మహిళా వైద్యురాలి హత్యాచారం ఘటనను సుమోటోగా తీసుకున్న సుప్రీంకోర్టు మంగళవారం విచారణ కొనసాగించింది. హతురాలి పేరు, ఫొటోను తొలగించాల్సిందిగా వికీపీడియాను ధర్మాసనం మరోసారి ఆదేశించింది. ఇక ఆర్జీకర్ ఆస్పత్రిలో ఆర్థికపరమైన అవకతవకలపై దర్యాప్తు చేస్తున్న సీబీఐని స్టేటస్ రిపోర్టు సమర్పించాల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశించింది. హత్యాచార ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం పదవికి రాజీనామా చేసేలా మమతను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 'ఇది రాజకీయ వేదిక అనుకుంటున్నారా' అని పిటిషనర్‌ను మందలించింది. మరోవైపు, బెంగాల్ హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ కౌస్తవ్ నాయక్‌ను, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(డీఎంఈ) డాక్టర్ దేబశీష్ హల్దార్‌ను ఆ పదవుల్లోంచి ప్రభుత్వం తొలగించింది. జూనియర్ వైద్యులతో సోమవారం భేటీ తర్వాత మమత ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు.

బుల్డోజర్ న్యాయం.. రాజ్యాంగ వ్యతిరేకం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా ఆస్తులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలకు ఈ నిషేధం వర్తించదని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అక్రమంగా కూల్చివేతలు కొనసాగుతున్నాయని, వాటిని అడ్డుకోవాలని కోరుతూ జమాత్ ఉలేమా ఎ హింద్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ విమెన్ దాఖలు చేసిన పిటిషన్లపై జరుపుతున్న విచారణను సుప్రీంకోర్టు కొనసాగించింది. బుల్డోజర్ కూల్చివేతలకు సంబంధించి దేశవ్యాప్తంగా వర్తించే విధంగా మార్గదర్శకాలను రూపొందిస్తామని ఈ నెల 2వ తేదీన ధర్మాసనం తెలిపిన విషయం తెలిసిందే. మంగళవారం విచారణ సందర్భంగా.. దీనిని ధర్మాసనం ప్రస్తావించింది. "ఆ ఆదేశాలు మేం జారీ చేసిన తర్వాత కూడా.. 'బుల్డోజర్ ఆగకుండా నడుస్తూనే ఉంటుంది. దానిని ఎవరు నడుపుతున్నారన్న దానిపై ఆధారపడి అది ఉంటుంది' అంటూ వ్యాఖ్యలు వినిపించాయి" అని పేర్కొంది. ఈ కేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఉద్దేశించి.. 'మిస్టర్ మెహతా! మార్గదర్శకాలను రూపొందించిన తర్వాత.. ఇటువంటి అసందర్భ ప్రగల్భాలను ఆపటానికి మీ సాయం తీసుకుంటాం. అవసరమైతే ఎన్నికల సంఘాన్ని కూడా అడుగుతాం' అని పేర్కొంది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు సీయూ సింగ్, ఎంఆర్ శంషాద్, నిజాంపాషా, రష్మీసింగ్ వాదనలు వినిపించారు. సెప్టెంబరు 2వ తేదీన సుప్రీంకోర్టు ఈ అంశంపై స్పందించిన తర్వాత కూడా పలు రాష్ట్రాల్లో కూల్చివేతలు జరిగాయని తెలిపారు. దీనికి తుషార్ మెహతా ప్రతి వాదనలు వినిపిస్తూ.. నిబంధనలను ఉల్లంఘించి ఒక్కటంటే ఒక్క కూల్చివేత కూడా జరగలేదన్నారు. ముస్లింల ఇళ్లను, దుకాణాలను మాత్రమే కూల్చుతున్నారనే ప్రచారాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. బయట జరుగుతున్న ప్రచారం గురించి తుషార్ మెహతా చెబుతున్నప్పుడు.. 'బయటి చప్పుడు మమ్మల్ని ప్రభావితం చేయలేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'కార్యనిర్వాహక వర్గం (ప్రభుత్వ యంత్రాంగం) న్యాయమూర్తి పాత్రను పోషించలేదు. సమగ్ర విచారణ అనంతరం న్యాయస్థానం జారీ చేసే మార్గదర్శకాలు దేశమంతటా వర్తిస్తాయి' అని తెలిపింది. విచారణను వచ్చే నెల 1వ తేదీకి వాయిదా వేస్తున్నామని, అప్పటి వరకూ ఏవైనా నేరాల్లో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల స్థిరాస్తులను కూడా కూల్చివేయవద్దని పేర్కొంది. తమ అనుమతి లేకుండా కూల్చివేతలు కొనసాగించవద్దని తెలిపింది. అక్రమ నిర్మాణాల కూల్చివేతను అడ్డుకోవద్దని, ఆ మేరకు మినహాయింపు ఇవ్వాలని మెహతా కోరారు. దీనికి ధర్మాసనం నిరాకరిస్తూ.. 'కొన్ని రోజులపాటు మీరు చేతులు ముడుచుకోవాల్సిందే. అప్పటి వరకూ ఆకాశం ఏమీ కింద పడదు' అని వ్యాఖ్యానించింది. ఎవరైనా తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే.. కోర్టు ధిక్కరణను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.



ఫుట్‌పాత్ మీద ఏ మత కట్టడం ఉన్నా తొలగించండి!

విచారణ సందర్భంగా తుషార్ మెహతా.. ఫుట్‌పాత్‌ను ఆక్రమించి నిర్మించిన ఓ నిర్మాణాన్ని నోటీసులు ఇచ్చిన తర్వాతే తొలగించామన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'అటువంటి వాటికి నోటీసులు కూడా అవసరం లేదు. మతపరమైన నిర్మాణాలున్నా కూడా వాటిని తొలగించండి. ఏ మతానికి చెందినదైనా సరే!' అని స్పష్టం చేసింది.

విశాక మార్గదర్శకాల తరహాలో

పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కొన్ని కూల్చివేత ఘటనలను ప్రస్తావించబోగా.. విశాక మార్గదర్శకాల తరహాలో ఈ మొత్తం అంశంపైనే మార్గదర్శకాలను రూపొందిస్తాం అని ధర్మాసనం తెలిపింది. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణకు సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను విశాక మార్గదర్శకాలుగా పేర్కొంటారు. కాగా, అక్రమ నిర్మాణాలను చట్టపరమైన ప్రక్రియతో తొలగించాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. బుల్డోజర్ అన్యాయంపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును స్వాగతిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

పేజర్లతో పేల్చేశారు

ఇజ్రాయెల్ రహస్య ఆపరేషన్!.. లెబనాన్‌లో 9మంది హిజ్బుల్లా ఉగ్రవాదుల మృతి

» 3 వేల మందికి పైగా క్షతగాత్రులు

» 200 మంది పరిస్థితి విషమం

» ఒకే సమయంలో వెయ్యికి పైగా పేజర్ల విస్ఫోటం... అన్నీ కొత్తవే!

» మాల్‌వేర్ ప్రభావమంటున్న నిపుణులు





చిత్రంలో ఎడమవైపు ఉన్నది పాత పేజర్, కుడి వైపున ఉన్నవి కొత్త పేజర్లు. ఈ కొత్త పేజర్లలో మాల్‌వేర్ చొప్పించడం ద్వారా ఇజ్రాయెల్ వీటిని పేల్చివేసి ఉండొచ్చని భావిస్తున్నారు

బీరుట్, సెప్టెంబరు 17: లెబనాన్ కేంద్రంగా.. ఇజ్రాయెల్‌పై ముప్పేట దాడులు చేస్తున్న హిజ్బుల్లా ఉగ్ర సంస్థకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ట్యాపింగ్ నుంచి తప్పించుకునేందుకు పేజర్లను వినియోగిస్తున్న హిజ్బుల్లా పాలిట.. ఆ పరికరాలే మృత్యువుగా మారాయి. మంగళవారం మధ్యాహ్నం 3.45 గంటల సమయంలో లెబనాన్ వ్యాప్తంగా ఏకకాలంలో వెయ్యికి పైగా పేజర్లు విస్ఫోటం చెందాయి. బీరుట్ సహా.. పలు నగరాల్లో జరిగిన ఈ పేలుళ్లలో 9 మంది మృతిచెందగా.. 3 వేల మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో తీవ్రంగా కాలిన గాయాలైన 200 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ ఘటన జరిగిన వెంటనే.. పేజర్లను కాల్చేయాలంటూ హిజ్బుల్లా నాయకత్వం ఆదేశాలను జారీ చేసింది. 'భద్రతాపరంగా ఇదో అతి పెద్ద లోపం' అని వ్యాఖ్యానిస్తూ.. ఈ దారుణాలు ఇజ్రాయెల్ పనే అని ఆరోపణలు చేసింది. ఏకకాలంలో వెయ్యికిపైగా పేజర్లు పేలిపోవడం కాకతాళీయం కాదని, పక్కా ప్రణాళికతో జరిగిన దాడి అని నిపుణులు చెబుతున్నారు. ఈ పేలుళ్లలో లెబనాన్ ఎంపీ కుమారుడు మృతిచెందగా.. బీరుట్‌లో ఇరాన్ రాయబారి ముజ్తబా అమానీ తీవ్రంగా గాయపడినట్లు రాయిటర్స్ వార్తాసంస్థ తెలిపింది. లెబనాన్‌లోని రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ సంస్థలు కూడా ఒక్క బీరుట్‌లోనే 50కి పైగా అంబులెన్సులను వినియోగించామని, 300 మందికి పైగా ఎమర్జెన్సీ బృందాలు క్షతగాత్రులకు చికిత్సనందిస్తున్నాయని పేర్కొన్నాయి. పేజర్లు పేలడానికి ముందు అసాధారణమైన 'బీప్' శబ్దం వచ్చిందని ప్రత్యక్ష సాక్ష్యులు చెబుతున్నారు. మరోవైపు సిరియాలోని డమాస్కస్‌లో కూడా హిజ్బుల్లా నేతలు వినియోగించే పేజర్లు పేలిపోయాయని, 11 మంది తీవ్రంగా గాయపడ్డారని అల్-జజీరా తెలిపింది.



జేబులో పేజర్ పేలిపోవడంతో కుప్పకూలిన ఓ వ్యక్తి

లిథియం అయాన్ బ్యాటరీతో తీవ్రత

మొబైల్ ఫోన్ విప్లవంతో అన్ని దేశాల్లో పేజర్లు కనుమరుగయ్యాయి. అయితే.. హిజ్బుల్లా మాత్రం సమాచార మార్పిడిలో భద్రత కోసం వీటిని మళ్లీ వినియోగించడం మొదలు పెట్టింది. పాత పేజర్లలో 'ఏఏ' రకం చిన్న బ్యాటరీలను వాడేవారు. కొత్తగా తెప్పించిన పరికరాల్లో మాత్రం.. లిథియం అయాన్ బ్యాటరీలను వినియోగించారు. వేడెక్కితే పేలిపోయే స్వభావం ఈబ్యాటరీలకు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పేజర్లలో మాల్‌వేర్ జొప్పించి, ఒకే సమయంలో.. వాటి బ్యాటరీలు వేడెక్కి.. పేలిపోయేలా కుట్ర జరిగి ఉంటుందని సైబర్ నిపుణులు అనుమానిస్తున్నారు.

ఇంకా పేజర్ల వాడకమా?

టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చి.. 5జీ నెట్‌వర్క్‌ను విరివిగా వినియోగిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో.. భద్రత నేపథ్యంలో హిజ్బుల్లా ఉగ్రసంస్థ పేజర్లను వినియోగిస్తోంది. సొంతంగా నెట్‌వర్క్ టవర్లను ఏర్పాటు చేసుకుని, పేజర్ల ద్వారా సందేశాలను అందిపుచ్చుకుంటోంది. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి తర్వాత.. ఇజ్రాయెల్‌పై ఉత్తరాది నుంచి దాడి చేస్తున్న హిజ్బుల్లా.. తొలినాళ్లలో తమ నాయకత్వాన్ని పెద్ద సంఖ్యలోనే కోల్పోయింది. మొబైల్ ట్రాకింగ్, ట్యాపింగ్ ద్వారా ఇజ్రాయెల్ తమవారి ఉనికిని గుర్తిస్తున్నట్లు నిర్ధారించుకుని, పేజర్లవైపు మొగ్గుచూపింది. అయితే.. ఇజ్రాయెల్‌పై దాడి తొలినాళ్ల నుంచే పేజర్లను వాడినా.. హిజ్బుల్లా ఇటీవల పెద్ద సంఖ్యలో వీటిని తెప్పించినట్లు లెబనాన్‌కు చెందిన ఎంటీవీ నెట్‌వర్క్ వెల్లడించింది. కొత్తగా తెచ్చిన పరికరాలే మంగళవారం పేలిపోయినట్లు కథనాలను ప్రసారం చేసింది.

జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల కన్నుమూత


పడాల వీరభద్రరావు

కృష్ణాదేవిపేట (గొలుగొండ)/ రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17: జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు (80) అనారోగ్యంతో మంగళవారం రాత్రి కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో కన్నుమూశారు. కాలిగాయంతో పాటు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ఆయన్ను కుటుంబ సభ్యులు వారం కిందట రాజమండ్రిలోని ఆస్పత్రిలో చేర్చారు. మెరుగైన చికిత్స కోసం మూడు రోజుల క్రితం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ మంగళవారం వీరభద్రరావు తుదిశ్వాస విడిచారు. పడాల వీరభద్రరావు రాజమండ్రిలో కోస్తా సమయం దినపత్రిక ఎడిటర్‌గా ఉంటూ జాతీయ అల్లూరి యువజన సంఘం ఏర్పాటుచేశారు. ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లో అల్లూరి స్మారక ప్రాంతాల పరిరక్షణకు, అభివృద్ధికి ఆయన విశేషంగా కృషిచేశారు. అనేక ప్రాంతాల్లో అల్లూరి సీతారామరాజుతో పాటు ఆయన ప్రధాన అనుచరులు గాం గంటందొర, మల్లుదొర విగ్రహాలు స్థాపనకు ఎనలేని కృషిచేశారు. పడాల వీరభద్రరావు మృతికి అల్లూరి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.సత్యనారాయణరావు, కార్యదర్శులు అంబటి వరహాలరాజు, లాక్కాకుల బాబ్జీ, శ్యామల వరలక్ష్మి, వెంకటరమణ, తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

సముద్ర మార్గాన జంప్

(మొదటి పేజీ తరువాయి)

నుంచి చెన్నైలోని బంధువుల ఇంటికి వెళ్లారు. దేశం దాటి వెళ్లేందుకు అక్కడ అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణం చేయడానికి ఒక్కరోజు ముందు, జూన్ 11న, భార్యతో కలిసి ఓడ ఎక్కేశారు. కేంద్ర సర్వీసు ఇండియన్ కోస్ట్ గార్డులో సీనియర్ సివిల్ స్టాఫ్ ఆఫీసర్ అయిన వెంకటరెడ్డి.. ఆ పరిచయాలతో సముద్ర మార్గం ద్వారా ఉడాయించారు. సాధారణంగా ఎయిర్‌పోర్టులపై అందరి దృష్టి ఉంటుందని భావించి, ఆయన ఈ 'దారి'ని ఎంచుకున్నారని భావిస్తున్నారు. వెంకటరెడ్డి వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఏపీ మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్‌గా మూడేళ్లపాటు పని చేసి సుమారు రూ. మూడు వేల కోట్లు రాష్ట్ర ఖజానాకు గండి కొట్టాడు. తాడేపల్లి 'ముఖ్యనేత'లకు భారీగా దోచి పెట్టారు.. ఆయన హయాంలో మైనింగ్‌లో ఘోరమైన ఉల్లంఘనలకు పాల్పడి రూ.2,856 కోట్ల ప్రభుత్వ సంపదను ప్రైవేటు వ్యక్తుల పరం చేశారు. మే 2021 నుంచి జూన్ 2024 వరకూ ప్రైవేటు ఏజెన్సీలు భారీగా ఇసుక తవ్వకాల్లో అగ్రిమెంట్ షరతులను ఉల్లంఘించాయి. అయినా, వాటిపై వెంకటరెడ్డి చర్యలు తీసుకోలేదు. పైగా, దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీం కోర్టు ఆదేశాలను సైతం ఉల్లంఘించారు. వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యం వ్యవహరించిన ఆయన, అప్పటి ప్రభుత్వ పెద్దల దోపిడీకి సహకరించారు. తన నిర్వాకాలు బయటపడతాయనే భయంతో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు తీరకముందే దేశం నుంచి వెంకటరెడ్డి ఉడాయించారు. చంద్రబాబు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొలువు దీరిన వెంటనే ఇసుక తవ్వకాలు, మైనింగ్ అక్రమాలపై ప్రాథమిక నివేదిక తెప్పించింది. వెంకటరెడ్డి ఇష్టారాజ్యంగా చేసిన దోపిడీపర్వం గురించి పలు ఆధారాలు లభించడంతో ఆయనను సస్పెండ్ చేసి పూర్తిస్థాయి ఏసీబీ విచారణకు ఈ ఏడాది ఆగస్టు 1న ఆదేశించింది. రంగంలోకి దిగిన అవినీతి నిరోధక శాఖ అధికారులు.... గనుల శాఖలో అక్రమాల పుట్టను పసిగట్టారు. ఇటీవలే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వెంకట రెడ్డిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించగా, ఆయన జాడ కనిపించలేదు. విజయవాడలోని మైనింగ్ గెస్ట్ హౌస్‌లో మూడేళ్లకు పైగా వెంకట రెడ్డి బస చేశారు. ఈ ఏడాది జూన్ 6న అక్కడున్న అటెండర్ రాజును మంగంపేటకు బదిలీ చేశారు. అంతకు ముందురోజు తన సామాన్లన్నీ వెంకటరెడ్డి ప్యాక్ చేసినట్లు ఏసీబీ అధికారులకు రాజు తెలిపారు. అయితే, ఎప్పుడు వెంకట రెడ్డి గెస్ట్ హౌస్ వదిలి వెళ్లారనేది తెలియదని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో ఇల్లు రెండు నెలల క్రితమే ఖాళీ చేశారని, కడప జిల్లాలోని ఆయన సొంతూరులోనూ ఇంటికి తాళం వేసి ఉందని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని చెబుతున్నారు.

ఎలా పారిపోయారు?

వెంకటరెడ్డి ఫోను ఎప్పటి నుంచి స్విచ్ఛాఫ్ అయిందో టెక్నాలజీ ద్వారా ఏసీబీ అధికారులు గుర్తించారు. చివరిగా రెండు నెలల క్రితం సమీప బంధువుకు వాట్సాప్ ద్వారా పత్రికల్లో తనపై వచ్చిన వార్తల కటింగ్స్ వెంకటరెడ్డి పంపినట్లు పసిగట్టారు. దాని ఆధారంగా కడప జిల్లాలో ఉంటున్న ఆ బంధువు ఇంటితలుపు తట్టారు. అక్కడ ఆరా తీయగా, చెన్నైలో వెంకటరెడ్డికి బంధువులు ఉన్నారని, అక్కడికి జూన్ మొదటి వారంలో భార్యతో కలిసి వెళ్లారని తెలిసింది. చెన్నైకు వెళ్లి విచారించగా తమకు ఏమీ తెలీదని, సొంత శాఖకు తిరిగి వెళుతున్నట్లు మాత్రమే చెప్పారని అక్కడి వారు సమాధానమిచ్చారు. అయితే ఇండియన్ కోస్ట్ గార్డులో పనిచేసిన వెంకటరెడ్డి అక్కడ తనకు పరిచయం ఉన్న వారి ద్వారా చెన్నైలో షిప్పు ఎక్కి భార్యతో సహా విదేశాలకు ఉడాయించినట్లు తెలుస్తోంది. పదిరోజుల పాటు సముద్రంలో ప్రయాణించే షిప్పులో పది లక్షలు చెల్లించి దంపతులిద్దరూ దేశం దాటినట్లు సమాచారం. ఏ దేశానికి షిప్పులో వెళ్లారు...ఎవరు సహకరించారు...అక్కడ షిప్పు దిగిన దేశంలోనే ఉన్నారా.. లేదా మరో దేశంలో తలదాచుకున్నారా.. తదితర వివరాలు సేకరించలే పనిలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఉన్నారు. అవసరమైతే రెడ్ కార్నర్ నోటీసు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

సీఎం చంద్రబాబుతో సునీతారెడ్డి దంపతుల భేటీ

- వివేకా పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదులో నిజానిజాలు తేల్చాలని వినతి
- సీఎం సహాయ నిధికి 10 లక్షల విరాళం

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దారుణ హత్యకు గురైన మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి దంపతులు మంగళవారమిక్కడ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు అప్పటి సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్‌తో పాటు తమపై పోలీసులు పెట్టిన అక్రమ కేసు గురించి ఆయన దృష్టికి తెచ్చారు. కృష్ణారెడ్డి ఫిర్యాదులో నిజానిజాలు, రాంసింగ్‌పై కేసు తదితర అంశాలపై సీఐడీ విచారణ జరిపించాలని కోరారు. వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. తనకు అన్ని విషయాలూ తెలుసని, తప్పనిసరిగా విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.10 లక్షల విరాళం అందించారు. ఇదే సందర్భంలో అక్టోబరు 3-5 తేదీల్లో అంటువ్యాధుల నివారణ-నియంత్రణపై హైదరాబాద్ శిల్పకళా వేదికలో జరిగే జి-స్పార్క్-2024 (గ్లోబల్ సౌత్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ అండ్ యాంటీమైక్రోబియల్ స్టివార్డ్‌షిప్) సదస్సుకు రావలసిందిగా సునీత ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia ద.మ. రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును

ఆసక్తి వ్యక్తీకరణ (ఇ.ఓ.ఐ)

ప్రకటన నం. No.B/C.300/EMR/EOI/GDR, RJY, OGL/2024 (Setting up of Emergency Medical First Aid center at Rajehmundry, Gudur & Ongole Railway Stations over Vijayawada Division), తేది: 12.09.2024.

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, విజయవాడ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే వారు "విజయవాడ డివిజన్‌పై రాజమండ్రి, గూడూరు & ఒంగోలు రైల్వే స్టేషన్ల వద్ద అత్యవసర వైద్య ప్రాథమిక చికిత్సా కేంద్రం" కొరకు ఇ-టెండరింగ్ పోర్టల్ అనగా https://scr.indianrailways.gov.in ద్వారా ఆసక్తి వ్యక్తీకరణ కోరుచున్నారు. ఈ ఇఓఐ ఉద్దేశ్యం రాజమండ్రి, గూడూరు & ఒంగోలు రైల్వే స్టేషన్ల వద్ద "అత్యవసర వైద్య ప్రాథమిక చికిత్సా కేంద్రం"ను నెలకొల్పుటకు మరియు ఆపరేషన్‌కు డివిజనల్ రైల్వే హాస్పిటల్, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడతో జాబితాలో గల హాస్పిటళ్ళ నుండి దరఖాస్తులు కోరుచున్నారు. ఈ ప్రతిపాదనకు రైల్వే ఆవరణలో స్థలం ఉచితంగా అందించబడుతుంది. అయితే ఎంపిక చేసిన ఆసుపత్రులే విద్యుత్ ఛార్జీలు భరించవలెను. కాబోయే బిడ్డర్లు తమ ఇఓఐను దాఖలు చేసే ముందు ఈ ఇఓఐ డాక్యుమెంట్‌ను జాగ్రత్తగా చదవాలని సూచించడమైనది. ఈ ఇఓఐ డాక్యుమెంట్ బదిలీ చేయబడదు. విజయవాడ డివిజన్ వారు ఎటువంటి పక్షపాతం లేకుండా మరియు ఎటువంటి కారణం తెలుపకుండా ఈ ప్రకటనకు ఎదురుగా స్వీకరించిన అన్ని ఇఓఐ లను స్వీకరించు లేదా తిరస్కరించు హక్కు కలిగి ఉన్నారు.

1	వెబ్‌సైట్‌పై లభించు ఇఓఐ ప్రకటన	13.09.2024న 10.00 గం.ల నుండి
2	ఆన్‌లైన్ ఇఓఐ దాఖలుకు చివరి తేది & సమయం	30.09.2024న 15.00 గం.లకు

మరిన్ని వివరాలకు ఆసక్తి గల అభ్యర్థులు ఏదేని పని రోజున దిగువ సంతకందారు కార్యాలయాన్ని దర్శించగలరు లేదా https://scr.indianrailways.gov.inకు లాగిన్ అవ్వగలరు.
సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ / విజయవాడ

నం.GNT/C.EAUCTION CATALOGUE/2024-25 తేది: 16.09.2024

'ఇ' వేలం లీజింగ్ ద్వారా నాన్ ఫేర్ రెవెన్యూ కాంట్రాక్టుల ప్రదానం కొరకు గుంటూరు డివిజన్ యొక్క సమగ్ర నెలవారి క్యాటలాగ్

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు డివిజన్, గుంటూరు వారు ireps వెబ్‌పోర్టల్ పై ఇ-వేలం లీజింగ్ విధానం ద్వారా ఇ-బిడ్లు కోరుచున్నారు. కెటలాగ్‌ల వివరాలు దిగువ విధంగా ఇవ్వబడినవి.

వాణిజ్య ప్రచారం :-

క్ర. సం.	కాంట్రాక్టు రకం	స్టేషన్/ ప్రదేశం/లింక్	ఆఫర్ చేయు ఏరియా	కాంట్రాక్టు కాలం	బయానా విలువ	వేలం ప్రారంభ తేదీ మరియు సమయం
1	గుంటూరు రైల్వే ప్రాంతాల వద్ద ఓ.ఓ.హెచ్ ప్రదేశాల వద్ద లాలీపాప్ బోర్డులు, ఎల్ఈడీ ట్రీస్‌లు, యూనిపోల్‌లు మరియు హోర్డింగుల ద్వారా ప్రకటనలు	గుంటూరు రైల్వే ప్రాంతాలు (ప్యాకేజీ నం.4)	14518 చ.అ.	5 సం.లు	బిడ్ విలువలో 5%	04.10.2024న 11.00 గం.లకు

సకల ఇతర స్టాటిక్ సేవలు

క్ర. సం.	కాంట్రాక్టు రకం	స్టేషన్/ ప్రదేశం/లింక్	ఆఫర్ చేయు ఏరియా	కాంట్రాక్టు కాలం	బయానా విలువ	వేలం ప్రారంభ తేదీ మరియు సమయం
1	గుంటూరు రైల్వే స్టేషన్ వద్ద బ్యాటరీ ఆపరేటెడ్ కార్ల యొక్క ఏర్పాటు, ఆపరేషన్ & నిర్వహణ	గుంటూరు రైల్వే స్టేషన్		5 సం.లు	బిడ్ విలువలో 5%	04.10.2024న 11.00 గం.లకు

డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ పొందుట మరియు ఇ-టెండర్లలో పాల్గొనుటకు IREPSలో 'ఇ' వేలం లీజింగ్‌లో తమకు తాము నమోదు చేసుకొనుట టెండరుదారుల బాధ్యత. రిజిస్ట్రేషన్ కొరకు ముందస్తు అవశ్యకతలు మరియు IREPS పోర్టల్ ద్వారా ఇ-వేలం లీజింగ్‌లో పాల్గొనుట కొరకు ముందస్తు అవశ్యకతలు www.ireps.gov.in పోర్టల్‌లోని మాన్యువల్ మరియు మార్గదర్శకాల క్రింద లభిస్తాయి. టెండరుదారులు కోరినప్పుడు దిగువ సంతకందారు కార్యాలయానికి అవసరమైన డాక్యుమెంట్లు దాఖలు చేయవలసి ఉంటుంది. టెండరుకు సంబంధించి అవసరమైన డాక్యుమెంట్లు అప్‌లోడింగ్ చేయు సమయంలో లేదా చెల్లింపులు చేయు సమయంలో IREPS పోర్టల్‌లో తలెత్తే ఏదేని అంతరాయానికి రైల్వే అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించదు. టెండరుఫారంలో నిర్దేశపరిచినట్టి అన్ని నిబంధనలు నెరవేర్చకుండా అందినట్టి టెండర్లు వెంటనే తిరస్కరించబడతాయి. పై టెండరు యొక్క పూర్తి వివరాలు ఇ-వేలం లీజింగ్ మాన్యువల్ www.ireps.gov.in పోర్టల్‌లో లభిస్తాయి.

A1189 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంటూరు

WALK-IN INTERVIEW

రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న బల్క్‌డ్రగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ఈ క్రింది అర్హతలు, శారీరక దారుఢ్యం మరియు మంచి ఆరోగ్యం గల అభ్యర్థులు కావలెను.

2020 to 2024 PASSED OUT CANDIDATES

Job Title	Qualification	Age	Stipend (P.M)
Trainee Helper	S.S.C , Inter / ITI (Fitter, Electrical, Diesel Mechanic)	19-25yrs	Rs. 15,000/-
Trainee Supervisor/ Graduate Apprentice	B.Sc (Chemistry)	21-25yrs	Rs. 18,000/-
	B.Pharmacy B.Tech (Chemical/Mechanical)	21-25yrs	Rs. 20,000/-
	M.Sc (Organic Chemistry/ Analytical Chemistry /Micro Biology)	21-25yrs	Rs. 22,000/-
	M.Pharmacy (Pharmaceutical Chemistry/ Analysis/QA/RA)	21-25yrs	Rs. 24,000/-

గమనిక : పైన తెలుపబడిన కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ కాపీలను తీసుకొని ఈ క్రింది ప్రదేశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. ఎంపిక కాబడిన అభ్యర్థులు షిఫ్ట్‌లలో పనిచేయవలసియుండును.

18-09-2024	GOVT ITI COLLEGE Chinaravuru, TENALI, Guntur Dist.
19-09-2024	AMG ITI COLLEGE CHILAKALURIPET, Palnadu Dist.
20-09-2024	MGS ITC COLLEGE Main Rd, TAKKELLAPADU, Guntur Dist.
21-09-2024	ATP ITC COLLEGE Ravipadu, NARASARAOPET, Palnadu Dist.
23-09-2024	JAN JANAM MANGALADRI ITI COLLEGE CHINA KAKANI, Guntur Dist.
24-09-2024	SRI SIVA SAI ITI COLLEGE Throvagunta, ONGOLE, Prakasam Dist.
25-09-2024	GOVT ITI COLLEGE Madhavi nagar colony, MARKAPURAM, Prakasam Dist.
26-09-2024	SRI UMMITI SIVAIAH PVT ITI COLLEGE Desai Peta, VETAPALEM, Bapatla Dist.
27-09-2024	SRI KRISHNA ITI COLLEGE Markapur Road, YARRAGONDAPALEM, Prakasam Dist.
28-09-2024	JAYA ITC COLLEGE MADDIPADU, Prakasam Dist.
30-09-2024	DHARANI ITI COLLEGE Sri Saibaba Temple Road, BESTAVARIPETA, Prakasam Dist.

Interview Time : 9:00 am to 3:00 pm

సదుపాయములు: 1.బ్యాచిలర్స్‌కు (పురుషులు) ఉచిత వసతి 2.ఉచిత యూనిఫాం 3.అర్హులైన వారికి PF, ESI ఇవ్వబడును 4.భోజన ఖర్చులో రాయితీ

Contact : 08694 - 257001

హరికథా సార్వభౌమ కోట సచ్చిదానంద శాస్త్రి కన్నుమూత

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 17: తెలుగునాట ప్రసిద్ధి చెందిన హరికథకుడు కోట సచ్చిదానంద శాస్త్రి(90) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన గుంటూరు అమరావతి రోడ్డులోని నివాసంలో సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గతంలోనే ఆయన భార్య చనిపోయారు. కోట సచ్చిదానంద శాస్త్రి 1934 ఆగస్టు 12న ప్రకాశం జిల్లా అద్దంకిలో సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. మూడో తరగతిలోనే పాఠశాలలో చదువుకు స్వస్తి పలికారు. 12ఏళ్ల వయసులోనే తండ్రి మరణించడంతో కుటుంబ భారం మొత్తం ఆయనపైనే పడింది. ఆ తర్వాత జీవనం కోసం తెనాలికి మకాం మార్చారు. ఏఆర్ కృష్ణయ్య, ముసునూరి సూర్యనారాయణమూర్తి, భాగవతుల అన్నపూర్ణయ్య వద్ద హరికథ గానంలో శిక్షణ పొందారు. ప్రసిద్ధ హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు శిష్యుల్లో అగ్రగామిగా సచ్చిదానంద పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. హరికథా కళాకారుడిగా ప్రసిద్ధి చెందిన ఆయన ఈ కళాభివృద్ధికి విశేష కృషి చేశారు. హరికథ ఆలాపనలో నాటి పరిస్థితులను విభిన్నంగా మలచి వచనంలో, కవిత్వంలో, గేయరూపంలో చెప్పడం ఆయన ప్రత్యేకత. హరికథలను చెప్పే విధానంలో సినిమా పాటలు జోడించి, సామాజిక అంశాలను చొప్పించి ఆసక్తికరంగా, వినోద్మాతకంగా భక్తులకు అందజేయడంలో ఘనాపాటిగా సచ్చిదానంద పేరు ప్రఖ్యాతులు గడించారు. ఆయన చెప్పే హరికథలు వినడానికి ఎడ్ల బండ్లు కట్టుకొని మరీ పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు గుంటూరుకు తరలివచ్చేవారు. ఆలిండియా రేడియోలో అగ్రశ్రేణి కళాకారుడైన ఆయన దేశ విదేశాల్లో నిర్వహించిన పలు ప్రతిష్టాత్మక సంగీత ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయన దేశవ్యాప్తంగా 20వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. సచ్చిదానంద శాస్త్రి 2023లో పద్మశ్రీ, 2018లో సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. హరికథా సామ్రాజ్య సార్వభౌమ, కథాగాన కళాకోవిద, మధురగాన కళానిధి, హరికథా సామ్రాట్, హరికథా చక్రవర్తి తదితర బిరుదులు ఆయనను వరించాయి. కళారంగానికి ఆయన చేసిన సేవకు గాను 1988లో ఉగాది విశిష్ట పురస్కారం, 2014లో హంస పురస్కారం లభించాయి, 2019లో ఏపీ ప్రభుత్వం ఆయనకు ఆదిభట్ల నారాయణ దాసు పురస్కారాన్ని ప్రదానం చేసింది. 2015 తర్వాత ఆరోగ్యం సహకరించకపోవడంతో హరికథ ప్రదర్శనలకు దూరమయ్యారు. సచ్చిదానంద శాస్త్రి మృతిపట్ల కళాభిమానులు, సాహితీవేత్తలు, ప్రజా ప్రతినిధులు సంతాపాన్ని తెలిపారు.

రాహుల్‌పై బీజేపీ, శివసేన వ్యాఖ్యలు...

- నేడు విజయవాడలో షర్మిల ధర్నా

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): 'తీవ్రవాద లక్షణాలను అణువణువునా పుణికిపుచ్చుకుని, మనుషుల మధ్య చిచ్చుపెట్టి చలికాచుకునే నీచ సంస్కృతి భారతీయ జనతా పార్టీది. అలాంటి విచ్ఛిన్నకర శక్తితో రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారు' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఈ మేరకు మంగళవారం షర్మిల ఓ ప్రకటన చేశారు. ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని తీవ్రవాదితో పోలుస్తూ బీజేపీ, శివసేన చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'రాహుల్‌పై కత్తికట్టే విఫల ప్రయత్నాన్ని బీజేపీ, శివసేన చేస్తున్నాయి. వారి పాచికలు పారబోవు. రాహుల్‌పై వారి వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం విజయవాడ పోస్టాఫీసు ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్ద, విజయవాడ వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ముందు ధర్నా నిర్వహిస్తున్నాం' అని షర్మిల తెలిపారు.

రైతు ప్రాణం తీసిన 'జగనన్న భూరక్ష సర్వే'

- గత ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో తప్పిదం
- న్యాయం కోసం కలెక్టర్‌కు మొర... పట్టించుకోని వైనం
- ఇంట్లో ఉరేసుకొని రైతు ఆత్మహత్య.. నెల్లూరు జిల్లా లో ఘటన


పెంచలయ్య

ఆత్మకూరు, సెప్టెంబరు 17: గత ప్రభుత్వ హయాంలో జగనన్న భూరక్ష సర్వేలో జరిగిన తప్పిదం అన్నదాత ఉసురు తీసింది. నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం పాత జంగాలపల్లికి చెందిన కత్తి పెంచలయ్య(55)కు రెండున్నర ఎకరాల భూమి ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన జగనన్న భూ రక్ష సర్వేలో అధికారులు సర్వే చేసి పెంచలయ్యకు రెండెకరాల భూమే ఉన్నట్లు తేల్చారు. ఆ మేరకు రికార్డుల్లోనూ నమోదు చేశారు. తన అనుభవంలో ఉన్న మిగతా పొలాన్ని పొరుగునే ఉన్న రైతు పేరిట ఎక్కించారు. దీంతో సదరు రైతు ఆ అరెకరాలో సాగు చేయడానికి ఉపక్రమించడంతో పెంచలయ్య అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో గ్రామసభకు వచ్చిన కలెక్టర్‌కూ తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి రెవెన్యూ కార్యాలయం, వీఆర్వో చుట్టూ బాధితుడు పెంచలయ్య తిరుగుతున్నట్లు తెలిసింది. రోజులు గడుస్తున్నా న్యాయం జరగకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సోమవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తర్వాత ఉరివేసుకుని మరణించాడు. మంగళవారం ఉదయం ఉరికొయ్యకు వేళాడుతున్న పెంచలయ్యను చూసి కుటుంబసభ్యులు విలపించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఘట నా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ వీడియో తిరుమలలో తీసింది కాదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): తప్పుడు వార్తను నమ్మొద్దు అంటూ టీటీడీ పేర్కొంది. 'సాలూరు తెలుగుదేశం నాయకుల బరితెగింపు. తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో ఆమె భర్త జయకుమార్, కొంతమంది విలేకరుల చిందులు' అంటూ ఓ వీడియో సోషల్‌మీడియాలో మంగళవారం చక్కర్లు కొట్టింది. ఈ వీడియోలో సినిమా పాటలకు కొంతమంది నృత్యాలు చేస్తున్నారు. దీంతో టీటీడీ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఈ వీడియో తిరుమలలోది కాదని నిర్ధారించారు. ఈ క్రమంలో 'తప్పుడు వార్తను నమ్మొద్దు' అంటూ టీటీడీ సోషల్ మీడియాలోనే వివరణ ఇచ్చింది. టీటీడీ ఈవో శ్యామలరావు కూడా స్పందిస్తూ.. తమ విచారణలో ఈ వీడియో తిరుమలలో తీసింది కాదని తేలిందన్నారు. ఇదిలావుంటే, తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించి డిసెంబరు నెల కోటాను టీటీడీ బుధవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం సెప్టెంబరు 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో భక్తులు నమోదు చేసుకోవచ్చు.

22 నుంచి టెట్ హాల్ టిక్కెట్లు

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష హాల్ టిక్కెట్లను ఈనెల 22 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 19 నుంచి టెట్ మాక్ టెస్ట్, నమూనా పత్రాలు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు.

ఎంబీఏ, ఎంసీఏల్లో 20వేల అడ్మిషన్లు

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో రెండు విడతల్లో కలిపి 20009 మంది అడ్మిషన్లు పొందినట్లు ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. 23,737 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 20,862 మంది ఆప్షన్లు ఎంపిక చేసుకున్నారని పేర్కొంది.

TENALI MUNICIPALITY
Request for Proposal(RFP) E-procurement Tender Notice
E-procurement NIT NO.11/2024-25/GOI,GOAP & ULB(15th FC)Grants.dated:18-09-2024 Online tenders are here by invited from the contractors / contracting agencies for the work of Legacy Waste Land Reclamation through Bio-remediation and Bio-Mining in Teanli Municipality with near Zero residues for the amount of Rupees in Ecv.Rs.349.525 Lakhs.The tender document is available for download from 18-09-2024 (11.00 am) onwards and last date for bid submission is on 03-10-2024 (5.00 pm) Further details can be seen at 'e' procurement market Place i.e., "www.apeprocurement.gov.in".
Sd/- COMMISSIONER, TENALI MUNICIPALITY

CENTRAL POWER DISTRIBUTION CORPORATION OF A.P.LTD., VIJAYAWADA
e-Procurement Tender Notice
Tenders are invited from APCPDCL for award of contract for scanning, digitalizing of Employee Service registers in APCPDCL. For further details please visit https://tender.apeprocurement.gov.in from 18-09-2024. Ph: 9490618834 & E-mail: gmit-sap@apcpdcl.in
Sd/- Chief General Manager/P&MM, APCPDCL, Andhra Pradesh
DIPR R.O.No.3161PP/CL/ADVT/1/1/2021-22, Dt: 17/09/2024

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ
No.WDC02-26021/14/2019-ICPS, నియామకపు ప్రకటన తేది:08.09.2024
డైరెక్టర్ కార్యాలయం, WD&CW శాఖ, AP, గుంటూరులో పనిచేయుటకు అర్హత గల అభ్యర్థుల నుండి మిషన్ వాత్సల్య పథకం క్రింద వివిధ కాంట్రాక్టు ఉద్యోగాల కోసం WD&CW శాఖ, ఆంధ్రప్రదేశ్, గుంటూరు వారు దరఖాస్తులు కోరుతున్నారు. ఉద్యోగాల ఖాళీలు, అర్హతా ప్రమాణాలు మరియు దరఖాస్తు ప్రక్రియ సంబంధించిన తదుపరి సమాచారం కోసం https://wdcw.ap.gov.in దర్శించండి. ఆఖరి తేది: ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 15 రోజులు.
సం/- డైరెక్టర్, WD&CW శాఖ, AP, గుంటూరు
DIPR R.O. No.3160PP/CL/ADVT/1/1/2021-22 Dt: 17.09.2024

ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్
1వ అంతస్తు, పోర్ట్ అడ్మిన్ బిల్డింగ్, కాకినాడ- 533007
ఇ-టెండరు ప్రకటన నం. 4/SE/PP2/145/2024, తేది: 14.09.2024
దిగువ పనుల కొరకు APMB టెండర్లు కోరుతోంది.
1. ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం జిల్లాలో ఆదాని గంగవరం పోర్ట్‌లో FY 2024-25 కొరకు FY 2022-23 మరియు 2023-24 ఫైనాన్షియల్ ఆడిట్ కొరకు హిస్టారికల్ ఆడిట్ కొరకు ఇండిపెండెంట్ ఫైనాన్షియల్ ఆడిటర్ నియామకం.
2. ఆంధ్రప్రదేశ్, కాకినాడ డీప్ వాటర్ పోర్ట్‌లో FY 2024-25 కొరకు FY 2022-23 మరియు FY 2023-24 ఫైనాన్షియల్ ఆడిట్ కొరకు హిస్టారికల్ ఆడిట్ కొరకు ఇండిపెండెంట్ ఫైనాన్షియల్ ఆడిటర్ నియామకం.
3. ఆంధ్రప్రదేశ్, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో ఆదాని కృష్ణపట్నం పోర్ట్‌లో FY 2024-25 కొరకు FY 2022-23 మరియు FY 2023-24 ఫైనాన్షియల్ ఆడిట్ కొరకు హిస్టారికల్ ఆడిట్ కొరకు ఇండిపెండెంట్ ఫైనాన్షియల్ ఆడిటర్ నియామకం.
ఇ-టెండర్లను 20.09.2024 నుండి వెబ్‌సైట్ https://tender.apeprocurement.gov.in/ నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. తదుపరి వివరాలు దిగువ సంతకందారు నుండి పొందవచ్చును. ఫోన్ నం. 9182321350.
సం/- Cv ప్రవీణ్ ఆదిత్య IAS, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, APMB, కాకినాడ
DIPR RO No. 3163 PP/CL/ADVT/1/1/2021-22 తేది: 17.09.2024



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కశ్మీర్‌లో కొత్త ఆరంభం!

జమ్మూకశ్మీర్‌లో పదేళ్ళ తరువాత అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం 90 స్థానాల్లో, నేడు తొలివిడతలో ప్రజలు 24 మంది ఎమ్మెల్యేలను ఎన్నుకోబోతున్నారు. పిర్ పంజాల్ పర్వతసానువులకు అటూఇటూగా జమ్మూలో మూడు, కశ్మీర్‌లో నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉన్న స్థానాల్లో ఉగ్రవాద దాడుల ప్రమాదం కూడా పొంచి వున్నందున బందోబస్తు అధికంగా ఉంది. ఐదేళ్ళక్రితం ప్రత్యేకప్రతిపత్తినీ, రాష్ట్రహోదానూ కోల్పోయి దేశంలో అతిపిన్నవయసుగల కేంద్రపాలిత ప్రాంతంగా అవతరించిన చోట, సుప్రీంకోర్టు విధించిన గడువు మేరకు జరుగుతున్న ఈ ఎన్నికలను యావత్ ప్రపంచమూ ఆసక్తిగా గమనిస్తున్నది.

అప్పట్లో రెండు పార్టీలే చక్రం తిప్పిన వాతావరణం ఇప్పుడు మారిందని, క్షేత్రస్థాయి పరిస్థితుల్లోనూ మార్పువచ్చిందని చాలామంది అంచనా. నియోజకవర్గాల పునర్విభజన, రిజర్వేషన్లలో మార్పుచేర్పులు భారతీయ జనతాపార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా జరిగాయని స్థానిక పార్టీలు ఆరోపించిన విషయం తెలిసిందే. వీటికి తోడు, ఎంతోకాలంగా ఈ పార్టీలు ప్రజలతో ప్రత్యక్షసంబంధం లేకుండా ఉండిపోవడం కూడా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయవచ్చు. అబ్దుల్లాలు, ముఫ్తీలు తమ ఉనికి చాటుకోవడానికి ఎన్నడూ లేనంతగా కష్టపడవలసి వస్తున్నదని విశ్లేషకుల వాదన.

ప్రత్యేక ప్రతిపత్తి విషయంలో ఒక్కమాటగా ఉన్నా, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీలు ఎన్నికల క్షేత్రంలో వేరుదారుల్లోనే పోతున్నాయి. అబ్దుల్లాల పార్టీ ప్రస్తుతం కాంగ్రెస్‌తో పొత్తులో ఉంది. ఈ కూటమిదే కాస్తంత పైచేయి కావచ్చునని అంటున్నారు. ఈ పార్టీలకంటే బీజేపీకి ఈ ఎన్నికల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఏ మేరకు లబ్ధిచేకూరుతుందా అని అందరూ ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే రాష్ట్రహోదా ఖాయమని బీజేపీ గట్టిగా హామీ ఇస్తోంది. మళ్ళీ ప్రత్యేక ప్రతిపత్తి అంటూ ఎవరు హామీ ఇచ్చినా ప్రజలు నమ్మవద్దనీ, అది ఎవరితరమూ కాదని బీజేపీ పెద్దలు గట్టిగా చెబుతున్నారు. ప్రత్యేకప్రతిపత్తిని తిరిగి తెస్తానని నేషనల్ కాన్ఫరెన్స్ చెప్పుకుంటున్నప్పటికీ, కాంగ్రెస్ నేరుగా ఈ మాట అనకుండా రాష్ట్రహోదా విషయంలో మాత్రం గట్టి హామీ ఇస్తోంది. స్థానిక అవసరాలు, ప్రయోజనాలకు అనుగుణంగా కొన్ని స్థానాల్లో ఈ రెండు పార్టీలూ 'ఫ్రెండ్లీ కంటెస్ట్'కు దిగుతున్నాయి కూడా.

నేటినుంచి మూడు విడతల్లో సాగే ఈ ఎన్నికల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారా అన్నది ప్రశ్న. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఉత్సాహంగా ఉన్నమాట నిజం. కానీ, ఆ తరువాత జమ్మూకశ్మీర్ ప్రజలు ఊహించని పరిణామాలనేకం చూశారు. పీడీపీతో పొత్తు తెగదెంపులు చేసుకున్న బీజేపీ రాష్ట్రపతిపాలనతో కొత్త అంకానికి తెరదీసింది. గవర్నర్‌కు సైతం చివరివరకూ ఏమీ తెలియనిస్థితిలో, వేలాది సైనికబలగాల మోహరింపు మధ్య స్వయంప్రతిపత్తి రద్దు, స్థానికనేతల సుదీర్ఘనిర్బంధం, ప్రజలమీదా, మీడియామీదా నెలలతరబడి కొనసాగిన ఆంక్షలూ అణచివేతలూ తెలిసినవే. ఈ నిర్బంధ వాతావరణంలోనే, ఏకపక్షంగా అక్కడ అనేక కొత్త నిర్ణయాలు జరిగాయి, చట్టాలు వచ్చాయి. అభివృద్ధి పేరిట పెట్టుబడులకూ వెలుపలి వ్యక్తులకూ తలుపులు తెరుచుకున్నాయి. 370, 35(ఎ) తొలగిన తరువాతే జమ్మూకశ్మీర్ అన్ని విషయాల్లోనూ బాగుపడిందని కేంద్రం చెప్పుకుంటోంది. అనేక పథకాలద్వారా వేలకోట్లు కుమ్మరించి దాదాపు అన్ని రంగాల్లోనూ విస్తృతమైన మార్పు తెచ్చినమాట నిజం. పెట్టుబడులు ప్రవహించడంతో పాటు, వివిధ వ్యవస్థల్లో ఉన్న జడత్వం కూడా చాలామేరకు వదిలింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయని అంటారు. ఇటీవల వరుస ఉగ్రదాడులు జరిగినప్పటికీ, గతంలో కంటే ఉగ్రవాదం బాగా తగ్గిందని, తాము చేపట్టిన ప్రాజెక్టులతో ప్రజల మధ్యా, ఆయా ప్రాంతాల మధ్యా అనుసంధానం పెరిగిందని ఢిల్లీ బీజేపీ పెద్దలు ఎన్నికల ప్రచార సభల్లో చెప్పుకుంటున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఎంతో చక్కగా జరిగిన నేపథ్యంలో, ఇప్పుడు తమకు మరింత ముఖ్యమైన ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యం అంతకంటే ఎక్కువగా ఉంటుందనడంలో సందేహం అక్కరలేదు. అయితే, పదేళ్ళ పరిణామాలన్నింటినీ బుర్రనుంచి చెరిపేసి, సెంటిమెంట్ వదిలేసి, డెవలప్‌మెంట్ మాత్రమే చూస్తారా అన్నది ప్రశ్న. ఢిల్లీ పక్షాన ఏకపక్షంగా వ్యవహరించే లెఫ్టినెంట్ గవర్నర్ కాక, తమ గోడువినే స్థానిక నాయకులు కావాలనుకుంటున్న ప్రజలు ఎంత తెలివైన ఎంపికలు చేసుకుంటారో చూడాలి.

తెలుగునాట చెబుతున్నట్లుగా, గల్ఫ్‌లో మరణించిన మలయాళీలకు కేరళ ప్రభుత్వం ఎలాంటి నగదు సహాయం చేయదు. ఎడారి దేశాలలోని మలయాళీలు స్వచ్ఛందంగా సాముహిక బీమా పథకంలో భాగస్వాములు అవుతారు. సమగ్ర అధ్యయనం తర్వాతే ప్రవాసుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే విషయమై రేవంత్ ప్రభుత్వం ప్రకటన చేసి ఉంటే మరింత స్పష్టత వచ్చేది.

ఆపన్న హస్తమా? అందని ద్రాక్షా?

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని సాహసోపేత నిర్ణయాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. సమగ్ర అధ్యయనం లేకుండా వెలువడుతున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అనుమానాలు కూడా కలిగిస్తున్నాయి.

గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న ప్రవాసుల కుటుంబాల సంక్షేమం కొరకు తాజాగా తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు సమస్త ఎడారి దేశాలలోని ప్రవాసులలో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. నాలుగు అంశాలతో కూడిన ప్రభుత్వ ఉత్తర్వులో ఎడారి దేశాలలో పని చేస్తూ మరణించిన వారి కుటుంబాలకు ఐదు లక్షల రూపాయాల ఎక్స్‌గ్రేషియా చెల్లించే అంశమే ప్రథమంగా ఉంది. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన డిసెంబర్ 7, 2023 నుంచి గల్ఫ్ దేశాలలో మరణించిన ప్రవాసులకు ఈ నిర్ణయం వర్తిస్తుందని ప్రభుత్వ ఉత్తర్వులో పేర్కొన్నారు. అయితే ఆ నిర్ణయం అమలు విధివిధానాలు ఏమిటో స్పష్టం చేయలేదు.

ప్రతి ప్రభుత్వ సహాయానికి అర్హత విధానం ఉంటుంది. అయితే గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయాలు చెల్లించే ఈ పథకంలో లాభోక్తుల ఎంపిక విధానం ఏమిటి అనేది ప్రభుత్వ ఉత్తర్వులో విశదీకరించలేదు. ఈ కారణంగా, గల్ఫ్ దేశాలలో మరణించిన వారి కుటుంబాలు గంపెడాశతో ఆ ఎంపిక పద్ధతిని తెలుసుకోవడానికి ఎదురు చూస్తున్నాయి.

వాస్తవానికి ప్రవాసులు ఎక్కువగా ఉండి విభిన్న ప్రవాసీ సంక్షేమ పథకాలు అమలుపరిచే కేరళ, పంజాబ్ రాష్ట్రాలు కూడా ఈ రకమైన ఎక్స్‌గ్రేషియా పథకాన్ని ప్రకటించలేదు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక బీమా పథకాన్ని ప్రవేశపెట్టి అమలుపరిచారు. తద్వారా ఈ రకమైన బాధిత కుటుంబాలకు కొంతవరకు ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. విదేశాలకు ఉపాధి వలసలు అనేది కేంద్ర ప్రభుత్వ విదేశీ విధానంలో భాగంగా ద్వైపాక్షిక ఒప్పందాలకు అనుగుణంగా జరగడం పరిపాటి. అందులో ఉపాధికై దేశం బయటకు వెళ్లే భారతీయుడి భద్రత అంశం కూడా కీలకంగా ఉంటుంది. వివిధ కారణాల వలన అది సరిగ్గా అమలు కాలేకపోతుందనేది వేరే విషయం.

గల్ఫ్ లేఖ

రాచరిక వ్యవస్థ అమలులో ఉండే గల్ఫ్ దేశాలలో కేవలం స్థానిక యాజమానులు పిలిపించినవారే వీసాలు పొంది ఉద్యోగాలకు రావాలి. వీసా గడువు ముగిసిన తర్వాత తిరిగి వెళ్ళిపోవాలి. ఉద్యోగ కాలంలో అనారోగ్యానికి గురయితే చికిత్స అందించడం పిలిపించిన



యాజమాని బాధ్యత. అదే విధంగా ఉద్యోగి మరణిస్తే మృతదేహాన్ని స్వదేశానికి పంపించడం కూడ యాజమాని కర్తవ్యం. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే పరిహారం కూడ చెల్లించాలనేది ఒప్పందంలో భాగమే. ప్రతికూల పరిస్థితులు, చట్టాల కాఠిన్యంలో చిక్కుకుపోయిన భారతీయుల మృతదేహాలను కొన్ని సందర్భాలలో మానవతా దృక్పథంతో స్వదేశానికి తరలించడానికి అయ్యే వ్యయాన్ని భారతీయ రాయబార కార్యాలయాలు భరిస్తాయి. అయితే ఇది పూర్తిగా భారతీయ రాయబార కార్యాలయాల అంతర్గత విషయం. కనుక అవి ఎప్పుడూ ఆ వివరాలను బహిర్గతం చేయవు. బహిర్గతమైతే స్థానిక యాజమాన్యాలు తమ కనీస బాధ్యతల నుంచి పూర్తిగా తప్పించుకుని తమ బాధ్యతను పూర్తిగా భారత ప్రభుత్వంపై రుద్దుతారనే ఉద్దేశంతో మానవతాపూర్వక వ్యయాల విషయంలో వీలయినంత గోప్యత పాటించడం జరుగుతుంది. మరణించిన వారికి రావాల్సిన బకాయి వేతనాలు ఇతర చెల్లింపుల గురించి సంబంధిత స్థానిక కార్మిక మంత్రిత్వ శాఖ అధికారులతో అధికృత సమాచారాన్ని పొంది, బ్యాంకు ద్వారా అందిన తర్వాత మాత్రమే ఫైళ్లను ముగిస్తారు.

కడప జిల్లాలో గల్ఫ్ వలసల ప్రభావం ఎక్కువ. ఈ కారణాన గల్ఫ్ మృతులు, బాధితుల సహాయార్థం గతంలో వైయస్ రాజశేఖర రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కొన్ని చర్యలు చేపట్టారు. అయితే నాటి గవర్నర్ నరసింహన్ అభ్యంతరం తెలిపారు. పైగా అప్పటి విదేశీ వ్యవహారాల మంత్రి ప్రణబ్ ముఖర్జీ సైతం ఆ మానవతా పూర్వక వ్యయాలు రాష్ట్రాల పరిధిలోని అంశం కాదని స్పష్టం చేశారు. దీంతో వైయస్‌తో పాటు ఎంతో ఉత్సాహంగా ముందుకు వెళ్లిన (అప్పుడు ఇప్పుడూ) మంత్రి అయిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చల్లబడ్డారు. హైదరాబాద్ నుంచి స్వంత స్థలాలకు మృతదేహాలను తరలించేందుకు పేదలకు కనీసం ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని ఆ సందర్భంగా నేను సూచించాను. నా సూచనతో మంత్రి శ్రీధర్‌బాబు ఏకీభవించారు. ఫలితంగానే ఆ ఉచిత అంబులెన్సు విధానం అమలులోకి వచ్చింది.

తెలంగాణ యువత బతుకులు దుబాయి, బొగ్గుబాయి, బొంబాయికి మాత్రమే పరిమితమా అంటూ ప్రత్యేక ఉద్యమ కాలంలో నినదించిన కె.చంద్రశేఖర్‌రావు అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత గల్ఫ్‌లోని కొన్ని వర్గాలలో ఆశలు చిగురించాయి, ఈ దిశగా ఆయన కొన్ని ప్రకటనలు కూడ చేసారు, తన హయాంలోని కీలక అధికారులు నర్సింగరావు, సోమేశ్ కుమార్‌ల ద్వారా దీనిపై ప్రత్యేకంగా అధ్యయనం కూడ చేయించి ఆ తర్వాత మిన్నకుండిపోయారు. వాస్తవ పరిస్థితుల గురించి అవగాహన ఉన్న శ్రీధర్‌బాబు ఈ సారి మంత్రివర్గంలో కీలకంగా ఉన్నా ప్రవాసుల సంక్షేమ విధానంపై మౌనంగా ఉండడం గమనార్హం. తెలుగునాట చెబుతున్నట్లుగా, గల్ఫ్‌లో మరణించిన మలయాళీలకు కేరళ ప్రభుత్వం ఎలాంటి నగదు సహాయం చేయదు. ఎడారి దేశాలలోని మలయాళీలు స్వచ్ఛందంగా సాముహిక బీమా పథకంలో భాగస్వాములు అవుతారు. ప్రస్తుతం ఖతర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలలోని భారతీయులకు కూడ స్వల్ప విరాళంతో కూడిన బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. సమగ్ర అధ్యయనం చేసిన తర్వాత రేవంత్ సర్కారు ఈ విషయమై ప్రకటన చేస్తే మరింత స్పష్టత వచ్చేది.

■ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సీతారాం ఏచూరి లేని భారత రాజకీయం



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

దాదాపు 15 సంవత్సరాల క్రితం 2009 ఆగస్టు 30న హైదరాబాద్‌లో జరిగిన నా ఇండియా గేట్ పుస్తకావిష్కరణ సభలో నాటి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నేత ముప్పవరపు వెంకయ్య నాయుడు, సీపీఐ(ఎం) పోలిట్ బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి పాల్గొన్నారు. ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ తొలి ప్రతి అందుకున్న ఈ సమావేశంలో ఒకే వేదికపై మూడు విభిన్నమైన భావజాలాలు గల ముగ్గురు ప్రముఖ నేతలు హాజరు కావడం అపూర్వమని ఒక జాతీయ పత్రిక అభివర్ణించింది. జైపాల్, వెంకయ్య, సీతారాం ఏచూరి మంచి స్నేహితులు. పార్లమెంట్‌లోనూ, బయటా ముగ్గురూ ఘర్షించుకున్నా, తటస్థపడినప్పుడు స్నేహపూర్వకంగా పలకరించుకునేవారు. 15 సంవత్సరాల క్రితం జరిగిన ఇలాంటి పరిణామాన్ని ఇప్పుడు దేశంలో ఎక్కడైనా ఊహించుకోగలమా? దేశంలో మూడు సైద్ధాంతిక భావజాలాల మధ్య సంఘర్షణే జాతీయ రాజకీయాలను ప్రభావితం చేస్తాయని సీతారాం ఏచూరి ఆనాడు పుస్తకావిష్కరణ సభలో అన్నారు. ఇవాళ సీతారాం ఏచూరి మన మధ్య లేరు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న మూడవ భావజాలం కూడా తీవ్ర సంక్షోభంలో ఉంది. సిద్ధాంతాలకు అతీతంగా ఆయన రాజకీయ నేతల మధ్య నెలకొల్పిన స్నేహపూరిత వైఖరి కూడా ఇవాళ పూర్తిగా మృగ్యమైంది.

వర్తమాన సామాజిక చరిత్రలో భాగంగా గత కొద్ది రోజులుగా జరుగుతున్న ఘటనలు దేశ రాజకీయాల పరిణామాల్ని నిర్దేశించే అవకాశాలు ఉన్నాయి. ఇందులో భాగంగా సీతారాం ఏచూరి మరణాన్ని కేవలం ఒక వ్యక్తి మరణంగా కొట్టిపారేయలేము. వామపక్ష పార్టీలు మనుగడ కోసం తీవ్ర యత్నాలు చేస్తున్నప్పటికీ సీతారాం ఏచూరి దేశ వ్యాప్తంగా ఒక ప్రత్యామ్నాయ భావజాలం వ్యాపించేందుకు, దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక కీలక అంశాలపై చర్చ జరిగేందుకు దోహదం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ప్రతిపక్షాలను పూర్తిగా తుడిచిపెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఆయన తీవ్రంగా ప్రతిఘటించి బీజేపీయేతర పక్షాలను సంఘటితం చేసేందుకు శక్తి యుక్తులొడ్డారు. 'కాంగ్రెస్ వామపక్షాల ప్రభావంతో పని చేస్తోంది' అని మోదీ విమర్శించేంతగా ఆయన కాంగ్రెస్‌కు దిశా నిర్దేశం చేశారు. సీతారాం ఏచూరితో తాను ఎన్నో సుదీర్ఘ సంభాషణలు చేసేవాడినని రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు. పదేళ్ల తర్వాత మోదీ హయాంలోని బీజేపీ సంఖ్యాబలం తగ్గి, ఇండియా కూటమి బలోపేతం కావడంలో సీతారాం ఏచూరి పాత్రను ఎవరూ విస్మరించలేరు. ఒక వ్యక్తిగా కాకుండా ఒక వ్యవస్థగా సీతారాం ఏచూరి పనిచేసిన ఆయన కార్యాచరణ గురించి ఆయనను దగ్గరినుంచి గమనించిన వారికి అర్థమవుతుంది. ఇప్పుడే కాదు. యునైటెడ్ ఫ్రంట్ హయాంలో కూడా ఆయన కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించి ప్రభుత్వం అందుకు అనుగుణంగా నడుచుకునేలా చేశారు. నాడు పెట్రోలు ఒక్క రూపాయి పెంచాలన్నా మొత్తం యునైటెడ్ ఫ్రంట్‌లో భాగస్వామ్య పార్టీల నేతలు చర్చించుకునేవారంటే ఏచూరి, తదితరులు అనుసరించిన ప్రజాస్వామిక, సమాఖ్య స్ఫూర్తే కారణం.

ఏచూరి ఆలోచనా విధానానికి ఆయన పార్టీ పూర్తిగా సహకరించిందా లేదా అన్నది చర్చనీయాంశం. 2008లో అణు ఒప్పందానికి వ్యతిరేకంగా మద్దతు ఉపసంహరించుకునేందుకు తొందరపడవద్దని అప్పుడు అమెరికాలో ఉన్న సీతారాం ఏచూరి చెప్పినా పార్టీ అంగీకరించలేదు. కనీసం తాను అమెరికా నుంచి తిరిగి వచ్చేంతవరకైనా వేచి చూడమని సీతారాం ఏచూరి చేసిన అభ్యర్థనను పార్టీ తిరస్కరించి యూపీఏ సర్కార్‌కు మద్దతు ఉపసంహరించుకోవడమే కాక ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానంతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని నిర్ణయించుకుంది. కాని ములాయంసింగ్ యాదవ్ వంటి నేతలు సహకరించకపోవడంతో సీపీఐ(ఎం) ప్రయత్నాలు ఫలించలేదు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వామపక్షాలు తీవ్రంగా నష్టపోయాయి. తమ నిర్ణయం సరైనదేనని, తాము వామపక్షాల మధ్య ఐక్యత సాధించి, కాంగ్రెసేతర, బీజేపీయేతర ఫ్రంట్‌ను బలోపేతం చేస్తామని నాటి ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ ప్రకటించారు. అయితే తాము అణు ఒప్పందాన్ని వ్యతిరేకించడం సరైనదేకాని, మద్దతు ఉపసంహరించుకోవడం తప్పేనని సీతారాం ఏచూరి 2015లో తాను ప్రధాన కార్యదర్శి అయిన తర్వాత అంగీకరించారు. యునైటెడ్ ఫ్రంట్ హయాంలో 1996లో అప్పటి ముఖ్యమంత్రి జ్యోతి బసును ప్రధానమంత్రి కాకుండా సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ అడ్డుపడింది. ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాల్సిందిగా నాడు కర్ణాటక భవన్‌లో సమావేశమైన చంద్రబాబు, దేవెగౌడ, ములాయంసింగ్ యాదవ్, లాలూ తదితరులు పార్టీని కోరినా అందుకు అంగీకరించలేదు. ఇది ఒక చారిత్రక తప్పిదమని, తాను ప్రధానమంత్రి అయితే అనేక ప్రజానుకూల చర్యలు తీసుకునేవాడినని జ్యోతి బసు స్వయంగా ఆ తర్వాత ప్రకటించారు. బహుశా దేవెగౌడ బదులు జ్యోతిబసు ప్రధాని అయితే కాంగ్రెస్ యునైటెడ్ ఫ్రంట్ సర్కార్‌ను పడగొట్టేందుకు తొందరపడేది కాదేమో అన్న చర్చ కూడా తర్వాతి కాలంలో జరిగింది. అదే విధంగా యూపీఏ ప్రభుత్వానికి 2008లో సీపీఐ(ఎం) మద్దతు ఉపసంహరించుకోకుండా ఉంటే, 2009–14 మధ్య యూపీఏ సర్కార్ హయాంలో కుంభకోణాలు, అవినీతి కార్యకలాపాలు జరగకుండా సీపీఐ(ఎం) దిశానిర్దేశం చేసేదేమో అన్న చర్చ కూడా జరిగింది. సీపీఐ(ఎం) మద్దతు ఉన్న కాలంలో యూపీఏ తొలిదశ ప్రభుత్వంపై ఎలాంటి అవినీతి ఆరోపణలూ రాలేదు. సీపీఐ(ఎం) నిర్దేశకత్వం లేనందువల్లే యూపీఏ ప్రభుత్వం రకరకాల ఆరోపణలకు గురై ప్రజాదరణను కోల్పోయి నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ ఘనవిజయం సాధించడం జరిగిందన్న వ్యాఖ్యానాలు కూడా వినిపించాయి. తద్వారా కాంగ్రెస్‌తో పాటు వామపక్షాలు కూడా దేశంలో తీవ్రంగా దెబ్బతిన్నాయి. మళ్లీ ఏచూరి లైన్ మూలంగానే బీజేపీయేతర పక్షాలు ఇప్పుడిప్పుడే బలం పుంజుకోవడం ప్రారంభించాయి.

ఏచూరి ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పటికీ ఆయన రాజకీయ జీవితం అంతర్గతంగా సాఫీగా సాగలేదు. ఆయన ఆలోచనలకు, తీసుకోదలచిన నిర్ణయాలకూ పార్టీ పోలిట్ బ్యూరోలో చుక్కెదురైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. విశాఖపట్టణం, హైదరాబాద్‌లో ఆయనను ప్రధాన కార్యదర్శిగా కాకుండా చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు జరిగాయి. ఆయన మూడవసారి రాజ్యసభకు ఎన్నిక కాకుండా పార్టీ బలంగా అడ్డుపడింది. దాదాపు పది సంవత్సరాలు రాజ్యసభలో చేసిన అద్భుత ప్రసంగాలు, మోదీ ప్రభుత్వంపై చేసిన బలమైన విమర్శలు, ప్రతిపక్షాల ఐక్యతకోసం ఆయన చేసిన ప్రయత్నాలు తెలిసిన వారికి రాజ్యసభలో ఆయన లేని లోటు కొట్టొచ్చినట్లు కనపడింది. 'ఏం చేస్తాం.. మావాళ్లే నన్ను రానివ్వడం లేదు'. అని సెంట్రల్ హాలులో ఆయన బాధపడుతూ చెప్పిన దృశ్యం ఇంకా మరిచిపోలేనిది. 'బీజేపీయేతర ఫ్రంట్‌ను బలోపేతం చేసేందుకు మేము చేసిన ప్రయత్నాలు కొంత విజయవంతం అయ్యాయి కాని సీపీఐ(ఎం)ను బలోపేతం చేసేందుకు ఇక నేను తీవ్రయత్నాలు చేయాల్సి ఉన్నది..' అని ఏచూరి తన చివరి ఇంటర్వ్యూలో అన్నారు. తన ప్రయత్నాలు నెరవేరకముందే ఆయన కన్నుమూశారు. ఈ నేపథ్యంలో ఏచూరి తర్వాత బాధ్యతలు స్వీకరించే నేత సీపీఐ(ఎం)ను బలోపేతం చేయగలరా. ఏచూరి లాగా సమర్థంగా బీజేపీయేతర పక్షాలను ఏకం చేసి ఒక సైద్ధాంతిక దిశా నిర్దేశం చేయగలరా అన్న సందేహం నెలకొన్నది.



గత కొద్ది రోజులుగా జరుగుతున్న ఘటనలు దేశ రాజకీయాల పరిణామాల్ని నిర్దేశించే అవకాశాలు ఉన్నాయి. ఇందులో భాగంగా సీతారాం ఏచూరి మరణాన్ని కేవలం ఒక వ్యక్తి మరణంగా చూడలేము. మనుగడ కోసం వామపక్షాలు పోరాడుతున్నప్పటికీ ఆయన దేశ వ్యాప్తంగా ఒక ప్రత్యామ్నాయ భావజాలం వ్యాపించేందుకు, అనేక కీలక అంశాలపై చర్చ జరిగేందుకు దోహదం చేశారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ప్రతిపక్షాలను పూర్తిగా తుడిచిపెట్టే ప్రయత్నాలను సీతారాం ఏచూరి తీవ్రంగా ప్రతిఘటించి బీజేపీయేతర పక్షాలను సంఘటితం చేసేందుకు శక్తి యుక్తులొడ్డారు.

సీతారాం ఏచూరి మరణంతో పాటు ఇటీవలి కాలంలో జరిగిన ముఖ్యమైన పరిణామాల్లో ఒకటి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడవ ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకోవడం. మొదటి రెండు ప్రభుత్వాలు వందరోజులు పూర్తి చేసుకున్న తర్వాత కనపడిన ఉత్సాహకరమైన సన్నివేశాలు ఇప్పుడు అంతగా కనపడడం లేదు. అప్పుడు బీజేపీ ఒక్కటే తన ఢంకా తాను భజాయించుకుంది. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ బీజేపీ నేతలే ఎక్కువగా ఉత్సాహం కనపరుస్తున్నారు. వందరోజులు పూర్తవుతుండగానే ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన 74వ పుట్టిన రోజును పూర్తి చేసుకుని 75వ సంవత్సరంలో అడుగుపెడుతున్నారు. ఆయన 75 సంవత్సరాలు పూర్తి చేసుకునే సమయంలోపు అనేక కీలక రాజకీయ పరీక్షలను ఎదుర్కోనున్నారు. హర్యానా, జమ్ముకశ్మీర్, ఢిల్లీ, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించడం అంత సులభంగా కనపడడం లేదు. గత పదేళ్లుగా కనపడ్డ మోదీ ముద్ర, ప్రభావం ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయాల్లో అంత బలంగా గోచరించడం లేదు. ఈ అయిదు రాష్ట్రాల్లో బీజేపీ తన సత్తా చూపకపోతే ఏమి జరుగుతుందన్న విషయంలో బీజేపీలోనే అంతర్గత చర్చ జరుగుతోంది. బీజేపీ మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ ఈ సారి ఆయన ప్రతి చర్యలను నిశితంగా గమనిస్తోంది.

'నేను గణేశ్ పూజలో పాల్గొంటే కూడా కాంగ్రెస్ విమర్శిస్తోంది..' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం ఒడిషాలో వాపోయారు. మోదీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నివాసంలో గణేశ్ పూజకు హాజరయినందుకు ప్రతిపక్షాలు విమర్శించాయి. భారత ప్రధాన న్యాయమూర్తి నివాసంలో గణేశ్ పూజకు ప్రధానమంత్రి హాజరు కావడం వల్ల న్యాయవ్యవస్థ స్వతంత్రతను ప్రశ్నార్థకం చేసిందని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌తో పాటు అనేక మంది న్యాయనిపుణులు విమర్శించారు. మరో రెండునెలల్లో పదవీవిరమణ చేస్తున్న జస్టిస్ చంద్రచూడ్ కూడా జస్టిస్ గొగోయ్ లాగే నామినేటెడ్ కోటాలో రాజ్యసభ సభ్యత్వాన్ని ఆశిస్తున్నారేమో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'మన మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉండాలి' అని ఒకప్పుడు సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్యతో అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు ఒక కార్యక్రమంలో అన్నారు. 'మన రాజ్యాంగ వ్యవస్థలో ప్రభుత్వానికీ, న్యాయవ్యవస్థకూ స్నేహ సంబంధాలకు ఆస్కారం లేదు. అవి తమ పాత్రను సరిగ్గా నిర్వహించాలి కాని 'స్నేహ పూర్వకంగా కాదు' అని జస్టిస్ వెంకటాచలయ్య పీవీకి స్పష్టం చేశారు! కాని తర్వాతి కాలంలో న్యాయవ్యవస్థ, ప్రభుత్వం తమ మధ్య ఉండాల్సిన లక్ష్మణ రేఖను తామే తొలగించుకుంటున్నాయేమోనన్న అనుమానాలు తీవ్రతరమయ్యాయి. మోదీ, చంద్రచూడ్‌ల భేటీ ఇందుకు తాజా నిదర్శనం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

సిద్దేశ్వరం అలుగు.. ఆంధ్రప్రదేశ్‌కు వెలుగు


రాయలసీమ సాగునీటి కష్టాలకు పరిష్కారంగా సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలన్న ప్రజా ఆకాంక్ష దశాబ్దాలుగా కొనసాగుతున్నది. అయితే కేవలం రాయలసీమకే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో వెలుగులు నింపే ఆస్కారం ఈ అలుగు నిర్మాణంతో పుష్కలంగా ఉంది. రాయలసీమ సాగునీటి ఇబ్బందులకు పరిష్కారంగా విశ్రాంత సాగునీటి నిపుణులు సుబ్బరాయుడు రెండు దశాబ్దాలుగా ప్రభుత్వం ముందుంచుతున్న సిద్దేశ్వరం అలుగు ప్రతిపాదనకు దారితీసిన పరిస్థితులు, ఈ అలుగు నిర్మాణం ఆంధ్రప్రదేశ్‌కు ఏ విధంగా వెలుగును నింపుతుందో తెలిపే చిరు ప్రయత్నమే ఈ వ్యాసం.

బచావత్ ట్రిబ్యునల్ 75 శాతం సంవత్సరాల నీటి లభ్యత ఆధారంగా (వంద సంవత్సరాలలో 75 సంవత్సరాలు తప్పక నీరు లభించేలాగా) కృష్ణా జలాల నీటి పంపిణీ చేసింది. రాయలసీమ ప్రాజెక్టులకు ప్రధానంగా కృష్ణా ఉపనది తుంగభద్ర, కృష్ణా నదుల నీటిని బచావత్ ట్రిబ్యునల్ కేటాయించింది. కాని రాయలసీమకు కేటాయించిన నీటిని ఏ సంవత్సరం కూడా వినియోగించుకోలేకపోతున్నది. నీటిని నిలువ చేసుకునే రిజర్వాయర్లు లేకపోవడం, రిజర్వాయర్ల నుంచి పంట పొలాలకు అందించే ప్రధాన కాలువలు తగినంత నీటి ప్రవాహ సామర్థ్యంతో నిర్మించకపోవడం లేదా ప్రధాన కాలువల నుంచి ఉప కాలువలు, పంట కాలువలు సక్రమంగా లేకపోవడం ఈ దుస్థితికి ప్రధాన కారణాలు.

రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించిన తుంగభద్ర జలాలు కర్నూలు జిల్లాలోని సంకేసుల బ్యారేజి దాటి నంద్యాల జిల్లాలోని సిద్దేశ్వరం, సంగమేశ్వరం ఎగువన కృష్ణా నదిలో కలుస్తున్నాయి. ఈ నీరంతా అక్కడ నుంచి దిగువకు శ్రీశైలం వైపు ప్రవహిస్తున్నది. శ్రీశైలం వద్ద కృష్ణా నదికి అడ్డంగా ప్రాజెక్టు నిర్మించడం వల్ల కృష్ణా జలాలు శ్రీశైలం రిజర్వాయర్‌లో నిలువ ఉంచే అవకాశం కలిగింది. శ్రీశైలం ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీరు నిలువ ఉంచినపుడు వెనుకకు ఎగదన్నడం వలన సిద్దేశ్వరం, సంగమేశ్వరం ప్రాంతం అంతా సముద్రాన్ని తలపిస్తుంది. అయితే రాయలసీమ ప్రాజెక్టులు ఆ నీటిని ఉపయోగించుకునే అవకాశం లేదు. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తితే కృష్ణా జలాలు దిగువన ఉన్న నాగార్జునసాగర్ వైపు పరుగులు తీస్తాయి. రాయలసీమలోని ఒక్క ఎకరాకు కూడా నీరు లభించని పరిస్థితి ఉంది.

రాయలసీమ ప్రాజెక్టులకు నీరు లభించడానికి ప్రధానంగా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పొందే అవకాశాన్ని అంజయ్య ముఖ్యమంత్రిగా ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించింది. 19 టీఎంసీల నికర జలాల కేటాయింపుతో ఎస్ఆర్‌బీసీ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి తెలుగుగంగ ప్రాజెక్టు, మద్రాసుకు త్రాగునీటిని అందించే పథకాన్ని తర్వాత ఎన్‌టి రామారావు ముఖ్యమంత్రిగా ఉండగా తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టింది. గాలేరు–నగరి, హంద్రీ–నీవా ఎత్తిపోతల పథకాలకు కూడా ఎన్‌టి రామారావు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులను మంజూరు చేసింది. పోతిరెడ్డిపాడు నుంచి గాలేరు–నగరి ప్రాజెక్టు, కేసి కెనాల్‌కు నీటి కేటాయింపులు (తుంగభద్ర డ్యాం నుంచి కేసి కెనాల్‌కు ఉన్న 10 టీఎంసీల నీటిని హెచ్ఎల్‌సీకి బదలాయించి, దీనికి బదులుగా కేసి కెనాల్‌కు 10 టీఎంసీల నీరు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి పొందేలాగా అంతర్గత సర్దుబాటుకు అనుమతులు ఇవ్వడం), హంద్రీనీవా ఎత్తిపోతల పథకంను (శ్రీశైలం రిజర్వాయర్‌లో 834 అడుగుల వరకు నీరు ఉన్నప్పుడు నంద్యాల జిల్లా మల్యాల గ్రామం వద్ద హంద్రీనీవా ఎత్తిపోతల ప్రాజెక్టు) వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది.

అయినా శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని రాయలసీమ ప్రాజెక్టులు వినియోగించుకోలేకపోతున్నాయి. దీనికి ప్రధాన కారణం శ్రీశైలం రిజర్వాయర్‌లో తగిన స్థాయిలో నీరు నిలువలేకపోతే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు నీరు అందదు. సముద్ర మట్టానికి 841 అడుగుల ఎత్తున ఉన్న నంద్యాల జిల్లా పోతులపాడు గ్రామం వద్ద పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం చేపట్టారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో 854 అడుగుల నీరు ఉన్నప్పుడు మాత్రమే సుమారు 6000 క్యూసెక్కుల నీటిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ ప్రాజెక్టులకు తీసుకునే అవకాశం ఉంటుంది. శ్రీశైలం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు ఉన్నప్పుడే 44 వేల క్యూసెక్కుల నీటిని రాయలసీమ ప్రాజెక్టులకు తీసుకునే అవకాశం ఉంటుంది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నాగార్జునసాగర్ ఆయకట్టుకు, కృష్ణాడెల్టాకు కేటాయించిన 80 టీఎంసీలు కృష్ణా జలాలకు అదనంగా నీటిని తరలిస్తుండటంతో, ఆ నీరంతా సముద్రం పాలు అవుతున్నది. దీనివలన శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటి నిలువ 854 అడుగులు దిగువకు పడిపోతుండడంతో రాయలసీమకు చుక్క నీరు కూడా దక్కడం లేదు.



సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపడితే శ్రీశైలంలో 860 అడుగుల ఎత్తులో నీరు ఉన్నప్పుడు అలుగు దిగువన శ్రీశైలం రిజర్వాయర్ వరకు 60 టీఎంసిల నీరు, అలుగు ఎగువ భాగాన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వరకు సుమారు 50 టీఎంసిల నీరు నిలువ ఉంటుంది. దీనితో నాగార్జునసాగర్‌లో నిలువ ఉండే 312 టీఎంసీలతో పాటు, అలుగు ఉన్న ప్రాంతం నుంచి దిగువన శ్రీశైలం రిజర్వాయర్ వరకు ఉండే నీటిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అలుగుకు ఎగువ భాగన ఉన్న నీటిని రాయలసీమ, నెల్లూరు జిల్లాల ప్రాజెక్టులకు వినియోగించుకునే అవకాశం లభిస్తుంది.

శ్రీశైలంలో నీరు నిలువ ఉంచి దిగువన ఉన్న సాగర్, కృష్ణాడెల్టా ఆయకట్టుకు, బ్యాక్ వాటర్ మీద ఆధారపడిన రాయలసీమ ప్రాజెక్టుల ఆయకట్టుకు నీరు సక్రమంగా అందించాల్సిన అవసరం ఉంది. నంద్యాల జిల్లా సిద్దేశ్వరం వద్ద 860 అడుగుల ఎత్తుతో అలుగు నిర్మాణం చేపట్టడం వల్ల అన్ని సాగునీటి ప్రాజెక్టుల ఆయకట్టుకు నీరు సక్రమంగా అందించే వెసలుబాటు కలుగుతుంది. అలుగు నిర్మాణం చేపడితే శ్రీశైలంలో 860 అడుగుల ఎత్తులో నీరు ఉన్నప్పుడు అలుగు దిగువన శ్రీశైలం రిజర్వాయర్ వరకు 60 టీఎంసిల నీరు, అలుగు ఎగువ భాగాన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వరకు సుమారు 50 టీఎంసిల నీరు నిలువ ఉంటుంది. దీనితో నాగార్జునసాగర్‌లో నిలువ ఉండే 312 టీఎంసీలతో పాటు, అలుగు ఉన్న ప్రాంతం నుంచి దిగువన శ్రీశైలం రిజర్వాయర్ వరకు ఉండే నీటిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అలుగుకు ఎగువ భాగన ఉన్న నీటిని రాయలసీమ, నెల్లూరు జిల్లాల ప్రాజెక్టులకు వినియోగించుకునే అవకాశం లభిస్తుంది. దీంతో కృష్ణానది మీద ఆధారపడిన ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని సాగునీటి ప్రాజెక్టుల అవసరాలకు సాగునీటిని, తాగునీటిని వినియోగించుకోవడానికి అవకాశం లభిస్తుంది.


315 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన శ్రీశైలం రిజర్వాయర్‌లో పూడిక చేరడం వల్ల నేడు సుమారు 185 టీఎంసీల సామర్థ్యానికి తగ్గిపోయింది. ఇదే విధంగా కొనసాగితే ఇది ఒక పెద్ద కుంటలాగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. దీని జీవితకాలం పెంచడం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని సాగునీటి ప్రాజెక్టుల సక్రమ నిర్వహణకు అత్యంత కీలకం. సిద్దేశ్వరం అలుగు నిర్మాణం వల్ల శ్రీశైలం రిజర్వాయర్‌లో పూడిక చేరికను నివారించి, దాని జీవితకాలాన్ని పెంచడంలో ఉపయోగపడుతుంది. అలుగు నిర్మాణం శ్రీశైలం ప్రాజెక్టుకు రక్షణ అవుతుంది. దీనికి కొత్తగా భూసేకరణ చేయాల్సిన అవసరం లేదు. వరద బారి నుంచి శ్రీశైలం రిజర్వాయర్‌ను రక్షించుకోవడం, ప్రాజెక్టు జీవితకాలాన్ని పెంచుకోవడం, నీటి నిర్వహణను సక్రమంగా చేపట్టడం, విద్యుత్తు ఉత్పత్తి చేపట్టడం, తాగునీటి ఇబ్బందులను తొలగించడం తదితర బహుళ ప్రయోజనాలను తక్కువ నిర్మాణ సమయంతో, తక్కువ పెట్టుబడితో సిద్దేశ్వరం అలుగు నిర్మాణం ద్వారా సాధించవచ్చు.

సిద్దేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి 1951లోనే ప్లానింగ్ కమిషన్ అనుమతులు ఇచ్చింది. తరతరాలుగా ఈ ప్రాజెక్టు సాధనకు ప్రభుత్వాలు స్పందించని నేపథ్యంలో, అనేక బహుళార్థ ప్రయోజనాలను కలిగి ఉన్న సిద్దేశ్వరం అలుగు నిర్మాణం కోసం రాయలసీమ సాగునీటి సాధన సమితి, అనేక ప్రజా సంఘాలతో కలిసి మే 31, 2016న సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2019 సంవత్సరంలో నిండు ఎండాకాలం మే నెలలో నాలుగు రోజుల 100 కిలోమీటర్ల పాదయాత్రను నంద్యాల నుంచి సిద్దేశ్వరం వరకు వేలాదిమంది ప్రజలతో విజయవంతంగా నిర్వహించింది. రాజకీయ పార్టీలపై ఒత్తిడి తీసుకొస్తున్నది. ఈ పరంపరలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీలు సిద్దేశ్వరం అలుగు నిర్మాణానికి మద్దతును ప్రకటించాయి.

కల్వకుర్తి నంద్యాల మధ్య నిర్మించే జాతీయ రహదారిలో భాగంగా సంగమేశ్వరం వద్ద కృష్ణానదిపై నిర్మిస్తున్న తీగెల వంతెనకు బదులుగా 'అలుగుతో కూడిన వంతెన' నిర్మాణం చేపట్టాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అనేక కార్యక్రమాలు నిర్వహించింది. 2024 సార్వత్రిక ఎన్నికల ముందు ఈ అంశాలను నారా లోకేష్, నారా చంద్రబాబు నాయుడుల దృష్టికి సమితి నాయకులు తీసుకొచ్చారు. గత ఆగస్టులో చంద్రబాబునాయుడు శ్రీశైలం ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇస్తున్న సందర్భంలో, సిద్దేశ్వరం అలుగు నిర్మాణానికి అవసరమైన కార్యాచరణ చేపడతామని ప్రకటించారు.

ఆంగ్లేయుల కాలం నుంచి వందేళ్ళుగా సిద్దేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అంశం రాయలసీమ ప్రజానీకాన్ని ఆశల పల్లకిలోనే ఊరేగిస్తున్నది. ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్‌కు వెలుగులను అందించే సిద్దేశ్వరం అలుగు నిర్మాణాన్ని రాజకీయ దృఢసంకల్పంతో అత్యంత త్వరగా చేపట్టాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది.

■ **బొజ్జా దశరథరామిరెడ్డి**
అధ్యక్షులు, రాయలసీమ సాగునీటి సాధన సమితి





రాజీవ్‌నగర్‌లో స్కూల్‌లో వరదకు తడిసిపోయిన ట్యాబ్‌లు, కంప్యూటర్లు



కండ్రికలో ఇంకా తొలగని బురదతో మహిళ అవస్థలు

కపులూరి కిషోర్‌కుమార్... జక్కంపూడి కాలనీలోని బ్లాక్ నంబరు 137లో నివాసి. వండ్రింగి పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు ముగ్గురు ఆడపిల్లలు. పెద్ద కుమార్తె ఇంటర్ చదువుతోంది. చిన్న కుమార్తె తొమ్మిది, మూడో కుమార్తె ఏడో తరగతి చదువుతున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు సర్వం కోల్పోయారు. నీళ్ల మెట్ల వద్దకు వచ్చే సరికి అన్నీ సర్దుకోవడం మొదలుపెట్టారు. రెండో కుమార్తెకు ఓణీల ఫంక్షన్ చేయడానికి ఉపయోగపడతాయని రూ.16 వేలను భద్రం చేసుకున్నాడు. కుటుంబమంతా సామాన్లు సర్దుకుంటున్న సమయంలో నీళ్లు పెరిగిపోయాయి. బీరువాలో ఉన్న వస్తువులు, డబ్బులు తీస్తుండగా పాములు ఇంట్లోకి వచ్చాయి. పిల్లలు వాటిని చూసి పెద్దగా అరవడంతో కిషోర్ కుమార్ భార్య కంగారుపడి డబ్బులను నీటిలో పడేసింది. ఆ వరద నీటిలోనే డబ్బులు కొట్టుకుపోయాయి.

మల్లిపాముల వర్ధన్... 18 సంవత్సరాలు. ఉడా కాలనీ ఈడబ్ల్యూఎస్‌లో ఉంటాడు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుడమేరు వరద ఛాతి వరకు వచ్చింది. ఎదురింట్లో ఉన్న వృద్ధుడిని కాపాడడానికి వెళ్లాడు. ఆ వృద్ధుడ్ని బయటకు తీసుకొచ్చి రెండంతస్తుల భవనం ఎక్కించాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా వరద ప్రవాహం పెరిగిపోయింది. అందులో కొట్టుకుపోయాడు. వరద వచ్చిన నాలుగు రోజుల తర్వాత మూడు వీధుల అవతల మృతదేహం తేలింది.

గడపకో గాథ!

బుడమేరు వరదతో సర్వం కోల్పోయిన బాధితులు

- జరిగిన నష్టం చూసి అంతులేని ఆవేదన
- వస్తువులు నిన్న నీళ్లలో... నేడు రహదారులపై...
- కొన్ని ప్రాంతాల్లో ఇంకా తొలగని బురద
- అద్దెల కోసం ఇంటి యజమానుల సతాయింపు
- ఇంటి మరమ్మతుల భారం బాధితులపైనే
- నానిపోయిన నోట్సులు, పాఠ్య పుస్తకాలు
- మళ్లీ 'మొదలు' పెడుతున్న ఉపాధ్యాయులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : బుడమేరు వరద బెజవాడను భయపెట్టింది. కుటుంబాలను చిన్నాభిన్నం చేసింది. వరద తగ్గాక మిగిలిన బురదను కడుక్కుంటున్న బాధితులు నీళ్లలో నానిన వస్తువులను ఇప్పుడు రోడ్లపై ఆరేసుకుంటున్నారు. పది రోజులపాటు పనులు వదలేసుకుని పస్తులు ఉన్న బాధితులు ఇప్పుడిప్పుడే కూలి పనికెళ్తున్నారు. కొన్ని ఇళ్లలో బురద తొలగిపోయినా ఇంకా చెమ్మదనం పోలేదు. జక్కంపూడి కాలనీలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. పీకల లోతు వరకు నీళ్లు వచ్చినప్పుడే దొంగలు తలుపులు పగలగొట్టి వస్తువులు, నగదు ఎత్తుకుపోయారు. చెమ్మదనం ఉందని మేడలపై నిద్రపోతే మిగిలిన వస్తువులను ఉండనివ్వరని బాధితులు చెబుతున్నారు. అందుకోసమే చెమ్మదనం ఉన్నా ఇళ్లలోనే ఉంటున్నామని వివరిస్తున్నారు. మరోపక్క కండ్రిగ, ఉడా కాలనీ, అంబాపురంలో ఇంకా వరద నీరు పూర్తిగా తొలగిపోలేదు. కొన్నిచోట్ల మోటార్లతో నీటిని తోడుతున్నారు. మరికొన్నిచోట్ల గండ్లు కొట్టారు. ఖాళీ స్థలాల్లో నిలిచిన నీరు పోయే మార్గం కనిపించడం లేదు. దీంతో అక్కడ దోమల బెడద పెరిగిపోతోంది.

అద్దె ఇళ్లలో అన్నింటికీ నివసించేవారిదే బాధ్యత

అజిత్‌సింగ్ నగర్, రాజీవ్‌నగర్, వాంబేకాలనీ, కండ్రిక ప్రాంతాలు శివారున ఉండడంతో అద్దెలు తక్కువగా ఉంటాయని చాలామంది ఇక్కడికి అద్దెలకు వచ్చారు. వివిధ జిల్లాల నుంచి ఉపాధి కోసం వలస వచ్చినవారు ఈ ప్రాంతాల్లోనే అద్దెకు ఉంటున్నారు. బుడమేరు మొత్తం ముంచేయడంతో చాలా ఇళ్లు పూర్తిగా మునిగిపోయాయి. బహుళ అంతస్తులున్న భవనాల్లో మొదటి అంతస్తులు మునిగాయి. కొన్ని ఇళ్లల్లో ఇంటి యజమానులు పైఅంతస్తులో నివాసం ఉండి, కింది అంతస్తులను అద్దెలకు ఇచ్చారు. మరికొంతమంది ఈ ప్రాంతాల్లో ఇళ్లను నిర్మించుకుని మరోచోట నివాసం ఉంటున్నారు. ఇక్కడ ఉన్న ఇళ్లను అద్దెలకు ఇచ్చారు. నగరంలో మొత్తం 32 డివిజన్లలో ఉన్న ప్రాంతాలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. ఈనెల పదో తేదీ వరకు ఈ ప్రాంతాలన్నీ నీటి ముంపులోనే ఉన్నాయి. బాధితులు క్రమంగా ఇళ్లను శుభ్రం చేసుకుంటున్న సమయంలో యజమానులు వారికి షాక్‌ల మీద షాక్‌లు ఇస్తున్నారు. అద్దెలు చెల్లించాలని బాధితులపై ఒత్తిడి పెంచుతున్నారు. వరద ఉధృతికి పాడైపోయిన ద్వారాల తలుపులు, సెల్ఫ్‌లు, బాత్‌రూం తలుపులను మరమ్మతులు చేయించుకోవాలని బాధితులకు తెగేసి చెప్తున్నారు. కొన్ని ఇళ్లలో మోటార్లు కాలి పోయాయి. కొత్త మోటార్లను ఏర్పాటు చేయించుకోవాలని చెబుతున్నారు. కొంతమంది యజమానులు పాడైనవన్నీ మరమ్మతులు చేయించుకోవాలని చెప్తుంటే, మరికొంతమంది మాత్రం రిపేర్లు చేయించుకున్న తర్వాత డబ్బులు ఇస్తామని చెబుతున్నారు. దీంతో బాధితుల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడినట్టవుతోంది.



బొమ్మసాని సుబ్బారావు నగర్‌లో బురద తొలగింపు


ఎన్టీఆర్ జిల్లాలో 11,693 మంది విద్యార్థుల పుస్తకాలు నీటిపాలు

వరదలకు లక్షలాది కుటుంబాలు నీటిలో ఉండిపోయాయి. ఇంట్లో ఉన్న పాత్రలు, బయట పెట్టుకున్న వాహనాలు కొట్టుకుపోయాయి. విద్యార్థులు ఆస్తిగా భావించే పుస్తకాలన్నీ ముద్దయిపోయాయి. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మొత్తం నీళ్లలో కొట్టుకుపోయాయి. బుడమేరు ముంపులో మునిగిన అన్ని ప్రాంతాల్లో పాఠశాలలు నాశనమైపోయాయి. ఈ వరదల వల్ల ఎన్టీఆర్ జిల్లాలో 11,693 మంది విద్యార్థులకు నష్టపోయినట్టు విద్యాశాఖాధికారులు నిర్ధారించారు. వారిలో విజయవాడలో ముంపు బారిన పడిన 32 డివిజన్లలో మొత్తం 4-5వేల మంది విద్యార్థులు ఉంటారని అంచనా వేశారు. ఇప్పటి వరకు పూర్తయిన 40శాతం సిలబస్‌కు సంబంధించి మళ్లీ నోట్స్ చెప్పాల్సి ఉంటుంది. ముంపులో ఉన్న అన్ని పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ట్యాబ్‌లు, కంప్యూటర్లు పూర్తిగా పాడైపోయాయి. వాటినీ ఎండలో ఆరబెడుతున్నారు. వరదల్లో నష్టపోయిన బాధిత విద్యార్థుల లెక్కలు తేలాయని, వారికి త్వరలోనే యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉన్న కిట్స్‌ను అందజేస్తామని జిల్లా విద్యా శాఖాధికారి సుబ్బారావు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

- మిగతా 6లో



వైఎస్సార్‌కాలనీలోని పాఠశాలలో పుస్తకాలను ఆరబెట్టుకుంటున్న విద్యార్థి



డీ అడ్రస్ మాల్ బస్టాప్ వద్ద ప్రకటన బోర్డు

విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో ప్రకటనలు, హోర్డింగుల లీజుల ద్వారా 2018-19 వరకు ఏటా రూ.13 కోట్ల ఆదాయం వచ్చేది. ప్రస్తుతం ఈ మొత్తం ఆదాయినికి గండి పడింది. కోర్టు కేసులు సాకుగా చూపుతూ వీఎంసీ అధికారులు బడా ప్రకటనల సంస్థలు కుమ్మక్కయ్యి వీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ కుమ్మక్కు ఫలితంగా ఐదేళ్లలో రూ.65 కోట్ల ఆదాయాన్ని వీఎంసీ కోల్పోవాల్సి వచ్చింది. ఈ ఎగవేత దందాలో వైసీపీ నాయకులు కీలకపాత్ర పోషిస్తుండటం గమనార్హం.



కలెక్టర్ ఆఫీసుకు ఎదురుగా బస్టాప్ వద్ద ప్రకటన బోర్డు

రూ.65 కోట్లు ఎగవేత!

- ఐదేళ్లుగా నయాపైసా లీజు చెల్లించని వైనం
- ఇటీవల కౌన్సిల్ సమావేశంలో నిలదీసిన టీడీపీ
- అయినా స్పందించని అధికారులు

ప్రకటనల సంస్థలతో వీఎంసీ పాలకుల కుమ్మక్కు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో హోర్డింగులు, భారీ బ్యానర్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రకాశ్ ఆర్ట్స్, లీడ్ స్పేస్ అనే రెండు ప్రముఖ సంస్థలు వీఎంసీ నుంచి ఆయా స్థలాలను లీజుకు తీసుకున్నాయి. 2018-19 వరకు ఈ సంస్థలు ఏటా లీజు మొత్తాన్ని చెల్లించేవారు. ఆ తర్వాత వీఎంసీ లీజు మొత్తంపై 250 శాతం పన్నును విధించింది. దీనిపై కొన్ని చిన్న సంస్థలు కోర్టును ఆశ్రయించాయి. అంత మొత్తాన్ని పన్నుగా విధిస్తే తమలాంటి చిన్న సంస్థలకు భారంగా మారుతుందని వారు కోర్టుకు విన్నవించుకున్నారు. దీన్ని సాకుగా చూపి ప్రకాశ్ ఆర్ట్స్, లీడ్ స్పేస్ సంస్థలు కూడా లీజు మొత్తాలను చెల్లించడం నిలిపివేశాయి. వీఎంసీ ప్రకటన స్థలాల లీజులో వీరిద్దరిదే అగ్రస్థానం. 90 శాతం స్థలాలు ఈ రెండు సంస్థల చేతిలోనే ఉంటాయి. చిన్న సంస్థలు కోర్టును ఆశ్రయించడాన్ని సాకుగా చూపి ఈ రెండు సంస్థలు లీజు మొత్తాన్ని చెల్లించకుండా ఆపేయడం.. దానికి వీఎంసీ లీగల్ సెల్, వీఎంసీ పాలకులు సహకరిస్తూ రావడంతో గడిచిన ఐదేళ్లలో నయాపైసా లీజు మొత్తం వీఎంసీకి జమ కాలేదు. ఈ బకాయిలు సుమారు రూ.65 కోట్లుపైబడి ఉన్నాయి. కేసులు పరిష్కరించి లీజు మొత్తాన్ని వసూలు చేయడంలో వీఎంసీ లీగల్ సెల్ దృష్టి పెట్టడం లేదు. వైసీపీ హయాంలో నియమితులైన వారే ఇప్పటికీ లీగల్ సెల్‌లో ఉండటం.. వీఎంసీ పాలకులు ప్రకటనల సంస్థలతో కుమ్మక్కు కావడంతో వీఎంసీ ఖజానాకు కోట్లలో గండిపడుతోంది.

పేరు వారిది.. ఎగవేత వీరిది..

నగరంలో హోర్డింగ్‌ల ఏర్పాటుకు ప్రకాశ్ ఆర్ట్స్, లీడ్ స్పేస్ సంస్థలు 90 శాతం స్థలాలను వీఎంసీ నుంచి లీజుకు తీసుకున్నాయి. ఈ రెండు సంస్థల చేతిలో 500కుపైగా చిన్న పెద్ద హోర్డింగులు ఉన్నాయి. మిగిలిన 10 శాతం హోర్డింగ్‌లు చిన్న, చిన్న సంస్థలు నిర్వహిస్తున్నాయి. ఆ 10 శాతం కూడా తామే దక్కించుకోవాలన్న ఉద్దేశంతో పెద్ద సంస్థలు ప్రకటన స్థలాల లీజుపై 250 శాతం పన్ను విధించేలా చక్రం తిప్పి విజయం సాధించారు. పెద్ద సంస్థలకు ఇది పెద్ద భారం కాకపోయినా చిన్న సంస్థలకు ఇది మోయలేని భారం. దీంతో వారు కోర్టును ఆశ్రయించారు. ఇదే అదనుగా బడా సంస్థలు కోర్టు కేసుల సాకుతో లీజు చెల్లింపును నిలిపివేశారు. గత ఐదేళ్లుగా ఇదే తంతు నడుస్తోంది. దీనిపై స్పందించి లీగల్ సెల్ ద్వారా కేసులను పరిష్కరించాల్సిన వీఎంసీ అధికారులు వైసీపీ పాలకుల ఒత్తిళ్లతో గత ఐదేళ్లు ఈ కేసుల వైపే చూడలేదు. ఆగస్టు 28న జరిగిన వీఎంసీ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కార్పొరేటర్ ముమ్మనేని వెంకట ప్రసాద్ ఈ అంశాన్ని లేవనెత్తారు. నగర పరిధిలోని పలు ఏజెన్సీలు వ్యాపార ప్రకటనలు, హోర్డింగ్‌ల ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించుకుంటూ నగరపాలక సంస్థకు చెల్లించాల్సింది చెల్లించకుండా కోర్టుకేసుల సాకుతో కాలయాపన చేస్తున్నారని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, బకాయిలను వెంటనే వసూలు చేయాలని కమిషనర్ హెచ్‌ఎం.ధ్యానచంద్రను కోరారు. దీనిపై వీఎంసీ అధికారులు దృష్టిసారిస్తే వీఎంసీకి ప్రతియేటా రూ.13 కోట్ల పైచిలుకు ఆదాయం వస్తుంది.

వరద ఎన్యూమరేషన్ రీ వెరిఫికేషన్ పూర్తి

- జిల్లా యంత్రాంగం రెండు రోజులుగా నిర్వహణ


(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బుడమేరు, కృష్ణా వరద బాధితుల ఫ్లడ్ ఎన్యూమరేషన్‌కు సంబంధించిన రీ వెరిఫికేషన్ ప్రక్రియను ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం నూరు శాతం పూర్తి చేసింది. రీ వెరిఫికేషన్ ప్రకారం నమోదైన డేటాను రాష్ట్ర ప్రభుత్వానికి మరోమారు జిల్లా యంత్రాంగం పంపింది. విజయవాడ నగర పరిధిలో తూర్పు, పశ్చిమ, నార్త్, సెంట్రల్ మండలాల పరిధిలో మొత్తం 4036 మంది ఎన్యూమరేటర్లు నాలుగు రోజుల పాటు ఇంటింటికీ తిరిగి ఫ్లడ్ ఎన్యూమరేషన్ నిర్వహించారు. వీరంతా కలిసి దాదాపుగా 1,75,000 ఇళ్లకు ఎన్యూమరేషన్ నిర్వహించారు. ఏ ఒక్కరూ నష్టపోకూడదని ప్రభుత్వం పదేపదే చెబుతుండటంతో.. హౌస్‌హోల్డ్స్ కాకుండా ఇంకా ఎవరైనా నష్టపోయారేమోనని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇలా దాదాపుగా పది వేల మందిని గుర్తించి వారికి కూడా ఎన్యూమరేషన్ నిర్వహించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోకి నీళ్లు వచ్చిన వారితో పాటు, ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉంటున్న వారికి కూడా న్యాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించటంతో ఈ మేరకు సమగ్రంగా ఫ్లడ్ ఎన్యూమరేషన్‌ను జిల్లా యంత్రాంగం చేయించింది. అంతిమంగా నిర్వహించిన సర్వేలో తీవ్ర నష్టం జరిగినట్టుగా వెలుగు చూసింది. ప్రధానంగా ఫ్లడ్ ఎన్యూమరేషన్ ద్వారా 30,893 ఇళ్లకు డ్యామేజీ కలిగిందని తేలింది. ఆ తర్వాత 43,281 వాహనాలకు డ్యామేజీ అయిందని, గృహోపకరణాలలో ప్రధానంగా ఎలక్ట్రానిక్ పరికరాలైన 31,436 ఫ్రిజ్‌లు, 26,723 టీవీలు, 21,153 వాషింగ్ మెషీన్లు, 2051 ఏసీలకు నష్టం జరిగిందని తేలింది. గేదెలు, గొర్రెలు, కోళ్లు కలిపి 16,834 ప్రాణులకు నష్టం జరిగిందని గుర్తించారు. ప్రభుత్వం ఏ ఒక్కరూ నష్టపోకూడదన్న ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం రీ వెరిఫికేషన్‌కు ఆదేశించింది. రీ వెరిఫికేషన్‌ను గత రెండురోజులుగా విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం పూర్తి సమగ్ర వరద నష్టం ఏమిటన్నది జిల్లా యంత్రాంగం దగ్గర ఉంది. ఈ వరద నష్ట నివేదికను ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం నివేదించింది. ప్రభుత్వం ఈ నష్టంపై మదింపు చేసి ఇంటికి ఎంత సహాయం అందించగలమన్నది ప్రకటించాల్సి ఉంది. ప్రభుత్వం ఇంటికి ఎంత సహాయం అందిస్తామని ప్రకటన చేస్తుందో దానికి అనుగుణంగా వెంటనే బడ్జెట్ కూడా విడుదల చేసే అవకాశం ఉంది. సీఎం రిలీఫ్ ఫండ్‌కు వచ్చిన నిధులను సహాయకంగా ఉపయోగించనున్నారు. ఈ నిధులు సరిపోకపోతే ప్రభుత్వం మిగిలిన మొత్తాన్ని భరిస్తుంది.

అమరావతి రైల్వేలైన్‌కు 296.28 ఎకరాలు

నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో భూ సేకరణ

- కంచికచర్ల, వీరులపాడు మండలాల పరిధిలోని 8 గ్రామాల్లో భూములు
- రెవెన్యూకు ప్రతిపాదనలు పంపిన రైల్వే అధికారులు
- ఎర్రుపాలెం నుంచి పెద్దాపురం, పరిటాల మీదుగా అమరావతిలోకి..

అమరావతి నూతన రైల్వే లైన్ భూ సేకరణకు అడుగు ముందుకు పడింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూముల కోసం రైల్వే శాఖ, రెవెన్యూకు ప్రతిపాదనలు పంపించింది. ఎన్టీఆర్ జిల్లాలోనే ఈ ప్రాజెక్టుకు ఎక్కువ భూములు అవసరమౌతున్నాయి. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి ఎన్టీఆర్ జిల్లా పెద్దాపురం, చెన్నారావు పాలెం, గొట్టుముక్కల, పరిటాల వరకు గుంటూరు జిల్లాలో కొత్తపేట, వడ్డమాను, తాడికొండ, కొప్పవరం, నంబూరు వరకు అవసరమైన భూములకు సంబంధించి రైల్వేశాఖ ప్రతిపాదనలు అందించింది. ఇందులో ఎన్టీఆర్ జిల్లాలో **296.28** ఎకరాలు అవసరమని రైల్వే అధికారులు ప్రతిపాదించారు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ / కంచికచర్ల): జిల్లాలో నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో వీరులపాడు మండలంలో 173.52 ఎకరాలు, కంచికచర్ల మండలంలో 122.76 ఎకరాలు అవసరమని తన నివేదికలో రైల్వే తెలిపింది. కంచికచర్ల మండలంలో రెండు గ్రామాల్లో భూములు అవసరమని తెలిపింది. గొట్టుముక్కలలో 51.97 ఎకరాలు, పరిటాలలో 70.791 ఎకరాలు కావాలని ప్రతిపాదించారు. వీరులపాడు మండలం పరిధిలో అల్లూరులో 45.017 ఎకరాలు, చెన్నారావుపాలెంలో 25.768 ఎకరాలు, గూడెం మాధవరంలో 5.103 ఎకరాలు, జుజ్జూరులో 29.67 ఎకరాలు, నరసింహరావుపాలెంలో 17.297 ఎకరాలు, పెద్దాపురంలో 50.252 ఎకరాలు చొప్పున కావాలని ప్రతిపాదించింది. ఈ భూములకు సంబంధించి రెవెన్యూ శాఖకు పక్షం రోజుల కిందటే డ్రాఫ్ట్ నివేదికను అందించారు. రైల్వేశాఖ ప్రాథమికంగా ఇచ్చిన రిపోర్టు మేరకు జేసీ నిధి మీనా ఆదేశాలతో ఆయా గ్రామాల వారీగా రెవెన్యూ సర్వే నెంబర్లు, భూ విస్తీర్ణం వంటి జాబితాలను నందిగామ రెవెన్యూ డివిజినల్ అధికారులు సిద్ధం చేశారు. రైల్వే అధికారులతో ఈ వారంలో భేటీ అయ్యే అవకాశం ఉంది. భారీ సంఖ్యలో సేకరిస్తున్న భూములకు సంబంధించి జిల్లాలో రూ. 510 కోట్ల మేర పరిహారం కింద అందించాల్సి వస్తోంది. కంచికచర్ల, వీరులపాడు మండలంలో ఎకరం కనిష్టంగా రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల మధ్యలో ధర పలుకుతోంది. హైవే వెంబడి అయితే రూ. కోటి కూడా ధర పలుకుతోంది. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రెండు రెట్ల పరిహారం చెల్లించాల్సి కాబట్టి సగటున ఎన్టీఆర్ జిల్లాలో రూ. 510 కోట్లు ఖర్చు అవుతుందని భావించాల్సి వస్తోంది.

అమరావతి నూతన రైల్వేలైన్ అలైన్‌మెంట్ ఇలా

అమరావతి నూతన రైల్వేలైన్ ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి ఎన్టీఆర్ జిల్లాలో పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాలల మీదుగా గుంటూరు జిల్లాలో కొత్త పేట, వడ్డమాను, తాడికొండ, కొప్పవరం, నంబూరుల వరకు 28.4 కిలోమీటర్ల మేర అభివృద్ధి చెయ్యాల్సి ఉంటుంది. 2016 - 17 ఆర్థిక సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం నూతన రైల్వేలైన్ ప్రతిపాదనల మేరకు సర్వే చేసిన అలైన్‌మెంట్ ప్రకారమే పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. 2017 - 18 ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రాజెక్టుకు రూ.2800 కోట్లు అంచనా అవుతుందని రైల్వే ప్రకటించింది. ప్రస్తుతం నూతన ఎస్ఎస్ఆర్ ప్రకారం రూ.3 వేల కోట్లు దాటే అవకాశం కనిపిస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

బీసీల అభ్యున్నతే లక్ష్యం

రాష్ట్ర పండుగగా విశ్వకర్మ జయంతి

బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత

వన్‌టౌన్, సెప్టెంబరు 17 : బీసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, టీడీపీ ప్రభుత్వంలోనే బీసీలకు పూర్వవైభవం వచ్చిందని రాష్ట్ర బీసీ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. గొల్లపూడిలోని బీసీ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విశ్వకర్మ జయంతి ఉత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. ప్రపంచ తొలి వాస్తు శిల్పి, సృష్టికర్తగా విశ్వకర్మ పేరుగాంచారన్నారు. చేతి వృత్తులకు ఆద్యుడిగానూ విశ్వకర్మను ఆరాధిస్తున్నామన్నారు. విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. ఈ మేరకు జీవో కూడా విడుదల చేశారన్నారు. ఆయనే స్వయంగా విశ్వకర్మ జయంత్యుత్సవంలో పాల్గొనాలని భావించినా అనివార్య కారణాల వల్ల హాజరుకాలేకపోయారన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీల పార్టీగా ముద్ర పడిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు బీసీల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా టీడీపీని స్థాపించారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా ఎన్నో కార్యక్రమాలు, పథకాలను అమలు చేశారన్నారు. బీసీల అభ్యున్నతి కోసం 2019కు ముందు అమలు చేసిన పథకాలన్నింటినీ వర్తింపజేయనున్నట్టు మంత్రి తెలిపారు. బీసీ కార్పొరేషన్‌ను పటిష్టపర్చి వెనుకబడిన తరగతులకు వెన్నుదన్నుగా చంద్రబాబు ప్రభుత్వం నిలుస్తుందని తెలిపారు. బీసీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేస్తామని, యువతకు స్వయం ఉపాధి లక్ష్యంగా రుణాలు అందచేస్తామని వెల్లడించారు. విశ్వబ్రాహ్మణ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. అనంతరం మంత్రిని విశ్వబ్రాహ్మణులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నెట్టెం రఘురాం, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి కోలా భాస్కర్, విశ్వకర్మ కార్పొరేషన్ జేఎండీ తనూజారాణి, జేఎంబీజీ ఉమాదేవి, హైకోర్టు అడ్వకేట్ చేపూరి రామస్వామి, బీసీ నాయకులు వి.గురుమూర్తి, టి.జయప్రకాష్ నారాయణ, సింహాద్రి కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే మార్చి లోగా ఇళ్లు నిర్మించుకోవాలి

హౌసింగ్ డీఈఈ రామోజీ నాయక్

గన్నవరం, సెప్టెంబరు 17 : ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు హౌసింగ్ డీఈఈ ఎం.రామోజీనాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పీఎంఏవై లబ్ధిదారులు మార్చి 2025లోగా ఇళ్లు నిర్మించుకోవాలని, లేకపోతే పథకం వర్తించదన్నారు. లబ్ధిదారులు నిర్మాణం చేపడితే దశల వారీగా బిల్లులు వస్తాయన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు ప్రభుత్వం ఇస్తుందనేది వదంతులు మాత్రమేనని చెప్పారు. ఇంటికి రూ.1.80 లక్షలు మాత్రమే వస్తాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28న లబ్ధిదారులకు ఒక రోజు అవగాహన సదస్సు 'మన ఇల్లు మన గౌరవం' పేరున జరుగుతుందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ స్థాయిలో 26న జరుగుతుందన్నారు. ఆ లేఅవుట్లలో మౌలిక వసతులు లేకపోతే సంబంధిత శాఖ అధికారులకు వెంటనే ఆదేశాలిచ్చి సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతుందన్నారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పీఎంఏవై 2.0 డిమాండ్ సర్వే చేస్తారన్నారు. గతంలో ఇల్లు మంజూరై నిర్మాణం చేపట్టకపోతే వెంటనే పనులు ప్రారంభించుకోవాలన్నారు. లేకపోతే ఏప్రిల్ నుంచి ఆ లబ్ధిదారుని పేరున ఎలాంటి ఇంటి స్కీము వర్తించదని తెలిపారు. ఏఈఈ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నేతృత్వంలో జిల్లా మరింత అభివృద్ధి : వేదవ్యాస్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 17 : కూటమి ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామ్యం కావడంతో ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి మరిన్ని నిధులు అందిస్తారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. మంగళవారం మచిలీపట్నంలోని తన కార్యాలయం వద్ద ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుడమేరు పొంగడంతో విజయవాడ మహానగరంతో పాటు పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, కోట్లాది రూపాయల నష్టం వాటిల్లిందన్నారు. ప్రధాని నేతృత్వంలో కేంద్రం తన వంతుగా సాయం అందిస్తుందని వేదవ్యాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా కేకులు కట్ చేశారు.



గడపకో గాథ!

(5వ పేజీ తరువాయి)

పరి'శ్రమ' బురదపాలు

విజయవాడకు చెందిన జంపన దుర్గాప్రసాద్ కబేళా ప్రాంతంలో గౌరాంగ ఇంపోర్ట్స్ పేరుతో ఫోర్ కలర్ రోటో గ్రేవియర్ ప్రింటింగ్ యూనిట్‌ను మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసుకున్నారు. 800 గజాల స్థలాన్ని అద్దెకు తీసుకుని రూ.కోటీ 50 లక్షలతో ఈ యూనిట్ ఏర్పాటు చేశారు. ఇది ప్యాకేజింగ్ ఫిల్మ్ ప్రింటింగ్. కొద్దిరోజుల క్రితం బుడమేరు వరదలకు యూనిట్‌లోకి తొమ్మిది అడుగుల వరకు నీరు చేరింది. దీంతో యూనిట్‌లో మిషనరీ మొత్తం తడిసిపోయింది. ఆటోమెటిక్ ప్రింటింగ్ విషన్, ప్రింటింగ్ డిజైన్ సిలిండర్స్, స్టాక్ గోడౌన్ తొమ్మిది రోజులుపాటు నీళ్లలో ఉండిపోయాయి. ఒక్కో సిలిండర్ విలువ రూ.50-60వేలు ఉంటుంది. రూ.2 లక్షల విలువ చేసే డ్రైవ్స్ నిండా బురద పట్టేసింది. విద్యుత్ సరఫరా ప్యానల్ బోర్డులు, మిషనరీ, సరుకు మొత్తం బురద పాలయ్యాయి. మొత్తంగా ఈ వరద ఆయనకు రూ.కోటి నష్టాన్ని మిగిల్చింది. నీరు తగ్గినా మిషనరీ, రసాయనాల నిండా బురద చేరడంతో దుర్వాసన రావడం మొదలైంది. దీంతో చుట్టుపక్కల వారు గొడవ చేయడం మొదలుపెట్టారు. అగ్నిమాపక వాహనాలను పిలిపించుకుని మొత్తం శుభ్రం చేయించుకున్నారు. మిషనరీ ఆన్ చేయాలని ఉన్నా ఏం జరుగుతుందో తెలియదని, ఇన్సూరెన్స్ వస్తుందో తెలియదని దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రింటింగ్ రంగంలో స్థిరపడిన దుర్గాప్రసాద్ మళ్లీ దీన్ని ప్రారంభించాలనుకున్నా కొత్త యూనిట్ ఏర్పాటు చేసినట్టే అవుతుంది.

రూ.లక్ష ఉంటేనే కోలుకోగలం : ఎస్‌కే బాజీ, రాజీవ్‌నగర్



ప్రకాష్‌నగర్‌లో గ్యాస్‌స్టౌ రిపేరు షాపు నిర్వహిస్తున్నా. మాకు ముగ్గురు పిల్లలు. బుడమేరు వరదలకు ఇల్లు, షాపు మునిగిపోయాయి. రూ.4లక్షల నష్టం వచ్చింది. రిపేర్లకు ఇచ్చిన స్టౌలు కొట్టుకుపోయాయి. కొత్త స్టౌవ్‌లు వరదలో పోయాయి. సర్వీసింగ్ సామగ్రి మొత్తం పోయింది. ఇప్పుడు రూ.లక్ష ఉంటే గానీ షాపును తెరుచుకోలేను. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఇంటి అద్దె, షాపు అద్దె చెల్లించలేని పరిస్థితి.

రూ.50 లక్షలు నష్టపోయా : కె.నాగేశ్వరరావు, అజిత్‌సింగ్‌నగర్



కల్లే వారి వీధిలో నివాసం ఉంటున్నా. తలవెంట్రుకల ఎక్స్‌పోర్ట్ చేస్తుంటాను. మా ఇంటికి కిందనే గొడౌన్ ఉంది. అందులో రూ.30లక్షల సరుకు ఉంది. ఏడాది క్రితం రూ.22లక్షలతో ఇన్నోవా కారు కొనుగోలు చేశారు. మూడు నెలల క్రితం ఎలక్ట్రికల్ కారు కొన్నాను. ఈ వరదలకు రెండు కార్లు నాశనమయ్యాయి. రూ.50లక్షల వరకు సరుకు నష్టపోయాను.







భవానీ ద్వీపం, బెరంపార్కు, తదితర ప్రాంతాలలో వరద మిగిల్చిన నష్టాన్ని పరిశీలిస్తున్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మంత్రికి వివరిస్తున్న అధికారులు

పర్యాటక నష్టం పూడ్చలేనిది!

భవానీ ద్వీపం, బెరం పార్కులకు తీవ్ర నష్టం

తిరిగి పునరుద్ధరణకు చర్యలు

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణానదికి వచ్చిన రికార్డు స్థాయి వరద కారణంగా పర్యాటక ఆస్తులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, రాష్ట్ర ప్రభుత్వ సహాయం కోసం చర్యలు తీసుకుంటానని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం సాయంత్రం కృష్ణా వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న భవానీ ఐల్యాండ్, హరిత బెరం పార్కులను మంత్రి పరిశీలించారు. భవానీ ఐల్యాండ్, బరం పార్కులలో జరిగిన నష్టాన్ని ఏపీటీడీసీ డీవీఎం చైతన్య, బెరం పార్కు, ఐల్యాండ్ యూనిట్ మేనేజర్లు శ్రీనివాస్, సుధీర్, బోటింగ్ మేనేజర్ నాగరాజు, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఎస్ఈ ఈశ్వరయ్య, ఈఈ శ్రీనివాసరావులు మంత్రికి వివరించారు. వరదల కారణంగా తన పుట్టినరోజు అయినప్పటికీ భవానీ ద్వీపం, బెరంపార్కులను ఆయన పరిశీలించారు.



బోటుపై ద్వీపం పరిశీలనకు వెళుతూ..

ముందుగా బెరం పార్కులోకి ఎంత వరద వచ్చిందో తెలుసుకున్నారు. బోట్లకు ఏర్పడిన డ్యామేజీలను పరిశీలించారు. కొట్టుకు వచ్చిన చెత్త చెదారం, తొలగింపు పనులు పరిశీలించారు. బెరం పార్కులోకి పెద్ద ఎత్తున వచ్చిన మట్టి తొలగింపును కూడా ఆయన పరిశీలించారు. పార్కులలోని కాటేజీలలో ఫర్నిచర్ దెబ్బతినటాన్ని పరిశీలించారు. పరుపులు, కాట్‌లు, ఇతర ఉపకరణాలకు ఏర్పడిన డ్యామేజీని పరిశీలించారు. కాన్ఫరెన్స్ హాల్‌లో స్టాండ్ ఏసీలు దెబ్బతిన టాన్ని పరిశీలించారు. అనంతరం బోటుపై భవానీ ఐల్యాండ్ వెళ్లి మేట వేసుకుపోయిన మట్టిని పరిశీలించారు. దెబ్బతిన్న పార్కులు, ఫ్లవర్ గార్డెన్స్, మేజ్ గార్డెన్, రోబోటిక్ పార్క్, గేమింగ్ జోన్‌లను పరిశీలించారు. కాటేజీలలో పేరుకుపోయిన మట్టి, దెబ్బతిన్న ఫర్నిచర్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యాటకాభివృద్ధి సంస్థ అధికారులు మంత్రికి రూ. 10 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు నివేదిక ఇచ్చారు. రోజువారీ లక్షలాది రూపాయల ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తున్న విషయాన్ని కూడా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలోనే ముఖ్యమైన భవానీ ఐల్యాండ్, బెరం పార్కులు దారుణంగా డెబ్బతినటం పట్ల మంత్రి దుర్గేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండింటికీ జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని పర్యాటకాభివృద్ధి సంస్థ అధికారులకు చెప్పారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి ప్రభుత్వ పరంగా సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వానికి మాట రాకుండా చూడండి

అధికారులతో మంత్రి ఆనం

దసరా ఏర్పాట్లపై సమగ్ర నివేదిక

వన్‌టౌన్, సెప్టెంబరు 17 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న దసరా మహోత్సవాల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు లేకుండా ప్రభుత్వానికి మాటరాకుండా ఏర్పాట్లు చేయాలనిదేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సెక్రటేరియట్‌లో ఈవో రామారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ, దేవదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణలు ఏర్పాట్లపై మంత్రికి నివేదిక సమర్పించారు. భక్తులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, దర్శనాలు, పూజలు, తదితర అంశాలపై సమగ్ర నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సామాన్య భక్తులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, ఎటువంటి ఇబ్బంది లేకుండా అమ్మవారి దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సౌకర్యాల కల్పనలో అలసత్వం కనిపించరాదన్నారు. మంత్రిని కలిసిన వారిలో అదనపు కమిషనర్ కె.రామచంద్ర మోహన్, చీఫ్ ఇంజనీర్ శేఖర్‌లు ఉన్నారు.



దసరా ఏర్పాట్లపై అధికారులతో మంత్రి ఆనం సమీక్ష

దేవదాయ కమిషనర్ కార్యాలయంలో..

దసరా ఉత్సవాల నిర్వహణపై మంగళవారం గొల్లపూడిలోని కమిషనరేట్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు దేవస్థానం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, దసరా ఉత్సవాల నిర్వహణలపై సమావేశంలో పలు అంశాలను చర్చించారు. పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని అధికారులు పలు సూచనలు చేశారు. కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దుర్గగుడి ఈవో రామారావు, సీఈ శేఖర్, ఏడీసీ చంద్రకుమార్, జాయింట్ కమిషనర్ (ఎస్టేట్) చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ వైదిక సిబ్బంది, ఈఈలు లింగం రమాదేవి, కె.వి.ఎస్. కోటేశ్వరరావు, ఏఈవోలు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో సమావేశం

దసరా ఉత్సవాల సందర్భంగా దేవస్థానంలో భక్తుల సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లపై అనుసరించాల్సిన విధి విధానాల రూపకల్పనకు విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షా సమావేశం జరగనుంది.

టూరిజం-పర్యాటక అవార్డులకు

దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, సెప్టెంబరు 17 : ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని పర్యాటక ఎక్సలెన్స్ 2023-24 సంవత్సరానికిగాను 38 విభాగాలకు సంబంధించి 41 అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా పర్యాటక శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉత్తమ కార్యనిర్వహణ పద్ధతులు అవలంబించిన టూర్ ఆపరేటర్లు, ట్రావెల్స్, హోటల్ తదితర సంబంధిత సంస్థల వారు డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.టూరిజం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, దరఖాస్తులను ఈనెల 22వ తేదీ లోగా కార్యాలయ పనివేళల్లో ముఖ్య కార్యనిర్వాహణ అధికారి, ఏపీ టూరిజం అథారిటీ, 5వ అంతస్తు, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ-520007వారి కార్యాలయం నందు అందజేయాలన్నారు.

20 నుంచి షటిల్ పోటీలు

గన్నవరం: ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పురుషుల 45ఏళ్లలోపు, 45ఏళ్ల పైన ఉన్న వారికి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 20, 21, 22 తేదీలలో గన్నవరం కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ రమణ, కార్యదర్శి కేవీఆర్ కిషోర్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రతి రోజు సాయంత్రం 4గంటల నుంచి పోటీలు జరుగుతాయన్నారు. తొలిరోజు పోటీలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని చెప్పారు. రెండు విభాగాల్లో విజేతలకు వరుసగా రూ.12వేలు, రూ.8వేలు, రూ.5వేలు, రూ.3 వేలు, షీల్డులు అందజేస్తామన్నారు. బెస్ట్ ప్లేయర్‌లకు రూ.2వేలు, పోటీలలో పాల్గొనే క్రీడా కారులకు భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 98850-68099, 91771-05146, 79812-61897 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

అక్టోబరు 3 నుంచి తాళం భజన, కోలాటం పోటీలు

ఘంటసాల : మండల పరిధిలోని చిట్టూర్పు శివాలయం వద్ద దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో తాళం భజన, మురళీకోలాటం పోటీలు అక్టోబరు 3 నుంచి 11వ తేదీ వరకు ప్రతీరోజు సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గుత్తికొండ వరప్రసాద్ తెలిపారు. ప్రథమ రూ.10 వేలు, ద్వితీయ రూ.5 వేలు, తృతీయ బహుమతిగా రూ.3 వేలు నగదు అందజేస్తామని, ఈ నెల 26వ తేదీ లోగా పోటీదారులు వివరాలతో నమోదు చేసుకోవాలని, సమాచారం కోసం 9247443763కి ఫోన్ చేయాలన్నారు.



చంద్రబాబును కలిసిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, సిబ్బంది

వరద బాధితులకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వితరణ

భారతీనగర్ : ఇటీవల వరదల కారణంగా నష్టపోయిన వారిని ఆదుకునే నిమిత్తం తమ వంతు వితరణగా ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం కలిసి యాజమాన్యం తరపున రూ.5లక్షలు, విద్యార్థులు తరపున రూ.4లక్షల చెక్కును అందజేశారు. ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ యాజమాన్యాన్ని, విద్యార్థులను ముఖ్యమంత్రి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్‌చైర్మన్ పరిమి నరేంద్రబాబు, డైరెక్టర్ పరిమి పవన్ చంద్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్వోపై వైసీపీ నేత భర్త దురుసు ప్రవర్తన!

చల్లపల్లి : కొత్తమాజేరు సర్పంచ్ భర్త కళ్లేపల్లి లక్ష్మీనారాయణ గ్రామ వీఆర్వో ఓగిరాల నాగమల్లేశ్వరరావు పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. దురుసుగా ప్రవర్తించటంతోపాటు వీఆర్వో బ్యాగ్‌ను బయటకు విసిరేసి అవమానించాడు. మంగళవారం గ్రామ సచివాలయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. గ్రామంలో వరద బాధితులు 66 మంది ఉండగా, బాధితుల బ్యాంకు ఖాతాలు సేకరించేందుకు మాజేరు వీఆర్వోతోపాటు పురిటిగడ్డ వీఆర్వో కిరణ్ సైతం గ్రామానికి వచ్చి సుమారు 45మంది బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించగా వాటిని తీసుకుని కిరణ్ చల్లపల్లి వెళ్లాడు. మధ్యాహ్నం మిగిలిన వారి వివరాలు సేకరించాలని అనుకున్నారు. ఈ విషయమై తనకు సమాచారం ఇవ్వకుండా జాబితాలు తీసుకువెళ్లటం ఏమిటనీ, ఇష్టానుసారం వ్యవహరిస్తున్నావంటూ సర్పంచ్ భర్త వీఆర్వోపై వాగ్వాదానికి దిగినట్టు తెలుస్తోంది. ఆగ్రహంతో వీఆర్వో బ్యాగ్‌ను బయటకు విసిరేసి దురుసుగా ప్రవర్తించడంతో గ్రామ పెద్దలు వివాదం పెద్దదికాకుండా లక్ష్మీనారాయణతో క్షమాపణలు చెప్పిస్తామంటూ వీఆర్వోకు సర్దిచెప్పారు. వీఆర్వో ఎటువంటి ఫిర్యాదు చేయనప్పటికీ ఈ విషయమై సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది.

బడి భోజనంపై అవగాహన పెంచాలి

అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



మచిలీపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో, ఆహారపట్టికను అమలుచేసే విషయంలో ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని కలెక్టర్ కోరారు. విద్యార్థులు పాఠశాలల్లో పెడుతున్న భోజనం ఇష్టంగానే తింటున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంలో వాడే ఫోర్టిఫైడ్‌బియ్యంలో ఫోలిక్‌యాసిడ్, విటమిన్‌బి-12 వంటి ఎనిమిదిరకాల పోషకాలు కలిగి ఉన్నాయన్నారు. ఈ ఆహారం తినడం వలన ఒత్తిడికి గురికారని, మధుమేహం నియంత్రించ బడుతుందన్నారు. పిల్లల తల్లిదండ్రులకు ఈ విషయాన్ని తెలియజేసి నూటికి నూరుశాతం పిల్లలను చైతన్యవంతంచేయాలన్నారు. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన పథకంను తరచూ పరిశీలించాలని సూచించారు. పాఠశాలల్లో రక్షిత మంచినీటిని అందుబాటులో ఉంచాలన్నారు. డీఈవో తాహెరా సుల్తానా మాట్లాడుతూ, జిల్లాలోని 1348 పాఠశాలల్లో 87,276 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వీరిలో 97.45శాతంమంది పిల్లలు మధ్యాహ్న భోజనం చేస్తున్నారని చెప్పారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, వారంలో రెండు రోజులపాటు పులిహోర పెడుతున్నారని, దానిని ఒకరోజుకు కుదించాలని సూచించారు. కోడిగుడ్లను ఉడికించి ఇస్తున్నారని, కోడిగుడ్డు పొరుటు, బజ్జీగాను ఇస్తే బాగుంటుందని అన్నారు. రాగిజావలో కలిపే బెల్లం సరిగా లేకపోవడంతో తీసుకోవడానికి పిల్లలు ఇష్టపడటం లేదని, రాగి లడ్డు, లేదా బిస్కెట్‌ల రూపంలో ఇవ్వాలని ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆహారపట్టికలో మార్పులు చేస్తూ ప్రభుత్వానికి నివేదికను పంపుతామన్నారు. సమావేశంలో ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు

అర్హులందరికీ ఇళ్లు..

ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన పథకం ద్వారా పట్టణ, గ్రామీణప్రాంతాలలో అర్హులైన వారందరికీ సొంత ఇంటి నిర్మాణాలు చేస్తామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ప్రధానమంత్రి మోదీ ఒడిసాలోని భువనేశ్వర్‌లో 'ప్రధానమంత్రి అవాస్ యోజన-అర్బన్2.0పథకాన్ని' మంగళవారం లాంఛనంగా ప్రారంభించగా కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాలు నుంచి వర్చువల్ పద్ధతిలో కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో గృహ నిర్మాణానికి ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కలెక్టర్‌చేతుల మీదుగా అందజేశారు. త్వరితగతిన లబ్ధిదారులు గృహనిర్మాణాలను పూర్తిచేయాలని కలెక్టర్‌ఈ సందర్భంగా కోరారు. సమావేశంలో గృహనిర్మాణసంస్థ ఈఈ ఎస్ వెంకట్రావ్, మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో మౌలిక వసతులకు కృషి : లక్ష్మీ షా



మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 17 : మచిలీపట్నంలోని వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఆశించిన విధంగా అడ్మిషన్లు జరగలేదని, కళాశాలలో అడ్మిషన్లు పెరిగేందుకు కృషి చేస్తానని మౌలిక సదుపాయాల కల్పన మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీషా అన్నారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అరకొర వసతులపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణులు ఉదయం నుంచి స్కానింగ్ రూమ్ వద్ద పడిగాపులు పడుతూ క్యూలో ఉండటాన్ని గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని లక్ష్మీ షాకు వైద్యులు తెలిపారు. మరో నాలుగు నెలల్లో మెడికల్ కళాశాలలో రెండో సంవత్సరం విద్యార్థులు ప్రవేశిస్తున్నారని, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కళాశాల అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేస్తోందన్నారు. ఆసుపత్రిలో అంబులెన్స్ సర్వీసుల కొరతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఈ సందర్భంగా లక్ష్మీషా తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



చల్లపల్లిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో విద్యార్థుల మానవహారం

చల్లపల్లిలో స్వచ్ఛతా హీ సేవ

పక్షోత్సవాలు ప్రారంభించిన కలెక్టర్

విద్యార్థుల ర్యాలీ, మానవహారం

చల్లపల్లి, సెప్టెంబరు 17 : ప్రజల్లో స్వచ్ఛత, పరిశుభ్రతలపై సామాజిక స్పృహ కలిగించేందుకు ప్రభుత్వం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాలను మంగళవారం చల్లపల్లిలో కలెక్టర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి స్థానిక జడ్పీహైస్కూల్ వద్ద మొక్కలు నాటి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. చల్లపల్లి ప్రధాన సెంటర్లో మానవహారం ఏర్పాటుచేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతపై సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. చెత్తను రోడ్లపై వేయరాదనీ, ఇంటిలోనే చెత్తను రీ సైక్లింగ్ చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛ చల్లపల్లిలో ప్లాస్టిక్ నిషేధం అమలుచేయాలన్నారు. పరిశుభ్రతా అంశాలపై విద్యార్థులు అవగాహనతో ఉండి తోటివారిని చైతన్యం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, స్వచ్ఛభారత్ స్ఫూర్తిగా చల్లపల్లి స్వచ్ఛసైనికులు నిరంతరం శ్రమించి స్వచ్ఛ సుందర చల్లపల్లికి దేశంలోనే ప్రత్యేకస్థానం లభించేలా కృషిచేశారన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ నడుంకట్టాలనీ, చెట్లను నాటి సంరక్షించాలని సూచించారు. చల్లపల్లి స్ఫూర్తితో స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. డీపీవో నాగేశ్వరనాయక్, జడ్పీ సీఈవో ఆర్‌సిహెచ్.ఆనంద్‌బాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయరాధిక, జడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, వైస్‌ఎంపీపీ మోర్ల రాంబాబు, డీఎల్‌పీవో ఐ.జ్యోతిర్మయి, డీపీఆర్‌సి డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ ఎ.అరుణకుమారి, ఎంపీడీవో సిహెచ్.చినరాట్నాలు, స్వచ్ఛ చల్లపల్లి సారధి డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్, ఉపాధ్యాయులు, డ్వాక్రా మహిళలు, వివిధ శాఖల ఉద్యోగులు, స్వచ్ఛ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 17: కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బీసెంట్ రోడ్డులో శ్రీవిరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు విశ్వకర్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ ఎన్.బాలస్వామి, సంఘం అధ్యక్షుడు రవీంద్ర, ప్రధాన కార్యదర్శి హేమసుందర్, కోశాధికారి కృష్ణసాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్, ధనాలకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బీసెంట్ రోడ్డులో పూజలు




కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా, గంధం చంద్రుడు, కమిషనర్ ధ్యానచంద్ర



ఆర్టీసీ హౌస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

స్వచ్ఛతకు కట్టుబడి ఉందాం

● స్వచ్ఛతా హి సేవా పక్షోత్సవాల సందర్భంగా ఉద్యోగులు, విద్యార్థుల ప్రతిజ్ఞ

వన్‌టౌన్, సెప్టెంబరు 17: పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో మంగళవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ పోస్టర్లు, బెలూన్లను విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ శుభ సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛతగా, ఎంతో అందంగా, పరిశుభ్రంగా మారిందన్నారు. సీఎం చంద్రబాబు జన్మభూమి కార్యక్రమం ప్రజల్లో పరిశుభ్రత పట్ల పెద్ద అవగాహన కల్పించిందన్నారు. నగరవాసులు తమ ఇంటిని ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటారో, విజయవాడను కూడా అంతే పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మొక్కలను నాటటాన్ని ఒక అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నగరపాలక సంస్థ అధికారులను అభినందించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతిఒక్కరిలో ఉండాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ మహాత్మాగాంధీ శుభ సంకల్పం మేరకు 2014లో స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభమైందని, నేటికి పది సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తిచేసుకున్న శుభ సందర్భంలో ఈ కార్యక్రమాలు నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. ఈనెల 17వరకు జరిగే స్వచ్ఛ కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని స్వచ్ఛ భారత్ పోటీలో నగర పాలక సంస్థకు ప్రథమ స్థానం వచ్చేలా సహకరించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, హాజరైనవారితో ప్రతిజ్ఞ చేయించారు. అతిథులు ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. 58, 59, 60 డివిజన్లలో వీధును శుభ్రం చేశారు. స్వచ్ఛ విజయవాడ బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ జి. సమరం, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.వి. సత్యవతి, సీఎంవో డాక్టర్ పి.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ సృజన, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్, మెడికల్ ఆఫీసర్లు, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

వారానికి రెండు గంటలు పనిచేద్దాం..

బస్టాండ్: స్వచ్ఛతా హి సేవా పక్షోత్సవాలు సందర్భంగా ఆర్టీసీ హౌస్‌లో మంగళవారం ప్రతిజ్ఞ చేశారు. హెచ్‌ఆర్‌డీ కుమారి సామ్రాజ్యం ఉద్యోగులు స్వచ్ఛత కోసం కట్టుబడి ఉండాలని, వారానికి రెండు గంటల చొప్పున స్వచ్ఛత కోసం పాటుపడదామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారబోయమని, ఎవరూ వేయకుండా కూడా చూస్తామన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చీఫ్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్ రాఘవ కుమార్, విజిలెన్స్ ఏడీ శోభామంజరి, విజయగీత, చీఫ్ మేనేజర్ (పర్సనల్) స్వరూపానంద రెడ్డి, చీఫ్ సివిల్ ఇంజనీర్ శ్రీనివాస్, ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

18వ డివిజన్‌లో..

రాణిగారితోట: 18వ డివిజన్ వారధి పార్కు వద్ద మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షనీయమన్నారు. హెల్త్ సెక్రెటరీ, శానిటేషన్ సెక్రటరీ, వెంకటేశ్వరరెడ్డి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



గద్దెకు చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళం అభినందనీయం
ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

లబ్బీపేట, సెప్టెంబరు 17: వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 19వ డివిజన్‌లో ఎలక్ట్రిసిటీ కాలనీలోని బొప్పనాస్ వల్లూరు ఎంపైర్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 2.25 వేల చెక్కును మంగళవారం ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం శ్రమకు తోడుగా దాతలు ముందెకు వచ్చి విరాళాలు అందించడం శుభ పరిణామమని అన్నారు. కార్యక్రమంలో వల్లూరు బసవయ్య చౌదరీ, శేషసాయి, రమణ, సత్యవాణి, సంజన, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ..

మొగల్రాజపురం : అహ ర్నిశలు పనిచేసిన కార్యకర్తలకు ఆరోగ్య సమస్యలు, ఇతర ఇబ్బందులు వచ్చినపుడు పార్టీ అండగా ఉంటామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మొగల్రాజపురానికి చెందిన టీడీపీ క్రియాశీలక సభ్యుడు తుమ్మల సత్య కాన్సర్ బారిన పడి ఇబ్బందులు పడుతున్నాడు. అతనికి ఎమ్మెల్యే రూ. లక్ష వ్యక్తిగతంగా అందజేశారు. ఎక్కడ పార్టీ కార్యక్రమం చేపట్టినా సత్య హజరయ్యేవాడని, ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పనిచేశాడన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి వెళ్లడంతో బసవ తారకం ఆసుపత్రితో చికిత్స చేయడానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో చలసాని రమణ, పడాల గంగాధర్, మూత్రపు బెనర్జీ, శ్రీకాంత్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విద్యాధరపురం, సెప్టెంబరు 17: భవానీపురం సబ్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో మరమ్మతులు కారణంగా పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విజయవాడ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వి. సుధాకర్ తెలిపారు. టీచర్స్ కాలనీ, అప్నా బజార్ రోడ్డు, ఇందిరాప్రియదర్శినీ కాలనీ, దర్గాప్లాట్లు, హెచ్‌బీ కాలనీలోని 450 ఎస్ఎఫ్‌టీ బ్లాక్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. **పటమట:** మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు ఎస్ఎస్ఎం స్కూల్ పరిసర ప్రాంతాలు, దర్శిపేట, అంబేద్కర్‌నగర్, చిన్నవంతెన సెంటర్, కిసాన్ రోడ్డు, శివశంకర్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తెనాలి 11వ అడిషినల్ జిల్లా జడ్జి వారి కోర్టులో : తెనాలి
ఐ.ఎ.నెం. 465/2018 ఇన్
ఎ.యస్ నెం. 14/2018
బిట్వీన్: పుచ్చకాయల వెంకటరత్నం
....పిటీషనర్/అప్పిలెంట్
మరియు
నల్లమోలు రాజశేఖర్ మరియు ఇతరులు
రెస్పాండెంట్స్
టు: 1వ రెస్పాండెంట్
నల్లమోలు రాజశేఖర్ తండ్రి నాంచారయ్య, వయస్సు 39సం॥, హిందువు, వ్యాపారం, డోర్ నెం. 41-20/3-86, క్రిష్ణలంక, విజయవాడ, విజయవాడ జె.సి.జె.సి.

పై నెంబర్ కేసులో పిటీషనర్ /అప్పిలెంట్ ఇంజంక్షన్ ఉత్తర్వులు కోరుతూ పిటీషన్ దాఖలు చేయగా 1వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారు పలుమార్లు నోటీసులు పంపించినను మీరు సదరు నోటీసులు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకముగా కాలయాపన చేయుచున్నందున కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా అర్డరు వేస్తు ది.01-10-2024కి వాయిదా వేసియున్నారు. ది.01-10-2024వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని, మీ న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ అక్షేపణలు తెలుపుకొనగలరని కోరుటమైనది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియ జేయటమైనది. (శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేదీ: 01-10-2024
వి.క్రిష్ణమోహనరావు,
పిటీషనర్ /అప్పిలెంట్ తరుపు న్యాయవాది.











జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

బాధితులకు అన్యాయం చేయొద్దు : సీపీఎం

కృష్ణలంక, సెప్టెంబరు 17 : కృష్ణలంక రణదీవెనగర్ ప్రాంతంలో ముంపునకు గురైన కొన్ని కుటుంబాలను వరద బాధితుల జాబితాలో చేర్చడం లేదని, వారికి న్యాయం జరిగేలా చూడాలని సీపీఎం నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌కు స్థానికులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దోనేపూడి కాశీనాథ్, మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీ నుంచి వచ్చిన వరద ఉధృతి వలన తీవ్రంగా నష్టపోయరన్నారు. రోజు వారీ కూలీ పనులు చేసుకొనేవారికి వరద తీవ్రమైన నష్టాన్ని మిగిల్చిందన్నారు. సామగ్రి, ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వారంరోజులు పనులు పోయాయి. వారు ఆర్థికంగా నష్టపోయరన్నారు. ప్రభుత్వం నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ఎన్యూమరేషన్‌కు వచ్చిన అధికారులు బాధితులను గుర్తించడంలో లోపం జరగుతోందని, లోతట్టు ప్రాంతంలో ప్రజలు మ్యాపింగ్ అవలేదని, అలైన్మెంట్ కంటే దిగువన ఉన్నారని చెబుతూ వారిని బాధితులుగా చేర్చడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో 25 కుటుంబాలకు నష్టం జరుగుతోందన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని డీఆర్‌వోకు విన్నవించారు. నాయకులు పుప్పాల కృష్ణ, కోరాడ రమణ, గోపి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్‌కు బీటలు

వన్‌టౌన్: 52వ డివిజన్‌లోని కొత్తపేట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం సమీపంలోని వాటర్ ట్యాంక్ పైభాగాన రిటైనింగ్ వాల్ బీటలు వారింది. కిందిభాగాన గోడకు బీటలు పడటంతో మరమ్మతులు చేయటానికి మంగళవారం కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) కార్పొరేషన్ ఏఈలు అహ్మద్, రామకృష్ణ పరిశీలించారు. త్వరలో రిటైనింగ్ వాల్‌ను నిర్మించాలని కోరారు.

పైపులైన్లు పదిలమేనా ?

భవానీపురం : వరద బీభత్సం నుంచి నగరంలోని పలు ప్రాంతాలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. పలు చోట్ల డ్రెయినేజీ పైప్‌లైన్లు దెబ్బతిని పలు ప్రాంతాలకు మురుగునీరు సరఫరా అయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల ఊర్మిళానగర్, ఏకలవ్యనగర్, కబేళా, సితార, సీతారెడ్డి ప్లాట్స్, అవుట్ ఏజెన్సీ, క్రాంబ్వే రోడ్డు తదితర ప్రాంతాల్లో పైపులైన్లు విస్తరించారు. 45వ డివిజన్ రేటరీనగర్‌లోని పలు చోట్ల పైపులైనకు రంధ్రాలు ఏర్పడి నీరు బయటకు పోతోంది. ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. పైపులైన్ లీకేజీలపై వాటర్ వర్క్స్ అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లకు మరమ్మతులు

భవానీపురం : వరదలతో ఇటీవల దెబ్బతిన్న రోడ్లకు వీఎంసీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో మరమ్మతులు చేపట్టారు. కుమ్మరి పాలెం నుంచి కబేళా వరకు నిత్యం రద్దీగా ఉండే విద్యాధరపురం, చెరువుసెంటర్, సితార సెంటర్లలో ఏర్పడిన గోతులను పూడ్చే పనులు చురుగ్గా సాగుతున్నాయి. దసరా ఉత్సవాలు కూడా మరో రెండు వారాల్లో ప్రారంభం కానుండటంతో భవానీలు రాకపోకలు సాగించడానికి మార్గం సుగమం కానుంది. స్వాతి, క్రాంబ్వే, హెచ్‌బీ కాలనీ, శివాలయం, ఊర్మిళానగర్‌ల్లోను పనులు జరుగుతున్నాయి,



బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న మంత్రులు ఫరూక్, జనార్దన్ రెడ్డి, ఎం.ఎస్.బేగ్, తదితరులు

54వ డివిజన్‌లో మంత్రులు బియ్యం పంపిణీ

వన్‌టౌన్: వరద బాధితులకు మంగళవారం న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్, రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖల మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి 54వ డివిజన్‌లో రైస్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్, డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తులు...

ఆటోనగర్: విజయవాడ వరద బాధితులకు ఆటోనగర్ వందడుగుల రోడ్డులోని మెస్సీయా ఫెలోషిప్ తరఫున పాస్టర్ సజ్జా రత్నకుమార్ దుస్తులను పంపిణీ చేశారు. రాజీవ్‌నగర్, పాయకాపురం, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో బాధితులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాస్టర్ రత్నకుమార్ మాట్లాడుతూ వరద వచ్చిన నాటి నుంచి కొన్ని వందల మందికి ఆహార పొట్లాలను పంపిణీ చేశామన్నారు. రవికిషోర్, షాలెం, సజ్జా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు నిత్యావసరాలు...

వన్‌టౌన్ : సెంట్రల్ నియోజకవర్గంలో కార్మికులు 900 మందికి నిత్యావసర సరుకులు, దుప్పట్లు, ప్లేట్లు మంగళవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ టీఎన్‌టీయూసీ కార్మికుల కోసం నిరంతరం పనిచేస్తోందన్నారు. కష్టకాలంలో ఉన్న ఆటో డ్రైవర్లకు, కార్మికులకు బకెట్లు, దుప్పట్లు తదితర వాటిని అందించారు. సెంట్రల్ నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గరిమెళ్ల చిన్న, మునిఅప్పలస్వామి, కరణం సుబ్రహ్మణ్యం, కాశి, రాజేష్, నీలం మధు, శివయ్య, ఆంజనేయులు, దండూరి శ్రీను పాల్గొన్నారు.

శ్రమదానం

పటమట: అవదూత ఆశ్రమంలో పిచ్చి మొక్కలు పెరిగి క్రిమి కీటకాలు ఆవాసంగా మారింది. దీనిపై స్పందించిన గద్దె రామ్మోహన్ మంగళవారం ఆ ప్రాంతానికి తన కుమారుడు క్రాంతికుమార్‌ను పంపించారు. స్థానికుల యువకులతో కలిసి శ్రమదానం చేసి ఆ పిచ్చి మొక్కలను తొలగించారు.కార్పొరేటర్ చెన్నుపాటి కాంతిశ్రీ, ఏపీఎన్జీవో నాయకులు విద్యాసాగర్, యలమంచిలి దేవేంద్ర, కడియాల గంగాధర్, కొమ్మారెడ్డి రవి, అన్నా బాబ్జీ, శ్రీదేవి పాలొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఔదార్యం



ఆర్థికసాయం అందిస్తున్న వెంకట్

వన్‌టౌన్: హెల్పింగ్ హ్యాండ్స్ వెంకట్ మరోసారి తన ఔదార్యాన్ని చూపించింది. ఇటీవల వరదల్లో తండ్రిని కోల్పోయిన బాలుడి బాధ్యతను తీసుకున్నారు. జక్కం పూడి వైఎస్ఆర్ కాలనీకి చెందిన నూకెళ్ల నాగరాజు, రాధకృష్ణ దంపతుల కుమారుడు మణికంఠ(11). నాగరాజు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మణికంఠ తల్లికి మాటలు రావు. మిషన్ వర్క్ చేసి కుటుంబానికి ఆర్థికంగా తోడుగా ఉంటున్నారు. ఇటీవల వరదల సమయంలో నాగరాజు చనిపోవటంతో పాటు ఇంటిలో సామగ్రి పాడైపోయాయి. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్ వెంకట్ మణికంఠ చదువు బాధ్యతను తన ట్రస్ట్ తీసుకుంటుందన్నారు. దీంతో పాటు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు.

26 నుంచి ఎంబీవీకేలో దసరా ఉత్సవాలు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 17: యువతీ యువకుల్లో సృజనాత్మకతను పెంచేందుకు, సమాజం పట్ల అవగాహన కల్పించేందుకు ఈనెల 26, 27, 28 తేదీల్లో మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే) ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు బాధ్యులు కె. స్వరూపరాణి తెలిపారు. ఎంబీవీకె, సేఫ్, తరుణీ తరంగాలు, స్నేహాస్తి ఆర్గనైజేషన్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జన శిక్షణా సంస్థాన్, భారత మహిళా మండలి, ఇన్నర్ వీల్ దివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ చెడును దునుమాడుదాం-మంచిని పెంచుదాం అనే థీమ్‌తో ఈవెంట్స్‌ను రూపొందించడం జరిగిందన్నారు. మహిళల పట్ల వివక్ష, సమానత్వం, లైంగిక వేధింపులు, అత్యాచారాలు, అక్రమ రవాణా, అశ్లీల సాహిత్యం తదితర అంశాలపై డిబేట్ ఉంటుందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజలు దీనిలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ దరఖాస్తులు ఈనెల 20లోపు పంపాలన్నారు. కార్యక్రమంలో సెఫ్ అధ్యక్షురాలు జి. జోత్స్న, సేఫ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.విజయలక్ష్మి, పి. విజయ, పి.వాణి, ఎ.సుమబిందు, శాంతిరెడ్డి, పి.శ్వేత, వి.సూర్యకామేశ్వరి, ఉషారాజా, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సెఫ్ అధ్యక్షురాలు జోత్స్న, వైస్‌ప్రెసిడెంట్ విజయలక్ష్మి తదితరులు

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11868, 99854 85777, 99854 11733, 99854 09286, 99854 09587

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234

ఆంధ్రజ్యోతి
డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

» బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999
AJB-194232

WANTED

» Only For Retires (రిటైర్స్) ప్రముఖ MNC లో వర్క్ చేయుటకు రిటైర్డ్ ఎంప్లాయిస్, స్టేట్, సెంట్రల్, బ్యాంకర్స్, టీచర్స్, VRS, Ex - సర్వీస్ మెన్ కావలెను. Cell No. 9347269626
AJB-194062

» ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థలో పనిచేయుటకు సీనియర్ సిటిజెన్ లేదా గృహిణులు మరియు రిటైర్డ్ అయిన వారికి Fixed Income / PF / ESIC పెన్షన్ ఇన్కమ్ Opportunity కలదు. అర్హత : 10th ఆపైన. విజయవాడ పరిసర ప్రాంతం వారికే సంప్ర. సెల్ : 77023 96675
AJB -194066

» ప్రముఖ బ్యాంకు అనుబంధ సంస్థలో పార్ట్ టైం బిజినెస్ / ఫ్రాంచైజ్, పెట్టుబడి జీరో, అధిక ఆదాయం కొరకు Retired Employees, Business People, మరియు గృహిణులు కావలెను. అర్హత : ఇంటర్/ ఆపైన Age 35 to 70. ✆ 98662 85503
AJB -194067

» VJA ఆటోనగర్ & సిటిలో పనిచేయుటకు సె.గార్డ్స్ కావలెను. వయస్సు, చదువు, అనుభవంతో పని లేదు. ఆకర్షణీయమైన జీతం. ఒంటరివారికి వసతి. సంప్ర:92472 71222, 96423 13999.
AJB - 403

» విజయవాడ నుండి వెలువడుతున్న ఉషా పత్రికకు ప్రకటనలు సేకరించే బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ & డిటిపి ఆపరేటర్స్ కావలెను. సంప్ర॥ 98492 41286, 63014 41591
AJG-203162

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం 18K. Ph: 9160900024 / 9640400073
AJH-15220

EDUCATION

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA, ✆ 99493 08940
AJB-194064

» ఆంధ్రా, నాగార్జున యూనివర్శిటీల ద్వారా DEGREE, P.G, MBA, MCA, AUTHORIZED STUDY & EXAM CENTER. డైరెక్టు 10th, ఒకే సం.లో ఇంటర్. భవ్య అకాడమి (Since : 2001) : 97053 35678.
AJB-72

FLAT FOR SALE

» నందిగామ రైతుపేట NH-65 మీద, LP థియేటర్ ప్రక్కన నిర్మించిన విఘ్నేష్ ప్లాజా నందు 2BHK ఫ్లాట్స్ మరియు కమర్షియల్ షాప్స్ అమ్మకమునకు సిద్ధముగా కలవు. సెల్ : 76800 70510
AJB - 194222

» 2 & 3 BHK DELUXE FLATS, గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నవి. అయ్యప్పనగర్, కానూరు, పోరంకి, తాడిగడపలలో 34 Lakhs onwards. M.P. Developers సంప్ర.89856 50007.
AJB -81

TO-LET

» కృష్ణలంక గుండుకొటయ్య వీధిలో SBI రోడ్డులో పూర్తి ఫర్నిచర్‌తో A/C రూములు, ఫ్యామిలీ పోర్షన్స్, GFలో ఆఫీసులకు, గోడౌన్‌లకు అద్దెకు. సంప్ర: 83099 04493
AJB -467

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నిర్మించబడిన /క్లెయిమ్స్‌కు, వల్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ॥290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట, పెనమలూరు : 99854 11868,
ఎం.జీ.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

దిక్సూచి DIKSUCHI

మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్

తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు: డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.

- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.

అర్హతలు: డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందిన వారు కూడా అర్హులే.
- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్: టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సు లో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్, ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

SCHOLARSHIP ALERT

Corteva Agriscience Scholarship Program 2024-25

Description:
An initiative of Corteva Agriscience Seeds Pvt. Ltd., this program aims to provide financial assistance to meritorious students pursuing postgraduate, doctoral or undergraduate courses in the area of agriculture, as well as students in Classes 11 and 12 with STEM subjects.

Eligibility:
Female students in postgraduate (MBA/ M.Sc./M.Tech.), doctoral, or undergraduate courses, as well as for those in Classes 11 and 12 with STEM subjects (government/private schools).
The applicant's annual family income must be ?6,00,000 or less.
Students from across India can apply Children of employees of Corteva & Buddy4Study are not eligible.

Prizes & Rewards: For PG students: INR 50,000
For UG students: INR 25,000
For school students: INR 10,000
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/CASP4



Alstom India Scholarship 2024-25

Description: Alstom India is offering this scholarship to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out of college.
Eligibility: Students studying in any year of professional graduation in STEM courses can apply. Applicants must have secured at least 60% marks in their previous academic year/semester. The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources. The scholarship is open to students residing in locations such as Chennai (Tamil Nadu), Coimbatore (Tamil Nadu), Kolkata (West Bengal), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat).
Prizes & Rewards:
Up to INR 75,000 (one-time)
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AISDG7

Infosys Foundation STEM Stars Scholarship Program 2024-25

Description: An initiative by the Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM courses (Science, Technology, Engineering, Mathematics), Medical Sciences (MBBS), Bachelor of Dental Surgery (BDS), Bachelor of Pharmacy (B.Pharm)!
Eligibility: Applicants must be female students who are citizens of India.
Students must be enrolled in the First year of a 3 year B.Sc Degree (Courses such as Bio-chemistry, Physics, Chemistry, Nursing, Geography, IT, Biology, Computer Science, Forensic Science, etc.)
First or 2nd year of B.Tech, MBBS, B.Pharm, BDS, Integrated Masters, Dual Degree (B.Tech + M.Tech)
Students must be enrolled in institutes listed among the top ranks in the NIRF (National Institutional Ranking Framework) for 2023 or 2024.
Candidates must have obtained admission into the identified colleges and completed their Class 12.
Applicants must have an annual family income of less than or equal to ?8 lakh.
Candidates must not have availed other scholarships for the same expenses.
Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to ?1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url:
www.b4s.in/aj/ISTS2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

వెట్రిమారన్ దర్శకత్వంలో నటించాలని ఉంది

ఎన్టీఆర్



తమిళంలో తన అభిమాన దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ దర్శకత్వం వహించే తమిళ స్ట్రైట్ చిత్రంలో నటించి, దానిని తెలుగులోకి అనువదించాలని ఉందని జూనియర్ ఎన్టీఆర్ చెప్పారు. కొరటాల శివ దర్శకత్వంలో జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం చెన్నైలో విలేకరుల సమావేశం జరిగింది. తమిళంలో స్ట్రైట్ చిత్రం ఎప్పుడు చేస్తారని విలేకరులు ప్రశ్నించగా, అలా సమాధానం చెప్పారు ఎన్టీఆర్. ఈ సమావేశంలో చిత్ర దర్శకుడితో పాటు హీరోయిన్ జాన్వీకపూర్, సంగీత దర్శకుడు అనిరుధ్, కెమెరామెన్ రత్నవేలు, గేయరచయిత రామజోగయ్య శాస్త్రి, తమిళనాడు 'దేవర' చిత్ర పంపిణీదారుడు, నిర్మాత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ... చెన్నైతో తనకు చిన్ననాటి నుంచి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ పునాదులు చెన్నైలో ఉన్నాయని, ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లిందన్నారు. దేవర చిత్రం ఇంత బాగా రావడానికి ప్రధాన కారణం నటీనటులేనని, ముఖ్యంగా, దర్శకుని విజన్‌లో తెరపై ప్రతిబింబించేలా చేసిన సినిమాటోగ్రాఫర్, ఎడిటర్, సంగీత దర్శకులకు ఆ క్రెడిట్ దక్కుతుందన్నారు. ప్రేక్షకులంతా ఒక్కటేనని బాహుబలి చిత్రం నిరూపించిందని, ఇప్పటివరకు భాషాపరంగా వేరుగా ఉన్నా, సినిమాపరంగా తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, హిందీ అంతా ఒక్కటేనని నిరూపితమైందన్నారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

వర్క్ పేరుతో మైనర్ యువతిపై వేధింపులు

- ఎంక్వయిరీలో దొరికిన ఆధారాలు..
- 90 రోజుల్లోపే నివేదిక
- ప్రెస్‌మీట్‌లో నటి ఝాన్సీ వెల్లడి



నృత్య దర్శకుడు జానీ తనపై చేసిన లైంగిక వేధింపుల గురించి బాధితురాలు చేసిన ఫిర్యాదుపై నార్సింగ్ పోలీసులు ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేసి విచారణ చేపెట్టారు. అలాగే టాలీవుడ్ లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ మంగళవారం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసింది. ఈ ప్యానెల్ ఛైర్‌పర్సన్, నటి ఝాన్సీ , తమ్మారెడ్డి భరద్వాజ దామోదర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఝాన్సీ మాట్లాడుతూ ' ఇద్దరు ప్రముఖ కొరియోగ్రాఫర్స్ మధ్య ఉన్న మేటర్ ఇది. చిత్ర పరిశ్రమ అనేది అన్ ఆర్గనైజ్‌డ్ సెక్టార్. మహిళల రక్షణ కోసం ఇక్కడ సరైన గైడ్‌లైన్స్ లేవు. డిఫరెంట్ వింగ్స్‌లో పరిశ్రమ పని చేస్తుంది కాబట్టి ఏ రకమైన గైడ్ లైన్స్ ఉండాలనేది ప్రభుత్వంతోచర్చించాలి. అయితే తెలుగు చిత్ర పరిశ్రమలో లైంగిక వేదింపులు లేవు అని మేం చెప్పడం లేదు.ఇతర భాషల పరిశ్రమలో ఉన్న సమస్యలు, సెక్సువల్ హరాస్‌మెంట్ ఇక్కడ కూడా ఉంది, ఇద్దరు కొరియోగ్రాఫర్ల మధ్య జరిగిన వ్యవహారం ఇది. వాళ్ల పేర్లు బయట పెట్టదలచుకోలేదు ఒక హయ్యర్ పొజిషన్ లో ఉన్న వ్యక్తి మీద ఆరోపణ వచ్చింది. బాధితురాలు మైనర్‌గా ఉన్న దగ్గర నుంచి పని చేస్తోంది. ఆమె మొదట మీడియా ఛానల్స్‌ను ఎప్రోచ్ అయింది. ఇది మీడియాలో వస్తే చాలా పెద్ద ఇష్యూ అవుతుంది కనుక నువ్వు ఛాంబర్‌కు వెళ్లమని మీడియా వారు భరద్వాజ దగ్గరకి, సుప్రియ దగ్గరకు వెళ్లమని సలహా ఇచ్చారు. పరిశ్రమలో నాకు వర్క్ కావాలి అని ఆమె ఛాంబర్ ముందు వచ్చింది. పని ఇస్తామని చెప్పి వేధిస్తున్నారని వచ్చింది. ఫెడరేషన్ ద్వారా ఛాంబర్ ఆమెకి కార్డు ఇప్పించింది. అయితే కార్డు ఇవ్వడం వెనుక సెక్సువల్ హరాస్‌మెంట్ ఉందనే విషయం ఆమెతో మాట్లాడిన తర్వాత మాకు అర్థమైంది. అయితే సెక్సువల్ హరాస్‌మెంట్ అనేది వర్క్ ప్లేస్‌లో కాదని తెలిసింది. ఆమె కంప్లయింట్ రికార్డ్ చేశాం. ఆ కొరియాగ్రాఫర్ స్టేట్‌మెంట్ కూడా రికార్డ్ చేశాం. వర్క్ పేరుతో ఒక మైనర్ మీద వేధింపులు జరిగాయి. దీని మీద ఎంక్వయిరీ జరుగుతోంది. ఆధారాలు కొన్ని దొరికాయి. గైడ్‌లైన్స్ ప్రకారం మాకు 90 రోజుల గడువు ఉంది. దానిలోపే పని పూర్తి చేసి రిపోర్ట్ ఇస్తాం. వర్క్ ప్లేస్‌లో మహిళలకు భద్రత కల్పించాలనీ, ఇది సురక్షిత ప్రదేశమని నిరూపించాలని మా తపన.' అని చెప్పారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'ఇలాంటి కేసుల కోసమే 2013లో 'ఆసరా' ఏర్పాటు చేశాం. 2018లో ఈ ప్యానెల్ పెట్టాం. పరిశ్రమలో మహిళలు సేఫ్‌గా ఉంటారని చెప్పడానికే ఈ ప్రెస్‌మీట్ పెట్టాం' అన్నారు.

ఫిర్యాదు చెయ్యండిలా : టీఎఫ్‌సీసీ

లైంగిక వేధింపులు ఎదుర్కొన్న వారు ఫిర్యాదు చేయాలని టీఎఫ్‌సీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. హైదరాబాద్ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీసు వద్ద ఉదయం 6గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కంప్లైంట్ బాక్స్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ డి.రామానాయుడు బిల్డింగ్ కాంప్లెక్స్, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500096 చిరునామాకు పోస్టుద్వారా అయినా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. ఫోన్ నంబరు : 98499 72280, మెయిల్ ఐడీ : complaints@telugufilmchamber.in కు కంప్లైంట్స్ ఇవ్వొచ్చని విజ్ఞప్తి చేసింది.

బాధితురాలికి పరిశ్రమ భరోసా



ఈ కేసు తర్వాత ఈ ఫిమేల్ కొరియోగ్రాఫర్ తన పని ప్రశాంతంగా చేసుకోగలగాలి. దీని వల్ల తన జీవితం నాశనం అయిపోతుంది, వచ్చే అవకాశాలు పోతాయి. పరిశ్రమ నుంచి వెళ్లిపోవాల్సి వస్తుంది.. అనే భయం ఆమెకి ఉండకూడదు. ఆ అమ్మాయి టాలెంట్ పరిశ్రమకు తెలుసు. ఈ కేసు ఎటువైపు వెళ్లినా ఆమె టాలెంట్‌కు వచ్చే ఇబ్బంది ఏమీ లేదు. ఆమెకు చిత్ర పరిశ్రమ సపోర్ట్‌గా నిలబడింది. కొంతమంది నిర్మాతలు ఆమెకు అవకాశాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఆమె టాలెంట్ తెలిసిన పెద్ద సంస్థ, దర్శకుడు అవకాశం ఇస్తున్నారు. ఒక పెద్ద హీరో తన మేనేజర్ ద్వారా కబురు చేసి ఆమెకు మద్దతు పలికారు. టాలెంట్‌కు పరిశ్రమ నుంచి ఎప్పుడూ సపోర్ట్ ఉంటుంది

-ఝాన్సీ

ఆ ఇల్లు అమ్మక తప్పలేదు

- కంగన



'ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు' అనేది ఒకప్పటి సామెత. దానికి పొడిగింపుగా 'సినిమా తీసి చూడు' అని చేర్చుకోవాల్సి వస్తోంది ఇప్పుడు. ఇందుకు తాజా ఉదాహరణ బాలీవుడ్ నటి. దర్శకురాలు కంగనా రనౌత్. ఆమెకు ముంబైలో బాంద్రా ప్రాంతంలోని పాలీ హిల్ లో ఓ ఖరీదైన బంగ్లా ఉంది. 2017లో రూ. 20 కోట్లకు దీన్ని కొన్నారు కంగనా. నిబంధనలకు విరుద్ధంగా ఉందని 2020లో ఈ బంగ్లాలోని కొంత భాగాన్ని బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్ కూల్చివేయడంతో అప్పట్లో కంగనా అధికార పార్టీని తీవ్రంగా విమర్శించారు. ఇప్పుడు అదే బంగ్లాను అమ్మేశారు కంగనా. కారణం.. ఆమె దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'ఎమర్జెన్సీ' సినిమా. జీ స్టూడియోస్‌తో కలసి ఆమె నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కావాలి. కానీ సెన్సార్ సర్టిఫికెట్ రాని కారణంగా విడుదల వాయిదా పడింది. ఇప్పటికే ఆ సినిమా మీద చాలా డబ్బు పెట్టిన కంగనా మిగిలిన ఖర్చుల కోసం బంగ్లాను కూడా అమ్మేశారు. 'నా దృష్టిలో ఆస్తులు అనేవి అవసరం వచ్చినప్పుడు ఆదుకోనేవే. అందుకే బంగ్లా అమ్మేశాను' అని చెప్పారు కంగనా. రూ. 32 కోట్లకు అమ్మకం జరిగిందని సమాచారం.

ఇప్పటికైనా త్రివిక్రమ్‌ను ప్రశ్నించండి

- పూనమ్‌కౌర్



కొరియోగ్రాఫర్ షైక్ జానీ భాష (జానీ మాస్టర్)పై అత్యాచార కేసు టాలీవుడ్‌లో చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నటి పూనమ్ కౌర్ సోషల్‌మీడియాలో పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. "నేను గతంలో దర్శకుడు త్రివిక్రమ్‌పై మూవీ ఆర్టిస్ట్స్ అసోషియేషన్ (మా)కు ఫిర్యాదు చేశాను. నా ఫిర్యాదుపై 'మా' చర్యలు తీసుకోలేదు. 'మా' గనక నా ఫిర్యాదును పరిశీలించి ఉంటే.. నాకూ... మరికొంత మందికి ఇబ్బందులు తప్పేవి. రాజకీయంగా కూడా నేను ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ఇప్పటికైనా ఇండస్ట్రీ పెద్దలు త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను ప్రశ్నించాలని కోరుకుంటున్నాను" అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

'మా'లో ఎప్పుడు ఫిర్యాదు చేసిందో తెలీదు

పూనమ్ కౌర్ వ్యాఖ్యలపై దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ స్పందించారు. "పూనమ్ కౌర్ 'మా'లో ఫిర్యాదు ఎందుకు చేశారో.. ఎప్పుడు చేశారో మాకు తెలియదు. అప్పటికి కమిటీ ఏర్పాటై ఉంటే .. ఫిర్యాదు బాక్స్‌లో ఆమె తన కంప్లైంట్‌ను వేసి ఉంటే సరిపోయేది. ఫిర్యాదు లేకుండా ముందుకెళ్లలేం. 'మా' వాళ్లు ఆ ఫిర్యాదును మాకు పంపించి ఉన్నా.. చర్యలు తీసుకునేవాళ్లం. ఇప్పటికైనా ఫిర్యాదు అందిస్తే ముందుకు వెళ్తాం" అని పేర్కొన్నారు.


ఆ గొప్పతనం చాటేలా..



నోయల్, రిషిత నెల్లూరు హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'బహిర్భూమి'. రామ్‌ప్రసాద్ కొండూరు దర్శకత్వంలో మచ్చ వేణుమాధవ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మచ్చ వేణుమాధవ్ మాట్లాడుతూ "సినిమా చాలా కొత్తగా ఉంటుంది. ఎంతో ధైర్యంతో చేసిన చిత్రమిది. ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని చెప్పారు. "ఈ సినిమాలో నోయెల్, పణి మధ్య వచ్చే కామెడీ సీన్స్ సినిమాకే హైలైట్ అవుతాయి. ఈ సినిమాకు ఈ టైటిల్ ఎందుకు పెట్టామో.. సినిమా చూస్తే తెలుస్తుంది. మన కల్చర్‌లోని గొప్పతనాన్ని చాటే చిత్రమిది" అని దర్శకుడు రామ్‌ప్రసాద్ కొండూరు అన్నారు. "చాలా మంచి చిత్రం చేశాం. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి" అని హీరో నోయెల్ తెలిపారు. ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ: ప్రవీణ్ కొమరి, సంగీతం: అజయ్ పట్నాయక్.

గ్యాంగ్ గ్యాంగ్ గ్యాంగ్‌స్టర్స్

కథానాయకులు ఒకప్పుడు రాముడు మంచి బాలుడు తరహా పాత్రలు మాత్రమే చేయడానికి ఆసక్తి చూపేవారు. ఆ తర్వాత గ్రే షేడ్స్ ఉన్న పాత్రలకు సైతం సై అని బాక్సాఫీస్‌కు కళ తెచ్చారు. 1970 దశకంలో మొదలైన ఈ హడావుడి. ఇప్పటికీ ఎవర్‌గ్రీన్ ఫార్ములాగా వెండితెరను ఏలుతోంది. డాన్.. గ్యాంగ్‌స్టర్.. బూట్ లెగ్గర్ ఇలా ఎన్ని పేర్లతో ఈ పాత్రలు తెరపైకి వచ్చినా.. కథానాయకులు మాత్రం ఈ రోల్‌లో ఒక్కసారి అయినా కనిపించాలని కోరుకుంటుంటారు. కొందరు కథానాయకులు అయితే ఇదే తరహా పాత్రలకు బ్రాండ్‌గా మారిన సందర్భాలూ అనేకం. అలా త్వరలో వెండితెరపై తళుక్కుమననున్న గ్యాంగ్‌స్టర్ పాత్రధారులెవరో ఓ లుక్కేద్దాం.



సుజీత్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ నటిస్తున్న చిత్రం 'దే కాల్ హిమ్ ఓజీ'. ఇందులో పవన్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. జపాన్..కోల్‌కతా నేపథ్యంలో సాగే ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాపై అంచనాలు ఇప్పటికే పీక్స్‌లో ఉన్నాయి. ఇప్పటికే ఈ సినిమా గ్లింప్స్ విడుదలై సినిమా ఏ రేంజ్‌లో ఉంటుందో ప్రేక్షకులకు హింటిచ్చింది. ఇది వరకే 'బాలు', 'పంజా' చిత్రాలలో పవన్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను మొదట ఈ నెల 27న విడుదల చేయాలనుకున్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా పవన్ ఎన్నికవ్వడం.. ఆయన రాజకీయాలకే ఎక్కువ సమయం కేటాయిస్తుండడంతో ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందనేది దానిపై మేకర్స్ నుంచి అప్‌డేట్ లేదు.


అచ్చొచ్చిన పాత్రలో...

తమిళ నటుడు అజిత్ ఇప్పటివరకూ ఎన్నో పాత్రల్లో కనిపించారు. అయితే, గ్యాంగ్‌స్టర్ పాత్రలతో ఆయన తనకంటూ విశేష గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన ఇప్పటికే 'బిల్లా', 'బిల్లా 2', 'గ్యాంబ్లర్' వంటి పలు చిత్రాల్లో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి మెప్పించారు. ఇప్పుడు అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఇందులోనూ ఆయన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్స్ సినిమాలో అజిత్ పాత్రలో ఎన్నో వేరియేషన్స్ ఉంటాయనే హైప్ క్రియేట్ చేశాయి. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.



డెడ్లీ డాన్‌గా...

తమిళ సినిమాల్లో డాన్ పాత్రను పోషించాలంటే టక్కున గుర్తొచ్చే నటుల్లో సూపర్‌స్టార్ రజనీ ఒకరు. ఆయన ఇది వరకే 'రంగా', 'బిల్లా', 'బాషా' 'కాలా' 'కబాలి' వంటి చిత్రాల్లో గ్యాంగ్‌స్టర్‌గా అదరగొట్టారు. ఆయన నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'కూలీ'. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమాలో రజనీకాంత్ డెడ్లీ డాన్‌గా కనిపించనున్నారు. గోల్డ్ స్మగ్లింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కే. ఈ చిత్రంలో నాగార్జున 'సైమన్' అనే విలన్ పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.




ఖురేషి అబ్రహంగా

మలయాళ నటుడు మోహన్‌లాల్ నటించిన దాదాపు అరడజనుకుపైగా సినిమాల్లో ఆయన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించారు. 2019లో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో మోహన్‌లాల్ నటించిన చిత్రం 'లూసీఫర్'. ఆయన ఇందులో సినిమా మొదటి నుంచి చివరి వరకు స్టీఫెన్ గట్టుపల్లి అనే రాజకీయనాయకుడి పాత్రలో కనిపిస్తారు. సినిమా ఎండ్ క్రెడిట్స్‌లో ఆయన గ్యాంగ్‌స్టర్ ఖురేషీ అబ్రహంగా కనిపించి ప్రేక్షకులను థ్రిల్ చేస్తారు. ఇప్పుడు ఖురేషీ పాత్రపై 'లూసీఫర్'కు సీక్వెల్‌గా 'ఎల్ 2 ఎంపురాన్' అనే చిత్రం వస్తోంది. ఎంపురాన్ అంటే రాజుకు ఎక్కువ.. దేవుడికి తక్కువ అనే అర్థం వచ్చేలా తెరకెక్కుతోన్న ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి.



రోలెక్స్‌గా..

తమిళ నటుడు సూర్య ప్రతీ చిత్రంతో తన వైవిధ్యమైనన నటనతో అలరిస్తుంటారు. తను ఎంచుకునే పాత్రల్లో ఎన్నో షేడ్స్ చూపించే ఆయన.. ఇది వరకే 'ఆరు', 'నంద', 'సికందర్' సినిమాల్లో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి రాణించారు. ఇప్పుడు ఆయన లోకేశ్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా.. 'విక్రమ్' సినిమా క్లైమాక్స్‌లో 'రోలెక్స్'గా కనిపించిన సంగతి తెలిసిందే. ఆయన తెరపై కనిపించింది ఐదు నిమిషాలే అయినా.. ఆ కొద్దిసేపటికే థియేటర్లు 'రోలెక్స్'.. 'రోలెక్స్' అంటూ దద్దరిల్లాయి. 'రోలెక్స్' క్యారెక్టర్‌తో రెండు సినిమాలను ప్లాన్ చేస్తున్నారు లోకేశ్. ఈ సినిమాల్లోనే కాకుండా ఆయన.. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రంలోనూ గ్యాంగ్‌స్టర్‌గా మెరవనున్నారు. ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'సూర్య 44'. అలాగే, సుధా కొంగర దర్శకత్వంలో నటిస్తున్న చిత్రంలోనూ సూర్య గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారని టాక్.



పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామా

తమిళ నటుడు కార్తీ కూడా ఓ గ్యాంగ్‌స్టర్ చిత్రంలో నటిస్తున్నారు. 'కార్తీ 29' వర్కింగ్ టైటిల్‌గా తమిళ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో ఆయన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. కార్తీ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామా వచ్చే ఏడాది ప్రేక్షకులను పలకరించనుంది.

ఫ్యాషన్

కవ్వించే... కౌల్ ప్యాంట్స్



నెక్‌లైన్ వరకూ బాటమ్ వేర్ వరకూ కౌల్ డిజైన్, మహిళల మనసులను దోచుకుంటూనే ఉంది. రిలాక్స్‌డ్ లుక్‌ను తెచ్చిపెట్టే కౌల్ ప్యాంట్స్‌తో ఫ్యాషనబుల్‌గా ఎలా కనిపించాలో తెలుసుకుందామా?

మాంక్స్ ధరించే హుడ్‌ను ల్యాటిన్‌లో కుకుల్లా అంటారు. దీన్నుంచే కౌల్ అనే పదం పుట్టుకొచ్చింది. హుడ్‌ను పోలినట్టుండే కౌల్ ప్యాంట్ ఫ్యాషన్ ప్రపంచవ్యాప్త ఆదరణకు నోచుకోడానికి ఎన్నో కారణాలున్నాయి. ఆధునికంగా కనిపించడంతో పాటు, సౌకర్యంగా ఉండడం, అన్ని రకాల సందర్భాలకూ అనువుగా ఉండడం వల్ల కౌల్ ప్యాంట్స్ ఫ్యాషన్ ట్రెండ్‌గా మారిపోయాయి.

డ్రేప్‌డ్/ఫ్లోయింగ్: మెత్తగా, జారిపోతున్నట్టుండే ఫ్యాబ్రిక్‌తో కుట్టిన కౌల్ ప్యాంట్స్ అన్ని అకేషన్లకూ బాగుంటాయి. నడుము, పిరుదుల దగ్గర ప్లీట్స్‌ను కలిగి ఉండే ఈ తరహా కౌల్ ప్యాంట్స్ ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయి.

స్టైలింగ్: క్యాజువల్ లుక్ కోసం ఫిట్టెడ్ టాప్, సింపుల్ టి షర్ట్‌తో కౌల్ ప్యాంట్‌ను మ్యాచ్ చేసి ధరించవచ్చు. ఈవినింగ్ వేర్ లుక్ కోసం, వీటిని బ్లౌజ్ లేదా స్ట్రక్చర్డ్ జాకెట్‌తో కలిపి ధరించవచ్చు.





సౌకర్యం, సౌలభ్యం: సౌకర్యంగా వినూత్నంగా కనిపించడమే లక్ష్యంగా రూపొందే కౌల్ ప్యాంట్స్ అన్ని రకాల బాడీ టైప్స్‌కూ సూటవుతాయి. వదులుగా ఉంటాయి కాబట్టి సన్నగా ఉండేవాళ్లకే ఈ ప్యాంట్లు సూటవుతాయనుకుంటే పొరపాటు. ఫ్లోయీ డిజైన్ మూలంగా ఈ ప్యాంట్లు అన్ని శరీరాకృతులకూ చక్కగా సూటవుతాయి.

సందర్భాన్ని బట్టి: ఫ్యాబ్రిక్, డిజైన్ ఆధారంగా సందర్భానికి తగ్గట్టు ఎంచుకోదగిన కౌల్ ప్యాంట్స్ కూడా ఉంటాయి. జెర్సీ, సిల్క్, లేదా లైట్ వెయిట్ వూల్ ప్యాంట్లు పార్టీ వేర్‌గా సూటవుతాయి. కాటన్, శాటిన్ కౌల్ ప్యాంట్స్ ఈవినింగ్ వేర్‌కు సూటవుతాయి.



అందరూ చేసే పనే మనమూ చేస్తే మజా ఏముంటుంది? నలుగురిలో గుర్తింపు రావాలంటే భిన్నమైన కెరీర్‌ను ఎంచుకోవాల్సిందే అంటోంది ఇప్పటి యువతరం. అందుకే హూప్ డ్యాన్సర్, మల్టీ ప్రోప్ ఫ్లో ఆర్టిస్టు, డాపోస్టార్, లెవివ్యాండ్ ఆర్టిస్ట్ వంటి కొత్త కొత్త కెరీర్‌ల వైపు అడుగులు వేస్తున్నారు. ఈ కొత్త వృత్తుల్లో తమదైన ముద్ర వేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



ఈ వృత్తులు స్పెషల్

కోవిడ్ సమయంలో ఎష్నాకుట్టి అనే యువతి చీరలో 'జెండాపూల్' పేరుతో చేసిన డ్యాన్స్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆమె అప్‌లోడ్ చేసిన రెండు నిమిషాల వీడియోను 23 లక్షల మంది వీక్షించారు. ఎష్నాకుట్టి చేసిన హూప్ డ్యాన్స్ కొత్తగా కనిపించింది. ఆమె డ్యాన్స్‌కు అందరూ ఫిదా అయ్యారు. ఆ వీడియో ఎంతో మందికి స్ఫూర్తినిచ్చింది. మరెంతోమందికి కొత్త కెరీర్‌ను ఎంచుకునేందుకు దారి చూపింది. ఆమె వీడియో పాపులర్ అయిన తరువాత చాలా మంది హూపర్స్ బయటకొచ్చారు. ఇంకా చెప్పాలంటే హూప్ డ్యాన్స్‌ను కెరీర్‌గా ఎంచుకునే వాళ్లు కూడా పెరిగారు. హూప్ డ్యాన్స్ నేర్పేందుకు క్లాసులు, వర్క్‌షాపులు నిర్వహించడం మొదలయింది. మరికొందరు ఈ డ్యాన్స్ స్ఫూర్తితో డ్యాపోస్టార్, లెవివ్యాండ్ ఆర్టిస్టులు కెరీర్‌ను ఎంచుకోవడం ప్రారంభించారు. ఈ తరహా వృత్తులను ఫ్లో ఆర్ట్స్ అని పిలుస్తారు. వీటి ద్వారా శరీరానికి బ్యాలెన్స్, యోగా తరహాలో ఫ్లెక్సిబిలిటీ, మజిల్ ఐసోలేషన్, స్టావినా వంటివి లభిస్తాయి.

చార్లెస్.... డ్యాన్సర్, ఇన్‌స్ట్రక్టర్

కేరళలోని త్రిసూర్‌లో క్లినికల్ రీసెర్చ్ చేస్తున్నారు 32 ఏళ్ల అన్నాబెలె చార్లెస్. ఆమె 2021లో ఒకరోజు బెంగళూరులోని డెకాథ్లాన్ స్టోర్‌కు వెళ్లారు. అక్కడ ఒక పాప ఎంతో అనుభవం ఉన్న దానిలా హూలా హూప్ చేయడాన్ని ఆమె గమనించారు. ఆ సంఘటన చార్లెస్‌పై చాలా ప్రభావం చూపించింది. తను కూడా హూలా హూప్ నేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. అక్కడే ఆమె ఒక హూప్‌ని కొనుగోలు చేసి ప్రాక్టీస్ మొదలుపెట్టారు. మూడు నెలల్లోనే హూలా హూప్‌లో రాటుతేలారు. ఇప్పుడు హూప్‌తో ఆమె చేసే డ్యాన్స్‌ని చూస్తే కళ్లు తిప్పుకోలేరు. ఒకేసారి మూడు నాలుగు హూప్‌లను రకరకాల వేగాలతో ఆడించే సామర్థ్యం ఆమె సొంతం. తరువాత చార్లెస్ ఇన్‌స్ట్రక్టర్‌గా అవతారం ఎత్తారు. ఎన్నో శిక్షణా తరగతులు తీసుకుని ఎంతో మందికి ఈ విద్య నేర్పించారు. 'హూప్ ఫ్లో'లో ఆన్‌లైన్ క్లాసులు తీసుకుంటున్నారు. ఇన్‌స్టాలోనూ ఆమెను ఫాలో అయ్యే వారి సంఖ్య ఎక్కువే ఉంది. ఆమెదగ్గర హూలా నేర్చుకోవడానికి ఆసక్తి చూపే వారిలో ఆటో డ్రైవర్లు, సేల్స్‌మెన్‌లు సైతం ఉన్నారు.



సాఫ్ట్‌వేర్ వదిలేసి....

ఇండి ఫ్లో అనే సంస్థ ఫ్లో ఆర్ట్స్‌ను ప్రదర్శిస్తూ ఉంటుంది. 2014లో గోవా ట్రిప్‌కు వెళ్లినప్పుడు ఒక మ్యూజిక్ కాన్సర్ట్‌లో జరిగిన ఫ్లో ఆర్టిస్టులను చూసి ఈ సంస్థను స్థాపించారు తరువాత బెంగళూరుకు తిరిగొచ్చాక నేర్చుకోవాలనుకున్నారు. కానీ ఎంత వెతికినా నేర్పేవాళ్లు దొరకలేదు. దాంతో యూట్యూబ్‌లో వీడియోలు చూస్తూ సొంతంగా నేర్చుకున్నారు. సాక్స్‌లో స్ట్రెస్ బాల్స్ పెట్టి తన మొదటి పాయ్ (ఒక రకమైన పర్‌ఫార్మింగ్ ఆర్ట్)ని ప్రదర్శించారు. ఇప్పుడు తను అందులో ఎక్స్‌పర్ట్. పాయ్ ఒక్కటే కాకుండా లెవీవ్యాండ్, డాపోస్టార్ వంటి ఫ్లో ఆర్ట్‌లలో సైతం ప్రావీణ్యం సంపాదించారు. తరువాత పార్ట్‌నర్, ఫైర్ ఫ్లో ఆర్టిస్ట్ అయినటువంటి సారెనా బెరీతో కలిసి 2020లో ఇండి ఫ్లో సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ఇండియా వ్యాప్తంగా ఫ్లో ప్రాప్స్ నిర్వహిస్తూ ఉంటుంది. ఆసక్తి గల వారికి నేర్పిస్తూనే ఈవెంట్స్‌ను నిర్వహిస్తూ ఉంటారు. 'ఎలాంటి డ్యాన్స్ బ్యాక్‌గ్రౌండ్ లేకున్నా నేర్చుకోవడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. ఇది చాలా సంతోషించదగిన విషయం' అని అంటారు సారెనా బెరీ.

డాపోస్టార్

2020లో గోవా టూర్‌కి వెళ్లినప్పుడు అక్కడ ఒక వ్యక్తి ఎనిమిది పాయింట్లు ఉన్న స్పిన్నింగ్ క్లాత్‌ను తిప్పడాన్ని చూసి ఆ విద్యను తనుకూడా నేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. అంతే.. మూడు నెలలో అందులో బేసిక్స్ నేర్చుకున్నారు. ఒక చేత్తో తిప్పుతూ ఒడుపుగా మరో చేతులోకి మార్చుకుంటూ అందులో ఆరితేరారు నితీశ్. కొవిడ్ సమయంలో ఎంబీఏ పూర్తి చేసినా ఉద్యోగావకాశాలు రాలేదు. దాంతో 2021లో సిమ్లాలో 'ఫ్లోచక్ర' పేరుతో సంస్థను ప్రారంభించారు. ఇప్పుడు తను చాలా బిజీ. ఇండియా అంతటా ఈవెంట్స్, వర్క్‌షాపులతో బిజీగా గడుపుతున్నారు. ఆసక్తిగల యువతీయువకులకు శిక్షణ అందిస్తూ డాపోస్టార్‌లుగా తీర్చిదిద్దుతున్నారు.

న్యూస్‌మేకర్

విద్యావేత్త... ఉద్యమాల బాట... సమాజం పట్ల బాధ్యత... రాజకీయ చతురత... అన్నీ కలిపితే ఆతిశీ మార్లినా సింగ్. త్వరలో ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న ఆమె... ఆ పీఠం అధిరోహించనున్న అతిపిన్న వయస్కురాలిగానూ చరిత్ర సృష్టించనున్నారు. సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఒక మహిళ... ఒక రాష్ట్ర ప్రభుత్వాధినేత కానున్నారు. ఈ ప్రస్థానంలో పూల వర్షాలే కాదు... పార్టీ కోసం కఠిన పరీక్షలు, సవాళ్లు అన్నిటినీ స్వీకరించారు.

ఆమ్ ఆద్మీ... ఆతిశీ



ఆతిశీ మార్లినా సింగ్... ఇప్పుడు ఈ పేరు దేశంలో ఒక సంచలనం. నవ శకానికి శ్రీకారం. ఢిల్లీ ముఖ్యమంత్రి సింహాసనం అధిష్టించిన మూడో మహిళగానే కాదు... అక్కడి విద్యా వ్యవస్థను కొత్త పుంతలు తొక్కించిన వ్యక్తిగా... నవతరం మెచ్చిన రాజకీయ శక్తిగా ఎదిగిన నేపథ్యం ఆమెది. దేశ రాజధానిలో పుట్టి పెరిగిన ఆతిశీ తల్లితండ్రులు విజయ్‌సింగ్ తోమర్, త్రిప్తా వాహి... ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు. పంజాబీ మూలాలున్న కుటుంబం. మార్క్స్, లెనిన్ కలిపి తమ కూతురి పేరులో 'మార్లినా' జోడించారు ఆతిశీ తల్లితండ్రులు. అయితే 2019 పార్లమెంటు ఎన్నికలకు ముందు తన ఇంటిపేరు తొలగించి, 'ఆతిశీ' మాత్రమే ఉంచుకున్నారు. 'ప్రజలు నా పని గురించి మాట్లాడాలి. నా వారసత్వం గురించి కాకూడదని భావించి ఆ నిర్ణయం తీసుకున్నా' అని ఓ సందర్భంలో చెప్పారామె.

రేసులో ముందు...

ఢిల్లీ కేబినెట్‌లో ఒకేఒక్క మహిళా మంత్రి ఆతిశీ. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం లేకపోయినా... తొలిసారి మంత్రి పదవి చేపట్టినా... ఆమె ఎంతో పరిణతి కనబరిచారు. కల్కాజీ నియోజకవర్గం నుంచి గెలుపొంది... అసెంబ్లీలో అడుగుపెట్టిన ఆమెకు రాజకీయ గురువు 'ఆప్' (ఆమ్ ఆద్మీ పార్టీ) అధినేత కేజ్రీవాల్. అవినీతి ఆరోపణలపై గత మార్చిలో ఆయన అరెస్టయిన నాటి నుంచి ఆతిశీ... ఢిల్లీ రాజకీయాల్లో కేంద్ర బిందువయ్యారు. పార్టీని ముందుండి నడిపించారు. ఉపముఖ్యమంత్రిగా ఉన్న మనీశ్ సిసోడియా అరెస్టు తరువాత... ఆయన స్థానంలో కేబినెట్‌లోకి వచ్చారు. ప్రస్తుతం ఆతిశీ



14 శాఖలను పర్యవేక్షిస్తున్నారు. వాటిల్లో 'ఆప్' ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న విద్యా శాఖతో పాటు కీలకమైన ఆర్థిక, ప్రణాళిక, స్త్రీశిశు సంక్షేమం, నీటిపారుదల వంటి శాఖలు ఉన్నాయి.
కేజ్రీవాల్ బెయిలుపై బయటకు వచ్చాక తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో సీఎం రేసులో ఆయన సతీమణి సునీతా కేజ్రీవాల్‌తో పాటు సౌరబ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, కైలాస్ గెహ్లాట్ పేర్లు పరిశీలనలోకి వచ్చాయి. చివరకు ఆతిశీకి పట్టం కట్టారు. వాస్తవానికి కేజ్రీ జైలుకు వెళ్లినప్పుడు ఆయన వారసురాలిగా ఆతిశీ పేరే వినిపించింది. అయితే జైలు నుంచే పరిపాలిస్తానని కేజ్రీ ప్రకటించడంతో నాడు ఆ ఊహాగానాలకు తెర పడింది.

ఎందుకంత ప్రాధాన్యం...

అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో నెంబర్ వన్, టూగా ఉన్న కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా అరెస్టులతో గందరగోళం ఏర్పడింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో పార్టీని, ప్రభుత్వాన్ని నడిపించేదెవరనే చర్చ మొదలైంది. ఆ సమయంలో అన్నీ తానై ముందుండి ప్రజలకు, కార్యకర్తలకు ధైర్యం ఇచ్చారు ఆతిశీ. వాగ్ధాటితో ప్రత్యర్థుల నోటికి తాళాలు వేయడంలో ఆమె దిట్ట. కేజ్రీపై ప్రతిపక్ష పార్టీ ఆరోపణలను, విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టారు. తద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. సహచర మంత్రి సౌరబ్ భరద్వాజ్‌తో కలిసి పాలన గాడి తప్పకుండా చూసుకున్నారు. అదే సమయంలో లోక్‌సభ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేశారు. నిత్యం జనం మధ్యనే ఉంటూ, సాధ్యమైనన్ని సమావేశాలు పెట్టి, అరెస్టులతో మసకబారిన 'ఆప్' ప్రతిష్ఠను నిలబెట్టే ప్రయత్నం చేశారు. ప్రజల్లో పార్టీకి మద్దతు కూడగట్టేందుకు శ్రమించారు. హరియాణా నుంచి ఢిల్లీకి రోజుకు వంద మిలియన్ గ్యాలెన్ల నీటిని విడుదల చేయకపోవడంతో గత జూన్‌లో నిరాహార దీక్షకు దిగారు. ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రి పాలయ్యారు. పార్టీని పటిష్ఠం చేసి, సుస్థిర పాలన అందించడానికి ఎంతటి ఒత్తిడినైనా భరించడానికి, ఎలాంటి సవాళ్లనైనా స్వీకరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండడం ఆతిశీ బలం.

> **అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో నెంబర్ వన్, టూగా ఉన్న కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా అరెస్టులతో గందరగోళం ఏర్పడింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో పార్టీని, ప్రభుత్వాన్ని నడిపించేదెవరనే చర్చ మొదలైంది. ఆ సమయంలో అన్నీ తానై ముందుండి ప్రజలకు, కార్యకర్తలకు ధైర్యం ఇచ్చారు ఆతిశీ. అంతేకాదు... కేజ్రీపై ప్రతిపక్ష పార్టీ ఆరోపణలను, దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టారు.**

విద్యా విధానంపై చెరగని ముద్ర...

'ఆప్'లో అందరికంటే ఉన్నత విద్యావంతురాలు ఆతిశీ. 2015లో నాటి విద్యాశాఖ మంత్రి సిసోడియాకు సలహాదారుగా వ్యవహరించడంవల్ల ఆ శాఖపై ఆమెకు పట్టు దొరికింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మార్పును కేజ్రీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఆ క్రమంలో నూతన విద్యా విధానం రూపకల్పనలో, సిసోడియా సలహాదారుగా ఆతిశీ కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, మెరుగైన పాఠ్యప్రణాళికలను రూపొందించడంలో ఎంతో పురోగతి సాధించారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధితో పాటు విలువలనూ నేర్పేందుకు కృషి చేశారు. ఒక రకంగా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల ముఖచిత్రాన్ని మార్చిన ఘనత ఆమెది.మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఈ అనుభవం కలిసివచ్చింది.

ఏడేళ్లు శ్రమించి...

ఆతిశీ మొదటి నుంచి చదువులో టాప్. ఢిల్లీ 'స్ప్రింగ్‌డేల్స్ స్కూల్'లో ప్రాథమిక విద్యాభ్యాసం తరువాత... 'సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ'లో హిస్టరీతో డిగ్రీ (2001) పూర్తి చేశారు. స్కాలర్‌షిప్‌పై 'ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ'లో మాస్టర్స్ చదివారు. 2005లో 'రోడ్స్ స్కాలర్‌షిప్'తో ఆక్స్‌ఫర్డ్‌లోని 'మగ్డాలెన్ కాలేజీ'లో డబుల్ మాస్టర్స్ పట్టా పొందారు. 'ఆప్'తో అనుబంధానికి ముందు ఆతిశీ మధ్యప్రదేశ్‌లోని ఓ మారుమూల గ్రామంలో ఏడేళ్లు నివసించారు. అక్కడ ఓ స్వచ్ఛంద సంస్థతో కలిసి సేంద్రియ సాగు, ప్రగతిశీల విద్యావిధానంపై అధ్యయనం చేశారు. పలు ఎన్‌జీఓలతో కలిసి పని చేశారు. ఆ తరువాత 'ఆప్' సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి అధినాయకత్వంతో కలిసి ప్రయాణం మొదలుపెట్టారు. 2013 అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో డ్రాఫ్టింగ్ కమిటీలో సభ్యురాలయ్యారు. పార్టీ విధాన రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు. తనపై నమ్మకం ఉంచి, అవకాశం ఇచ్చిన ప్రతిసారీ ఆమె తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. అందుకే సీఎం ఎవరని నిర్ణయించే క్షణంలో అధినేత ఆమె పక్షాన నిలిచారు. ఈ సందర్భంగా ఆతిశీ మాట్లాడుతూ... 'ఢిల్లీకి ఒక్కరే సీఎం. అది కేజ్రీవాల్ మాత్రమే. మళ్లీ ఆయన్ను గెలిపించి, ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టడమే మా ముందున్న లక్ష్యం' అన్నారు. ఏదిఏమైనా మరి కొద్ది నెలల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆతిశీపై అతిపెద్ద బాధ్యతే పెట్టింది పార్టీ.

సంప్రదాయ చేతివృత్తులను సాధన చేసే మహిళల డాక్యుమెంటరీ చిత్రీకరణ కోసం థార్ ఎడారికి చేరుకున్న 28 ఏళ్ల ఆక్కృతి శ్రీవాత్సవ, అక్కడి స్థానికుల ఎడారి బతుకుల్లో పచ్చదనం నింపే పనికి పూనుకుంది. బహుళ న్యాచురల్స్‌ను స్థాపించడం ద్వారా ఒంటె, ఆవు పాల ఉత్పత్తులకు ప్రచారం కల్పించిన ఆక్కృతి ఆసక్తికరమైన కథనమిది.

ఎడారి బతుకుల్లో పచ్చదనం



థార్ ఎడారిలో తరతరాలుగా జీవసంపదల మీద ఆధారపడే సమాజాలున్నాయి. ఒంటెలు, గాడిదలు, గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెల పెంపకమే వీళ్ల జీవనాధారం. ఏడాదిలో ఎనిమిది నెలల పాటు పచ్చని పచ్చికను వెతుక్కుంటూ పశువులను మేపుకుంటూ సంచరిస్తూ ఉండే ఈ సమాజాలు వాటి మీదొచ్చే కొద్దిపాటి రాబడితోనే బ్రతుకులు ఈడుస్తూ ఉంటాయి. అయితే ఈ కఠిన వాస్తవాల గురించి ఏమాత్రం అవగాహన లేని ఆక్కృతి, వాతావరణ నిర్దిష్ట డాక్యుమెంటరీ రూపకల్పన కోసం రాజస్థాన్‌లోని థార్ ఎడారికి చేరుకుంది. 2017లో ఢిల్లీలోని ఐపి యూనివర్శిటీ నుంచి మీడియా స్టడీస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆక్కృతి భవిష్యత్తులో ఫిల్మ్‌మేకర్‌గా స్థిరపడాలనుకుంది. ఆ క్రమంలో తన డాక్యుమెంటరీ కోసం భారత్-పాక్ సరిహద్దులో ఉన్న రాజస్థాన్‌లోని, బజ్జు అనే చిన్న గ్రామానికి చేరుకుంది. "రాజస్థాన్‌లోని ఆ మారుమూల ప్రాంతాలకు వెళ్లినప్పుడు పశువులను మేపుకోవడం కోసం స్థానికులు వందల కిలోమీటర్ల దూరాలు ప్రయాణిస్తారని తెలుసుకున్నాను. నిర్జన రాజస్థాన్ రెండు భాగాలుగా విడిపోయింది. ఒకటి ఇందిరాగాంధీ కాల్వకు అనుసంధానమై ఉంటే, ఇంకొకటి నీటి అవసరాల కోసం పూర్తిగా వర్షపాతం మీదే ఆధారపడి ఉంటుంది. ఫలితంగా అక్కడి ప్రజల జీవనోపాధి ఎంతో కష్టంగా మారిపోయింది. దాంతో ప్రజలు ప్రధానంగా ఒంటెలు, గాడిదలు, మేకలు, ఆవులు, గొర్రెలు, గేదెల పెంపకం మీదే ఆధారపడుతున్నారు. కానీ వాటి ఉత్పత్తులను ఎలా వినియోగించుకోవాలో, విపణిలో సరసమైన ధరలకు ఎలా విక్రయించాలో వాళ్లకు తెలియదు. ఈ పరిస్థితులను గమనించిన నేను, నా స్నేహితులు థార్ ఎడారిలో నివసించే పశువుల కాపరుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని నిర్ణయించుకున్నాం. ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టాం. పశు ఉత్పత్తులతో 'బహుళ న్యాచురల్స్'ను లాంచ్ చేయగలిగాం" అంటూ చెప్పుకొచ్చింది ఆక్కృతి.

'బహుళ' ప్రయోజనాలు...

బహుళ న్యాచురల్స్ స్థాపించడానికి ముందు ఆక్కృతి ఐదేళ్ల పాటు స్థానికంగా పరిశోధన చేసింది. ఆ క్రమంలో గత పదేళ్లలో భారతదేశంలో ఒంటెల సంఖ్య 37% క్షీణించిందనే విషయం కూడా తెలుసుకుంది. ఉర్మూల్ సీమంత్ సమితి, డెజర్ట్ రిసోర్స్ సెంటర్ లాంటి ఎన్‌జీవోలతో మాట్లాడినప్పుడు, ఈ సమాజాలన్నిటినీ ఏకతాటి మీదకు తీసుకురావడం ద్వారా సుస్థిరమైన జీవనభృతిని కల్పించడంతో పాటు ఒంటెల సంఖ్యను పెంచడం ఎంత అవసరమో ఆక్కృతి గ్రహించింది. అలా ఐదేళ్ల పాటు శ్రమపడి అంతిమంగా 2022లో 4 వేల మంది పశువుల కాపరులతో కూడిన బహుళ ఫుడ్స్‌ను స్థాపించింది. ప్రధాన ఉత్పత్తిదారులు సరసమైన ధరలకు ఉత్పత్తులను విక్రయించుకునేలా, వ్యాపారావకాశాలను మెరుగుపరుచుకునేలా వాళ్లను ప్రభుత్వ పథకాలతో అనుసంధానించింది. ఒంటె పాలు పౌష్టికాహారమని, ఆ పాలతో ఉత్పత్తులను తయారుచేయవచ్చనీ వాళ్లకు నేర్పించింది. "మేమొక ఇకో సిస్టమ్‌ను రూపొందించాం. దాన్లో సభ్యులకు నాణ్యమైన విత్తనాలు, పశు గ్రాసం, బయోగ్యాస్, ఇతరత్రా సాంకేతిక నైపుణ్యాలను సమకూర్చాం. దాంతో ఉత్పత్తిదారులు అత్యంత నాణ్యమైన డైరీ, అగ్రి ఉత్పత్తులను సృష్టించగలిగారు. నేడు మా ఇకో సిస్టమ్‌లో 750 బయోగ్యాస్ స్టేషన్లున్నాయి. ఈ బయోగ్యాస్ ద్వారా మహిళలు సంప్రదాయ చుల్హా (కట్టెల పొయ్యి)కి ప్రత్యామ్నాయాన్ని పొందగలిగారు. బయోగ్యాస్ ఆధారంగా పశువులకు అవసరమైన సేంద్రియ పశుగ్రాసం కూడా అందుతుంది. ఒంటె, ఆవు పాల సేకరణ కోసం సూర్యరశ్మితో నడిచే ఇన్‌స్టంట్ చిల్లర్ మిషన్లను కూడా మారుమూల గ్రామాల్లోని ఇండ్లలో నెలకొల్పారు. అంతకు ముందు వరకూ పాలను చల్లబరుచుకునే సౌలభ్యం లేకపోవడంతో ప్లాంట్‌కు చేరుకునేలోపే పాలు విరిగిపోతూ ఉండేవి. ప్రస్తుతం ఆక్కృతి బృందం నెలకొల్పిన 8 చిల్లింగ్ ప్లాంట్స్‌తో ఆ సమాజం వాటిని స్వయంగా నడుపుకుంటూ, జీవనభృతిని పొందుతోంది.

ఒంటె ఉత్పత్తులతో...

ఒంటె పాలు, ఆవు పాలు, సేంద్రీయ ఉత్పత్తులు, బహుళ న్యాచురల్స్ ప్రధాన ఉత్పత్తులు. ఒంటె పాల నెయ్యి, మిల్క్ కుకీస్, జున్నులు కూడా దొరుకుతాయి. ఫిటా, హలూమి, రికోటా, ఏజ్‌డ్ చెడ్డైర్ చీజ్... ఇలా ఒంటె పాలతో నాలుగు రకాల చీజ్‌లు తయారు చేస్తారు. ఈ నాలుగు చీజ్‌లూ అత్యంత ఆదరణ పొందుతూ ఉండడం చెప్పుకోదగిన విశేషం. స్థానిక రాథి ఆవుల పాలు, పన్నీర్, మజ్జిగ, బిలోనా నెయ్యిలు కూడా మంచి ఆదరణ పొందుతున్నాయి. నల్ల గోధుమలతో తయారు చేసిన బిస్కెట్లు కసూరి మేథి, సాంగ్రి, ఆవ నూనె, పల్లీ నూనెలు కూడా ఎక్కువగా అమ్ముడవుతూ ఉంటాయి. ఒంటెలు, రాజస్థాన్, గుజరాత్, లడాక్‌లోని కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఉంటాయి. అయితే కాలక్రమేణా వీటి సంఖ్య క్షీణిస్తోంది. కాబట్టి ఒంటెలను జీవనభృతితో అనుసంధానించడం అవసరమని భావించిన ఆక్కృతి, ఒంటె పాల ఉత్పత్తులను విపణిలో ప్రవేశపెట్టి, అటు ఒంటెల సంఖ్యనూ, ఇటు పశువుల కాపరుల జీవనభృతులనూ పెంచడం అభినందించవలసిన విషయం.

ప్రత్యర్థి ఎవరైనా.. లక్ష్యం ఒక్కటే!

కొత్త వ్యూహామేమీ లేదు
బంగ్లాదేశ్‌తో సిరీస్‌పై కెప్టెన్ రోహిత్



చెన్నై: టెస్టు ఫార్మాట్‌లో ఇటీవలి బంగ్లాదేశ్ ప్రదర్శన కారణంగా తమ వ్యూహాలేమీ మారవని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తేల్చిచెప్పాడు. ఇటీవల పాక్‌తో జరిగిన రెండు టెస్టులను బంగ్లా క్లీన్‌స్వీప్ చేసిన విషయం తెలిసిందే. అలాగే ఆ జట్టు బౌలర్లు కూడా విశేషంగా రాణిస్తున్నారు. కానీ ఈ విషయంలో పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రోహిత్ భావిస్తున్నాడు. 'భారత్‌ను ఓడించాలని ప్రతీ జట్టు కోరుకుంటుంది. అలాగే భావించనీయండి. మా దృష్టంతా మ్యాచ్‌లను గెలవడంపైనే ఉంటుంది. ప్రతీ అగ్రశ్రేణి జట్టుతో మేం క్రికెట్ ఆడాం. కాబట్టి ఈసారి ప్రత్యేక ప్రణాళికలతో బరిలోకి దిగాల్సిన అవసరం లేదు. అలాగే ప్రత్యర్థి జట్ల బౌలర్ల గురించి ఆందోళన చెందాల్సిన పనీలేదు. ఇద్దరు ముగ్గురు కొత్తవారు బంగ్లా జట్టులో ఉన్నారు. వారి పని వారిని చేసుకోనీయండి. మేం మా గేమ్‌ప్లాన్‌పై ఫోకస్ పెడతాం. ఇక ఊపిరి సలపని క్రికెట్ కారణంగా జట్టులోని ఉత్తమ బౌలర్లు ప్రతీ సిరీస్‌లోనూ ఆడాలంటే కష్టం. అందుకే అప్పుడప్పుడు వారికి విశ్రాంతివ్వడం అవసరం. అలాగే దేశవాళీల్లో యువ బౌలర్లు విశేషంగా రాణిస్తూ అవకాశం కోసం చూస్తున్నారు' అని రోహిత్ తెలిపాడు. మరోవైపు ఆసీస్‌తో సిరీస్ కోసం బంగ్లా మ్యాచ్‌లను సన్నాహకంగా తీసుకోవడం లేదని, డబ్ల్యూటీసీ పాయింట్లు గెలవాలంటే తమకు ప్రతీ మ్యాచ్ కీలకమేనని గుర్తుచేశాడు. ఇక తమ నెలన్నర రోజుల విరామంతో ఎలాంటి ఇబ్బందీ లేదన్నాడు. మరోవైపు కేఎల్ రాహుల్‌కు వరుస అవకాశాలిస్తామని స్పష్టం చేశాడు. అతను స్పిన్, పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటాడని, అతడి ఉత్తమ ఆటతీరును వెలికితీయడమే తమ ఉద్దేశమని అన్నాడు.

నల్లమట్టి పిచ్‌పై..

భారత్, బంగ్లాదేశ్ ఆటగాళ్లు మంగళవారం నల్లమట్టి పిచ్‌పై ప్రాక్టీస్‌ను కొనసాగించారు. తొలి టెస్టును మాత్రం ఎర్రమట్టితో తయారుచేసిన పిచ్‌పై నిర్వహించనున్నారు. ఇది ఆరంభంలో పేసర్లకు సహాయకంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం చెన్నైలో వేడి అధికంగా ఉంటోంది. దీంతో మ్యాచ్ సాగుతున్నకొద్దీ పిచ్ తన సహజ స్వభావాన్ని కోల్పోయి స్పిన్‌కు అనుకూలించే అవకాశముందని వెటరన్ క్యూరేటర్ ఒకరు తెలిపాడు. అందుకే ఇరు జట్ల బ్యాటర్లు నల్లమట్టి పిచ్‌పైనా సాధన చేస్తున్నారు. శ్రీలంకతో ఇటీవల జరిగిన వన్డే సిరీస్‌లో శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, విరాట్ కోహ్లీ స్పిన్నర్లను సరిగా ఎదుర్కోలేకపోయారు.



కోహ్లీ, గంభీర్, అగార్కర్



ఆసియా చాంపియన్స్
మళ్లీ మనమే

భారత్ ఖాతాలో ఐదో టైటిల్
ఫైనల్లో 1-0తో చైనాపై విజయం
జుగ్‌రాజ్ గెలుపు గోల్

చైనా గోడను బద్దలుకొట్టిన భారత్.. ఆసియా చాంపియన్స్ హాకీ ట్రోఫీని నిలబెట్టుకొంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన తుది పోరులో జుగ్‌రాజ్ ఏకైక గోల్‌తో భారత్ విజేతగా నిలిచింది. పటిష్ఠ డిఫెన్స్‌తో డ్రాగన్ జట్టు సవాల్ విసిరినా.. పట్టువిడవకుండా పోరాడిన భారత్ రికార్డు స్థాయిలో ఐదోసారి టైటిల్‌ను ముద్దాడింది.



కెప్టెన్ హర్మన్‌ప్రీత్

హులున్‌బుయిర్ (చైనా): అప్రతిహత జైత్రయాత్ర కొనసాగిస్తున్న డిఫెండింగ్ చాంప్ భారత హాకీ జట్టు ఓటమనేదే లేకుండా ఆసియా చాంపియన్స్ ట్రోఫీని వరుసగా రెండోసారి కైవసం చేసుకొంది. డిఫెండర్ జుగ్‌రాజ్ సింగ్ అరుదైన ఫీల్డ్ గోల్‌తో.. మంగళవారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత్ 1-0తో చైనాను ఓడించింది. రికార్డు స్థాయిలో ఐదోసారి ఆసియా చాంపియన్‌గా నిలిచింది. టోర్నీలో ఏడు గోల్స్ చేయడమేగాక, ఫైనల్లో నమోదైన ఏకైక గోల్ సాధనలో కీలక భూమిక పోషించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ప్లేయర్ ఆఫ్‌ది టోర్నీగా నిలిచాడు. భారత్ ఇంతకుముందు 2011, 2016, 2018, 2023 సంవత్సరాల్లో ట్రోఫీని గెలిచింది.

కేవలం రెండో అంతర్జాతీయ టోర్నీ ఫైనల్ ఆడుతున్న చైనా.. తుది పోరులో ఎంతో బలమైన భారత్‌కు కఠిన సవాలే విసిరింది. తొలి మూడు క్వార్టర్లలో గోల్ కోసం హర్మన్ సేన ప్రయత్నించినా డ్రాగన్ డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది. అయితే, 51వ నిమిషంలో జుగ్‌రాజ్ గోల్‌తో హర్మన్‌ప్రీత్ సేన ఊపిరిపీల్చుకొంది. కాగా, మూడోస్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 5-2తో కొరియాను చిత్తు చేసింది.

ఏకపక్షమే అనుకొంటే..

లీగ్ దశలో చైనాపై భారత్ 3-0తో నెగ్గడంతో.. టైటిల్ ఫైట్ వన్‌సైడ్‌గా సాగడం ఖాయమనుకున్నారంతా. కానీ, చైనా అనూహ్య పోరాటంతో మ్యాచ్ రసవత్తరంగా మారింది. హర్మన్ సేన దాడుల పరంపరతో బెంబేలెత్తించినా.. చైనా పటిష్ఠ డిఫెన్స్‌తో సమర్థంగా తిప్పికొట్టింది. తొలి క్వార్టర్ 10వ నిమిషంలో రాజ్ కుమార్ జట్టుకు తొలి పెనాల్టీ కార్నర్ అందించాడు. కానీ, హర్మన్‌ప్రీత్ దాన్ని గోల్‌గా మలచలేక పోయాడు. రెండు నిమిషాల తర్వాత నీలకంఠ కొట్టిన షాట్‌ను చైనా కీపర్ వాంగ్ చాకచక్యంగా అడ్డుకొన్నాడు. ఆ తర్వాత సుఖ్‌జీత్ సింగ్, జుగ్‌రాజ్ దాడులను కూడా వాంగ్ తిప్పికొట్టాడు. అయితే, తొలి క్వార్టర్ చివర్లో చైనాకు పీసీ లభించినా.. భారత కీపర్ బహదూర్ పాఠక్ అప్రమత్తతతో వ్యవహరించాడు. ఇక, రెండో క్వార్టర్‌లో భారత్ దాడుల ఉధృతిని పెంచినా చైనా పెనాల్టీ ఏరియాలోకి చొచ్చుకెళ్లలేక పోయింది. 27వ నిమిషంలో పీసీ లభించినా హర్మన్ షాట్ గోల్‌పోస్టును తాకి బయటకెళ్లింది. అయితే, మూడో క్వార్టర్‌లో చైనా ఎదురుదాడికి దిగింది. ఈ క్రమంలో 38వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ సాధించినా గోల్ చేయలేక పోయింది. భారత యువ ఫార్వర్డ్‌లు చైనా పెనాల్టీ ఏరియాలోకి చొచ్చుకెళ్లినా.. ఫినిషింగ్ లోపాల కారణంగా గోల్ చేసే అవకాశాలను చేజార్చుకొన్నారు.

చొచ్చుకెళ్లిన హర్మన్..

చివరి క్వార్టర్‌లో భారత పోరాటం ఫలించింది. మ్యాచ్‌కు మరో 9 నిమిషాలు మిగిలి ఉండగా.. హర్మన్ చాకచక్యంగా సాగుతూ బంతిని చైనా పెనాల్టీ ఏరియాలో ఉన్న జుగ్‌రాజ్‌కు పాస్ చేశాడు. అతడు ఎటువంటి తప్పిదం చేయకుండా బంతిని నేరుగా గోల్‌లోకి పంపాడు. హర్మన్ డ్రిబ్లింగ్ చేస్తూ సాగడం విశేషమైతే.. డిఫెండర్ జుగ్‌రాజ్ గోల్ ముందు ఉండడం అరుదుగా జరిగేది. కానీ, వీరిద్దరూ ఎంతో తెలివిగా ప్రత్యర్థి డిఫెండర్లను బోల్తా కొట్టిస్తూ భారత్‌ను గెలిపించారు. ఆఖరి నాలుగు నిమిషాల్లో గోల్ కోసం చైనా తీవ్రంగా దాడులు చేసినా ఒత్తిడిని తట్టుకొంటూ టీమిండియా ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా ఆవిర్భవించింది.

హాకీ అవార్డుల రేసులో హర్మన్, శ్రీజేష్

లాసాన్నె (స్విట్జర్లాండ్): భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మాజీ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్ ఎఫ్ఐహెచ్ హాకీ అవార్డుల రేసులో నిలిచారు. మంగళవారం అంతర్జాతీయ హాకీ సమాఖ్య ఈ ఏడాది ఉత్తమ ప్లేయర్ల కుదించిన జాబితాను విడుదల చేసింది. ఇందులో ఉత్తమ ప్లేయర్ అవార్డుల జాబితాలో హర్మన్‌ప్రీత్, ఉత్తమ గోల్‌కీపర్ జాబితాలో శ్రీజేష్ చోటు దక్కించుకున్నారు. ఈ ఇరువురు పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ కాంస్యం సాధించడంలో కీలకపాత్ర పోషించారు. ఒలింపిక్స్‌లో హర్మన్ 10 గోల్స్ చేయగా, శ్రీజేష్ గోల్‌పోస్టుకు అడ్డుగోడలా నిలిచి ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెట్టాడు. వచ్చేనెల అక్టోబరు వరకు ఈ అవార్డు ఎంపిక కోసం ఆన్‌లైన్ ఓటింగ్‌ను కూడా నిర్వహిస్తున్నారు. ఈ అవార్డుల ప్రదానంలో ఎక్స్‌పర్ట్ ప్యానెల్ అభిప్రాయానికి 40 శాతం, జాతీయ హాకీ అసోసియేషన్లకు 20 శాతం, అభిమానుల ఓటింగ్ 20శాతం, మరో 20శాతం మీడియా అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకోనున్నారు.

అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకు రూ.19 కోట్లు

భారీగా పెరిగిన టీ20 ప్రపంచకప్ ప్రైజ్‌మనీ



దుబాయ్: ఇకపై క్రికెట్‌లో జరిగే పురుషుల, మహిళల వరల్డ్‌కప్ ప్రైజ్‌మనీ ఒకేలా ఉండనుంది. దీనిలో భాగంగా ఈసారి మహిళల టీ20 వరల్డ్‌కప్ గెలుచుకునే జట్టు జాక్‌పాట్ కొట్టనుంది. అక్టోబరు 3 నుంచి 20 వరకు యూఏఈలో జరిగే ఈ మెగా టోర్నీ విజేతకు రూ.19 కోట్ల 60 లక్షల ప్రైజ్‌మనీ ఇవ్వనున్నారు. ఇదే టోర్నీలో క్రితంసారి చాంపియన్‌గా నిలిచిన ఆస్ట్రేలియా జట్టుకు రూ.8 కోట్లు మాత్రమే దక్కడం గమనార్హం. అప్పటితో పోలిస్తే ప్రస్తుతం ప్రకటించిన నగదు బహుమతి 134 శాతం అధికం కావడం విశేషం. రన్నరప్ జట్టుకు రూ. 9 కోట్ల నగదు లభిస్తుంది. అలాగే మొత్తం ప్రైజ్‌మనీ గతం కన్నా 225 శాతం ఎక్కువగా అంటే... రూ. 66 కోట్లుగా ఉండబోతోంది. పురుషుల క్రికెట్‌కు సరిసమానంగా మహిళల క్రికెట్‌లోనూ ప్రైజ్‌మనీ ఉంటుందని గతంలోనే ఐసీసీ ప్రకటించింది. దీనికి తగ్గట్టుగానే మంగళవారం తమ నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే ఈ ఏడాది జూన్‌లో విజేతగా నిలిచిన రోహిత్ సేనకు కాస్త అధికంగా రూ.20 కోట్ల 53 లక్షలు దక్కాయి. ఎందుకంటే పురుషుల టీ20 వరల్డ్‌కప్‌లో 20 జట్లు ఉండగా మ్యాచ్‌లు ఎక్కువగా జరిగాయి. మహిళల మెగా టోర్నీలో 10 టీమ్స్ మాత్రమే ఉన్నాయి.

షెడ్యూల్‌లో మార్పు: అక్టోబరు 5న షార్జాలో జరగాల్సిన మ్యాచ్‌లను ముందు, వెనకా మార్చారు. షెడ్యూల్‌లో ప్రకటించినట్టు కాకుండా ఇప్పుడు ఆస్ట్రేలియా-శ్రీలంక జట్లు మధ్యాహ్నం తలపడనుండగా, రాత్రి మ్యాచ్‌లో బంగ్లాదేశ్-ఇంగ్లండ్ ఆడతాయి.

పతకం కోసం స్విస్ కోర్టుకు



లాసన్నే: క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానం (కాస్) తీర్పుతో ఒలింపిక్ కాంస్యం కోల్పోయిన అమెరికా జిమ్నాస్ట్ జోర్డాన్ చైల్స్ న్యాయ పోరాటానికి దిగింది. కాస్ తీర్పును స్విట్జర్లాండ్ ఫెడరల్ కోర్టులో సవాల్ చేసింది. పారిస్ విశ్వక్రీడల్లో ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ విభాగంలో తొలుత అనా బార్బోసు (రుమేనియా)కు కాంస్యం దక్కింది. కానీ, అమెరికా కోచ్ విజ్ఞప్తితో మరోసారి స్కోర్లను రివైజ్ చేసి జోర్డాన్‌కు కాంస్యం ప్రకటించారు. దీనిపై బార్బోసు కాస్‌లో అప్పీలు చేయడం.. ఆమెకు అనుకూలంగా తీర్పురావడంతో చైల్స్‌కు ఇచ్చిన పతకాన్ని వెనక్కి తీసుకొన్నారు. జోర్డాన్ ఆలస్యంగా రివ్యూకు అప్పీలు చేసిందని కాస్ పేర్కొంది. కానీ, నిర్ణీత సమయంలోనే చైల్స్ రివైజ్ కోరిందని ఆమె తరఫు లాయర్ వాదిస్తున్నాడు.

చైనాతో భారత్ కీలక పోరు నేడు

చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు వరుసగా ఆరు విజయాలతో టైటిల్‌పై ఆశలు పెంచుతున్నాయి. బుధవారం జరిగే ఏడో రౌండ్‌లో భారత పురుషుల జట్టు చైనాతో, మహిళల జట్టు జార్జియాతో తలపడతాయి. గత రౌండ్లలో అద్భుతంగా పోరాడిన భారత ప్లేయర్లు తర్వాతి రౌండ్లలో కూడా ఇదే తరహా ప్రదర్శన కనబరిస్తే స్వర్ణ పతకంతో చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. చైనాతో పోరులో తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి, గుకేష్ భారత జట్టుకు కీలకం కానున్నారు.

ఎగుమతుల్లో భారీ క్షీణత

ఆగస్టులో 9.3 శాతం డౌన్.. 10 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు

న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక అస్థిరతలు ఎగుమతుల రంగాన్ని కుంగదీశాయి. ఆగస్టు నెలలో భారత ఎగుమతులు 9.3 శాతం పడిపోయి 3,471 కోట్ల డాలర్లకే (రూ.2.92 లక్షల కోట్లు) పరిమితమయ్యాయి. ఇది 13 నెలల కనిష్ఠ స్థాయి. ఎగుమతుల భారీ క్షీణత ప్రభావం వల్ల వాణిజ్య లోటు 10 నెలల గరిష్ఠ స్థాయి 2,965 కోట్ల డాలర్లకు (రూ.2.49 లక్షల కోట్లు) దూసుకుపోయింది. ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఇదే నెలలో దిగుమతులు 3.3 శాతం పెరిగి రికార్డు గరిష్ఠ స్థాయి 6,436 కోట్ల డాలర్లకు (రూ.5.41 లక్షల కోట్లు) చేరాయి. దిగుమతుల వృద్ధికి బంగారం, వెండి ప్రధాన దోహదకారులుగా ఉన్నాయి.

పెట్రోలియం ధరలు తగ్గడం వల్ల క్రూడాయిల్ దిగుమతుల విలువ 32.38 శాతం తగ్గి 1,100 కోట్ల డాలర్లకు (రూ.92,400 కోట్లు) పరిమితమైంది. అయితే ఏప్రిల్-ఆగస్టు నెలల మధ్య కాలంలో మాత్రం ఎగుమతులు 1.14 శాతం పెరిగి 17,868 కోట్ల డాలర్లుగా (రూ.15 లక్షల కోట్లు) నమోదయ్యాయి. ఇదే కాలంలో దిగుమతులు 7 శాతం పెరిగి 29,532 కోట్ల డాలర్లకు (రూ.24.81 లక్షల కోట్లు) చేరాయి. వాణిజ్య లోటు గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 9,916 కోట్ల డాలర్ల (రూ.7.49 లక్షల కోట్లు) నుంచి 11,664 కోట్ల డాలర్లకు (రూ.9.80 లక్షల కోట్లు) చేరింది.

పెను సవాలే

ప్రపంచ స్థాయి అస్థిరతలు నెలకొన్న ప్రస్తుత వాతావరణంలో ఎగుమతులు పెను సవాలు విసురుతున్నాయని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ అన్నారు. చైనాలో మందగమనం, యూరోపియన్ యూనియన్ (ఈయూ), అమెరికాల్లో తిరోగమన పరిస్థితులు కొనసాగుతుండడంతో పాటు ఆయిల్ ధరల్లో క్షీణత, రెడ్ సీ (ఎర్ర సముద్రం) సంక్షోభం కారణంగా పెరిగిన రవాణా వ్యయాలు ఎగుమతులను కుంగదీస్తున్నాయని ఆయన చెప్పారు. ఇన్ని సవాళ్లున్నప్పటికీ ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల కాలంలో సానుకూల వృద్ధి నమోదు కావడం ఆనందకరమైన విషయమేనన్నారు.



నాలుగు నెలల కనిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

ఆగస్టు నెలలో టోకు ద్రవ్యోల్బణం 3 నెలల కనిష్ఠ స్థాయి 1.31 శాతానికి తగ్గింది. బంగాళాదుంప, ఉల్లి ధరలు పెరిగినా ఇతర కూరగాయలు, ఇంధనం ధరలు తగ్గడం ఇందుకు దోహదపడింది. ద్రవ్యోల్బణం తగ్గడం వరుసగా ఇది రెండో నెల. జూలైలో ఇది 2.04 శాతం ఉంది. మే నెలలో గరిష్ఠ స్థాయి 3.43 శాతాన్ని తాకిన అనంతరం ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తోంది. గత ఏడాది ఆగస్టులో టోకు ద్రవ్యోల్బణం (-) 0.46 శాతం ఉంది. ఆగస్టు నెలలో ఆహార వస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం 3.11 శాతంగా నమోదైంది. ప్రధానంగా కూరగాయల ధరలు 10.01 శాతం తగ్గాయి.

రికార్డు స్థాయిలో బంగారం దిగుమతులు

ఆగస్టు నెలలో బంగారం దిగుమతులు రెట్టింపై రికార్డు గరిష్ఠ స్థాయి 1,006 కోట్ల డాలర్లకు (రూ.84,504 కోట్లు) చేరాయి. వార్షిక ప్రాతిపదికన వెండి దిగుమతులు కూడా 72.7 కోట్ల డాలర్లుగా (రూ.6,106 కోట్లు) నమోదయ్యాయి. కస్టమ్స్ సుంకాలు భారీగా తగ్గించడం, ప్రస్తుత పండగల డిమాండ్ ఈ లోహాల దిగుమతులు భారీగా పెరగడానికి కారణమయ్యాయి. గత ఏడాది ఆగస్టులో బంగారం దిగుమతుల విలువ 493 కోట్ల డాలర్లుగా (రూ.41,412 కోట్లు) ఉంది. మొత్తం దిగుమతుల్లో బంగారం వాటా 5 శాతం ఉంది. ఇదిలా ఉండగా ఆగస్టులో ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులు 7.85 శాతం, ఫార్మా ఎగుమతులు 4.67 శాతం, ఇంజనీరింగ్ వస్తువుల ఎగుమతులు 4.36 శాతం పెరిగాయి. ఏప్రిల్-ఆగస్టు నెలల మధ్య కాలంలో మొత్తం సేవల రంగం ఎగుమతుల విలువ 15,018 కోట్ల డాలర్లకు (రూ.12.62 లక్షల కోట్లు) చేరింది.



83,000పైకి సెన్సెక్స్

25,400 ఎగువ స్థాయికి నిఫ్టీ .. సరికొత్త శిఖరాలకు సూచీలు

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను చేరుకున్నాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 90.88 పాయింట్ల లాభంతో 83,079.66 వద్ద, నిఫ్టీ 34.80 పాయింట్ల వృద్ధితో 25,418.55 వద్ద ఆల్‌టైం రికార్డు ముగింపును నమోదు చేశాయి. అంతేకాదు, సెన్సెక్స్ 83,000, నిఫ్టీ 25,400 ఎగువన స్థిరపడటం కూడా ఇదే తొలిసారి. సూచీలు వరుసగా రెండో రోజు పాజిటివ్ జోన్‌లోనే కొనసాగినప్పటికీ, అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లపై నిర్ణయాన్ని బుధవారం ప్రకటించనున్న నేపథ్యంలో పరిమిత శ్రేణిలో ట్రేడయ్యాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో సగం లాభపడ్డాయి. ఎయిర్‌టెల్, ఎన్‌టీపీసీ, ఎం అండ్ ఎం షేర్లు ఒక శాతానికి పైగా పెరిగాయి. కాగా, బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.13 శాతం వరకు తగ్గాయి. రంగాలవారీ సూచీల్లో రియల్టీ, టెలికాం, యుటిలిటీస్, టెక్, ఆటో స్వల్పంగా లాభపడ్డాయి. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 10 పైసలు పెరిగి 83.76 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒకదశలో 0.25 శాతం తగ్గి 72.52 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

- స్టాక్ ఎక్స్ఛేంజీల్లో సోమవారం లిస్టయిన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ షేర్లు వరుసగా రెండో రోజు అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. తాజా సెషన్‌లో కంపెనీ షేరు ధర మరో 10 శాతం పెరిగి రూ.181.48కి చేరుకుంది. ఐపీఓ ధర రూ.70తో పోలిస్తే, మొదటి రెండ్రోజుల్లోనే షేరు 159 శాతం పుంజుకుంది.
- ఓలా ఎలక్ట్రిక్ షేరు ఇంట్రాడేలో 10 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.118.40 వద్దకు చేరుకుంది. చివరికి 9.71 శాతం వృద్ధితో రూ.118.10 వద్ద స్థిరపడింది. బ్యాంక్ ఆఫ్ అమెరికా సెక్యూరిటీస్, గోల్డ్‌మన్ శాక్స్ ఈ కంపెనీ షేరు కొనుగోలుకు సిఫారసు చేయడం ఇందుకు దోహదపడింది.
- పీఎన్ గాడ్గిల్ జువెలర్స్ లిస్టింగ్‌కూ భారీ స్పందన లభించింది. ఐపీఓ ధర రూ.480తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 73.75 శాతం ప్రీమియంతో రూ.834 వద్ద ట్రేడింగ్ ఆరంభించింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి షేరు 65.16% లాభంతో రూ.792.80 వద్ద స్థిరపడింది.

100 రోజుల్లో సెన్సెక్స్ 6,300 పాయింట్లు అప్

రూ.45 లక్షల కోట్లు పెరిగిన స్టాక్ మార్కెట్ సంపద

ప్రధాని నరేంద్ర మోదీ మూడో విడత పాలనలో మొదటి వంద రోజులు పూర్తయ్యాయి. ఈ 100 రోజుల్లో సెన్సెక్స్ 6,300 పాయింట్లు (8.20 శాతం) పెరగగా.. నిఫ్టీ 2,000 పాయింట్లకు పైగా (9.28 శాతం) పుంజుకుంది. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ దాదాపు 18 శాతం ఎగబాకగా.. ఐటీ, హెల్త్‌కేర్ ఇండెక్స్‌లు 22 శాతం చొప్పున వృద్ధి చెంది టాప్ పెర్ఫార్మింగ్ సెక్టార్లుగా నిలిచాయి. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.45 లక్షల కోట్లకు పైగా పెరిగింది. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజారిటీ లభించకపోవడం, బడ్జెట్లో క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ పెంపు, సెబీ చీఫ్ పై పలు ఆరోపణలు వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ మార్కెట్ మెరుగైన పనితీరు కనబర్చడం గమనార్హం.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,050 ▲	68,800 ▲	98,000 ▲
ముంబై	73,276 ▼	67,121 ▼	87,537 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ

హైదరాబాద్	510	విజయవాడ	545
వరంగల్	512	గోదావరి	540
చిత్తూరు	553	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	113
వరంగల్	100	గుంటూరు	113
కరీంనగర్	100	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	115
కర్నూలు	100	నెల్లూరు	115
విశాఖపట్నం	101	అనంతపురం	115
గోదావరి	113		

స్కూటర్స్ సెగ్మెంట్‌లో హోండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్స్ (హెచ్ఎంఎస్ఐ) 'యాక్టివా' దూసుకుపోతోంది. 2001లో మార్కెట్లోకి విడుదలైన ఈ స్కూటర్ అమ్మకాలు దక్షిణ భారత్‌లో ఇప్పటి వరకు కోటికి మించిపోయినట్టు కంపెనీ తెలిపింది. ఇందులో యాభై లక్షల మైలురాయిని చేరేందుకు 16 ఏళ్ల సమయం పడితే, మిగతా యాభై లక్షల మార్కును దాటేందుకు కేవలం ఏడేళ్లు మాత్రమే పట్టింది. హోండా యాక్టివా 110సీసీ, 125 సీసీల్లో లభిస్తోంది.

- ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో ఫెస్టివ్ బాక్స్ క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. హోం, కిచెన్, ఔట్‌డోర్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ కీలకంగా ఉందని వెల్లడించింది. గత త్రైమాసికంతో పోల్చితే రాష్ట్రంతో పాటు వైజాగ్‌లో కూడా అమ్మకాల్లో రెండింతల వృద్ధిని నమోదు చేసినట్లు అమెజాన్ తెలిపింది.
- స్కిల్అప్ ఇండియా 4.0 ద్వారా వేలాది మంది విద్యార్థులకు నైపుణ్యాల్లో శిక్షణనందించేందుకు గాను నెక్స్‌వేవ్, విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ అండ్ సైన్స్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులను తయారు చేసేందుకు ఈ ఒప్పందం దోహపడనుంది. భారత్‌లో నైపుణ్యాల శిక్షణ కోసం నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ)తో నెక్స్‌వేవ్ జట్టు కట్టింది.

హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ అదుర్స్

తొలి ఆరు నెలల్లో 71% అప్: నైట్ ఫ్రాంక్ ఇండియా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో కార్యాలయాల భవనాల (ఆఫీస్ స్పేస్)కు డిమాండ్ ఏమాత్రం తగ్గడం లేదు. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో నగరంలో 50 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 71 శాతం ఎక్కువని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న జీసీసీ కేంద్రాలు, ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్‌కు పెరుగుతున్న గిరాకీ ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది.

పెద్ద కార్యాలయాలకే అధిక డిమాండ్: కాగా హైదరాబాద్‌లో తమ కార్యాలయాలు ఏర్పాటు చేయాలనుకునే కంపెనీల్లో ఎక్కువ కంపెనీలు లక్ష ఎస్ఎఫ్‌టీ లేదా అంతకు మించిన పెద్ద భవనాలపైనే ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ సంవత్సరం తొలి ఆరు నెలల్లో నమోదైన ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాల్లో 61 శాతం ఈ తరహా ఒప్పందాలని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. గత ఏడాది తొలి ఆరు నెలల్లో 14.7 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ కోసం ఈ తరహా లీజు ఒప్పందాలు జరిగాయి. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో ఇది 30.08 లక్షల ఎస్ఎఫ్‌టీకి చేరింది. మరో 26 శాతం లీజు ఒప్పందాలు 50,000-1,00,000 ఎస్ఎఫ్‌టీకి, 13 శాతం లీజు ఒప్పందాలు 50,000 ఎస్ఎఫ్‌టీ కంటే తక్కువ ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది.

నియోవాంటేజ్ పార్క్‌కు రూ.300 కోట్ల రుణం

న్యూఢిల్లీ: హైదరాబాద్ జీనోమ్ వ్యాలీలో నియోవాంటేజ్ ఇన్నోవేషన్ పార్క్స్ సంస్థ ఏర్పాటు చేసే రియల్టీ ప్రాజెక్టుకు హెచ్ఎస్‌బీసీ ఇండియా రూ.300 కోట్ల రుణం మంజూరు చేసింది. నియోవాంటేజ్ ఇన్నోవేషన్ పార్క్స్ ఈ రుణాన్ని పాత రుణాల చెల్లింపునకు వినియోగిస్తుంది. ఇవాన్‌హో కేంబ్రిడ్జ్, అంతర్జాతీయ పీఈ సంస్థ లైట్‌హౌస్ కాంటన్ సంస్థలు సంయుక్తంగా నియోవాంటేజ్ ఇన్నోవేషన్ పార్క్స్‌ను ఏర్పాటు చేశాయి.

ఈ సంస్థ జీనోమ్ వ్యాలీలో ఫార్మా, లైఫ్ సైన్సెస్ కంపెనీల పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కేంద్రాలకు అవసరమైన భవనాలు నిర్మించి అద్దెకు ఇస్తుంటుంది. ఇప్పటికే ఈ పార్కులో ఎనిమిది ప్రముఖ కంపెనీలు తమ ఆర్ అండ్ డీ కేంద్రాలు ఏర్పాటు చేశాయి.



బజాజ్ ట్రయంఫ్ కొత్త బైక్‌లు

న్యూఢిల్లీ: బజాజ్ ఆటో.. ట్రయంఫ్ బ్రాండ్ కింద రెండు 400 సీసీ బైక్‌లను మార్కెట్లో ప్రవేశపెట్టింది. వీటిలో స్పీడ్ టీ 4 బైక్ ధర రూ.2.17 లక్షలు కాగా స్పీడ్ 400 బైక్ ధర రూ.2.4 లక్షలు (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్). మిడ్ సైజ్ మోటార్ సైకిల్ విభాగంలో పెరుగుతున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ట్రయంఫ్ బ్రాండ్‌ను మరింత పటిష్ఠం చేసుకునేందుకు కొత్త ఉత్పత్తులు అందుబాటులోకి తేవడంతో పాటు సేల్స్ నెట్‌వర్క్‌ను కూడా విస్తరించనున్నామని బజాజ్ ఆటో ప్రో బైకింగ్ విభాగం ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్ తెలిపారు.


నూతన ఎక్సైజ్ విధానంపై మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు మనోహర్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్, కొండపల్లి శ్రీనివాస్

జగనే పెద్ద లిక్కర్ సిండికేట్

- జే బ్రాండ్లతో రూ.19వేల కోట్ల నష్టం: మంత్రులు

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ప్రత్యేకంగా లిక్కర్ సిండికేట్ లేదని, జగనే పెద్ద సిండికేట్‌లా వ్యవహరించారని మంత్రులు కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, కొండపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం సీఎంతో సమీక్ష అనంతరం వారు సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో లిక్కర్ వ్యవస్థ మొత్తాన్నీ జగన్ తన గుప్పిట్లో పెట్టుకుని, జే బ్రాండ్లు మాత్రమే షాపుల్లో విక్రయించేలా చేశారని, ఫలితంగా ఏపీకి రూ.19వేల కోట్ల ఆదాయ నష్టం వాటిల్లిందని ఆరోపించారు. పైగా రాష్ట్రంలో నాణ్యమైన మద్యం అందుబాటులో లేకపోవడంతో నాటుసారా, ఎన్‌డీపీఎల్ పెరిగిందన్నారు. దీనివల్ల తాగేవారిలో అనారోగ్య సమస్యలు పెరిగాయని, కిడ్నీలు, లివర్ వ్యాధి కేసులు భారీగా పెరిగాయని చెప్పారు. ఈ అనుభవాల దృష్ట్యా ఆరు రాష్ట్రాల్లో మద్యం పాలసీలను అధ్యయనం చేసి, తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తున్నామన్నారు. గీత కార్మికులకు షాపుల్లో 10శాతం రిజర్వేషన్ ఉందని, వారికి ఆ మేరకు షాపులు కేటాయిస్తామని తెలిపారు. కొత్తగా ప్రీమియం అవుట్‌లెట్లు కూడా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన చేశామన్నారు. పర్యాటక ప్రాంతాల్లో మద్యం ధరలు ఎక్కువగా ఉన్నాయనే కారణంతో పర్యాటకులు తగ్గిపోతున్నారని, అందువల్ల పర్యాటకులను ఆకర్షించేలా మద్యం విధానం రూపొందిస్తామని మంత్రులు చెప్పారు.

రెండు దఫాలుగా మద్యం పాలసీ

- తొలుత 3,396 దుకాణాలకు లాటరీ
- తర్వాత గీత కార్మికులకు 400 షాపులు
- పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రైవేటుకే
- ఆర్డినెన్స్ తీసుకురానున్న సర్కారు
- నేడు కేబినెట్ భేటీలో నిర్ణయం

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన మద్యం విధానాన్ని రెండు దఫాలుగా అమల్లోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ దుకాణాలు, పర్యాటక ప్రాంతాల్లో ఆ శాఖ నిర్వహించే షాపులు కలిపి మొత్తం 3,396 దుకాణాలు ఉన్నాయి. తొలుత వాటికి నోటిఫికేషన్ జారీ చేయాలని, ఆ తర్వాత గీత కార్మికులకు 10శాతం రిజర్వేషన్ అమలులో భాగంగా మరో 400 షాపులకు నోటిఫికేషన్ ఇవ్వాలని సర్కారు యోచిస్తోంది. అక్టోబరులో తొలి నోటిఫికేషన్ ఇచ్చి 3,396 షాపులు అందుబాటులోకి తెచ్చే అవకాశముంది. గత ప్రభుత్వం ఎక్సైజ్ చట్టంలో 'ప్రైవేటు దుకాణాలు' అనే పదాన్ని తొలగించి, కేవలం ప్రభుత్వ మద్యం షాపులే ఉంటాయనే సవరించింది. దీంతో ఇప్పుడు ప్రైవేటు షాపుల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు తొలుత ఎక్సైజ్ చట్టాన్ని మళ్లీ సవరించాలి. దీనికోసం ఆర్డినెన్స్ తీసుకురావాల్సి ఉంది. బుధవారం జరగనున్న కేబినెట్ భేటీలో మద్యం పాలసీని ఆమోదించాక దానిపై జీవో విడుదల చేయనున్నారు. ఆ తర్వాత ఆర్డినెన్స్ తీసుకొచ్చి పాలసీని ప్రకటిస్తారు. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టే అవకాశముంది. అయితే.. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు అక్టోబరు మొదటి వారం దాకా ప్రభుత్వ దుకాణాలే కొనసాగనున్నాయి. అక్టోబరు 5-7వ తేదీల మధ్య కొత్త దుకాణాలు అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. అలాగే ఇప్పటి వరకు పర్యాటక ప్రాంతాల్లోని మద్యం షాపులను ఆ శాఖే నిర్వహిస్తోంది. ఇకపై ఆ షాపులు కూడా ప్రైవేటుకే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు, లాటరీ ప్రక్రియను నిర్వహించనున్నారు. దరఖాస్తు రుసుము రూ.2 లక్షలుగా నిర్ణయించనున్నట్టు తెలిసింది.

బీసీ కార్పొరేషన్ పునర్వ్యవస్థీకరణ


బీసీ సంక్షేమ శాఖపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, హాజరైన మంత్రి సవిత, అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

ఎస్.సవిత విలేకరులకు తెలిపారు. గడచిన ఐదేళ్లలో బీసీలు పూర్తిగా చితికిపోయారని.. చంద్రబాబు రాకతో వారికి పూర్వ వైభవం వచ్చిందన్నారు. జాతీయ బీసీ కార్పొరేషన్ నుంచి ఏటా రూ.100 కోట్లు రాబట్టడానికి అవసరమైన మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తామని చెప్పారు. బీసీల నుంచి పారిశ్రామికవేత్తలు వచ్చే విధంగా వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపేలా ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌ను రూపొందిస్తామన్నారు. బీసీ-ఏలో ఉన్న అత్యంత వెనుకబడిన కులాల అభివృద్ధికి ప్రణాళికకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. బీసీల వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచి పీఎం-విశ్వకర్మ పథకం వర్తింపజేస్తామని తెలిపారు. చట్ట సభల్లో వారి ప్రాతినిధ్యం పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. బీసీ రక్షణ చట్టం రూపకల్పనకు సీఎం ఆదేశించారన్నారు. బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలపై నివేదిక కోరినట్లు చెప్పారు.

కీలక నిర్ణయాలివీ..

- గత ప్రభుత్వంలో ఉన్న రూ.110 కోట్ల డైట్ చార్జీల బకాయిల విడుదల.
- రూ.20.52 కోట్ల కాస్మోటిక్ చార్జీల బకాయిలు కూడా.
- వసతి గృహాల విద్యార్థులకు వ్యక్తిగతంగా ఇస్తున్న ట్రంకు పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, బెడ్డింగ్ మెటీరియల్ కోసం రూ.25 కోట్లు.
- హాస్టళ్లలో డిజిటల్ కంటెంట్ విద్యా ప్రమాణాల పెంపుదలకు ఎస్ఆర్ శంకరన్ రిసోర్స్ సెంటర్ల ఏర్పాటు..
- ప్రీ-మెట్రిక్, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్పుల నిమిత్తం కేంద్రం వాటా రూ.133.78 కోట్లతోపాటు రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంటు రూ.89.18 కోట్లు విడుదల.
- 100 మంది బీసీ విద్యార్థులతో ఐఏఎస్ స్టడీ సర్కిల్.
- ఎన్టీఆర్ విదేశీ విద్యా పథకం కింద నాణ్యమైన విదేశీ విద్యా సంస్థల్లో అత్యధిక విద్యార్థులకు అవకాశం కల్పించేలా చర్యలు.
- ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం పునరుద్ధరణ.
- బీసీ స్టడీ సర్కిళ్ల బలోపేతానికి రూ.10 కోట్లు
- చిత్తూరు, శ్రీకాకుళం, కర్నూలులో అసంపూర్తిగా నిలిచిపోయిన బీసీ భవనాల నిర్మాణానికి రూ.8 కోట్లు.
- మిగిలిన 23 జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవన నిర్మాణానికి స్థలాలు గుర్తించి నిర్మాణాలు.
- అన్ని బీసీ గురుకుల విద్యాలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు.. ఆర్టీజీఎస్‌తో అనుసంధానం.
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిర్మాణంలో ఉన్న 4 రెసిడెన్షియల్ స్కూళ్ల పూర్తికి 75 కోట్లు. ఈ విద్యాసంవత్సరంలోనే ప్రారంభం.
- రాష్ట్రంలో 5 చోట్ల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్లు.
- కులాలవారీగా తలసరి ఆదాయం ఆధారంగా బీపీఎల్ కుటుంబాల గుర్తింపు.. వారి ఆర్థికాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక.
- గత టీడీపీ ప్రభుత్వంలో 68 కాపు భవనాలకు అనుమతులు మంజూరు. వాటిలో నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా నిలిచిపోయిన 2 భవనాల పూర్తికి రూ.2.36 కోట్లు విడుదల. మిగిలిన 66 కాపు భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు.

నీరు-చెట్టు బిల్లులు తక్షణమే చెల్లించండి

- అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నీరు-చెట్టు పథకం కింద రైతులకు చెల్లించాల్సిన రూ.256 కోట్లను తక్షణమే చెల్లించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ పథకంలో పెండింగ్ బిల్లులన్నింటినీ విడతల వారీగా విడుదల చేయాలని సీఎం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. నీరు-చెట్టు కార్యక్రమంపై మంగళవారం ఆయన వెలగపూడి సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా పెండింగ్ బిల్లులపై ఆర్థిక, జల వనరుల శాఖ అధికారుల నుంచి సమాచారం కోరారు. కాగా, నీరు-చెట్టు బిల్లులపై సీఎం ప్రకటనను సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు స్వాగతించారు. జగన్ నాడు బిల్లులు చెల్లించకుండా రైతులను నానా అగచాట్లకు చేశారని, కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో వాటికి మోక్షం కలిగిందన్నారు.



హరిత ఇంధన హబ్‌గా ఏపీ

చౌకగా విద్యుత్తును అందించేలా క్లీన్‌ఎనర్జీ పాలసీ

పోటీతత్వం మరిచిన ఐదేళ్ల పాలనతో నష్టపోయాం

- టెక్నాలజీ వినియోగం పెరిగేకొద్దీ ధరలు తగ్గుతాయి
- పెట్టుబడిదారుకూ, వినియోగదారుకూ.. ఉభయతారకంగా ముసాయిదా పాలసీ ఉండాలి
- ఇంధనశాఖ అధికారులకు చంద్రబాబు స్పష్టీకరణ
- రాష్ట్ర ఇంధన రంగంలో స్పష్టమైన లక్ష్యాల నిర్దేశం

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హరిత ఇంధన హబ్‌గా ఏపీని నంబర్ వన్ స్థానంలో నిలపాలని ఇంధనశాఖ అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. గడచిన ఐదేళ్లలో పోటీతత్వాన్ని మరిచిన పాలనతో రాష్ట్రానికెంతో నష్టం వాటిల్లిందన్నారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో సోమవారం జరిగిన 'ఆర్‌ఈ గ్లోబల్ ఇన్వెస్ట్ - 2024' మీట్‌లో పాల్గొని తిరిగొచ్చిన చంద్రబాబు, మంగళవారం విద్యుత్ సౌధలో ఇంధన శాఖ అధికారులతో సమావేశమయ్యారు. హరిత ఇంధన ఉత్పత్తి, సేవల విస్తరణపై రాష్ట్రంలో తీసుకురానున్న పాలసీ ముసాయిదాపై ఈ సమావేశంలో ఆయన సమీక్షించారు. గుజరాత్ సదస్సులో ముందుకొచ్చిన కొత్త ప్రతిపాదనలు, లక్ష్యాలు, తాను అక్కడ చేసిన ఆలోచనలకు అనుగుణంగా ముసాయిదాకు అవసరమైన మార్పులను ఆయన సూచించారు. "ఇప్పటివరకూ హరిత ఇంధనోత్పత్తిలో అగ్రగామి రాష్ట్రంగా ఏపీ ఉండాలనే లక్ష్యంతో పని చేస్తూ వచ్చాం. ఇకపై వినియోగదారు కేంద్రంగా చౌకైన విద్యుత్తును అందించడంపై దృష్టి సారించాలి. సాంకేతిక నైపుణ్యం పెరిగేకొద్దీ ధరలు పూర్తిగా నియంత్రణలోకి వచ్చేస్తాయన్న ఆలోచనతో ముందడుగు వేయాలి" అని చంద్రబాబు నిర్దేశించారు. హరిత ఇంధన పాలసీ పెట్టుబడిదారులకు సరళంగా ఉండటమే కాకుండా, వినియోగదారులకు చౌకగా విద్యుత్తు దొరికేలా ఉండాలని స్పష్టంచేశారు. హరిత విద్యుత్తు ఉత్పత్తిలో ముడిపదార్థాలైన .. సూర్యరశ్మి, గాలి, నీరు వంటివి ప్రకృతిపరంగా ఉచితంగా అందుబాటులో ఉంటాయని, వాడిని ఉపయోగించుకుని అత్యంత చౌకగా పునరుద్పాదక విద్యుత్తును వినియోగదారులకు అందించవచ్చని సూచించారు. .

ముసాయిదాలోని ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద మూడు గిగావాట్ల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు
- పీఎం కుసుమ్ పథకం కింద 5లక్షల పంప్‌సెట్లకు 3.7 గిగావాట్ సోలార్ ఫీడర్లు
- ఐదేళ్లలో 78.50 గిగావాట్ సోలార్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలి. అలాగే, 35 గిగావాట్ విండ్ ఎనర్జీ, రోజుకు 1500 కిలోలీటర్ల బయోసీఎన్‌జీ, ఏడాదిలో 1.50 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్, 22 గిగావాట్ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు ఉత్పత్తే లక్ష్యం.
- రాష్ట్రంలోని 974 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే ఆపరేషన్‌లో ఆరు పోర్టులు (మరో 4 పోర్టులు నిర్మాణంలో ఉన్నాయి) ఉన్నాయి.
- రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ నాలెడ్జ్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలి. ఈ సమావేశంలో ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్, సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థ ఎండీ కేవీ చక్రధరబాబు పాల్గొన్నారు.

ఇక నుంచి ఏపీ రీ సర్వే ప్రాజెక్టు

భూముల సర్వే పథకానికి జగన్ పేరు తొలగింపు

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): భూముల సర్వే ప్రాజెక్టుకు జగన్ పేరును తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టుగా పేరు మారుస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు ఇచ్చారు. జగన్ పాలనలో భూముల సర్వేను ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనికి వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, మరియు భూ రక్ష పథకం అని పేరుపెట్టారు. సరిహద్దు రాళ్లపైనా జగన్ పేరు రాశారు. రైతులకు ఇచ్చిన పాసుపుస్తకాల్లోనూ, రెవెన్యూ రికార్డుల్లోనూ జగన్ ఫొటోలు, నవరత్నాల లోగోలు భారీగా ముద్రించారు. ఈ పరిణామంపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తాము అధికారంలోకి వస్తే జగన్ ఫొటో ఉన్న పాసుపుస్తకాలను వెనక్కి తీసుకుంటామని ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూముల సర్వేను నిలిపివేశారు.

ఒకరికొకరు!



ఇది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట మండలం వెలగతోడు గ్రామంలోని ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాల. ఈ స్కూలులో 2022లో 1 నుంచి ఐదో తరగతి వరకు 22మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు ఉండేవారు. వైసీపీ ప్రభుత్వం 3,4,5 తరగతుల పిల్లలను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో చేర్పించింది. దీంతో విద్యార్థుల సంఖ్య పదికి పడిపోయింది. ఆ తర్వాత పిల్లలు క్రమంగా తగ్గిపోవడంతో 2023లో పాఠశాలను మూసేశారు. 2024 సెప్టెంబరు 1న ఒక విద్యార్థి చేరాడు. ఇప్పుడు ఒక టీచర్, ఒక విద్యార్థితో పాఠశాల నడుస్తోంది.

టీడీపీలోకి పశ్చిమ జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ!

నేడు సీఎం చంద్రబాబు సమక్షంలో చేరేందుకు ఏర్పాట్లు



ఏలూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ వైసీపీకి రాజీనామా చేసి, ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నారు. కొన్నిరోజులుగా సీఎం అపాయింట్‌మెంట్ కోసం పద్మశ్రీ దంపతులు ఎదురుచూస్తున్నారు. పద్మశ్రీ బుధవారం చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరేలా ఏర్పాట్లు చేశారు. పెద్దసంఖ్యలో జడ్పీటీసీలు కూడా త్వరలో టీడీపీలో చేరనున్నట్టు తెలిసింది. పద్మశ్రీ భర్త ఘంటా ప్రసాదరావు ఇప్పటికే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. పద్మశ్రీ దెందులూరు నియోజకవర్గంలోని పెదపాడు నుంచి జడ్పీటీసీగా గెలుపొందారు. జిల్లాపరిషత్‌లో మొత్తం సభ్యుల సంఖ్య 48 కాగా వీరవాసరం, ఆచంట స్థానాల్లో జనసేన, టీడీపీ, మిగిలిన 46 స్థానాల్లో వైసీపీ సభ్యులు ఉన్నారు.

టీటీడీ ఖజానాకు రూ.520 కోట్ల గండి

> జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమలలో ఐదేళ్లూ ఇష్టారాజ్యంగా వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు కేటాయించారు. ఒక్కో సిఫారసు లేఖపై గరిష్ఠంగా ఆరు టికెట్లు మాత్రమే ఇవ్వాల్సి ఉండగా.. ప్రజాప్రతినిధుల పలుకుబడి, స్థాయిని బట్టి కొందరికి రోజుకు 50 నుంచి 100-150 టికెట్లు కూడా ఇచ్చారు.

> గోవిందరాజస్వామి సత్రాల పునరుద్ధరణ పనులు ఇటీవలే జరిగినప్పటికీ.. వాటిని కూల్చివేసి కొత్తగా నిర్మించేందుకు నిధులు కేటాయించారు. ఆ విషయంలో నిబంధనలు పాటించలేదు.
> - విజిలెన్స్ అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

పనులకు సహేతుక కారణాలు లేకుండా భారీగా నిధులు కేటాయించారు. అన్న ప్రసాదాల తయారీకి అవసరమైన ముడి సరుకుల కొనుగోలులో నిబంధనలు పాటించకపోవడంతో దేవస్థానం ఖజానాకు రూ.15 కోట్ల నష్టం వాటిల్లడమే కాకుండా అన్న ప్రసాదాల రుచి, నాణ్యత దెబ్బతిన్నాయి. ఇవీ విజిలెన్స్ విభాగం నిర్ధారించిన అంశాలు. సుమారు 18 అంశాలపై లోతుగా విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు సమగ్ర నివేదికను డైరెక్టర్ జనరల్ ద్వారా గత శనివారమే ప్రభుత్వానికి పంపించారు. నిధులతో ముడిపడిన అంశాలే కాకుండా కొండపై దాతల కాటేజీల నిర్మాణానికి సంబంధించి నిబంధనలు పాటించకుండా.. రాజకీయ ఒత్తిళ్లతో ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చారని వారు గుర్తించారు. కొండపై రెవెన్యూ తదితర విభాగాల్లో అవినీతి పెచ్చరిల్లిందని.. ముఖ్యంగా దుకాణాలు, తట్టల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ కొందరు అధికారులు అక్రమంగా రూ.కోట్లు ఆర్జిస్తున్నారని తేల్చారు. విశ్వసనీయ సమాచారం మేరకు నివేదికలోని కీలకాంశాలివీ..

● అవసరం లేని చోట్లా వ్యయం

బాగున్న ఆలయాలకు కూడా మరమ్మతుల పేరిట శ్రీవాణి ట్రస్టు నిధులు కేటాయించారని విజిలెన్స్ తెలిపింది. టీటీడీకి రూ.10 వేలు విరాళంగానూ, రూ.500 దర్శన టికెట్ ధర.. మొత్తం రూ.10,500 చెల్లిస్తే ప్రొటోకాల్ మర్యాదలతో శ్రీవారి దర్శనం కల్పించేలా ఈ ట్రస్టును ఏర్పాటు చేశారు. ఇందులో రూ.10 వేల విరాళం ట్రస్టుకు వెళ్తుంది. ఆ నిధులతో టీటీడీ, టీటీడీయేతర ఆలయాల్లో మరమ్మతులు, అదనపు నిర్మాణాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ నివాస ప్రాంతాల్లో కొత్త ఆలయాల నిర్మాణం చేపట్టాలన్నది దీని లక్ష్యం. 2019లో ప్రారంభించిన ఈ ట్రస్టు నిధులను.. అవసరం లేని చోట్ల కూడా ఖర్చు చేశారని.. అలాంటి చోట్ల కేటాయించిన నిధుల్లో కొంత మంది ముఖ్యులకు 25 శాతం వాటా అందినట్లు విజిలెన్స్ గుర్తించింది.

● ఇష్టారాజ్యంగా బ్రేక్ టికెట్లు

శ్రీవారి దర్శనాలకు వీఐపీ బ్రేక్ పేరిట టీటీడీ ప్రత్యేక సమయం కేటాయిస్తోంది. రాష్ట్రానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పాలక మండలి చైర్మన్, సభ్యులు తదితరుల సిఫారసు లేఖలపై దర్శన టికెట్లు ఇస్తోంది. మార్గదర్శకాల ప్రకారం.. ఒక్కో లేఖపై గరిష్ఠంగా ఆరు టికెట్లు కేటాయించాలి. అయితే జగన్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లూ ఇష్టారాజ్యంగా వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు కేటాయించినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ప్రజాప్రతినిధుల పలుకుబడి, స్థాయిని బట్టి కొందరికి రోజుకు 50 నుంచి 100-150 టికెట్లు కూడా ఇచ్చినట్లు తేల్చారు. కొందరు ముఖ్య అధికారులు కూడా తమ కోటాను ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా దర్శనాలు చేయించారని, తద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విజిలెన్స్ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. వీఐపీ బ్రేక్ దర్శనాల విధివిధానాలను ప్రక్షాళన చేయాలని సూచించారు.

● ఇంజనీరింగ్ పనులకు అడ్డగోలుగా నిధులు

టీటీడీలో ఇంజనీరింగ్ పనులకు గతంలో రూ.300 కోట్ల నుంచి రూ.350 కోట్లకు లోబడే కేటాయింపులు జరిగేవని, అయితే 2019-24 నడుమ అనేక రెట్లు ఎక్కువగా నిధులు కేటాయించారని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. నిధుల కేటాయింపు ద్వారా ముఖ్యులకు వాటాలు ముట్టాయని, పనులు మాత్రం పునాదుల దశ దాటలేదని తెలిపారు. స్విమ్స్, బర్డ్ ఆస్పత్రుల్లో కూడా అవసరం లేకున్నా పునరుద్ధరణ పనులు, కొత్త భవనాల నిర్మాణాలు చేపట్టారని గుర్తించారు. టెండర్లలో తక్కువ మొత్తం కోట్ చేసిన వారికి పనులు కేటాయించాల్సి ఉండగా ఎక్కువ కోట్ చేసిన వారికి టెండర్ ఖరారు చేశారు. బర్డ్ ఆస్పత్రి ప్రాంగణంలో అంతర్గత రోడ్ల నిర్మాణంలో నాణ్యత లేదని విజిలెన్స్ బృందం గుర్తించింది. ఈ మొత్తం ఇంజనీరింగ్ పనులకు కేటాయించిన నిధుల్లో కూడా కీలక వ్యక్తులకు వాటాలు ముట్టాయని దాని దృష్టికి వచ్చింది. ఈ వ్యవహారంలో టీటీడీ, స్విమ్స్, బర్డ్ కీలక అధికారులను, ఇంజనీరింగ్ అధికారులను బాధ్యులుగా గుర్తించి వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

● ముడిసరుకుల టెండర్లలో..

శ్రీవారి అన్న ప్రసాదాల తయారీ కోసం నెయ్యి, జీడిపప్పు, చక్కెర, బెల్లం, యాలకులు, లవంగాలు, విరియాలు, బియ్యం వంటి 28 రకాల ముడిసరుకులను టీటీడీ భారీ పరిమాణంలో కొనుగోలు చేస్తుంటుంది. వీటి కొనుగోలుకు టెండర్ల ఖరారులో నిబంధనలు పాటించలేదని గుర్తించారు. ముఖ్యంగా 9 రకాల సరుకుల కొనుగోలుకు ఎక్కువ మొత్తాలు కోట్ చేసిన వారికి టెండర్లు ఖరారు చేశారని విజిలెన్స్ పేర్కొంది. దీనివల్ల టీటీడీ ఖజానాకు రూ.15 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని నివేదించింది. ముడిసరుకుల నాణ్యతను పరీక్షించేందుకు టీటీడీకి ల్యాబ్ అందుబాటులో ఉన్నప్పటికీ నాణ్యతను పట్టించుకోలేదని, దానివల్లే అన్న ప్రసాదాల రుచి, నాణ్యత దెబ్బతిన్నాయని పేర్కొంది.

గూగుల్ టేకౌట్‌తో గుట్టు రట్టు

(మొదటి పేజీ తరువాయి)

కేసు నమోదైంది. అందులో మొదటి నిందితుడిగా ఉన్న కుక్కల విద్యాసాగర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆయన ఆచూకీ కోసం టెక్నాలజీ ప్రయోగించడంతో విస్తుపోయే నిజాలు బయట పడ్డాయి. ఆయన సెల్ నెంబర్ ఆధారంగా ఎక్కడున్నారో కూపీలాగే ప్రయత్నంలో గూగుల్ టేకౌట్‌ను ప్రయోగించినట్లు తెలిసింది. అయితే ఫిబ్రవరి 2న విద్యాసాగర్ ముంబైలో విశాల్ గున్నీ ఇతర పోలీసులతో కలిసి ఉన్నట్లు బయటపడింది.

'సకల శాఖల మంత్రి' ఆదేశాలతోనే..

జెత్వానీని ముంబై నుంచి తీసుకురావడానికి ఆనాడు విజయవాడ పోలీసులు గన్నవరంలో విమానం ఎక్కితే.. విద్యాసాగర్ హైదరాబాద్‌లో బయలుదేరి ముంబైకి చేరుకున్నారు. అంతకుముందు తాడేపల్లి ప్యాలెస్‌లో వేసుకున్న స్కెచ్ ప్రకారం జెత్వానీ కదలికలు, ఆమె నివాసం ఎక్కడుందో తెలిసిన వ్యక్తిని తీసుకెళ్లాలని నిఘా విభాగం అధిపతి సూచించినట్లు తెలిసింది. ముగ్గురు ఐపీఎస్‌లు తాడేపల్లి ప్యాలెస్‌లో మాట్లాడుకున్నప్పుడు సకల శాఖల మంత్రిగా పేరు గాంచిన నాయకుడు...విద్యాసాగర్‌ను అక్కడికి పిలిపించారు. 'పోలీసు అధికారులకు సహకరించు' అని సూచించినట్లు సమాచారం. విజయవాడలో ఒకే విమానం ఎక్కితే తెలిసి పోతుందని, హైదరాబాద్ నుంచి విద్యాసాగర్ బయలుదేరినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ముంబైలోని జూహూలోని గుల్‌మహర్ రోడ్డులో ఉన్న ఐడియల్ అపార్ట్‌మెంట్‌లో జెత్వానీ తన కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. ఆమె తన కుటుంబంతో కలిసి కారులో బయటకు రావడం విద్యాసాగర్ చూశారు. ఆ సమాచారం పోలీసులకు ఇచ్చి.. తాను కారులో వారిని అనుసరించినట్లు సమాచారం. గూగుల్ టేకౌట్ ద్వారా కేసులో డిజిటల్ ఆధారాలు సేకరించే పనిలో బెజవాడ పోలీసులు ఉన్నారు. ఈ క్రమంలో ఐపీఎస్ అధికారులకు, వైసీపీ నేతలకు మధ్య నడిచిన వాట్సాప్ సందేశాలు, మెయిల్స్ పరిశీలిస్తున్నట్లు తెలిసింది. పక్కా ఆధారాలు సేకరించిన తర్వాతే పెద్ద ఖాకీలను నిందితులుగా చేర్చాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అన్నీ సేకరించుకుని విద్యాసాగర్ కేసులో అదర్స్ అనేచోట ఏ2, ఏ3, ఏ4గా పెద్ద పోలీసుల్ని చేర్చబోతున్నట్లు సమాచారం. ఆధారాలు బలంగా ఉంటే ఇదే ఎఫ్ఐఆర్‌లో సెక్షన్ 120(బి) చేర్చి కుట్ర కోణాన్ని పూర్తిస్థాయిలో ఉచ్చు బిగించనున్నట్లు తెలుస్తోంది. ఫోను స్విచ్ఛాఫ్ చేసి పరారీలో ఉన్న విద్యాసాగర్ కోసం లుక్ అవుట్ నోటీసులు జారీచేసే యోచనలో పోలీసులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

జెత్వానీ కేసులో ఎవరినీ వదలబోం: హోంమంత్రి

జెత్వానీ కేసులో ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తి లేదని హోంమంత్రి అనిత అన్నారు. దీనివెనుక ఉన్న అందరినీ శిక్షిస్తామని స్పష్టం చేశారు. "కాదంబరి కేసులో సస్పెండ్ అయిన ఐపీఎస్ అధికారుల వెనుక ఎంతమంది ఉన్నా వదిలిపెట్టబోం. వారి వెనుక సలహాదారులు ఉన్నా, సూత్రధారులు ఉన్నా వదిలిపెట్టబోం" అని అనిత హెచ్చరించారు.


2 వేల కోట్ల విపత్తు నిధులు గాయబ్!

- ఒక్క పైసాకూ లెక్కరాయని గత సర్కారు
- దేనికి ఖర్చు చేశారో జగన్‌కే తెలియాలి
- ముందు 500కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం
- రాజధానిపై విషంకక్కితే నోటికి తాళమే: చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విపత్తు నిధి కింద రాష్ట్రానికి అందుబాటులో ఉన్న రూ.2వేల కోట్లను గత వైసీపీ ప్రభుత్వం వాడేసి దానికి సంబంధించిన ఖర్చులను ఎక్కడా రాయలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. 'డబ్బులు పుస్తకాల్లో కనిపిస్తున్నాయి. ఖాతాల్లో లేవు. ఖర్చు చేసేశారు. కానీ ఎక్కడా రాయలేదు. పచ్చి దుర్మార్గంగా వ్యవహరించారు. మీవద్ద డబ్బులు ఉన్నాయని కేంద్రం అంటుంది. కానీ లేవు. దేనికి ఖర్చు చేశారో వారికే తెలియాలి. ఖర్చు కింద రాయాలని 'కాగ్'ను కోరాం. అత్యవసరంగా ముందు రూ.500కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం." అయన అన్నారు. పోలవరం సహా అనేక పథకాల నిధులు, కేంద్రం ఇచ్చిన నిధులు ఇష్టానుసారం మళ్లించి వాడేశారని, నిధులు ఇచ్చిన కేంద్రం తాము ఇచ్చిన ఉద్దేశానికి సంబంధించిన ఖర్చు చూపించమని అడిగితే ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆయన విమర్శించారు. 'వాళ్లు ఐదేళ్లలో చేయలేని పనులు మేం వంద రోజుల్లో చేశాం. విశాఖలో రైల్వే జోన్‌కు భూమి ఇవ్వలేకపోయారు. మేం ఇచ్చాం. రైతులకు బకాయిపడిన రూ.పదహారు వందల కోట్లు చెల్లించాం. పంచాయితీలకు బకాయి పడిన రూ.తొమ్మిది వందల కోట్లు ఇచ్చాం' అని ఆయన వివరించారు.

మనుషులైతే ఇలా మాట్లాడరు...

మనుషులే అయి ఉంటే అమరావతి రాజధాని గురించి అడ్డగోలుగా మాట్లాడరని చంద్రబాబు మండిపడ్డారు. ఇటీవలి వరదలకు అమరావతి మునిగిందని వైసీపీ వర్గాలు చేస్తున్న ప్రచారం గురించి ప్రస్తావించినప్పుడు ఆయన ఈ వ్యాఖ్య చేశారు. "బెంగళూరు, ముంబాయి, హైదరాబాద్, కర్నూలులో వరదలు రాలేదా? విశాఖకు తుఫాన్లు రావడం లేదా? ఎందుకీ దుష్ప్రచారం? ఇంకోసారి ఇలా విషం కక్కితే నోటికి తాళాలు వేయాల్సి వస్తుంది. వీళ్ల చేసిన పనులకు ముక్కు నేలకు రాయించాలి. ఇన్ని చెబుతారు. వరద బాధితుల పరామర్శకు వెళ్లి కనీసం నీళ్లలో కాలు కూడా పెట్టలేదు. రోడ్డు దిగలేదు. కానీ సొంత పేపర్లు, టీవీల్లో ఇష్టానుసారం తప్పుడు వార్తలు వేయిస్తున్నారు. 11 సీట్లకు దిగజారిపోయినా మార్పు రాలేదు. నడవలేని ముసలివాళ్లు కూడా వచ్చి తమ పింఛన్ డబ్బులు విరాళంగా ఇస్తున్నారు. వీళ్లు మనుషులు కాదు కాబట్టే ఇలా మాట్లాడుతున్నారు" అని ఆయన విమర్శించారు. బుడమేరు వరదలు మళ్లీ రాకుండా కిందకు తీసుకువెళ్లి, నదిలో కలపడం, పైన ఒక రిజర్వాయర్ నిర్మాణం వంటి అనేక ప్రతిపాదనలు పరిశీలిస్తున్నామని ఆయన చెప్పారు.



ప్రైవేటుపరం కాకుండా కాపాడతాం

విశాఖ స్టీల్ ప్లాంట్‌పై గతంలో ఒకసారి కేంద్ర మంత్రులతో మాట్లాడానని, ఈరోజు కూడా మళ్లీ మాట్లాడానని చంద్రబాబు తెలిపారు. 'ఈరోజు కొంత డబ్బు విడుదల చేస్తున్నారు. కానీ ప్రతిసారీ కేంద్రం వద్ద కూర్చుని డబ్బులు తేలేం. ప్రైవేటు ఉక్కు ఫ్యాక్టరీల మాదిరిగా దీనికి లాభాలు ఎందుకు రావడం లేదో ఆలోచన చేయాలి. స్టీల్ ప్లాంట్ మేనేజ్‌మెంట్, ఉద్యోగులు, యూనియన్లు దీని కోసం ప్రయత్నం చేయాలి. నేను కూడా దీనిపై దృష్టి పెడతా. గతంలో ఒకసారి సమస్య వస్తే నేనే బయటపడేశాను. విశాఖ ఉక్కు ఆంధ్రుల సెంటిమెంట్. కానీ సెంటిమెంట్ ఒక్కటే దానిని కాపాడలేదు. వాణిజ్యపరంగా లాభాల్లోకి తేవాలి. నేను కూడా దానిపై కూర్చుంటా. అది ప్రైవేటుపరం కాకుండా కాపాడతాం. నిలబెట్టుకొనే ప్రయత్నం చేస్తాం" అని ఆయన అన్నారు. వైసీపీ ప్రభుత్వం దానిని కాపాడటానికి ఏ ప్రయత్నమూ చేయలేదని, అందరం కలిసి ఢిల్లీ వెళ్దామని అన్నా రాలేదని, ఇప్పుడు మంట పెట్టి చలి కాచుకొనే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. ప్రైవేటు మెడికల్ కళాశాలలపై ఏం జీవో తెచ్చారో వైసీపీ నేతలు చదువుకోవాలని ఆయన ఘాటుగా సలహా ఇచ్చారు. "ఆ జీవోను వారి మెళ్లకే కట్టి పంపుతాం. అప్పుడైనా చదువుకొంటారు. బాబాయి హత్య మాదిరిగా అన్నీ ఇతరుల మీదకు తోసేస్తే కుదరదు. వాళ్లు చెల్లని కాసులు. నేరగాళ్ళు ఇలాగే చేస్తారు. తాము చేసి ఇతరుల మీదకు తోస్తారు" అని ఆయన విమర్శించారు.

బాధితులను ఆదుకోవడమే లక్ష్యం : అనగాని

చంద్రబాబు మనసు ఉన్న ముఖ్యమంత్రి అని రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ప్రశంసించారు. వరద బాధితులకు ప్రకటించిన ప్యాకేజీ బాగుందని మీడియా ప్రతినిధులు ప్రశంసించినప్పుడు, ఆయన ఈ మాట అన్నారు. ఖర్చు గురించి తాము లెక్కవేయలేదని, బాధితులను ఆదుకోవడం లక్ష్యంగా ప్యాకేజీ తయారు చేశామని ముఖ్యమంత్రి చెప్పారు.




ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిలో మునిగిన బోటును ఒడ్డుకు తీసుకువస్తున్న బోట్లు

ఎట్టకేలకు ఒక బోటు బయటికి..

- ఇరుక్కున్న బోటును కదిలించిన 'కావడి' వ్యూహం
- బ్యారేజీ గేటు నుంచి పున్నమి ఘాట్ వైపునకు తరలింపు
- నేడు మరో రెండు బోట్ల ఆపరేషన్ ప్రారంభం


ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న బోట్లను తొలగించే పనులను పరిశీలిస్తున్న మంత్రులు రామానాయుడు, అనిత

విజయవాడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): 'కావడి' పనిచేసింది! నీటిలో మునిగిపోయిన ఒక బోటును కదిలించింది!! పది రోజులకు పైగా ఇంజనీరింగ్ నిపుణులు, రిగ్గర్లు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ప్రకాశం బ్యారేజ్ గేట్లకు వెనుక భాగాన ఇరుక్కుపోయిన మూడు బోట్లలో ఒక బోటును ఇంజనీర్లు ఎట్టకేలకు బయటకు లాక్కొచ్చారు. ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన బోట్ల ఆపరేషన్ మంగళవారం రాత్రి ఫలితాన్నిచ్చింది. ఒక బోటును ఒడ్డుకు చేర్చడానికి 11 రోజులపాటు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. భారీ క్రేన్లు ఉపయోగించినా కదలని బోటును కావడి విధానంలో రెండు జంట బోట్లు కదిలించింది. బోటుపైకి ఎక్కిన ఈ బోటును ఆక్సీ ఆర్క్ కట్టర్ ద్వారా రెండు ముక్కలు చేసి క్రేన్ల ద్వారా తొలగించాలని ప్రణాళిక వేశారు. ఇది విఫలమవ్వడంతో కాకినాడ నుంచి అబ్బులు టీంను రంగంలోకి దింపారు. బెకమ్ కంపెనీ, వైజాగ్‌కు చెందిన సీ లయన్ సంస్థ, అబ్బులు టీం కలిసి సంయుక్తంగా శ్రమించి బోల్తా పడిన బోటును ఒక దిశలోకి తీసుకొచ్చాయి. నీటిలో మునిగిపోయిన ఈ బోటును ఒడ్డుకు తీసుకురావడానికి రెండు బోట్లకు ఇనుప గడ్డర్లను అమర్చి రంగంలో దింపారు. ఈ ప్రయత్నంతో నీటిలో మునిగిన బోటు కొంతమేరకు పైకి కనిపించింది. ఈ బోటును లాగడం కోసం కొత్తగా ఏర్పాటు చేసిన బోట్ల వల్ల కాకపోవడంతో మరో రెండు బోట్లను మంగళవారం రంగంలోకి దింపారు. ఇనుప గడ్డర్లతో ఉన్న రెండు బోట్లను కొత్తగా వచ్చి బోట్లకు ఇనుప రోప్‌తో లాక్ చేశారు. ఈ రెండు బోట్లు కదిలిన తర్వాత వెనుక ఇనుప గడ్డర్లతో ఉన్న బోట్లు కదిలాయి. నీటిలో మునిగిన ఉన్న బోటు మాత్రం కొంతమేరకే కదిలింది. ముందున్న రెండు బోట్లు కాస్త బలంగా ముందుకు కదిలే సరికి ఇనుప గడ్డర్లు ఉన్న బోటుకు మునిగిన బోటును లాక్ చేసిన రోప్ తెగిపోయింది. దీంతో డైవర్లు నీళ్లలోకి దిగిన మళ్లీ రోప్‌లను బిగించారు. బోటు నీళ్లలో మునిగిపోవడంతో బరువు పెరిగిపోయింది. నీటితోపాటు ఇసుక బోటులోకి చేరి ఉంటుందని, అందుకే బోటు బరువు బాగా పెరిగిందని అనుమానించారు. అయినా మునిగిన బోటును రాత్రి కొంతదూరం వరకు ఈ బోట్లు లాక్కొచ్చాయి. తర్వాత ఆ బోటులో ఉన్న నీటిని మోటారు ద్వారా తోడేశారు. దీంతో దాని బరువు తగ్గింది. తర్వాత నాలుగు బోట్లు కలిసి ఈ బోటును పున్నమిఘాట్ వైపునకు లాక్కెళ్లాయి. తొలుత ఈ బోటును గొల్లపూడి రేవుకు చేర్చాలని భావించారు. బ్యారేజీ గేటు నుంచి బయటకు రావడానికే 11 రోజుల సమయం పట్టినందున, ముందస్తు ఆలోచనతో భవానీపురం చేపల రేవు వద్దకు గానీ, పున్నమిఘాట్ దాటిన తర్వాత గానీ ఒడ్డుకు చేర్చాలని భావిస్తున్నారు. ఇసుక మేట తగిలే ప్రదేశంలో ఈ బోటును విడిచిపెడతారు.

నేటి నుంచి మరో రెండు బోట్ల వెలికితీత పనులు

ఇంకా ప్రకాశం బ్యారేజీ వద్ద రెండు బోట్లు ఉన్నాయి. వాటిని తొలగించే చర్యలు బుధవారం చేపడతారు. ప్రస్తుతం తొలగించిన బోటు మునిగిన ప్రదేశంలో ఒక చిన్న బోటు ఉన్నట్టు గుర్తించారు. ముందుగా దాన్ని బయటికి తీసుకొచ్చే అవకాశాలు ఉన్నాయి. బ్యారేజీ వద్ద జరుగుతున్న బోట్ల ఆపరేషన్‌ను మంత్రులు రామానాయుడు, అనిత పరిశీలించారు. వైసీపీ నేతలు ఉగ్రవాదుల కంటే ప్రమాదకరమని, బోట్లు కొట్టుకురావడంతో కచ్చితంగా కుట్రకోణం దాగి ఉందని చెప్పారు. బోట్లకు సంబంధించి విచారణ సాగుతోందన్నారు.

మునిగిన ఇంటికి రూ.25 వేలు!

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. దీని ప్రకారం..వరదల్లో మునిగిన ఇళ్లలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నవారికి ప్రతి కుటుంబానికి రూ.పాతికవేలు ఇస్తారు. ఆ పై అంతస్థుల్లో ఉన్నవారికి వారు పడిన ఇబ్బందులకు... పని పోయినందుకు పరిహారంగా ప్రతి కుటుంబానికి రూ. పది వేలు అందిస్తారు. పరిహారం ఇళ్లలో ఎవరు ఉంటే వారికే ఇస్తామని, అద్దెకు ఉండేవారు ఉంటే వారికే వస్తుందని ముఖ్యమంత్రి విస్పష్టంగా ప్రకటించారు. విజయవాడ నగరం, దానిని ఆనుకొని ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 172 వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో ఈ ప్యాకేజీ వర్తిస్తుంది. షాపులు, ఇతర వాణిజ్య సంస్థలకు వాటిల్లిన నష్టం ఎక్కువగా ఉండటంతో వాటికి వేరే ప్యాకేజీ ప్రకటించారు. చిన్న కిరాణా షాపులు, టీ కొట్లకు రూ.పాతిక వేలు, వ్యాపారం కింద నమోదై రూ.నలభై లక్షల లోపు టర్నోవర్ ఉన్న వాణిజ్య సంస్థలకు రూ.ఏభై వేలు, రూ.నలభై లక్షల నుంచి రూ.కోటిన్నర వరకూ టర్నోవర్ ఉన్న షాపులకు రూ.లక్ష, అంతకు పైన టర్నోవర్ ఉన్న వాణిజ్య సంస్థలకు రూ. లక్షన్నర పరిహారంగా ఇస్తారు. ద్విచక్ర వాహనాల రిపేర్లకు రూ. మూడు వేలు ఇస్తారు. ఆటోలకు రూ. పది వేలు ఇస్తారు. తోపుడు బళ్ళు పోయినా... దెబ్బతిన్నా ప్రభుత్వం వాటిని ఉచితంగా సమకూరుస్తుంది. చేనేత పనివారి మగ్గం పూర్తిగా పోతే రూ.పాతిక వేలు ఇస్తారు. గేదెలు, ఆవులు చనిపోతే రూ.ఏభై వేలు ఇస్తారు. ఎద్దులు చనిపోతే ఒక్కోదానికి రూ. నలభై వేలు అందిస్తారు. పశువుల కొట్టం పోతే రూ. ఏడున్నర వేలు ఇస్తారు. ఇల్లు పూర్తిగా పోతే కొత్త ఇల్లు ఇస్తారు.

పంట నష్ట పరిహారం ఇలా...

పంట నష్టం కింద కొన్ని పంటలకు ఎకరానికి రూ. పది వేలు, కొన్ని వాణిజ్య పంటలకు రూ. 14 వేలు చంద్రబాబు ప్రకటించారు. ఆ వివరాలు.. దెబ్బతిన్న హెక్టారు పత్తి-రూ.25 వేలు, వేరుశెనగ-25 వేలు, వరి-25 వేలు, చెరుకు-25 వేలు, సజ్జ-15 వేలు, మినుము-15 వేలు, పెసర-15 వేలు, మొక్కజొన్న-15 వేలు, రాగి-15 వేలు, కంది-15 వేలు, నువ్వులు-15 వేలు, సోయాబీన్-15 వేలు, సన్‌ఫ్లవర్-15 వేలు, పొగాకు-15 వేలు, ఆముదం-15 వేలు, జ్యూట్-15 వేలు, కొర్ర-15 వేలు, సామ-15 వేలు. అలాగే, ఉద్యాన పంటలకు పరిహారం అందిస్తామని తెలిపారు. ఆ వివరాలు.. వరద దెబ్బకు గురైన హెక్టారు అరటి పంటకు-రూ.35 వేలు, పసుపు-35 వేలు, కూరగాయలు-25 వేలు, తమలపాకు-75 వేలు, మిర్చి-35 వేలు, బొప్పాయి-25 వేలు, టమాటా-25 వేలు, జామ-35 వేలు, పూలు-55 వేలు, ఉల్లి-25 వేలు, నిమ్మ-35 వేలు, మామిడి-35 వేలు, పుచ్చకాయ-25 వేలు, నర్సరీలు-25 వేలు, దానిమ్మ-35 వేలు, యాపిల్ బేర్-35 వేలు, సపోటా-35 వేలు, కొత్తిమేర-25 వేలు, జీడి మామిడి-35 వేలు, డ్రాగన్ ఫ్రూట్-35 వేలు, ఆయిల్‌పామ్(మొక్కకు)-రూ.1,500, కొబ్బరి(మొక్కకు)-1,500.

కొత్త రుణాలు

వరదల్లో ఇళ్లు మునిగిపోయిన గ్రౌండ్ ఫ్లోర్ బాధితులకు రూ.ఏభై వేల రుణం బ్యాంకుల నుంచి ఇప్పిస్తామని, మూడు నెలల మారిటోరియం ఉంటుందని.. 36 నెలల వాయిదాల్లో దానిని తీర్చాల్సి ఉంటుందని చంద్రబాబు తెలిపారు. షాపులకు ఇప్పటికే ఉన్న రుణాలను రీ షెడ్యూల్ చేసి ఏడాది మారిటోరియంతో కొత్త రుణాలు ఇప్పిస్తామని, వ్యవసాయానికి స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు రీ షెడ్యూల్ చేసి కొత్త రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. తమ వద్ద ఉన్న లెక్కల ప్రకారం విజయవాడ నగరంలో 2.72 లక్షల కుటుంబాలు వరద బారిన పడ్డాయని, ఏడు లక్షల మంది ప్రభావితం అయ్యారని తెలిపారు. విద్యార్థుల ఫీజుల చెల్లింపు ఒక నెల వాయిదా వేశామని, వరద ప్రాంతాల్లో ఆస్తి పన్ను చెల్లింపు మూడు నెలలు వాయిదా వేశామని చెప్పారు. విద్యార్థుల పుస్తకాలు, సర్టిఫికెట్లు వరదల్లో పోయి ఉంటే, తిరిగి ఇస్తామని తెలిపారు. కేంద్రంతో మాట్లాడుతున్నామని, కొంత సాయం అందుతుందని ఆశిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నాలుగు వేల కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. బుడమేరు ఆక్రమణలను తొలగించడానికి ఆపరేషన్ బుడమేరు మొదలు పెడతామని ఆయన చెప్పారు. కాగా, వరదల తాకిడికి గురైన రాష్ట్రంలోని మిగిలిన చోట్ల కుటుంబానికి రూ.పది వేలు ఇస్తామని సీఎం వెల్లడించారు.

రూ. 300 కోట్ల మేర విరాళాలు

వరద బాధితులను ఆదుకోవాలంటూ ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు స్పందించి దాతలు మంగళవారం వరకూ రూ. మూడు వందల కోట్ల మేర విరాళాలు అందించారని ముఖ్యమంత్రి తెలిపారు. ఇంకో వంద నుంచి రూ. నూటా ఏభై కోట్లు అందుతాయని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. 'మా శక్తినంతా వెచ్చించి పనిచేశాం. మేం చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని విశ్వసించి అనేక మంది వచ్చి విరాళాలు ఇస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే పుతుంబాక భారతి తన చేతి బంగారు గాజులు ఇచ్చారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇస్తున్నారు. అహ్మదాబాద్ వెళ్తే అక్కడ కూడా మన కృషిని మెచ్చుకొన్నారు. దేశం అంతా గుర్తించింది' ' అని ఆయన పేర్కొన్నారు. మీడియా సమావేశంలో మంత్రులు పొంగూరు నారాయణ, పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

వాహనాల బీమా (రూ.కోట్లలో)

మొత్తం క్లెయిమ్‌లు-	9088	71.54
సెటిల్ చేసినవి-	2345	6.1
చెల్లించాల్సినవి-	6748	65.29

బుడమేరు బాధితులకు పరిహారం ఇలా...

కేటగిరీ	పరిహారం
గ్రౌండ్ ఫ్లోర్ ఇళ్లు	25,000
మొదటి అంతస్తు ఇళ్ల, ఆపై అంతస్తులు	10,000
కిరాణా షాపులు, హోటళ్లు	25,000
ద్విచక్ర వాహనాలకు	3,000
మూడు చక్రాల వాహనాలకు	10,000
తోపుడు బళ్లు	కొత్త తోపుడు బళ్లు
ఎంఎస్ఎంఈలు, రిజస్టరైన వ్యాపారాలు (రూ.40లక్షల కంటే తక్కువ టర్నోవర్)	50,000
ఎంఎస్ఎంఈలు, రిజస్టరైన వ్యాపారాలు (రూ.40లక్షల నుంచి రూ.కోటిన్నర టర్నోవర్)	1,00,000
ఎంఎస్ఎంఈలు, రిజస్టరైన వ్యాపారాలు (రూ.కోటిన్నర దాటిన టర్నోవర్)	1,50,000

ఇతర ప్రాంతాల్లోని బాధితులకు...

గ్రౌండ్ ఫ్లోర్ ఇళ్లకు	10,000
నేత కార్మికులు, కళాకారులకు	25,000
స్వల్పంగా దెబ్బతిన్న పడవకు	9,000
పూర్తిగా దెబ్బతిన్న పడవకు (మోటారు లేనివి)	20,000
పూర్తిగా దెబ్బతిన్న చేపల పడవలకు (మోటారు)	25,000
చేపల చెరువులు (హెక్టార్‌కు)	18,000
పట్టు పురుగుల పెంపకం(సెరికల్చర్, హెక్టార్‌కు)	25,000
ఆవులు, గేదెలు (ఒక్కోదానికి)	50,000
ఎద్దులు (ఒక్కోదానికి)	40,000
దూడలు (ఒక్కోదానికి)	25,000
గొర్రెలు, మేకలు (ఒక్కోదానికి)	7,500
కోళ్లు (ఒక్కోదానికి)	100
గేదెల షెడ్డుకు	5,000


నందిగం సురేశ్‌ను కోర్టుకు తీసుకువచ్చిన పోలీసులు

ముగిసిన నందిగం సురేశ్ కస్టడీ

- న్యాయస్థానంలో హాజరుపరచిన పోలీసులు
- అనంతరం గుంటూరు జిల్లా జైలుకు తరలింపు
- రేపటితో ముగియనున్న జ్యుడీషియల్ రిమాండ్
- దాడిలో మాజీ ఎంపీ పాత్రపై స్పష్టత?

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 17: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నిందితుడిగా ఉన్న బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్ పోలీసు కస్టడీ ముగిసింది. మంగళవారం మధ్యాహ్నం ఆయన్ను పోలీసులు మంగళగిరి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు తిరిగి గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. సురేశ్‌ను పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించడంతో ఆదివారం మధ్యాహ్నం ఆయన్ను కస్టడీలోకి తీసుకున్నారు. మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో విచారించారు. బయటి వ్యక్తులెవరినీ లోపలకు అనుమతించలేదు. సురేశ్‌కు మౌలిక సౌకర్యాలను పోలీసులే కల్పించారు. కేసు దర్యాప్తు అధికారి అయిన మంగళగిరి రూరల్ సీఐ వై శ్రీనివాసరావు ఆయన్ను వివిధ కోణాల్లో ప్రశ్నించారు. సీసీ ఫుటేజీలు, ఫోన్ కాల్స్ డేటా, ఇతర సాంకేతిక ఆధారాలను సురేశ్ ముందుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. దాడి జరిగే ముందు తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్య నేతలు, దాడికి పాల్పడిన దుండగులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నట్లు ఉన్న ఫొటోలను చూపించారు. దాడిలో ఆయన పాత్రపై వారు ఓ స్పష్టతకు వచ్చినట్లు తెలిసింది. మంగళవారం మధ్యాహ్నంతో పోలీసు కస్టడీ ముగియడంతో 12 గంటలకు మంగళగిరి న్యాయస్థానంలో సురేశ్‌ను పోలీసులు హాజరుపరిచారు. 'పోలీసులు ఇబ్బంది పెట్టారా.. భోజనం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించారా.. మీ తరపు న్యాయవాదిని విచారణ సందర్భంగా అనుమతించారా' అని న్యాయాధికారి అడిగారు. వాటన్నిటికీ సురేశ్ సానుకూలంగా జవాబులిచ్చినట్లు తెలిసింది. కాగా.. సురేశ్‌కు కోర్టు విధించిన జ్యుడీషియల్ రిమాండ్ గడువు ఈ నెల 19వ తేదీతో ముగియనుంది.

రెండు కేసులూ సవాల్‌గా తీసుకున్నాం: ఎస్పీ

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి, ఉండవల్లిలో సీఎం చంద్రబాబు నివాసంపై దాడి కేసులను సవాల్‌గా తీసుకున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ తెలిపారు. మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో 110 మంది పాల్గొన్నట్లు గుర్తించామన్నారు. వీరిలో 14 మంది ముందస్తు బెయిల్‌కు వెళ్లారని, ముగ్గురిని అరెస్టు చేశామన్నారు. 64 మందికి ఈ నెల 26వ తేదీ వరకు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ కోర్టు ఆదేశాలున్నాయని, ఆ తర్వాత ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కేసులో నిర్లక్ష్యం వహించిన పోలీసు సిబ్బందిపై ఇప్పటికే శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని, ఇద్దరు ఎస్ఐలు, ఒక సీఐని సస్పెండ్ చేశామని, పోలీసుల పాత్రన్నట్లు రుజువైతే చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు విరివిగా విరాళాలు

- బాధితులకు బాసటగా మేముంటాం
- వరద బాధితులకు భారీగా దాతల విరాళాలు
- హిందూజా 5 కోట్లు, అమర్‌రాజా 2 కోట్లు
- సంగం డెయిరీ 50 లక్షల సాయం
- ఎస్వీ ఉద్యోగుల విరాళం 47.46 లక్షలు
- ఎస్ఆర్ఎంటీ సహాయం పాతిక లక్షలు
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు చెక్కులు అందించిన సంస్థలు, దాతలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


హిందూజా విరాళం రూ. 5 కోట్లు

వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు అశోక్ లేలాండ్, హిందూజా పవర్ సంస్థలు 2.5 కోట్ల చొప్పున సాయాన్ని అందజేశాయి. ఇందుకు సంబంధించిన చెక్కును హిందూజా గ్రూప్ సలహాదారు ఆర్‌వీఆర్ చౌదరి, సీఈవో వేణుగోపాల్ మంగళవారం సీఎం చంద్రబాబుకు అందజేశారు.

వరద బాధితులకు బాసటగా మేముంటాం అంటూ రైతులు, సినీ, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు విరాళాలు అందించి, దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన పలువురు దాతలు సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళాల చెక్కులు అందజేశారు. అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ తరపున మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, విక్రమ్ ఆదిత్య గౌరినేని రూ.2 కోట్లు, చెన్నై కేసీపీ లిమిటెడ్ తరపున వెలగపూడి కవితాదత్ రూ.కోటి, శ్రీరామ్ సేవా సంకల్ప ఫౌండేషన్ తరపున శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ ఎండీ వైఎస్ చక్రవర్తి, కంపెనీ జేఎండీ కే శ్రీనివాస్, వైస్‌ప్రెసిడెంట్‌లు ఎమ్మెస్ చౌదరి, ఎం వెంకటేశ్వరరావు, మొగలేశ్వరరావు, కేవీఆర్వీ ప్రసాద్ అసిస్టెంట్ ప్రెసిడెంట్ ఈ నాగేంద్ర కలసి రూ.కోటి, అశ్విని ఫిషరీష్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సీ సెల్వమ్ రూ.కోటి, వెల్‌కం ఫిషరీష్ లిమిటెడ్ ప్రతినిధి కే ఆనంద్ రూ.కోటి, ఎస్ఎంఎస్ ఫార్మా లిమిటెడ్ తరపున రమేష్ బాబు పొట్లూరి రూ.కోటి, ఆస్ట్రో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ తరపున సుమన్ సిన్హా రూ.కోటి, విన్స్ బయో లిమిటెడ్ తరపున సిద్ధార్థ దగ రూ.51 లక్షలు, సంగం మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ తరపున ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ రూ.50 లక్షలు, పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ఎండీ బీ శ్రీనివాస్, గోవింద్ రూ.50 లక్షలు, జీఆర్టీ జ్యూయలరీస్ తరపున జీఆర్ తంగమాలిగై రూ.25 లక్షలు, పులివెందుల ప్రజల తరపున టీడీపీ నేత బీటెక్ రవి రూ.10 లక్షలు, డాక్టర్ వైఎస్ సునీతా రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి దంపతులు రూ.10 లక్షల చెక్కును సీఎంకు అందజేశారు. కాకినాడ ఎస్ఆర్ఎంటీ జేఎండీ కంటిపూడి జయ రూ.25 లక్షలు కాకినాడ జిల్లా కలెక్టర్ షన్ మోహన్‌కు అందజేశారు. డీపీఎస్ మేనేజ్‌మెంట్ తరపున పి.నరేంద్రబాబు రూ.5 లక్షలు, సీనియర్ జర్నలిస్టు అంకబాబు రూ.5 లక్షలు, నందిగామ చైతన్య జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ రూ.5 లక్షలు, క్వాంటమ్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.5 లక్షలు, డెల్టా స్టీల్ స్ట్రక్చర్స్ రూ.5 లక్షలు, స్టార్క్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.5 లక్షలు, ఎస్.వెంకటేశ్వరరావు రూ.5 లక్షలు, డాక్టర్ సౌజన్య రూ.5 లక్షలు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజయవాడ విద్యార్థులు రూ.4 లక్షల 5 వేలు అందజేశారు. దాతలకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

లోకేశ్‌కు అందించిన విరాళాలు ఇవే...: 'ఎస్వీ యూనివర్సిటీ ఉద్యోగుల తరపున ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు రూ.47,46,380, ఏపీ ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రూ.5 లక్షలు, అమలాపురానికి చెందిన చెరుకూరి రామచంద్రరావు రూ.5 లక్షలు, మంగళగిరి నియోజకవర్గం చినకాకానికి చెందిన వలివేటి విజయలక్ష్మి రూ.5 లక్షలు, విజయవాడ మాజీ మేయర్ తాడి శకుంతల ఆధ్వర్యంలో తెలుగు టెలివిజన్ డిజిటల్, ఓటీటీ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రతినిధులు రూ.5 లక్షలు, హైదరాబాద్‌కు చెందిన సునీత డిజైనర్ బొటిక్ నిర్వాహకురాలు ఎం సునీత రూ.2.35 లక్షలు మంత్రి లోకేశ్‌కు అందజేశారు. ఆపదలో వున్న బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు.


ఉద్యోగులు, పెన్షనర్ల విరాళాలు జమ

వరద బాధితుల కోసం ఉద్యోగులు, పెన్షనర్లు, సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు ప్రకటించిన విరాళాలను సీఎంఆర్‌ఎఫ్‌కు జమ చేశారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ జీవో ఇచ్చారు.

వరద బాధితులకు తానా చేయూత

- విరాళాల కోసం న్యూయార్క్‌లో ఆటాపాటా
- ఆ నిధులు తెలుగు రాష్ట్రాల సీఎంలకు చేరవేత!

విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 17: తెలుగు వారికి ఏ ఇబ్బంది వచ్చినా వెంటనే స్పందించి చేయూతనిచ్చి తోడుగా నిలిచే ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచింది. ఎన్నో కుటుంబాలు నిరాశ్రయులు కావడం, లక్షలాది ఎకరాలలో పంట నష్టంపై చలించిపోయిన 'తానా' సేన ప్రభావిత ప్రాంతాలలో నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేసినట్టు తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, పూర్వాధ్యక్షుడు జయ తాళ్లూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విరాళాల సేకరణకు సోమవారం న్యూయార్క్‌లో ప్రముఖ యాంకర్ సుమతో ఆటాపాటా కార్యక్రమం నిర్వహించినట్టు పేర్కొన్నారు. శ్రీలక్ష్మి కులకర్ణి వ్యాఖ్యాతగా వ్యవహరించారని, 200 మందికి పైగా దాతలు హాజరై ఉదారంగా విరాళాలు అందించారని వెల్లడించారు. మానవతా దృక్పథంతో తానా చేస్తున్న కృషిని న్యూయార్క్ ప్రముఖులు ప్రశంసించారని తెలిపారు.


న్యూయార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యాంకర్ సుమ, ప్రముఖవైద్యుడు నోరి దత్తాత్రేయుడు, తానా ప్రతినిధులు

జీవో 85ను రద్దు చేయాలి

- ప్రభుత్వం తక్షణమే చర్చలకు పిలవాలి
- విజయవాడలో పీహెచ్‌సీ వైద్యుల మహాధర్నా

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యులకు పీజీ ఇన్ సర్వీస్ కోటాను గతంలో మాదిరిగానే అమలు చేయాలని కోరుతూ మంగళవారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో సంబంధిత వైద్యులు మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. సర్వీస్ కోటాను కుదిరిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 85ను వెంటనే రద్దు చేయాలని కోరారు. కొవిడ్-19 లాంటి మహమ్మారిని ఎదుర్కొని ఎంతో కష్టంతో విధులు నిర్వహించిన తమకు.. ఇలా చివరి క్షణంలో ఉన్న సర్వీస్ కోటాను కుదించేయడం అన్యాయమని పేర్కొన్నారు. వెంటనే గతంలో మాదిరిగానే సర్వీస్ కోటా అమలు చేయాలని కోరారు. వీటితో పాటు డైరెక్టర్ ఆఫ్ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ వైద్యులకు టైమ్ బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ప్రైమరీ హెల్త్ వైద్యులకు ట్రైబల్ అలవెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు తమను ప్రభుత్వం తక్షణమే చర్చలకు పిలిచి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

చర్చలకు ఆహ్వానించిన మంత్రి సత్యకుమార్


పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ రిజర్వేషన్ విషయమై బుధవారం చర్చలకు రావాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆహ్వానించారు. ఈ మేరకు ఆరోగ్య శాఖ కమిషనర్ సి.హరికిరణ్ మంగళవారం సాయంత్రం వైద్యుల సంఘం ప్రతినిధులకు సమాచారం అందించారు. ఈ సమావేశానికి ముందు.. ఈ విద్యా సంవత్సరంలో జాతీయ మెడికల్ కౌన్సిల్ నిర్వహించిన పీజీ నీట్ పరీక్షలో అర్హత పొందిన ప్రభుత్వ ఎంబీబీఎస్ డాక్టర్ల వివరాల్ని కూడా తెలియజేయాలని కమిషనర్ కోరారు. ఈ ఏడాది ఇన్ సర్వీస్ రిజర్వేషన్ కింద పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు పొంది పీజీ పూర్తి చేసుకుని, 2027లో వీరంతా తిరిగి ప్రభుత్వాసుపత్రుల్లో విధుల్లో చేరాల్సి ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ సమయానికి వివిధ స్పెషలిస్ట్ విభాగాల్లో లభ్యం కానున్న ఖాళీలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు మదింపు చేస్తున్నారు. ఈ అంశంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టీ.కృష్ణబాబు, కమిషనర్ సి.హరికిరణ్, డీఎంఈ డాక్టర్ నరసింహం, హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డిలతో చర్చించారు.

ఠారెత్తిస్తున్న ఎండలు

- కావలిలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

విశాఖపట్నం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. రాష్ట్రం మీదుగా వీచే నైరుతి గాలులు పూర్తి పొడిగా మారడంతో మంగళవారం కోస్తాలో అనేక చోట్ల వేసవి మాదిరి వాతావరణం నెలకొంది. ఎక్కడా మేఘాలు లేకపోవడంతో ఎండ తీవ్రత మరింత పెరిగింది. గాలిలో తేమ శాతం కూడా గణనీయంగా తగ్గింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. కావలిలో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. 2009 సెప్టెంబరు 26న కావలిలోనే 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, మంగళవారం రాయలసీమ, కోస్తాల్లో అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఆ సమయంలో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 2–3 రోజులు ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ నిపుణుడు ఒకరు తెలిపారు.


సీఎం చంద్రబాబుకు రూ.2 కోట్ల చెక్కును అమరరాజ సంస్థ నుంచి అందజేస్తున్న గల్లా అరుణకుమారి


సీఎం చంద్రబాబుకు రూ.1 కోటి చెక్కు అందజేస్తున్న శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ సీఈఓ వై.ఎస్. చక్రవర్తి



పాఠశాలలు తెరచుకున్నాయ్!

వరదలతో పూర్తిగా నీట మునిగిపోయిన విజయవాడలోని సింగ్‌నగర్, పాయకాపురం, కబేలా సెంటర్, రాజరాజేశ్వరి, జక్కంపూడి, వైఎస్సార్ తదితర కాలనీల్లో ఇళ్లు, రోడ్లు పూర్తిగా వరద ముంపు నుంచి బయటపడ్డాయి. ప్రభుత్వ పాఠశాలలను ఇప్పుడిప్పుడే తెరుస్తున్నారు. మంగళవారం వైఎస్సార్ కాలనీలోని ఓ పాఠశాలలో తరగతులు ప్రారంభమైన దృశ్యం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

నిత్యావసరాల పేరుతో నరకయాతన

వరద బాధితులకు స్లిప్పులు పంచిన వైసీపీ నేతలు ● మధ్యాహ్నం వరకు ఎండలోనే పడిగాపులు ● 56వ డివిజన్ కార్పొరేటర్‌పై బాధితుల ఆగ్రహం

పాతరాజరాజేశ్వరి పేట, సెప్టెంబరు 17: వరద బాధితులకు మేము సైతం సాయం చేస్తామంటూ, స్వచ్ఛందంగా ఉన్నంతలో ఎంతో మంది ముందుకొచ్చి తమవంతు సహాయపడుతున్నారు. కానీ వైసీపీ నేతలు మాత్రం నిన్నటి వరకు స్తబ్ధుగా ఉండి ఇప్పుడు అర్భాటంగా సరుకుల పంపిణీ అంటూ వరద బాధితులను ముప్పతిప్పలు పెడుతున్న సంఘటన పాతరాజరాజేశ్వరి పేటలో చోటుచేసుకుంది. బుడమేరు ముంపు ప్రాంతాల్లో స్థానిక 56వ డివిజన్ పాతరాజరాజేశ్వరి పేట ఒకటి. అధిక సంఖ్యలో జీవనం సాగించే ఈ ప్రాంతంలో ఎక్కువగా పేద, మధ్యతరగతి వాసులు జీవిస్తుంటారు. బుడమేరు ముంపుతో పాతరాజరాజేశ్వరిపేట పేద ప్రజల బతుకులు రోడ్డు మీదకు వచ్చేశాయి. దాతల సాయంతో బతుకు బండిని ఈడ్చుకుంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ నేతలు మేము కూడా సహాయం చేస్తామంటూ సోమవారం సాయంత్రం స్థానిక కార్పొరేటర్, ఆయన అనుచరులు హడావుడి చేసి తమకు అనుకూలంగా ఉన్న బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీకి సంబంధించిన టోకెన్లు పంచిపెట్టారు. మంగళవారం ఉదయం 9గంటలకల్లా వస్తే నిత్యావసర సరుకులు అందజేస్తామంటూ తెలిపారు. కానీ మధ్యాహ్నం సూరీడు నడినెత్తి వచ్చేవరకు ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. దీంతో ఉదయం నుంచే అక్కడ పడిగాపులు కాస్తున్న వరద బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పనులు మానుకుని ఇక్కడికి వస్తే వైసీపీ నాయకులు తమను ఇంతసేపు వేచి ఉండేలా చేశారంటూ మండిపడ్డారు.



ఎండలో క్యూలైన్‌లో నిలబడిన పాతరాజరాజేశ్వరి పేట వరద బాధితులు

తొలుత టోకెన్లు తీసుకున్న వారు ఉదయం 8గంటలకే స్థానిక కార్పొరేటర్ ఆఫీసుకు చేరుకున్నారు. అక్కడ టోకెన్లు అందించిన కార్పొరేటర్, ఆయన అనుచరులు లేకపోవడంతో వరద బాధితులు అసహనం వ్యక్తం చేశారు. పాపం వరద బాధితులు నిత్యావసర సరుకుల కోసం మధ్యాహ్నం వరకు అక్కడే రోడ్డుపైనే ఎండలోనే క్యూలైన్ కట్టి వేచి ఉండి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎప్పటికో చేరుకున్న వైసీపీ నేతలు మిట్టమధ్యాహ్నం టోకెన్లు ఇచ్చిన వారికి పూర్తిగా నిత్యావసర సరుకులు ఇవ్వకుండా సగం మందికి ఇచ్చి మిగతావారిని వెనుక్కు పంపించారు.

దీంతో వరద బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ చేతనైతే తమకు సహాయం చే యాలిగానీ, ఇలా ఇబ్బందులకు గురి చేయడం తగునా అంటూ వైసీపీ నేతలపై మండిపడ్డారు.

వరద బాధితులకు 'మార్పు' సాయం

విజయవాడ: నగరానికి చెందిన మార్పు వె ల్ఫేర్ సొసైటీ ఇబ్రహీంపట్నంలో వరద బాధితులకు మంగళవారం ఆహారాన్ని అందజేసిం ది. దాదాపు 600 మంది కి భోజన సదుపాయం కల్పించింది. సొసైటీ అ ధ్యక్షురాలు తులసి ప ద్మశ్రీ పాల్గొన్నారు.



అన్నార్తులకు భోజనం అందిస్తున్న తులసి

ఆటో దొంగని వది లేసిన పోలీసులు..!

● **నేరస్థుడితో సన్నిహిత పరిచయాలే కారణం..!**

వన్‌టౌన్: పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద పా ర్కింగ్ చేసిన ఆటో సోమవారం చోరీకి గురైంది. బా ధితుడు కృష్ణలంక క్రైం పోలీసులను ఆశ్రయించి ఫి ర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. కృష్ణలంకకు చెందిన ఓ ఆటోడ్రైవర్ సోమవారం ఉదయం 10 గంటలకు బస్టాండ్ ఎదురుగా ఆటోను పార్కింగ్ చే సి టీ తాగేందుకు వెళ్లాడు. కొద్దిసేపటి తరువాత చూడగా ఆటో కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా దొరక్కపోవటంతో కృష్ణలంక క్రైం పోలీసులకు ఫిర్యా దు చేశాడు. దీంతో ఇద్దరు క్రైం కానిస్టేబుళ్లు బాధితుడితో కలిసి రైల్వేస్టేషన్‌తో పాటు ప్రధాన సెంటర్లన్నీ వెతికారు. రాత్రి 11గంటలకు నేరస్థుడు ఆటోను భవానీపురంలోని ఓ బార్ వద్ద పార్కింగ్‌చేసి మ ద్యం సేవించాడు. క్రైం పోలీసులు, బాధితుడు వెళ్లి అతడిని పట్టుకున్నారు. క్రైం పోలీసులకు నేరస్థుడు పరిచయం ఉండటంతో అతడిని అక్కడి నుంచి పంపేశారు. బాధితుడిని ఆటో తీసుకుని పోలీసు స్టేషన్‌కు రమ్మని చెప్పారు. మంగళవారం క్రైం పోలీసులు ఆటో చోరీ వ్యవహారాన్ని స్టేషన్ అధికారి సీఐ దృష్టిలో పెట్టారు. నేరస్థుడిని తీసుకువస్తేనే ఆటో ఇస్తానని సీఐ చెప్పటంతో బాధితుడు పోలీసులే కావాలని పంపేశారని చెప్పినా సీఐ వినిపించుకోలేదని తెలిసింది. పట్టుకున్న నేరస్థుడిని పోలీసులే కావాలని వదిలేసి తనను తీసుకురామనటం ఎంత వరకు న్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

● **బతికి బయటపడిన కుమారుడు**

రైల్వేస్టేషన్: మధురానగర్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి కుమారుడితో కలిసి ఆత్మహత్యకు ప్రయత్నించినట్టు మంగళవారం రైల్వే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ సంఘటనలో ఆ వ్యక్తి చనిపోగా, కుమారుడు బయటపడ్డాడు. సో మవారం ఉదయం మధురానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని 39ఏళ్ల వ్యక్తి తన మూడేళ్ల కుమారుడితో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు రై లు కింద పడ్డాడు. ఈ సంఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు 108లో ఇద్దరినీ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి సోమవారం రాత్రి మృతిచెందగా బాలుడు చికిత్స పొందుతున్నాడు. పోలీసులు మృతుడి వివరాలను ఆరా తీస్తున్నారు.

క్షయ అవగాహన శిబిరం అభినందనీయం

● **జిల్లా క్షయ నియంత్రణ సమన్వయ కర్త దినేష్**

పటమట: వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యం లో ఆటోనగర్ కాలేజీ లాడ్జి వద్ద 15 రోజుల క్షయ వ్యాధి అవగాహన శిబిరాలను జిల్లా క్షయ నియంత్రణ సమన్వయకర్త సీహెచ్ దినేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోరు, వెం ట్రుకలు తప్ప శరీరంలో ఏ అవయానికైనా క్షయ సోకే ప్రమాదముందన్నారు. ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రాజెక్టు మేనేజర్ కె. శ్రీ నివాసరావు మాట్లాడుతూ ఆటోనగర్‌లోని కార్మికుల కు ఫ్లిప్‌చార్ట్, పాంప్లెట్స్ ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. మెడికల్ అధికారి ఆర్ స్వర్ణలత, సత్యప్రసాద్, వీరాంజనేయులు, రామసాగర స్మిత, ఫిరో జ్, కేడీఎల్‌వో, రాయప్ప, ఏవీ ప్రసాద్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు, దోమతెరల పంపిణీ

భవానీపురం: వరదలతో అతలాకుతలమైన హె చ్‌బీ కాలనీ, అజిత్‌సింగ్‌నగర్, కండ్రిక, వాంబే కాల నీ, రాజీవ్ నగర్‌ల్లో నివసించే వెయ్యి కుటుంబాలకు భారత్ వికాస్ పరిషత్ అమరావతి ప్రాంత్ సంస్థ ఆదామా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో బాధితులకు నిత్యావసరాలు, దుప్పట్లు, దోమతెరలు అందించారు. ప్రాంత్ అధ్యక్షుడు రూప్‌చంద్ జైన్, కార్యదర్శి కమల్ నయన్‌బాంగ్, ఆర్థిక కార్యదర్శి (చా ర్టర్డ్ అక్కౌంటెంట్) ఎంవీఎస్ రామచంద్రరావు, ప్రాం తీయ కార్యదర్శి మురళీధర్, స్థానిక శాఖల అధ్యక్ష, కార్యదర్శికోశాధికారులు, ఆదామా సంస్థ జనరల్ మేనేజర్ హనుమంతరావు పాల్గొన్నారు.

నూతన పీసీబీ చైర్మన్ కృష్ణయ్యకు అభినందన

ఆటోనగర్: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నూతన చైర్మన్‌గా ఎంపికైన మాజీ ఐఏఎస్ కృష్ణయ్యకు స్థానిక జవహర్ ఆటోనగర్ ఐలా ప్రతినిధులు అభినందనలు తెలిపారు. మంగళవారం ఆటోనగర్‌లోని స్థానిక ఏపీఐఐసీ ప్రాంగణంలో పీసీబీ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాభినందనలు తెలి పి సన్మానించారు. ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసా ద్, కార్యదర్శి అన్నే శివనాగేశ్వరరావు, ప్రకాశం ఐలా సెక్రటరీ కొండా సర్వేశ్వరరావు, డాక్టర్ అబ్దుల్ కలాం మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధిలో కృష్ణయ్య సేవలు విలువైనవన్నారు. కత్తిక శివనాగేశ్వరరావు, బాహుబలేంద్ర కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దేశం వైపు ప్రపంచ దేశాల దృష్టి

● **వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్**

వన్‌టౌన్, సెప్టెంబరు 17: ప్రపంచ దేశాల దృష్టి నేడు భారతదేశం వైపు ఉందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. ప్రధానమంత్రి మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక భారతీనగర్ అన్ అకాడమీ కాలేజీలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం, ఉచిత వైద్య శిబిరాలు, స్వచ్ఛత కార్యక్రమాలు, బీజేపీ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 వరకు నడుస్తాయన్నారు. దేశంలో పదేళ్లలో 25కోట్ల మంది పేదరికం నుంచి బయట పడ్డారని, దేశంలో అమలవుతుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల కారణంగా ప్రపంచ దేశాల దృష్టి భారతదేశం వైపు ఉందని, 2047 నాటికి అగ్రగామిగా ఉండాలనే సంకల్పంతో ముందుకు పోతున్నామన్నారు. బీజేపీ సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ల శివనారాయణ, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, పలువురు రాష్ట్ర, జిల్లా నేతలు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో అగ్రరాజ్యంగా భారత్: ఎమ్మెల్యే

ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ అగ్రరాజ్యంగా వెలుగొందుతోందని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. మంగళవారం భవానీపురంలోని ఎన్డీయే కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుజనా చౌదరి తొలుత కేక్‌కట్ చేసి ప్రధాని మోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరంలో కూటమి నేతలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా అగ్రరాజ్యంగా వెలుగుతోందన్నారు. ప్రజల కోసం, దేశం కోసం పనిచేసే మోదీ నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కార్పొరేటర్ గుడివాడ రాఘవ నరేంద్ర, బీజేపీ నేతలు బిట్ర శివన్నారాయణ, పాతూరి నాగభూషణం, శివమకుటం, షేక్ బాజీ, పైలా సోమినాయుడు, భోగవల్లి శ్రీధర్, పచ్చిపులుసు ప్రసాద్, వడ్డాని మాధవరావు, మన్నా కృష్ణ, టీడీపీ నేత ఎం.ఎస్.బేగ్ పాల్గొన్నారు. అలాగే సూర్యారావుపేటలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆఫీసు ఇన్‌చార్జి శివమకుటం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సుజనా చౌదరి సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలు పోయి మంచి రోజులు వచ్చాయన్నారు. మోదీ నాయకత్వంలో సీఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు.



రక్తదాన శిబిరం సభలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్





5కే రెడ్ రన్ ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో యూత్‌ఫెస్ట్ ఏపీ-2024 రాష్ట్రస్థాయి మారథాన్‌ను నిర్వహించారు. 5 కిలోమీటర్ల రెడ్ రన్ పేరుతో నిర్వహించిన ఈ మారథాన్‌కు యువత నుంచి విశేష స్పందన లభించింది.

డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం

● **జీవో 85ను వ్యతిరేకిస్తు పీహెచ్‌సీడీఏ డాక్టర్ల ధర్నా**

ధర్నాచౌక్, సెప్టెంబర్ 17: జీవో 85ను తక్షణమే రద్దు చేయాలని, తమ ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని ఏపీపీహెచ్‌సీడీఏ డాక్టర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కనీస వేతనాలు, పదోన్నతులు, ట్రైబల్ అలవెన్స్, తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇచ్చేంతవరకు తమ నిరసనలు ఆగవని స్పష్టం చేశారు. ప్రస్తుతం పీహెచ్‌సీల్లో సేవలు నిలిచిపోవడంతో ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థపై భారీ ప్రభావం పడుతుందన్నారు. ఈ నెల 15, 16న ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలం కాలేదన్నారు. జీవో 85ను స్టేలో పెడితే ఎలాంటి చర్యలకైనా సిద్ధమని స్పష్టం చేశారు. సర్వీస్‌ను బట్టి ప్రమోషన్లు రావాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో పని చేసేవారికి 30శాతం జీతం అదనంగా ఇవ్వాలన్నారు. కరోనా సమయంలో అనేక మంది డాక్టర్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు యూనిస్ మీర్, ఎమ్.కిషోర్‌కుమార్, మొహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ వద్ద స్వచ్ఛతా హి సేవలో పాల్గొన్న డీఆర్ఎం, అధికారులు, విద్యార్థులు

రైల్వే డివిజన్‌లో 'స్వచ్ఛతా హి సేవ' పక్షోత్సవాలు ప్రారంభం

రైల్వే స్టేషన్, సెప్టెంబరు 17: రైల్వే డివిజన్‌లో మంగళవారం స్వచ్ఛతా హి సేవ పిలుపు మేరకు స్వచ్ఛతా హీ సేవ - స్వ చ్ఛతా పక్వాడ పక్షోత్సవాలు ప్రా రంభమయ్యాయి. అక్టోబరు 2న గాంధీ జయంతి నాటితో ముగుస్తాయి. ఈ సందర్భంగా డీఆర్ ఎం నరేంద్ర ఏ పాటిల్ స్థానిక ప్రధాన రైల్వేస్టేషన్ తూర్పు బు కింగ్ వద్ద ఉన్న గడియార స్థం భం వద్ద పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించటంతో ప్రారంభించారు. అక్కడి నుంచి ప్లాట్‌ఫారం-1లోని గాంధీ వెయిటింగ్ హాల్ వరకు ర్యాలీని నిర్వహించారు. అనంతరం పార్శిల్ ఆఫీసు కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్మికులతో కలిసి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ ఏర్పడి పదేళ్లయిందన్నారు. అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లు, డ్రెయిన్లు, మరుగుదొడ్లతో పాటు బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేయటానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. దాదాపుగా 500 క్లీన్‌లెస్ టార్గెట్ యూనిట్లు గుర్తించినట్టు తెలిపారు. పర్యావరణ హితమైన వస్త్రం, కాగితం, జనపనార సంచులను వాడాలని, బహిరంగ ప్రదేశాలను, స్టేషన్ ఆవరణలను పరిశుభ్రం చేయటానికి వారానికి 100 గంటలు కేటాయించాలన్నారు. వెయిటింగ్ హాల్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఏడీఆర్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మొక్కలు నాటి బహుమతులు అందజేస్తున్న ఆర్‌కె సింగ్

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

● **ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయ అధికారి ఆర్‌కే సింగ్**

గన్నవరం, సెప్టెంబరు 17: పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు జాతీయ రహదారులను సుందరీకరించేందుకు మొక్కలు నాటడం చేపట్టినట్టు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రాంతీయ అధికారి ఆర్‌కే సింగ్ అన్నారు. జాతీయ రహదారుల వెంట పర్యావరణాన్ని కాపాడటంతో పాటు వాహనదారులకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. మండలంలోని చిన అవుటపల్లి వద్ద మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ రోజురోజుకు వాహనాలు పెరిగిపోవడంతో శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం ఎక్కువవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని తగ్గించి వాహనదారులకు సుఖవంతమైన ప్రయాణాన్ని ఆహ్లాదకరంగా చేసేందుకు జాతీయ రహదారుల వెంట మొక్కలను పెంచుతున్నామన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ వి.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మొక్కల పెంపకం ద్వారా పర్యావరణాన్ని కాపాడితే దేశానికి సేవ చేసినట్లేనన్నారు. ఇటీవల కాలంలో ప్రతి ఒక్కరూ వాహనాలను వినియోగిస్తున్నారని వారు ప్రయాణించే సమయంలో కొద్దిసేపు ఎక్కడైనా చెట్టు కనబడితే తమ వాహనాన్ని నీడలో ఉంచి విశ్రాంతి తీసుకుంటారని గుర్తుచేశారు. నీడనిచ్చే మొక్కలను పెంచటం అందరి బాధ్యతన్నారు. వాహనదారులకు మెరుగైన వసతులు అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. తొలుత పాఠశాల, కళాశాలల విద్యార్థులకు మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బహుమతులు అందజేశారు. మొక్కల పెంపకం ఇన్‌చార్జి కె.సూర్యనారాయణ, డీజీఎంలు నీరజ గుప్తా, కేవీడీ ర జిని, కృష్ణమూర్తి, మేనేజర్‌లు వీవీ లక్ష్మీ, కె.లత, మురళీకృష్ణ, రమణాజీ దుర్గ, చంద్రశేఖర్, శివ ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

జరగండి.. జరగండి..!

● **డీఆర్ఎం వస్తున్నారు.. రోడ్డుపై ఎవరూ ఉండొద్దు**

● **రైల్వే ఉద్యోగుల హడావుడి**

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 17: నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లో మంగళవారం జరిగిన స్వచ్ఛతా హి సేవలో పాల్గొనటానికి రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు, జీఆర్‌పీ పోలీసులు, ఉద్యోగులు అత్యుత్సాహం చూపించారు. డీఆర్ఎం వస్తున్నారు.. జరగండి అంటూ రోడ్లపై నడిచేవారిని ఆటోలు, బస్సుల కోసం వేచి ఉండేవారిని అక్కడ ఉండవద్దంటూ తరిమివేశారు. వీరి హడావుడికి రోడ్లపై నడుస్తున్న వారు కంగారు పడిపోయారు. ఈ నేపథ్యంలో ఓ వృద్ధురాలు రైలుదిగి రైల్వే పార్శిల్ కార్యాలయం వద్ద ఆటో కోసం వేచి ఉన్నారు. దీంతో రైల్వే పోలీసులు ఆమెను అక్కడ ఉండవద్దని ఓ తోపుడు బండిపై ఎక్కించి అక్కడి నుంచి పంపించివేశారు. పార్శిల్ కార్యాలయం నుంచి పాత ప్రభుత్వాసుపత్రి, బస్టాండ్ వరకు తీసుకొచ్చారు. దీంతో వృద్ధురాలి కుటుంబ సభ్యులు డీఆర్ఎం వస్తే రోడ్డుపై ఎవరూ ఉండకూడదా అంటూ రైల్వే పోలీసులు, ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



హడావుడిగా వృద్ధురాలిని తోపుడు బండిపై తీసుకువెళ్లిపోతున్న కుటుంబ సభ్యులు

మంగళవారమే కౌంటర్ వేశాం

» **మరోరోజు విచారణ చేపట్టండి**

» **వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ పిటిషన్‌పై ఏపీపీ అభ్యర్థన**

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వేసిన పిటిషన్‌పై మంగళవారమే కౌంటర్ దాఖలు చేశామని పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ) హైకోర్టుకు నివేదించారు. 'నా భార్య వాణి, కుమార్తె హైందవిపై ఫిర్యాదు చేసినప్పటికీ టెక్కలి పోలీస్ స్టేషన్ సీఐ, ఎస్ఐ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకొనేలా ఎస్పీని ఆదేశించండి' అని కోరుతూ వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా... ఏపీపీ మాట్లాడుతూ... 'కౌంటర్ వేశాం. వ్యాజ్యంపై మరో రోజు విచారణ చేపట్టాలి' అని కోరారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

లుక్ అవుట్ నోటీసు ఉపసంహరించేలా ఆదేశాలు ఇవ్వండి

» **హైకోర్టును ఆశ్రయించిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి**

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఎస్వీయూ క్యాంపస్ పోలీసులు నమోదు చేసిన కేసులో తనపై జారీ చేసిన లుక్ అవుట్ నోటీసును ఉపసంహరించేలా ఆదేశించాలని కోరుతూ వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సంబంధిత కేసులో పోలీసులు తనకు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీ చేశారని, హైకోర్టు సైతం షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. విదేశాలకు వెళ్లకుండా నిషేధం విధిస్తూ ఎలాంటి షరతు విధించలేదన్నారు. లుక్ అవుట్ నోటీసును ఉపసంహరించాలని అభ్యర్థించినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలోనే హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై బుధవారం హైకోర్టు విచారణ జరపనుంది.

భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వండి

» **హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి**

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా ఉండగా తనకు కల్పించిన 3 ప్లస్ 3 భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఏకపక్షంగా భద్రతను ఉపసంహరించారని, సెక్యూరిటీ రివ్యూ కమిటీ సైతం ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థుల నుంచి ప్రాణహాని ఉన్నందున భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు.

టీడీపీకి ఓటేశానని రేప్ చేయించారు!

» **ఆస్తి కాజేయడంతో అన్న క్యాంటీన్‌లో తిని బతుకుతున్నా**

» **టీడీపీ ఆఫీస్ గ్రీవెన్స్‌లో బాధిత మహిళల ఫిర్యాదు**



టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): 'టీడీపీకి ఓటు వేశామన్న కక్షతో నాపై అత్యాచారం చేయించారు. ఆపై చంపాలని చూశారు. ఈ ఘటనలో నా కాలు, చేయి విరిగింది' అని నెల్లూరు జిల్లాకు చెందిన దళిత మహిళ టీడీపీ నేతలకు చెప్పి కన్నీటి పర్యంతమైంది. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీనేత పీలా గోవింద్ గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బాధితులకు అండగా ఉండి, న్యాయం చేస్తామని, సమస్యలు పరిష్కారిస్తామని నేతలు హామీలిచ్చారు. తాము టీడీపీకి ఓట్లేశామన్న కక్షతో అనుమోలు వెంకటేశ్వర్లు, లక్ష్మీనరసింహం అనే వారు తాను బహిర్భూమికి వెళ్లిన సమయంలో బండ్ల లక్ష్మయ్య మనవడితో అత్యాచారం చేయించారని, వీరిని కఠినంగా శిక్షించి, తనకు న్యాయం చేయాలని నెల్లూరు జిల్లా తూర్పు పోలినేని పాలెం గ్రామానికి చెందిన ఓ దళిత మహిళ కోరారు. కన్నకొడుకులే కాలాంతకులుగా మారి, తన పేరు మీదున్న పొలాన్ని ఫోర్జరీ సంతకాలతో కాజేసి, తననే కొట్టడానికి వస్తున్నారని, కనీసం అన్నం కూడా పెట్టకపోవటంతో అన్న క్యాంటీన్‌లో తిని బతుకుతున్నానని పల్నాడు జిల్లా గుమ్మనంపాడుకు చెందిన ముక్కపాటి రాజ్యం కళ్లనీళ్ల పర్యంతమైంది. ప్రకాశం జిల్లా గుమ్మలంపాడులో 2002లో తాను కొనుగోలు చేసిన, రెవెన్యూ రికార్డుల్లో నమోదైన భూమికి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి, తన భూమిని కొట్టేసేందుకు అబ్బూరి శేషయ్య, చాలా హరికృష్ణ కుట్ర చేశారని చీమకుర్తికి చెందిన ముప్పరాజు వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. మాల్యాద్రినాయుడు అనే వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించి, తమ పాసుపుస్తకాలను రద్దు చేయించాడని, ఈ అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని నెల్లూరు జిల్లా భీమవరప్పాడుకు చెందిన గోనుగుంట వెంకటేశ్వర్లు కోరారు. ఏలూరుకు చెందిన మైసన్నగూడెంలో తన భూమిని రీసర్వే పేరుతో గ్రామసర్పంచ్, అధికారులు మోసం చేసి, ఇతరుల పేరుపై మార్చారని ఓ వ్యక్తి వినతి పత్రాన్ని అందజేశారు.



కేసీపీ రూ. కోటి విరాళం సీఎం చంద్రబాబుకు రూ.1 కోటి చెక్కును అందజేస్తున్న కేసీపీ లిమిటెడ్ చెన్నై కి చెందిన వెలగపూడి కవితాదత్



కేదారేశ్వరపేట మసీదు సెంటర్‌లోని ఓ మెకానిక్ షాపులో బైక్ సీటు కింద ఉన్న పామును చంపిన మెకానిక్

బాబూ.. జరభద్రం...!

● **ఇంటి వస్తువుల్లో, వాహనాల్లో దాగి ఉంటున్న విషపు జీవులు**

పాతరాజరాజేశ్వరి పేట, సెప్టెంబరు 17: బుడమేరు ముంపు కారణంగా బాధిత నగర వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆ ప్రభావం నుంచి నేటికీ కోలుకోలేని పరిస్థితి. ఇదిలా ఉండగా నీట మునిగిన ఇళ్లలోకి వరద నీటితో పాటు పాములు, తేళ్ల వంటి విషజీవులు చేరుకున్నాయి. అవి తమ ప్రాణరక్షణకు ఇళ్లలోని ఎత్తైన ప్రాంతాల్లోని అటకల్లో, ఏసీ, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్ వంటి వస్తువులతో పాటు బైక్‌లు, కార్లలోనూ తలదాచుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పాతరాజరాజేశ్వరి పేటకు చెందిన ఓ వాహనదారుడు తన వాహనాన్ని కేదారేశ్వరపేట మసీదు సెంటర్‌లోని ఓ మెకానిక్‌కు ఇచ్చాడు. మెకానిక్ బైక్‌ను బాగుచేద్దామని బైక్ సీటును తీయగా, సీటు కింద చిన్న పాము దాగి ఉంది. దీంతో కంగారు చెందిన మెకానిక్ పామును చంపేశాడు. చిన్న పాము అవ్వడం, మెకానిక్ అప్రమత్తంగా ఉండటంతో ప్రమాదం తప్పింది. ప్రస్తుతం నగరంలో బైక్, కారు మెకానిక్‌లు, ఏసీ మెకానిక్‌లు, ఫ్రిజ్, వాషింగ్ మిషన్‌లు లాంటి మెకానిక్‌లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మహిళలను కించపరుస్తూ రాతలా?

- జత్వానీ కేసులో తన పేరు బయటపడుతుందని
- జగనే రాయిస్తున్నారు: పీతల సుజాత

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జత్వానీ కేసులో తన పేరు బయటపడుతుందనే భయంతోనే నీలి మీడియాలో జగన్‌రెడ్డి తప్పుడు రాతలు రాయిస్తున్నారని మాజీ మంత్రి పీతల సుజాత ఆరోపించారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'మహిళలను కించపరుస్తూ నీలి మీడియాలో తప్పుడు రాతలు రాస్తున్నారు. జత్వానీ కేసుకు దేశవ్యాప్తంగా మద్దతు పెరుగుతుంటే.. నీలి మీడియాలో దోషులను కాపాడేందుకు తప్పుడు కథనాలు రాయిస్తున్నారు. జగన్ మీడియా చైర్‌పర్సన్ భారతీరెడ్డి మహిళ అయి ఉండీ.. సాటి మహిళ మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది వైసీపీ రాజకీయ దిగజారుడు తనం కాదా? జగన్‌రెడ్డి స్క్రిప్టుతోనే జత్వానీపై కేసులు పెట్టారు. ఆమెని వేధించారు, ఆమె తల్లిదండ్రులను హింసించారు. జత్వానీ కేసులో ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ లిఖితపూర్వక వాంగ్మూలం ఇచ్చారు. తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా కుట్రలు చేసి, నేరాలు, ఘోరాలు చేయించిన వారంతా బయటకు వస్తారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా కూటమి ప్రభుత్వం, చంద్రబాబు వదిలి పెట్టే ప్రసక్తే ఉండదు. జగన్ పాలనలో మాదిరి ఎలాపడితే అలా చేస్తామంటే కుదరదు' అని సుజత అన్నారు.

జగన్... పుస్తకం గురించి తెలుసా?

- ఆత్మలతో మాట్లాడి తీసుకున్న నిర్ణయం
- విద్యార్థుల పాలిటి శాపంగా మారింది: మంత్రి సంధ్యారాణి

అమరావ తి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): 'పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు పుస్తకం గురించి తెలుసా? వేలాది పాఠశాలలను మూసి వేసిన ఘనుడు ఆయన' అంటూ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మండిపడ్డారు. మంగళవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 'టీచర్లను మద్యం షాపుల వద్ద కాపలా పెట్టిన ఘనత జగన్‌దే. జగన్ ఎక్కడ, ఏ స్కూలులో, ఏం చదివారో కూడా తెలియదు. ఆయన విద్యాశాఖ గురించి, పరీక్షల గురించి, స్టేట్, సెంట్రల్ సిలబస్ గురించి లెక్చర్లు ఇవ్వడం చాలా వింతగా, విడ్డూరంగా ఉంది. నువ్వు తీసుకున్న నిర్ణయం.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పాలిట శాపంగా మారింది. సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు రాయడానికి అవసరమైన వసతులు లేకుండా, ఉపాధ్యాయులకు ఎటువంటి శిక్షణ ఇవ్వకుండానే పరీక్షా విధానం మార్చడం వల్ల పదో తరగతి చదువుతున్న 75 వేల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. జగన్ ఆత్మలతో కాకుండా నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటే బాగుండేది. కానీ జగన్‌కు ఈగో ఎక్కువ. ఆయన అధికార దాహానికి పిల్లలు బలికావాలా?' అని మంత్రి సంధ్యారాణి ప్రశ్నించారు.


ఎనికేపాడు వద్ద బుడమేరు పాత యూటీని పరిశీలిస్తున్న నారాయణ

బుడమేరు యూటీ ఎత్తు పెంచకపోతే ముప్పే

- కేంద్రం దృష్టికి కొల్లేరు ఆక్రమణలు: సీపీఐ నారాయణ

అమరావతి, విజయవాడ(ఆంధ్రజ్యోతి), కైకలూరు, సెప్టెంబరు 17: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు వద్ద బుడమేరు పాత యూటీ (అండర్ టన్నెల్)ని తీసేసి.. దాని ఎత్తు పెంచి నిర్మించకపోతే రాబోయే రోజుల్లో ముప్పు తప్పదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆ టన్నెల్‌ను పరిశీలించారు. అనంతరం ఏలూరు జిల్లా మండవల్లి మండలం పెద్దఎడ్లగాడి వద్ద కొల్లేరు ముంపును పరిశీలించారు. ఈ రెండు ప్రాంతాల్లో ఆయన మీడియాతో మాట్లాడారు. "విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి ఒకవైపు కాలువ ద్వారా ఏలూరుకు నీరు వెళుతుండగా.. దాని దిగువ భాగాన బుడమేరు పారుతోంది. ఈ రెండూ విడివిడిగానే వెళ్లాల్సి ఉంది. 1902లో బ్రిటిష్ వాళ్ల కట్టిన దానిని ఇప్పటి అవసరాలకు అనుగుణంగా ఎత్తు లేపాల్సి ఉంది. యుద్ధ ప్రాతిపదికన బుడమేరు పాత యూటీని తీసేసి, ఎత్తు పెంచి కొత్తది కట్టకపోతే ముప్పే. కొల్లేరు ఆక్రమణలపై ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదు చేస్తామని, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తాం. కొల్లేరు, బుడమేరు ఆక్రమణలతోనే ముంపు ఏర్పడుతోంది. కొల్లేరు సరస్సును పరిరక్షించాలని గతంలో అనేక సార్లు సుప్రీం కోర్టు ఆదేశించినా ఎవరూ పట్టించుకోలేదు. కాలుష్యానికి గురి కాకుండా సరస్సును కాపాడాలి. కొల్లేరు పరిరక్షణకు చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయట్లేదు. ఎక్కడా గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు పాటించడం లేదు. 5వ కాంటూరు వరకు ఉన్న భూములను పరిరక్షించాలి' అని నారాయణ అన్నారు.

రాజధానికి భూములిచ్చేందుకు సిద్ధం

- సీఆర్‌డీఏ కమిషనర్ భాస్కర్‌ను కలిసిన రాజధాని రైతులు
- పూలింగ్ కింద ఇంకా రావాల్సి ఉన్న 3 వేల ఎకరాలు
- ఈ భూముల కోసం రైతులతో మంత్రి, కమిషనర్ చర్చలు
- సత్ఫలితాలిస్తున్న చర్చలు.. ముందుకొస్తున్న రైతులు

విజయవాడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఊపందుకుంటున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ విధ్వంసక పాలన, రాజధానిపై చూపిన అంతులేని నిర్లక్ష్యాన్ని చూసి.. గతంలో భూసమీకరణలో భాగంగా భూములు ఇవ్వని కొంత మంది రైతులు సైతం ఇప్పుడు ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. రాజధానిలో మరో 3 వేల ఎకరాలను భూసమీకరణ కింద ఇవ్వటానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంత మంది రైతులు ముందుకు రాలేదు. ఇటీవల కాలంలో సీఆర్‌డీఏ దాదాపుగా 100 ఎకరాలకు పైగా రైతుల నుంచి భూసమీకరణ విధానంలో భూములను తీసుకుంటోంది. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఒకవైపు, సీఆర్‌డీఏ కమిషనర్ భాస్కర్ మరోవైపు రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ భూ సమీకరణకు ఒప్పిస్తున్నారు. మంగళవారం రైతులు పెద్ద సంఖ్యలో విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చి భూ సమీకరణ కింద భూములు ఇవ్వటానికి ఆసక్తి చూపారు. రైతు నాయకులు మల్లెల శేషగిరిరావు నేతృత్వంలో ఉండవల్లి, పెనుమాక, అనంతవరం, మల్కాపురం గ్రామాలకు చెందిన రైతులు సీఆర్‌డీఏ కమిషనర్ భాస్కర్‌ను కలిశారు. గతంలో తాము కొన్ని చిన్నచిన్న సమస్యలను ఎదుర్కొన్నామని, వాటిని పరిష్కరిస్తే భూములు ఇస్తామని తెలిపారు. సమస్యలు పరిష్కరించేందుకు అదనపు కమిషనర్ ప్రతి శుక్రవారం తుళ్లూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని కమిషనర్ భాస్కర్ వారికి చెప్పారు. పూలింగ్ కింద భూములు ఇవ్వాల్సిన రైతులందరి దగ్గరికి వెళ్లి, వారి సమస్యలేమిటో తెలుసుకుని వ్యక్తిగతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ప్రమాదకర పరిశ్రమల్లో 3 నెలకోసారి సేఫ్టీ ఆడిట్

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రమాదకర పరిశ్రమల్లో మూడు నెలలకోసారి తప్పకుండా సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పటిష్ఠంగా అమలు చేయడం ద్వారా నిర్దిష్ట లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆయన వివిధశాఖలకు సంబంధించి సమీక్షించారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు.

ఐదేళ్లూ గాడిదలు కాశారా?

- స్టీల్‌ప్లాంటుపై వైసీపీ నేతలను నిలదీసిన గంటా

విశాఖపట్నం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విపక్షంలో కూర్చుని విశాఖపట్నం స్టీల్ ప్లాంటు కోసం గొంతు చించుకుంటున్న వైసీపీ నేతలు.. అధికారంలో ఉన్న ఐదేళ్లూ గాడిదలు కాశారా? అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఆయన విశాఖలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, నాడు స్టీల్ ప్లాంటు కోసం రాజీనామాలు చేయడం వల్ల ఉపయోగం ఉండదని చెప్పిన వైసీపీ నాయకులు.. ఇప్పుడు రాజీనామాల గురించి మాట్లాడడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం కర్మాగారానికి మాంగనీస్ గనులను రెన్యువల్ చేసిందని, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని రప్పించి, ప్లాంటును ప్రైవేటుపరం చేయబోమని ప్రకటన చేయించి చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు.

అమరావతి రైల్వేలైన్‌కు 510 ఎకరాలు!

- భూసేకరణ ఖర్చు దాదాపు రూ.1.000 కోట్లు
- మొత్తం భరించేందుకు రైల్వేశాఖ అంగీకారం?
- కృష్ణాకెనాల్ జంక్షన్‌లో స్టేషన్ ఏర్పాటుకు భూములు
- ఖర్చు 90శాతం తగ్గుతున్నా పట్టించుకోని అధికారులు
- ఎర్రుపాలెం నుంచి పాత అలైన్‌మెంట్‌కే రైల్వే మొగ్గు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

అమరావతి నూతన రైల్వేలైన్ కోసం 510 ఎకరాల భూములు అవసరమని రైల్వే శాఖ గుర్తించింది. ఎన్టీఆర్ జిల్లాలో 296.86 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 155, ఖమ్మం జిల్లాలో 60 ఎకరాల చొప్పున కావాలని రైల్వే శాఖ నుంచి మూడు జిల్లాల రెవెన్యూ యంత్రాంగాలకు పక్షం రోజుల కిందటే ప్రతిపాదనలు పంపింది. అయితే కృష్ణా, బుడమేరు వరదల కారణంగా ఈ అంశంపై దృష్టి పెట్టలేకపోయారు. తాజాగా అమరావతి రైల్వేలైన్ భూములపై ఆ శాఖ అధికారులతో భేటీ కావాలని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. ఈ భూముల సేకరణకు రూ.1,000 కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఈ వ్యయాన్ని భరించడానికి రైల్వే శాఖ అంగీకరించినట్టు తెలుస్తోంది. అమరావతి రైల్వేలైన్‌కు సంబంధించి ఖమ్మం జిల్లాలో ఎర్రుపాలెం దగ్గర, ఎన్టీఆర్ జిల్లాలో కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో, గుంటూరు జిల్లా కొత్తపేట, వడ్లమానూ, తాడికొండ, కొప్పవరం, నంబూరు ప్రాంతాల్లో భూ సేకరణ చేయాల్సి ఉంది. అదేవిధంగా అమరావతి నుంచి పెదకూరపాడు వరకు 24.5 కి.మీ., సత్తెనపల్లి నుంచి నరసరావుపేట వరకు 25 కి.మీ. మేర రెండో లైన్‌ను ప్రతిపాదించారు. వీటన్నింటినీ ఒకే ప్రాజెక్టుగా చేపట్టనున్నారు. వీటికి ఏడేళ్ల క్రితమే సర్వే నిర్వహించగా, 2017-18లో రూ.2,800కోట్ల వ్యయంతో అంచనాలు రూపొందించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతి రైల్వే లైన్ ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడు మళ్లీ టీడీపీ ప్రభుత్వం రావడంతో ఈ రైల్వేలైన్‌కు మార్గం సుగమమైంది. ఈ ప్రాజెక్టును రైల్వే కూడా తన ప్రాధాన్యత జాబితాలో చేర్చింది. రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడానికి ఆసక్తి చూపకపోతే 2013 భూ సేకరణ చట్టం ప్రకారం సేకరించాలని రెవెన్యూ యంత్రాంగం భావిస్తోంది. కాగా, నూతన రైల్వేలైన్‌ను విజయవాడ మీదుగా కృష్ణాకెనాల్ జంక్షన్‌కు కలిపి.. అక్కడ అమరావతి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చెయ్యాలని వస్తున్న ప్రతిపాదనలను రైల్వే పరిగణనలోకి తీసుకోవడం లేదు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే ముందుకు వెళ్లాలని భావిస్తోంది. కృష్ణాకెనాల్ జంక్షన్‌లో అమరావతి రైల్వేస్టేషన్ అభివృద్ధికి అవసరమైన భూములు చాలా ఉన్నాయి. దీనివల్ల భూసేకరణకు ఖర్చు కూడా 90శాతం తగ్గుతుంది. విజయవాడ రైల్వేస్టేషన్ రద్దీగా ఉందన్న సాకు చూపి గూడ్స్ రవాణా అవసరాల కోసం ఎర్రుపాలెం నుంచి నూతన లైన్ ప్రతిపాదిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.



అర్హతలేకున్నా అందలం!



- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యం
- జగన్ బాబాయి సుబ్బారెడ్డి బంధువు కోసం పదవి సృష్టి
- స్విమ్స్‌లో స్పెషలాఫీసర్‌గా పోస్టు
- పరీక్ష పాసైన రోజుల వ్యవధిలో జయచంద్రారెడ్డికి కీలక నియామకం
- ఫస్ట్ ర్యాంకర్‌నూ పక్కన పెట్టిన వైనం
- టీటీడీ సొమ్ముతో లక్షల వేతనం, రాజభోగం
- పాలన మారినా పట్టించుకోని ప్రభుత్వం
- స్విమ్స్‌లో చర్చనీయాంశమైన వ్యవహారం

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

జగన్ జమానాలో అర్హతలతో సంబంధం లేకుండా అయినవాళ్లను అందలాలెక్కించిన ఉదంతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఎంసీహెచ్ (సర్జికల్ ఆంకాలజీ) కోర్సు పాసైన వారం రోజులకే డాక్టర్ ఎం. జయచంద్రారెడ్డికి శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ(ఎస్‌బీఐఏ) స్పెషల్ ఆఫీసర్‌గా నియమించేశారు. ఆ తర్వాత ప్రతిష్ఠాత్మక స్విమ్స్‌కు స్పెషల్ ఆఫీసర్‌గా మారిపోయారు. దీనికిగాను ఆయనకున్న ఏకైక అర్హత... అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి సమీప బంధువు కావడమే! చిత్రమేంటంటే కూటమి ప్రభుత్వం వచ్చాకా ఆయన అక్కడే ఉండడం!!

వైసీపీ హయాంలో అయిన వారికి పదవులు.. పప్పు బెల్లాలు దోచిపెట్టిన విషయం తెలిసిందే. అయితే, అయినవారికేకాదు.. వారికి అయినవారికీ కూడా ఇష్టారాజ్యంగా పదవులు పంచేశారు. అర్హత లేకున్నా అందలాలు ఎక్కించారు. టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ అధినేత జగన్‌కు బాబాయి వరసయ్యే వైవీ సుబ్బారెడ్డికి సమీప బంధువైన డాక్టర్ ఎం. జయచంద్రారెడ్డికి ఇలానే పదవిని కట్టబెట్టారు. 2022, సెప్టెంబరు 16న శ్రీవేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(స్విమ్స్)లో ఎంసీహెచ్(సర్జికల్ ఆంకాలజీ)కోర్సు పాసైన ఆయనను కనీసం నెల రోజులు కూడా కాకుండానే, ఎలాంటి అనుభవం లేకుండానే శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ(ఎస్‌బీఐఏ) నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. సెప్టెంబరు 16న ఆయన ఆంకాలజీ కోర్సు పాసైతే, సెప్టెంబరు 24న ఆయనను స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలోని టీటీడీ పాలకమండలి(తీర్మానం 258)నిర్ణయం తీసుకుంది. అక్టోబరు 7న అప్పటి స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ భూమా వెంగమ్మ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. రూ.లక్షల్లో వేతనం, కారు, క్వార్టర్స్, చాంబర్.. ఇలా వెంటవెంటనే స్పెషల్ ఆఫీసర్‌కు కేటాయింపులు జరిగిపోయాయి.

నిబంధనలు ఏమైనట్టు?

టీటీడీలో స్పెషల్ ఆఫీసర్ అంటే కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ లేదా రాష్ట్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ హోదాలో ఉన్న అధికారిని డిప్యుటేషన్‌పై మాత్రమే నియమించుకునే నిబంధన ఉంది. టీటీడీ సర్వీస్‌రూల్స్‌కు విరుద్ధంగా వైవీ సుబ్బారెడ్డికి సమీప బంధువు కోసం 'స్పెషల్' పోస్టును సృష్టించారు. అప్పటి అదనపు ఈవో ధర్మారెడ్డికి ఈ విషయాలు తెలిసి కూడా నోరుమెదపలేదు. అసలు స్విమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య విద్య పాసైన తర్వాత మొదటి సంవత్సరం ముందస్తు ఒప్పందం మేరకు స్విమ్స్‌లో వైద్యుడిగా పనిచేయాలి. జయచంద్రా రెడ్డి విషయంలో ఈ నిబంధనను గాలికి వదిలేశారు.

మెల్లమెల్లగా మొత్తం ఆధీనంలోకి..

ఎస్‌బీఐఏ స్పెషలాఫీసర్‌గా నియమితులైన జయచంద్రారెడ్డి మెల్లమెల్లగా స్విమ్స్‌కే స్పెషల్ ఆఫీసర్‌గా మారిపోయారు. ఆంకాలజీ అనుబంధ విభాగాలతో పాటు, పాథాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాలకు సంబంధించిన పరికరాల కొనుగోలు, సిబ్బంది నియామకాలు, స్విమ్స్-టీటీడీకి లైజన్ ఆఫీసర్ బాధ్యతలను కూడా ఆయనకే అప్పగించారు. స్విమ్స్‌లో 15 మందికి పైగా సీనియర్ ప్రొఫెసర్ల నేతృత్వంలోని మెడికల్, సర్జికల్, రేడియేషన్ ఆంకాలజీ, రేడియాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ వంటి అనేక విభాగాలను ఆయన తన అధీనంలోకి తెచ్చుకున్నారు. పలు విభాగాధిపతుల ఫైళ్లను ప్రత్యేకాధికారి ద్వారా రూట్ చేయాలని ఆదేశాలిచ్చారు. ప్రతి ఫైలూ ఆయన దగ్గరకు రావాల్సి ఉండడంతో కీలక నిర్ణయాలన్నింటిలోనూ ఆయన పాత్ర తప్పనిసరైంది. పాత స్విమ్స్ భవనం పునరుద్ధరణ, న్యూరో అండ్ కార్డియో సైన్సెస్ బ్లాక్ నిర్మాణం, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ కోసం పరికరాల కొనుగోలు, మెడికల్ ఆఫీసర్లు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, డ్రైవర్ల నియామకంలో ఈయన ప్రమేయంతో దారిమళ్లింపులు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి.


నిర్మాణదశలోని శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ

ఫస్ట్ ర్యాంకర్‌ను పక్కనబెట్టి..

రూ.2 లక్షలతో మొదలైన స్పెషలాఫీసర్ జయచంద్రారెడ్డి వేతనం మూడు నెలలు తిరగకుండానే 'ఆయన అడిగారంటూ'.. అకస్మాత్తుగా రూ.3 లక్షలకు పెంచుతూ టీటీడీ నిర్ణయం తీసుకుంది. జయచంద్రారెడ్డితో పాటు ఎంసీహెచ్ పూర్తి చేసిన ఆయన బ్యాచ్‌మేట్ ఒకరు మాత్రం రూ1.5 లక్షల జీతంతో సర్జికల్ ఆంకాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. పైగా ఆయన ఫస్ట్ ర్యాంకర్ కూడా. ఇక స్పెషలాఫీసర్‌కు డ్రైవర్‌తో కూడిన అధికారిక కారు, నివాస వసతి, జాతీయ, అంతర్జాతీయ విమానాల్లో(బిజినెస్ క్లాస్) ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు.

కూటమి సర్కారు వచ్చినా

స్పెషలాఫీసర్ జయచంద్రారెడ్డి దర్జా మామూలుగా ఉండదు. విజయవాడకు విమానంలోనే ప్రయాణిస్తారు. విమానాశ్రయానికి కూడా టీటీడీ కారును పంపుతారు. స్విమ్స్‌లో సీనియర్లయిన డీన్, ఎంఎస్, రిజిస్ట్రార్ వంటి వారికి కూడా ఇలాంటి సదుపాయాలు లేవు. జయచంద్రారెడ్డి పీజీ చేసేటప్పుడు అంటే.. విద్యార్థిగా ఉన్నప్పుడే ఆయనకు స్టాఫ్ క్వార్టర్‌ను కేటాయించినట్టు తెలిసింది. అలాగే ఎంసీహెచ్‌లో అత్యధిక మార్కులు వచ్చినవారికి డాక్టర్ సునీత సుబ్రమణ్యం గోల్డ్ మెడల్‌ను బహూకరిస్తారు. జయచంద్రారెడ్డి కోసం ఈ నిబంధనను మార్చేశారు. బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్ అంటూ ఆ గోల్డ్ మెడల్‌ను ఈయనకే ఇచ్చారు. కాగా, వైసీపీ సర్కారు పోయి కూటమి ప్రభుత్వం వచ్చినా ఈయన హవా కొనసాగుతోంది. జయచంద్రారెడ్డి అదేస్థానంలో కొనసాగుతున్నారు. ఆయన వ్యవహార శైలిలోనూ ఎలాంటి మార్పు రాలేదు.

ద్రోణాదులలో అన్నదాన శాసనం!

- కొండపైన 7వ శతాబ్దం నాటి శిలాయుగం సమాధులు
- వెలుగు చూసిన చారిత్రక ఆధారాలు

మార్టూరు, సెప్టెంబరు 17: బాపట్ల జిల్లాలో చరిత్రకు సంబంధించి మరికొన్ని అరుదైన శాసనాలు, సమాధులు వెలుగుచూసినట్లు పురావస్తు శాస్త్ర పరిశోధకులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి తెలిపారు. మంగళవారం ఆయన బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని ద్రోణాదుల గ్రామంలో మరుగున పడి ఉన్న పలు అన్నదాన శాసనాలు, బృహత్ శిలాయుగం నాటి (రాక్షస గూళ్లు) సమాధులను గుర్తించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ద్రోణాదులలో మంగళవారం జరిపిన పరిశోధనలో క్రీ.శ. 1634లో 'తంగేడి నాయనం గారు చేయించిన సేవావార' అని రాసి ఉన్న శిలా శాసనాన్ని గుర్తించినట్లు చెప్పారు. ముఖ మండపంలో ఉన్న రెండో శాసనంలో శ్రీశైలం వెళ్లే భిక్ష వృత్తివారికి నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించాలని రాసి ఉన్నట్లు తెలిపారు. ఇంకా కొండపైన క్రీ.పూ. 7వ శతాబ్దం నాటి బృహత్ శిలాయుగం నాటి సమాధులను(రాక్షస గూళ్లు) గుర్తించామన్నారు. వీటి ఆధారంగా ద్రోణాదుల ప్రాంతంలో అప్పటికే జన సంచారం ఉన్నట్లు తెలుస్తోందని జ్యోతి చంద్రమౌళి తెలిపారు.


ద్రోణాదుల గ్రామంలో 17వ శతాబ్దంనాటి అన్నదాన శాసనాన్ని పరిశీలిస్తున్న పురావాస్తు పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి

లక్ష కడితే శాశ్వత సభ్యత్వం!

- ఇలా లక్ష మంది తీసుకుంటే వెయ్యి కోట్లు వస్తాయ్!!
- ఈ నిధితో కార్యకర్తలకు మెరుగైన సంక్షేమం: చంద్రబాబు
- టీడీపీ ఇన్‌చార్జులతో అర్ధరాత్రి వరకు భేటీ

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లక్ష రూపాయలు చెల్లిస్తే తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం కల్పిద్దామని ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు చెప్పారు. అలా లక్ష మంది శాశ్వత సభ్యులను తీసుకుంటే రూ.1,000 కోట్లు పార్టీకి అందుతాయని.. ఈ నిధితో కార్యకర్తలకు మెరుగైన సంక్షేమం అందించవచ్చని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిన స్థానాల్లో అభ్యర్థులు.. జనసేన, బీజేపీలకే కేటాయించిన స్థానాల్లోని టీడీపీ ఇన్‌చార్జులతో మంగళవారం రాత్రి ఆయన సమావేశమయ్యారు., అర్ధరాత్రి వరకు చర్చించారు. పార్టీ జెండాను 40 ఏళ్లుగా మోస్తున్న కార్యకర్తలను అన్ని విధాలుగా పైకి తీసుకొచ్చే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యకర్తలకు లబ్ధి చేకూరేలా కొత్త ఆలోచనలు చేస్తున్నామని తెలిపారు. సభ్యత్వ నమోదు, ఓడిన చోట్ల పార్టీ బలోపేతానికి తీసుకోవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం ఈ వంద రోజుల్లో సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలను ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. మిత్రపక్షాల నేతలతో సమన్వయంతో పనిచేయాలని.. కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని స్పష్టంచేశారు. వైసీపీ తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. పార్టీ కోసం సీట్లు త్యాగం చేసిన నేతలకు గౌరవప్రదమైన స్థానం ఇస్తామని హామీ ఇచ్చారు. త్వరలో జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తామన్నారు. తిరుపతి దర్శనాలను సులభతరం చేయాలని, సిఫారసు లేఖల్లో తమకూ ప్రాధాన్యమివ్వాలని కొందరు టీడీపీ నేతలు కోరారు. అన్నీ త్వరలోనే పరిష్కరిస్తానని చంద్రబాబు తెలిపారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దైవిక వాస్తు శిల్పి.. విశ్వకర్మ పుట్టిన రోజును మంగళవారం మంగళగిరిలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. భారత భూమి వేద, జ్ఞాన భూమి అని.. ఆయన జయంతిని ఇంజనీర్లు, ఆర్కిటెక్చర్లు, నాటి పురాణ పురుషులను ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు. భారత సంస్కృతిని కాపాడేలా నిర్మాణాలను చేపట్టి భారత దేశ హితానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు, అశోక్‌బాబు, అనురాధ, మాజీ ఎమ్మెల్సీలు ఏఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో మంగళవారం వినాయక నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. వేలాది విగ్రహాలను భక్తులు ఊరేగింపులతో వచ్చి నిమజ్జనం చేశారు.

లడ్డూ ధర రూ.1.87 కోట్లు!

- కళ్లు చెదిరే ఈ వేలంపాట బండ్లగూడ రిచ్మండ్ విల్లా వాసులది
- 25 మంది సొంతం.. నిరుడు రూ.1.26 కోట్ల ధర

నార్సింగ్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆ లడ్డూ వేలం పాటలో లక్ష.. పది లక్షలు.. యాభై లక్షలు.. ఆపై కోటి కూడా దాటేస్తే అంతా నోరెళ్లబెట్టారు. అక్కడితో పాట ఆగితేనా? జోరుగా సాగుతుంటే రెండు కోట్లకు చేరుతుందా? అనిపించింది. అయితే చివరికి రూ.1.87 కోట్లు పలికింది. కళ్లు చెదిరే ఈ వేలం పాటకు నెలవైంది గండిపేట మండలం బండ్లగూడ రిచ్మండ్ విల్లా టౌన్‌షిప్! అక్కడున్న 100 మంది నాలుగు గ్రూపులుగా ఏర్పడి ప్రతి ఇంటి నుంచి చందాలు వేసుకొని ఈ వేలం పాటలో పాల్గొన్నారు. వీరిలో ఓ గ్రూప్‌కు చెందిన 25 మంది రూ.1.87 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. నిరుడు ఈ లడ్డూ రూ.1.26 కోట్లు పలికింది. వేలంపాట రూపంలో వచ్చిన మొత్తాన్ని టౌన్‌షిప్‌లో పనిచేసే కార్మికులు, వంటవాళ్లు, పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, వారి పిల్లల స్కూలు ఫీజులకు.. అలాగే 42 స్వచ్ఛంద సంస్థలకు పంచుతామని టౌన్‌షిప్ వాసులు పేర్కొన్నారు.

కేఎంసీలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన కవలలు


దాక్షాయణి, దక్షిత

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 17: నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన దారూర్ సత్యనారాయణ శెట్టి, కళావతి దంపతుల కవలలకు అదృష్టం వరించింది. ఇద్దరూ కర్నూలు మెడికల్ కళాశాల(కేఎంసీ)లో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్‌లో అడ్మిషన్లు పొందా రు. నందికొట్కూరు పట్టణం సుబ్బరావుపేటలో కిరాణ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న సత్యనారాయణ శెట్టి దంపతులకు నలుగురు సంతానం. వీరిలో ఇద్దరు కవలలు. పెద్దమ్మాయి పేరు దాక్షాయణి నీట్ పరీక్షకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో 348వ ర్యాంక్ సాధించగా, దక్షిత 667 మార్కులతో 251వ ర్యాంక్ సాధించింది. వీరిద్దరికీ కేఎంసీలోనే సీట్లు దక్కాయి. కష్టపడి చదివి ఎంబీబీఎస్ సీట్లు సాధించిన దాక్షాయణి, దక్షితలను కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ అభినందించారు.

పీసా గ్రామాల్లో అక్టోబరు 15లోగా ఎన్నికలు

- 100 ఉద్యోగ ఖాళీల భర్తీకి పదోన్నతుల ప్రక్రియ
- త్వరలో 7 ఈఎంఆర్‌ఎస్ స్కూళ్ల ప్రారంభోత్సవం
- గిరిజన సంక్షేమ శాఖలో 100 రోజుల పురోగతిపై నివేదిక

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 100 రోజుల్లో సాధించిన ప్రగతిపై అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖలోని విభాగాల ద్వారా సాధించిన పురోగతిని ప్రభుత్వానికి నివేదించారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో పీసా((పంచాయతీ నిబంధల(షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు)) చట్టం ప్రకారం 2,038 గ్రామసభలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈ నెల 6న షెడ్యూల్ విడుదల చేశారు. అక్టోబర్ 15లోగా ఎన్నికలు పూర్తి చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 371 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 7,500 సీట్లు భర్తీ చేయాలని లక్ష్యం పెట్టుకోగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అంతకంటే ఎక్కువగానే 13,274 సీట్లును భర్తీ చేశారు. గిరిజన ప్రాంతాల్లో ప్రోటీన్లు తక్కువగా ఉన్న వారికి వైద్యశాఖ ద్వారా పోషకాహారం అందించేందుకు 35 వేల సికిల్ సెల్ కార్డులు అందించాలని ముందుగా లక్ష్యంగా పెట్టుకుని 51 వేల కార్డులు అందించారు. 7 ఈఎంఆర్ఎస్ స్కూళ్ల భవనాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని అధికారులు ఇప్పటికే ఆదేశించారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలకు సంబంధించి 1,559 అభ్యర్థనలు పరిశీలించాలని నిర్ణయం తీసుకున్నారు. దానికి సబ్‌డివిజనల్, డివిజనల్ స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ ప్రక్రియ కొనసాగుతోంది. పదోన్నతులతో వివిధ కేడర్లలో ఖాళీ అయిన 100 పోస్టులను భర్తీ చేసేందుకు శాఖ పదోన్నతుల కమిటీని ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. పీఎంజేవీఎం కింద 273 వన్‌దన్ వికాస కేంద్రాలను ప్రారంభించారు. పీఎం-జన్మాన్ పథకం కింద 44 పీవీటీజీ వన్‌దన్ వికాస కేంద్రాల పనులు ప్రారంభమయ్యాయి. లంబసింగిలో గిరిజనుల స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణాన్ని 53 శాతం పూర్తి చేశారు. పీఎం-జన్మాన్ పథకం కింద 24 మల్టీపర్పస్ కేంద్రాలు వివిధ దశల్లో ఉన్నాయి. పీవీటీజీల నివాసిత ప్రాంతాల్లో 136 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, 17 హెల్త్ కేంద్రాల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి.

శ్రీవారి లడ్డూలపై మంచి ఫీడ్‌బ్యాక్ వస్తోంది: టీటీడీ ఈవో

తిరుమల, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఇటీవల టీటీడీ అందజేస్తున్న లడ్డూల నాణ్యతపై మంచి ఫీడ్‌బ్యాక్ వస్తోందని ఈవో శ్యామలరావు సంతోషం వ్యక్తం చేశారు. తిరుమలలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొద్దిరోజులుగా లడ్డూల నాణ్యత పెంచేందుకు పలు చర్యలు చేపట్టామన్నారు. నాణ్యమైన నెయ్యిని లడ్డూల తయారీలో వినియోగిస్తుండడంతో లడ్డూలు చాలా రుచికరంగా ఉన్నాయని భక్తులు చెబుతున్నట్టు తెలిపారు. ప్రస్తుతం రోజుకు 3.50 లక్షల లడ్డూలు తయారు చేస్తున్నామని, త్వరలో లడ్డూల తయారీని పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

దేశసేవలో దీర్ఘాయుష్షు పొందాలి

- ప్రధాని మోదీకి చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు
- మోదీ దృఢమైన నాయకుడు: డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీకి సంతోషకరమైన జన్మదిన శుభాకాంక్షలు. మీరు మంచి ఆరోగ్యంతో పాటు దేశ సేవలో దీర్ఘాయుష్షు పొందాలని ప్రార్థిస్తున్నా. మీ దార్శనిక నాయకత్వంలో మన దేశం అభివృద్ధి చెందుతూనే ఉంటుందని విశ్వసిస్తున్నా'నని మంగళవారం 'ఎక్స్' వేదికగా చంద్రబాబు పేర్కొన్నారు. భారతదేశ శక్తిసామర్థ్యాలకు, భారతీయతలోని గొప్పదనానికి అంతర్జాతీయ యవనికపై మరింత ప్రాచుర్యం కల్పించిన వారిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అగ్రగణ్యులన్న విషయం సగర్వంగా చెప్పుకోవచ్చని ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అలాంటి దృఢమైన నాయకుడి జన్మదినం సందర్భంగా తన పక్షాన, జనసేన శ్రేణుల పక్షాన గౌరవపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ' నిరంతరం ప్రజాసేవలో తరించే మోదీ గొప్ప మానవతా వాది కూడా. ఆయన నాయకత్వంలోని ఎన్‌డీఏలో నేను సైతం భాగస్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నా. ఆయనకు ఆ సర్వేశ్వరుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మనసారా ప్రార్థిస్తున్నాను' అని పేర్కొన్నారు. 'మోదీజీ నాయకత్వంలో భారతదేశం గొప్ప పురోగతిని సాధిస్తోంది. ప్రపంచ వేదికపై అగ్రగామిగా ఎదుగుతోంది. దేశ అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న మోదీజీ మంచి ఆరోగ్యంతో విజయాన్ని కొనసాగించాలని కోరుకుంటున్నా'నని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● బుధవారం 18 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

ఉస్మానియా వర్సిటీలో ఓడీఎల్ ప్రోగ్రామ్‌లు

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(పీజీఆర్‌ఆర్ సీడీఈ)- ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) విధానంలో నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఫస్ట్ ఫేజ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. బీఏ, బీబీఏ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ తదితర ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని రెగ్యులర్ ప్రోగ్రామ్‌లతో సమానంగా పరిగణిస్తారు. అభ్యర్థులు రెగ్యులర్ కోర్సుతోపాటు ఒక ఓడీఎల్ ప్రోగ్రామ్ చేసుకోవచ్చు.



ఎంబీఏ, ఎంసీఏ: ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం ద్వితీయశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు ఇంటర్ లేదా డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. టీఎస్ ఐసెట్ 2024/ఏపీ ఐసెట్ 2024/పీజీఆర్‌ఆర్‌సీడీఈ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో చదవాలి.

ప్రోగ్రామ్ ఫీజు: ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.20,000; ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.15,000

ఎంఏ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఉర్దూ, హిందీ, సంస్కృతం, తెలుగు, ఇంగ్లీష్, ఫిలాసఫీ, సోషియాలజీ, పబ్లిక్ పర్సనల్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఏదేని డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంఏ(హిందీ/ఉర్దూ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత లాంగ్వేజ్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. లేదా సంబంధిత మాధ్యమంలో పదోతరగతి వరకు చదివి ఉండాలి.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: సైకాలజీకి రూ.10,000; మిగిలిన స్పెషలైజేషన్‌లకు రూ.8,000

ఎంకాం: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: ఏడాదికి రూ.9,000

ఎమ్మెస్సీ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మేథమెటిక్స్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ(మేథమెటిక్స్); స్టాటిస్టిక్స్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ(మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. వీటికి బీఈ/బీటెక్ అభ్యర్థులు కూడా అర్హులే.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: మేథమెటిక్స్‌కు రూ.9,000; స్టాటిస్టిక్స్‌కు రూ.8,000

డిగ్రీ: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. బీఏ, బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్), బీకాం(జనరల్), బీబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్) ప్రోగ్రామ్‌నకు మాత్రం ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: బీఏ, బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్)ప్రోగ్రామ్‌లకు రూ.4,000, బీకాం(జనరల్)కు రూ.5,000, బీబీఏకు రూ.8,000

అడ్వాన్స్‌డ్ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మేథమెటిక్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు రూ.8,000. బయోఇన్ఫర్మాటిక్స్ స్పెషలైజేషన్‌కు ద్వితీయశ్రేణి మార్కులతో బీఎస్సీ/బీఎస్సీ(అగ్రికల్చర్)/ఎమ్మెస్సీ/బీఫార్మసీ/బీవీఎస్సీ/ఎంబీబీఎస్/బీడీఎస్/బీఏఎంఎస్/బీయూఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీఈ ఉత్తీర్ణులైనవారు అర్హులు. ప్రోగ్రామ్ ఫీజు రూ.32,000. కంప్యూటర్ అప్లికేషన్స్ స్పెషలైజేషన్‌కు ప్రోగ్రామ్ ఫీజు రూ.18,000. డేటా సైన్స్‌కు రూ.20,000. ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌కు రూ.15,000. వేదిక్ ఆస్ట్రాలజీకి రూ.8,000. ఈ స్పెషలైజేషన్‌లన్నింటికీ ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు. వేదిక్ ఆస్ట్రాలజీని తెలుగు మాధ్యమంలో చదవాలి.

అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా: ఇందులో స్పెషలైజేషన్ వేదిక్ ఆస్ట్రాలజీ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. (డిప్లొమా/అడ్వాన్స్‌డ్ డిప్లొమా/పీజీ డిప్లొమా)(వేదిక్ ఆస్ట్రాలజీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.10,000

సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి/మెట్రిక్యులేషన్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.6,000. ఈ కోర్సుని ఆంగ్ల మాధ్యమంలో చదవాలి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఆగస్టు 16 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **వెబ్‌సైట్:** www.oucde.net



మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్



తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు: డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.

- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.

అర్హతలు: డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్: టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సులో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్, ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి/ఇంటర్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఆదాయ ధ్రువీకరణ పత్రం; సంబంధిత కోర్సులో అడ్మిషన్ పొందిన లెటర్; ట్యూషన్ ఫీజు రిసీట్; ఆధార్ లింక్‌తో ఉన్న బ్యాంక్ ఖాతా నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్; కుల ధ్రువీకరణ పత్రం; ఆధార్ కార్డ్; అభ్యర్థి ఫొటో
- **ఇన్‌స్టిట్యూట్ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 15
- **డీఎన్ఓ/ఎస్ఎన్ఓ/ఎంఎన్ఓ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

ఏపీ ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫీమేల్) /ఏఎన్ఎం ట్రెయినింగ్

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం(సీహెచ్&ఎఫ్‌డబ్ల్యూ)- మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ-ఫీమేల్)/ఏఎన్ఎం కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కోర్సు వ్యవధి రెండేళ్లు. రాష్ట్రంలోని ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలల్లో మొత్తం 2,930 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లన్నీ ఉచితమే. ప్రైవేట్ కళాశాలల్లో 60 శాతం సీట్లు ఉచితం కాగా మిగిలిన 40 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటాకు చెందుతాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగా నింపి నిర్దేశిత ధ్రువ పత్రాలు జతచేసి సంబంధిత జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వ్యక్తిగతంగా గానీ/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా గానీ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.50, బీసీ, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి:** అక్టోబరు 15న
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21 నుంచి
- **వెబ్‌సైట్:** http://cfw.ap.nic.in

బెంగళూరు ఐఐఎంలో డాక్టోరల్ ప్రోగ్రామ్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంబీ) - డాక్టోరల్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. జాతీయ పరీక్ష స్కోర్/ఐఐఎంబీ టెస్ట్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ఐఐఎంబీ టెస్ట్‌ను రెండు విడతల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు స్పెషలైజేషన్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: డెసిషన్ సైన్సెస్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఎకనామిక్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ పాలసీ, స్ట్రాటజీ.

అర్హత: ఏదేని స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ/ అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ/ రెండేళ్ల పీజీ డిప్లొమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. బీకాంతోపాటు ద్వితీయ శ్రేణి మార్కులతో సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎస్ ఉత్తీర్ణులు; ప్రథమశ్రేణి మార్కులతో నాలుగేళ్ల ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. స్పెషలైజేషన్‌ను అనుసరించి 2025 జనవరి 24 నాటికి జీమ్యాట్/జీఆర్ఈ/ క్యాట్/గేట్/జేఆర్ఎఫ్ నెట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేదంటే ఐఐఎంబీ నిర్వహించే టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** జాతీయ పరీక్ష వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులు ఒక స్పెషలైజేషన్‌కు అప్లయ్ చేస్తే రూ.1000, రెండు స్పెషలైజేషన్‌లకు అప్లయ్ చేస్తే రూ.1500 చెల్లించాలి. ఐఐఎంబీ టెస్ట్ రాసే అభ్యర్థులు ఒక స్పెషలైజేషన్‌కు అప్లయ్ చేస్తే రూ.2200; రెండు స్పెషలైజేషన్‌లకు అప్లయ్ చేస్తే రూ.2700 చెల్లించాలి.
- **దరఖాస్తు విండో ఓపెన్:** జనవరి 24 వరకు
- **ఐఐఎంబీ టెస్ట్ తేదీలు:** 2024 నవంబరు 17, 2025 ఫిబ్రవరి 2
- **ఇంటర్వ్యూలు:** 2025 మార్చి 13, 14, 15
- **వేదిక:** బెంగళూరు క్యాంపస్
- **వెబ్‌సైట్:** iimb.ac.in

SCHOLARSHIP ALERT

Corteva Agriscience Scholarship Program 2024-25

Description: An initiative of Corteva Agriscience Seeds Pvt. Ltd., this program aims to provide financial assistance to meritorious students pursuing postgraduate, doctoral or undergraduate courses in the area of agriculture, as well as students in Classes 11 and 12 with STEM subjects.
Eligibility: Female students in postgraduate (MBA/ M.Sc./M.Tech.), doctoral, or undergraduate courses, as well as for those in Classes 11 and 12 with STEM subjects (government/private schools).
The applicant's annual family income must be ?6,00,000 or less.
Students from across India can apply
Children of employees of Corteva & Buddy4Study are not eligible.
Prizes & Rewards: For PG students: INR 50,000
For UG students: INR 25,000
For school students: INR 10,000
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/CASP4

Alstom India Scholarship 2024-25

Description: Alstom India is offering this scholarship to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out of college.
Eligibility: Students studying in any year of professional graduation in STEM courses can apply.
Applicants must have secured at least 60% marks in their previous academic year/semester.
The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources.
The scholarship is open to students residing in locations such as Chennai (Tamil Nadu), Coimbatore (Tamil Nadu), Kolkata (West Bengal), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat).
Prizes & Rewards: Up to INR 75,000 (one-time)
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AISDG7

Infosys Foundation STEM Stars Scholarship Program 2024-25



Description: An initiative by the Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM courses (Science, Technology, Engineering, Mathematics), Medical Sciences (MBBS), Bachelor of Dental Surgery (BDS), Bachelor of Pharmacy (B.Pharm)!
Eligibility: Applicants must be female students who are citizens of India.
Students must be enrolled in the First year of a 3 year B.Sc Degree (Courses such as Bio-chemistry, Physics, Chemistry, Nursing, Geography, IT, Biology, Computer Science, Forensic Science, etc.)
First or 2nd year of B.Tech, MBBS, B.Pharm, BDS, Integrated Masters, Dual Degree (B.Tech + M.Tech)
Students must be enrolled in institutes listed among the top ranks in the NIRF (National Institutional Ranking Framework) for 2023 or 2024.
Candidates must have obtained admission into the identified colleges and completed their Class 12.
Applicants must have an annual family income of less than or equal to ?8 lakh.
Candidates must not have availed other scholarships for the same expenses.
Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to ?1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ISTS2

buddy4study.com

మంచి మిత్రుడు



రాజు, రాకేష్ అనే ఇద్దరు మిత్రులు వెంకటాపురం అనే ఊరిలో ఉండేవారు.వారిద్దరూ చదువులో ఆటపాటల్లో అన్నిచోట్లా ఒక్కటిగా ఉండేవారు. ఒకరి ఇంట్లో కష్టాలకు,సమస్యలకు మరొకరు తోడుగా,సాయంగా ఉండేవారు. ఊరిలో మిగతా వారికి కూడా చేతనైనంత సాయపడేవారు. ఊరి వారంతా వారిని చూపించి, స్నేహితులంటే ఇలా ఉండాలి అని చెప్పుకునే వారు. ఒక రోజు వారిద్దరూ సరదాగా నడుచుకుంటూ ఊరవతలికి షికారుకి వెళ్లారు. మాటల మధ్య ఇద్దరికీ వాదన పెరిగి, రాకేష్‌ను రాజు చెంప మీద కొట్టాడు. దానికి బాధపడ్డ రాకేష్ పక్కన ఇసుకలో ప్రాణమిత్రుడైన రాజు 'నన్ను ఇవాళ చెంప మీద కొట్టాడు' అని రాశాడు. అలా ముందుకు వెళ్లాక దారిలో బురద ఉన్నది చూసుకోకుండా రాకేష్ అందులో కాలు వేసి జారి పడ్డాడు. అతని బట్టలు మొత్తం మురికి అయిపోయాయి. బురదలో నుంచి లేవలేక పోతుంటే రాజు చేయి అందించి, పైకి లేపడమే కాకుండా తన ఒంటి మీద ఉన్న చొక్కా విప్పి రాకేష్‌కి ఇచ్చి అతన్ని ఇంటికి తీసుకెళ్లి దిగబెట్టాడు. తరువాత రాకేష్ ఒక పదునైన చిన్న రాయి తీసుకుని, దగ్గరలో ఉన్న బండరాయి మీద ఇలా చెక్కాడు.' ఇవాళ నా ప్రాణ మిత్రుడైన రాజు నన్ను బురదలో నుంచి పైకి లాగి సాయంచేసి, ఇంటి వద్ద దిగబెట్టాడు' అని. ఇది గమనించిన రాజు రాకేష్‌ను ఇలా అడిగాడు 'మొన్న నిన్ను కొడితే ఇలాగే ఇసుక మీద రాశావు ఇవాళ రాయి మీద రాశావు ఏమిటి మిత్రమా ఇదంతా?' అని అడిగాడు. దానికి రాకేష్ 'మిత్రుడనే కాదు రాజూ ఎవరు చేసిన తప్పునైనా ఇసుక మీది రాతలాగా వెంటనే మరచిపోవాలి. కానీ సాటి మనుషులు చేసిన సాయం మాత్రం బండరాయి మీద చెక్కిన రాత లాగా ఎప్పటికీ గుర్తు పెట్టుకోవాలి, అందుకే అది ఇసుకలోనూ, దీన్ని రాతి మీదా చెక్కాను'అని చెప్పాడు. రాకేష్ మంచి మనసుకు మంచి ఆలోచనలు చూసిన రాజు అలాంటి మంచి మిత్రుడిని కలిగి ఉన్నందుకు ఎంతో గర్వ పడ్డాడు.

దారి కనుక్కోండి




7 తేడాలను కనిపెట్టండి



సరైన నీడను గుర్తించండి



డైలీ సుడోకు - 412



సుడోకు - 411 సమాధానం



ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.